

అబ్రహాము - శారా

# ప్రభువు - పరిశుద్ధ స్త్రీలు

యాకోబు - రాహేలు



శ్రీమతి. కెజియా వరప్రసాద రెడ్డి

# ప్రభువు - పరిశుద్ధ స్త్రీలు


రచయిత్రి

శ్రీమతి కెజియా వరప్రసాదరెడ్డి



ప్రతులకు

టి.పి. వరప్రసాదరెడ్డి

షాలోమ్ చర్చ్, జె.యన్.టి.యు పోస్టాఫీస్

అనంతపురము - 515002

సెల్: 94402 85883

Date of Publishing: April, 2014

వెల : రూ. 40.00

ప్రతులకు:

**1. లోగోస్ బుక్ సెంటర్**

10/1, అరండల్‌పేట గుంటూరు – 522 002

ఫోన్ : (0863)2336927 సెల్:9866296843

**2. టి.పి. వరప్రసాదరెడ్డి**

షాలోమ్ చర్చి, జె.యన్.టి.యు పోస్టాఫీస్

అనంతపురము – 2

సెల్: 94402 85883

**3. మోరే ప్రార్థన మందిరము**

1088, 3వ ఫేజ్, కె.పి.హెచ్.బి. కాలనీ,

హైదరాబాద్–72, సెల్: 7396202017

**4. జి. రాజారావు**, పెద్దకాకాని–522 509,

గుంటూరు జిల్లా . సెల్: 9959466175

**5. టి. రత్నారెడ్డి**, మేనేజర్, ముత్తూట్ ఫైనాన్స్,

గిద్దలూరు, ప్రకాశం జిల్లా.

సెల్: 9490000789.

## విషయ సూచిక


| వ.సం. | అంశము | పేజి నెం. |
|---|---|---|
| 1. | శారా కుటుంబము | 4 |
| 2. | రిబ్కా కుటుంబము | 53 |
| 3. | లేయా – రాహేలులల కుటుంబము | 82 |

# 'గ్రంథ పరిచయము'

"పరిశుద్ధ గ్రంథము నందలి స్త్రీల– పుస్తక పరిచయము" అను ఈ పుస్తకమును వ్రాయుటకు నన్ను ప్రేరేపించిన మన ప్రభువును, రక్షకుడును, మన బోధకుడైన, యేసుక్రీస్తుకు నా శతకోటి వందనములు చెల్లిస్తున్నాను. నన్ను రక్షించినది మొదలుకొని తన సేవా పరిచర్య విషయమై కీర్త. 68:11వ.లో వ్రాయబడినట్లు బైబిల్ స్త్రీలను గురించి తన విలువైన వాక్య తలంపులను గ్రంథస్తము చేయుటకు ప్రభువిచ్చిన కృపాసహాయమునుబట్టి ప్రభువును స్తుతిస్తున్నాను.

పుస్తకము మరీ పెద్దది కాకుండు నిమిత్తమై కొన్ని వాల్యూమ్స్‌గా బైబిల్ స్త్రీలను గూర్చియు, వారి కుటుంబాలను గూర్చియు వ్రాయాలనుకున్నాను. ఈ మొదటి వాల్యూమ్‌లో శారాను గూర్చియు, ఆమె కుటుంబములో కొద్దిమంది వ్యక్తులను గూర్చియు, అనగా ఆమె భర్తయైన అబ్రహామును గూర్చియు, ఆమె మామగారైన తెరహును గూర్చియు, ఆమె దాసియైన హాగరును గూర్చియు, ఆమె బంధువైన లోతును గూర్చియు వ్రాయడం మంచిదని తలంచాను. కారణం, వారందరి జీవితాల ద్వారా ప్రభువు మనకు విలువైన హెచ్చరికలను, విలువైన పాఠాలను నేర్పుతారని నమ్ముచున్నాను.

అంతేకాక ఈ వాల్యూమ్‌లో శారా కోడలైన రిబ్కాను గూర్చియు, రిబ్కా కోడళ్ళైన రాహేలు, లేయాను గూర్చియు నేర్చుకోబోతున్నాము. ముమ్ముందు మరికొన్ని వాల్యూమ్స్‌లో బైబిలు సోదరీలను గురించి వ్రాయుటకు ప్రభువు కృపనిస్తారని నమ్ముచున్నాను. ఇక ప్రభువు మనతో మాట్లాడులాగున ప్రార్థనా పూర్వకముగా ఈ పుస్తకాన్ని చదువుదాం. ఈ పుస్తకము ద్వారా మన ప్రభువుకే ఘనతా, మహిమ, ప్రభావములు కలుగును గాక! అలాగే స్త్రీ జాతికి ఆత్మీయ మేలు కలుగును గాక!

ఇట్లు

మన ప్రభువునందు

– మీ, కెజియక్క

# శారా కుటుంబము

శారా కుటుంబములోని వ్యక్తులందరిని గూర్చి అనేకులు అనేక రీతులుగా వ్రాశారు. నేను కూడా ప్రభువు పాదాల దగ్గర నేర్చుకున్న విషయాలను దేవుని పిల్లలైన మీతో పంచుకోవడానికి యిష్టపడుతున్నాను. శారా కుటుంబములో మొదటిదిగా ఆమె మామయైన తెరహును గురించి పాఠం నేర్చుకుందాం.

## "తెరహు"

అపొ.కా. 7:3వ॥ మహిమగల దేవుడు అబ్రహాము మెసపొతోమియలో ఉన్నప్పుడు అతనికి ప్రత్యక్షమై నీవు నీ దేశమును, నీ స్వజనమును విడిచి బయలుదేరి నేను నీకు చూపించబోవు దేశమునకు రమ్మని చెప్పగా అతనితోపాటు తెరహు, లోతు కూడా కనాను దేశమునకు బయలు వెళ్ళారు. కుమారుని ద్వారా దేవుని స్వరాన్ని వినిన తెరహు అబ్రామును తన కుమారుని కుమారుడగు లోతును అబ్రాము భార్యయైన శారాయి అను తన కోడలిని తీసుకొని కనానుకు వెళ్ళుటకు బయలుదేరి హారాను మట్టుకు వచ్చి అక్కడ నివసించారు. దేవుని ప్రత్యక్ష్యత చూచి దేవుని స్వరాన్ని విన్నది అబ్రాము మాత్రమే. దేవుని ప్రత్యక్ష్యతను చూడక దేవుని స్వరాన్ని వినకయున్న తెరహు ప్రయాణానికి రథసారథిగా ఉండి కనానుకు వెళ్ళుటకు బయలుదేరి అందరినీ హారాను మట్టుకు నడిపించాడు. అలా ప్రత్యక్ష్యంగా దేవుని దర్శనాన్ని చూడక; ఆయన స్వరాన్ని వినక వున్నవారు కుటుంబాన్ని గాని, సంఘాన్ని గాని, నడిపిస్తే ఒక చోటికి తీసుకొనిపోయే బదులు మరొకచోటికి తీసుకెళ్తారు. కనానుకు వెళ్ళవలసినవారు కనానులో నివాసముండవలసిన వారు ఇప్పుడు ఆది. 11:31లో వున్నట్లు హారానులో నివసించారు. హారానులో ఎందుకు నివసించారంటే (ఆది 12:5) ప్రకారం అబ్రాము, లోతు తెరహును వారందరు కలిసి అక్కడ యాపదాస్థితిని సంపాదించారని తెలుస్తుంది. తెరహు హారానులో చనిపోయే పర్యంతము వారక్కడ వున్నారు. తెరహు చనిపోయాకే వారు హారాను విడిచిపెట్టి కనానుకు బయల్దేరారు. (12:5). దీనినిబట్టి వారు హారానులోనే వుండి యావదాస్తిని సంపాదించుటకు వారిని అంతకాలము అక్కడు వుండుటకు ప్రేరేపించిన వాడు తెరహు అని తెలుస్తుంది. హారాను అనగా 'వారి దహనము' లేక 'వారి మంట' అని అర్థము. వారిని కాల్చివేసే మంట దగ్గరే వాళ్ళున్నారు. హారానులో వారు సంపాదించిన యావదాస్తి వుంది. ఆ హారానులోనే వారిని వారి ఆత్మీయతను కాల్చివేసే మంట వుంది. ఈ తెరహు యావదాస్థిని సంపాదించుటకు వారిని ప్రోత్సహించాడు. వారు ముందుకెళ్ళకుండా ఆస్తిని చూపించి అడ్డుపెట్టాడు గనుకనే తెరహును తీసేస్తే గానీ అబ్రాము కానానుకు వెళ్లడానికి వీళ్ళేదు. కనుకనే దేవుడు తెరహును హారానులో చనిపోయేట్లు చేశాడు. అతడు చనిపోయిన తరువాతనే గానీ, దానికి ముందు అబ్రాము కనానుకు వెళ్ళలేకపోయాడు.

అందుకే ప్రభువు చెప్పారు, మత్త. 18:7వ.లో అభ్యంతరములు రాక తప్పవు గానీ ఎవని మూలంగా అభ్యంతరమొస్తుందో వారికి శ్రమ అని ప్రభువు చెప్పింది తెరహులో వాస్తవంగా చూస్తున్నాము. వయసుకు పెద్దవాడు, ముసలివాడు. ఆరంభంలో కనాను ప్రయాణానికి అందరినీ సిద్ధపరచి రథసారథ్యం వహించిన వాడుగా కనిపించాడు. లోకంలాంటి హారను చేరగానే వ్యాపారం మీద, ఆస్తి మీద, వెండి బంగారుల మీద, పనివారిమీద కన్నుపడి తన జీవిత ముగింపు సమయంలో చివరి సంవత్సరాలు పరలోకానికి గుర్తుగా వున్న కనానులో గడపకుండ ఇహలోకానికి సాదృశ్యమైన హారానులోనే తనువు చాలించాడు. ప్రియసోదరీ! నీవు కూడా పరమ కానాను యాత్రను ప్రారంభించి మధ్యలో ఏ హారానులో ఎన్ని సం॥రాలుగా ఆగిపోయావు? నీ హారాను ఏమిటో నాకు తెలియదు. నీకు, నీ దేవునికే తెలుసు. ఇండ్లు, వెండి బంగారు, ఆస్తి, భూములు, తోటలు, వస్త్రాలు, వ్యాపారాలే నీ 'హారానా'? ఎవడు ఈ లోకమనే హారానుతో స్నేహము చేయునో వాడు దేవునికి శత్రువగును. (యాకోబు) 4:4. అందుకే దేవుడు తెరహు జీవితానికి హారానులో ముగింపు చేశాడు.

ఇవి అంత్యదినాలు, అపాయకరమైన కాలాలు, దుర్దినాలు. అంత్యదినములలో ధనము కూర్చుకుంటున్నావా? యాకో. 5:1. ధనవంతులారా! మీమీదికి వచ్చెడి ఉపద్రవములను గూర్చి ప్రలాపించి ఏడువుడి. మీ ధనము చెడిపోయెను. మీ వస్త్రములు చిమ్మట కొట్టినవాయెను. మీ బంగారము, మీ వెండియు తుప్పుపట్టినవి. వాటి తుప్పు మీ మీద సాక్ష్యముగా వుండి అగ్నివలె అది మీ శరీరములను తినివేయును. అంత్యదినాల్లో ధనము కూర్చుకోవడం వల్ల లాభమేంటి? తుప్పు పట్టడానికా? మరియూ ఈ దినాలు 'వధ దినాలు' వధ దినమున అనగా గొర్రెపిల్ల ఉగ్రత దినము" రాబోవుతుండగా వధదినానికి మిమ్ములను మీ హృదయాలను పోషించుకుంటున్నారా?

పైగా దారి వెంబడి వెండి, బంగారులను, దాసులను యావన్మందినీ, ఆస్తిని సంపాదించుకుంటూ కనానుకు రండని దేవుడు వారితో చెప్పలేదు. వారు ప్రవేశించే కనానులోనే, సమస్తలోహాలు అందులో త్రవ్వి తీయవచ్చు. అది యెహోవా లక్ష్యపెట్టు దేశము. సారవంతమైన దేశం. ధాన్యము, ద్రాక్షలు, అంజూరలు, ఒలీవతోటలు గల దేశము. కట్టని యిండ్లు, త్రవ్వని బావులుగల దేశము. అక్కడ వారికి ఏమైనా కొరత వున్నట్లు హారాను నుండి తీసికొని పోవలసినదేమి లేదు. అలాగే మనమును ఈ లోకము లోనిది ఏదియూ పరలోకానికి తీసుకెళ్ళాల్సిన అవసరము లేదు. తల్లి గర్భములోనుండి ఎలా వచ్చామో అలాగే వెళ్లవలసి వస్తుంది. కలిగిన అన్న వస్త్రాలతో తృప్తి చెందుదాం. 2 రాజు 5:26లో వ్రాయబడినట్లు ద్రవ్యమును, వస్త్రములును, తోటలను, గొర్రెలను, ఎడ్లను, దాసదాసీలను సంపాదించుటకిది సమయమా? కాదు గనుక వున్నపాటున పరమ కనాను యాత్రకు బయల్దేరాలి, వెళ్లాలి. ఎవరెవరి హారానులు వారు విడువాలి. తెరహు

ప్రారంభ ఉద్దేశ్యం మంచిదే. నేత్రాశకు గంతలు కట్టుకోకుండా జీవితాన్ని గెలువలేక ధనాశ సమస్తమైన కీడులకు మూలం అన్నట్లు, కొద్దిమంది దానిని ఆశించి తమ్మును తామే పొడుచుకున్నారన్నట్లు 'హారాను' అను లోకాశలో తెరహు బహుగా నష్టపోయాడు. 'కనానుకు బయల్దేరాలి' అనే దేవుని వాక్కును కుమారుని ద్వారా విన్న దేవుని వాక్యమును (మార్కు 4:19లో వ్రాయబడినట్లు) ముండ్ల పొదలు అనే ఐహిక విచారాలు, ధనమోసము, ఇతరమైన అపేక్షలు లోపలచొచ్చి తెరహు వినిన దైవవాక్యాన్ని అణచివేయుట ద్వారా ఆ వాక్యము నిష్ఫలమై పోయింది. వాక్యమును విని దానిని అంగీకరించకపోతే ముప్పదంతలుగా, అరవదంతలుగా, నూరంతలుగా ఫలించే అవకాశమే లేదు. అతడు సంపాదించిన యిహ లోక ధనాన్ని అనుభవించకపోయాడు. వాక్య ధనాన్ని సంపాదించుకోలేకపోయాడు. ప్రియమైన సోదరీ! నీ యింటిలో నీవు పెద్దదానవుగా ఒక అమ్మమ్మగా, అత్తగా, ఒక తల్లిగా, సంఘములో వృద్ధ స్త్రీగా అందరూ నీకు లోబడుతున్నారు అనుకుంటూ దేవుని దగ్గర నేరుగా వినకుండా తెరహువలె నీ యింటిలో, సంఘములో స్త్రీలను నీ స్వంతముగా నడిపించాలనుకోకూడదు. చివరకు పరమకనానులో తన జీవితాన్ని ముగించాల్సిన తెరహు ధనాపేక్ష అను విగ్రహారాధికుని వలె హారానులోనే తన జీవితాన్ని ముగించేశాడు. ప్రారంభపు ఆశ, ఆసక్తి మంచివేకాని, వాటిని అంత్యము వరకు కొనసాగించినప్పుడే మన జీవితాల్లో పరమకనానుమట్టుకు క్షేమము పొందగలము.

అబ్రాహాము మెసపొతొమియలో వున్నప్పుడు మొట్టమొదట ప్రత్యక్షమయ్యాడు. ఇప్పుడు అతని తండ్రి మరణమయ్యాక హారానులో 2వసారి, దేవుడు ప్రత్యక్షమై, నీవు లేచి నీ దేశమునుండియు, నీ బంధువుల యొద్ద నుండియు నీ తండ్రియింట నుండియు బయలుదేరి నేను నీకు చూపించు దేశమునకు వెళ్ళుము అని చెప్పాడు. తండ్రి యింట నుండియు, బంధువుల యొద్ద నుండియు అంటే తండ్రి యింట నుండి బంధువుల యొద్ద నుండి లోతును వెంటబెట్టుకొని వెళ్ళాడు. 'నీవు' వెళ్ళుము అని దేవుడు ఏక వచనములో చెప్పాడు. కానీ అబ్రహాము, తన తండ్రిని, లోతును తీసికొని వెళ్ళాడు. యెష 51:2లో అతడు ఒంటరియై యుండగా నేనతని పిలచితిని అని చెప్పాడు. తెరహుతో, లోతుతో కూడా రమ్మని చెప్పలేదు. తెరహును తనతో తీసికొని రావడంబట్టి అబ్రాహాము జీవితంలో కనాను వెళ్ళడంతో కొంతకాలము హారానులో వ్యర్థమయ్యింది. దేవుడు చెప్పిన సమయానికి కనాను చేరివుంటే అప్పుడు అక్కడ కరువు వుండి వుండేది కాదేమో! అలాగే లోతును అబ్రహాము తన వెంట తీసికొని రాగా లోతు కాపరులకును అబ్రాహాము కాపరులకును కలహము కలిగింది. దానివల్ల వారు వేరై పోవలసి వచ్చింది. లోతు చెరపట్టబడినప్పుడు అబ్రాహాము శత్రురాజులతో యుద్ధమే చేయవలసి వచ్చింది. ఆస్తిని విడిపించుకొని వచ్చాక కూడ లోతు దానిని కాపాడుకోలేక కట్టుబట్టలతో సొదొమ నాశనం నుండి బయటకి రావాల్సి

వచ్చింది. 12:4 వచనము ప్రకారము అబ్రహాము యెహోవా అతనితో చెప్పిన ప్రకారము వెళ్లెను అని వ్రాయబడింది. అనగా దేవుడు చెప్పినట్లు, దేశాన్ని, తండ్రి యింటిని, బంధువులను విడిచాడే కానీ, తండ్రిని, లోతును కూడా తీసుకెళ్ళటం వల్ల తన ఆత్మీయ జీవితంలో అబ్రహాము వారిద్దరి ద్వారా ఎంతో నష్టాన్ని, కష్టాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. 12:2 వచనంలో దేవుని ఆజ్ఞకు విధేయత చూపించిన అబ్రాహాముకు 7 విధములైన ఆశీర్వాదమిచ్చినట్లు చూస్తాము. 1. నిన్ను గొప్ప జనముగా చేసెదను 2. నిన్ను ఆశీర్వదించెదను 3. నీ నామమును గొప్ప చేయుదును 4. నీవు ఆశీర్వాదముగా వుందువు. 5. నిన్ను ఆశీర్వదించు వారిని ఆశీర్వదించెదను. 6. నిన్ను దూషించు వానిని శపించెదను. 7. భూమి యొక్క సమస్త వంశములు నీ యందు ఆశీర్వదించబడును. దేవుని ఒక్క ఆజ్ఞకే యిన్ని ఆశీర్వాదాలైతే, దేవుని అన్ని ఆజ్ఞలకు ఇంకెన్ని ఆశీర్వాదాలు కలుగుతాయో కదా! కానీ దేవుని ఆజ్ఞలను మనము సరిగా పాటించకపోవుటనుబట్టి నేడు అనేక ఆశీర్వాదాలను మనము కోల్పోవుచున్నది వాస్తవము కాదా!

పైన దేవుడు చెప్పిన రీతిగా మనమాయన ఆజ్ఞలననుసరించి నడవకుంటే మనకు ఆశీర్వాదముండదు, మన పిల్లలకు ఆశీర్వాదముండదు, మన చుట్టు వారికి ఆశీర్వాదముండదు. కీ. 119:4లో ఆయన ఆజ్ఞలను మనము జాగ్రత్తగా గైకొంటే 5వ॥ ప్రకారము ఆయన ఆజ్ఞలను మనము లక్ష్యము చేస్తే మనకు అవమానము కలుగదట. ఈనాడు మన జీవితంలో ఏమైనా అవమానాలు ఎదుర్కొంటున్నామా? అంటే దానికి కారణం ఆయన ఆజ్ఞలు జాగ్రత్తగా గైకొనుట లేదేమో వాటిని సరిగా లక్ష్యపెట్టుట లేదేమో! పరీక్షించుకోవాల్సిన అవసరమెంతైనా వుంది. 119:16వ॥లో దావీదు ఆయన ఆజ్ఞలనుబట్టి హర్షిస్తున్నాడట. చాలాసార్లు వాగ్ధానాలు అంటే మనకెంతో యిష్టం. ప్రియంగా వాటిని మన ఇంటి గోడలమీద వ్రాసిపెట్టుకోడానికి ఇష్టపడుతున్నాము. 10 ఆజ్ఞలైన (కనీసం) మన యింటిగవునులమీద ద్వార బందరముల మీద వ్రాసి పెట్టుకోవాల్సిన అత్యవసరము మనకు మన పిల్లలకు ఉన్నది. వ్యభిచరించకూడదు, దొంగిలకూడదు, లంచము తీసికొనకూడదు, నీ పొరుగువాని భార్యను ఆశించకూడదు మొ॥గు ఆజ్ఞలు మన పిల్లలకు తెలిసివుంటే ఈనాడు మన పిల్లలు ఆ పనులు చేయకుండ వుండి వుందురు కదా! ఈనాడు ఏ న్యూస్ పేపర్నైనా టి.వి. వార్తల్లోనైనా వ్యభిచారపు కేసుల్లో, దొంగతనపు కేసుల్లోనైనా, లంచాల కేసుల్లోనైనా, అన్ని కేసుల్లో జాన్, జేమ్స్, మరియమ్మ, మార్తమ్మ, ప్రభుదాస్, యేసుదాస్ అనే క్రైస్తవ పేర్లే కనబడడానికి కారణమేమి? మన పిల్లలకు మనము ఈ ఆజ్ఞలను గూర్చి తెలుపలేదు, నేర్పించలేదు అనే కదా! అర్థము. కనీసం ఈ ఆజ్ఞలను మన యిళ్ళగోడల మీద ద్వారబందరాలలో అందరి కళ్లకు కనిపించే స్థలాలలో వ్రాసిపెట్టుకోడం మూలంగానైనా ఈ ఆజ్ఞలు మన పిల్లల కళ్ళకు కనబడి, ఆ ఆజ్ఞలు మన పిల్లల హృదయాలతో

మాట్లాడుతాయి కదా! ద్వితీ. 6:6-9 చదువుకోండి. ఈ ఆజ్ఞలను గురించి మనము కూర్చున్నప్పుడు త్రోవలలో నడుచునప్పుడు, పండుకొనునప్పుడు, లేచునప్పుడు వాటిని గూర్చి మనము మన పిల్లలతో మాట్లాడాలట. వాటన్నిటిని అనుసరించి నడుచునప్పుడు మనకు 'నీతి' కలుగుతుందట. ( ద్వితీ. 6:26).

**1. (ఆది 12:4)లో చెప్పిన ప్రకారమే వెళ్ళిన అబ్రహాము:-** దేవుడు చెప్పిన ప్రకారమే అబ్రహాము తన దేశాన్ని, తండ్రి యింటిని, బంధువులను వదిలి పెట్టి దేవుడు చెప్పిన కనానుకు వెళ్ళాడు. అటువలె మనమును దేవుడు మనకిచ్చిన ఆజ్ఞల ప్రకారము చెప్పినట్టే చేయాలి. ఆది. 6:22లో నోవహు దేవుడతనికి ఆజ్ఞాపించిన ప్రకారము యావత్తు చేశాడు అని వ్రాయబడింది. నిర్గ. 39:43లో ప్రత్యక్ష గుడారము విషయములో యెహోవా ఆజ్ఞాపించినట్లే ఇశ్రాయేలీయులు అలాగుననే చేసి వుండిరి. గనుక మోషే వారిని దీవించెను అని వ్రాయబడివుంది. ఆయన చెప్పినట్లే చేస్తే మనకు దీవెన కలుగుతుంది. మందిరపు పని అంతటిలో ఆయన చెప్పినట్లే చేసి దీవెన పొందుతున్నామా సోదరీ! సంఖ్యా. 9:20లో అరణ్యములో ప్రయాణంలో వున్న ఇశ్రాయేలీయులు యెహోవా నోటి మాట చొప్పున నిలిచారని, యెహోవా నోటిమాట చొప్పుననే ప్రయాణము చేశారని 18వ.లో యెహోవా నోటి మాట చొప్పుననే గుడారములు వేశారని చదువుచున్నాము. ఎంతమంచి విషయము కదా! మనము నిలిచినా, ప్రయాణాలు చేసినా "ప్రభువా ఈ రోజు పలానా ఊరికి వెళ్ళటం నీ చిత్తమేనా అని ప్రభువును ఎంక్వయరీ (enquiry) చేస్తున్నామా? మన గృహాలు నిర్మించుకునే విషయములోనూ, ఇంటి స్థలం కొనే విషయంలోను ఏ కాలనీలో, ఎవరి మధ్య ఎక్కడ కొనాలి? అది దేవుని చిత్తమా? అని దేవున్ని ప్రార్థించి తెలిసికోవడం మన కలవాటేనా? దేవుని విచారించకుండా మన స్వంత ఐడియాలతో మన పనులు చేసుకుంటున్నామా! లేక యెహోవా నోటిమాట చొప్పున చేస్తున్నామా? అలాగున అబ్రహాము తన కనాను యాత్రను యెహోవా నోటి మాట ప్రకారమే చేసి కనాను చేరాడు. అలా కనాను దేశములో అబ్రహాము సింధూర వృక్షము నొద్ద చేరాడు. (6వ.).

సింధూర వృక్షానికి ఒక ప్రత్యేకత ఉన్నది. ఆ చెట్టును గాయపరిస్తే గాయపరచబడిన ప్రాంతం నుండి ఒక ఎర్రని సువాసనకరమైన ద్రావము కారుతుందట. ఈ సింధూర వృక్షము వలె మన ప్రభువు పాపులమైన మన కొరకు తన శరీరమందు ఎన్నో గాయాలు మేకులు, ముళ్ళు, కొరడాల ద్వారా పొందారు. ఆ గాయాల ద్వారానే తన అమూల్యమైన పవిత్ర రక్తమును కార్చి మన పాపములన్నీ కడిగి వేసిన మన ప్రభువుకే ఆ సింధూర వృక్షము సాదృశ్యముగా వున్నది. ఒక పాపి మొట్టమొదట సిలువ వేయబడిన ప్రభువు దగ్గరికే రావాలి. వచ్చి తన పాపములకై పశ్చాత్తాపడి ప్రభువు నుండి క్షమాపణ పొంది ఆయన రక్తధారలతో కడుగబడాలి. మత్తయి 11:28 ప్రకారం ప్రయాసపడి పాప

భారము మోయు ప్రజలారా! నా యొద్దకు రండి. నేను మీకు విశ్రాంతి కలుగజేసెదనని ప్రభువు చెప్పాడు గాదా! ఈ సింధూర వృక్షము ఎక్కడ వున్నది అని అనుకుంటే 12:6వ॥ ప్రకారం "మోరే" దగ్గర వున్నదని తెలుస్తుంది. మోరే అనగా బోధకుడు. మనలను రక్షించిన సిలువ వేయబడిన యేసు మనకు బోధకుడైన యేసు ప్రభువు. మన (instructor) ఉపదేశకుడు ఆయనే. ఆయన మనకు వాక్యోపదేశము చేయు దేవుడు. కీర్త. 32:8 ప్రకారము "నీ మీద దృష్టియుంచి నీకు ఆలోచన చెప్పెదను. నీవు నడువవలసిన మార్గమును నేను నీకు బోధించెదను అన్నాడు. ప్రభువును నమ్మకమునుపు దుష్టుల ఆలోచన చొప్పున నడచాము. ఇప్పుడు రక్షించబడ్డాక ప్రభువు వాక్యపు ఆలోచన ప్రకారం నడువాలి. అనగా వాక్యము చదవాలి. ఆయన వాక్యము మన పాదములకు దీపమును, మన త్రోవకు వెలుగునై యున్నది. (119:105). ఈ సింధూర వృక్షము ఎక్కడ వున్నది అనుకుంటే అది 48:1 ప్రకారం 'మమ్రే' దగ్గర వున్నది అని చదువుతున్నాము. మన సింధూర వృక్షమైన ప్రభువు 'మమ్రే'గా మనకు వున్నాడు. 'మమ్రే' అనగా పుష్టికరమైన ఆహారము. ఈ వచనాలన్నిటినిబట్టి చూస్తే కనానులో సింధూర వృక్షము దగ్గరే 'మోరే' 'మమ్రే' అనుభవాలు వున్నాయి. ప్రభువే మన బోధకుడు (మోరే). ఆయన ఎటువంటి బోధ బోధిస్తాడంటే పుష్టికరమైన ఆహారాన్ని బలమైన మేతను మనకు భుజింపనిస్తాడు. యెహె. 34:14. "నేను మంచి మేతగల చోట వాటిని మేపెదను" అన్నాడు. 16వ వచనంలో "దుర్బలముగా వున్నదానిని బలపరచుదును" అన్నాడు. కనుక ఒక వ్యక్తి ప్రభువునందు రక్షించబడుట మాత్రమే కాదు. క్రొత్తగా జన్మించిన శిశువు ఆత్మలో రక్షణ విషయమై ఎదుగునట్లు 1 పేతురు. 2:3లో వ్రాయబడినట్లు నిర్మలమైన వాక్యమనే పాలను అనగా పాలవంటి దేవుని వాక్యోపదేశాన్ని అపేక్షించాలి. అపొస్తలుల బోధయందు ఎదగాలి. మనము ఇంట్లో మనమట్టుకు మనం వాక్యము చదువుకుంటే అర్థము కాదు. మరియ వలె ప్రభువు పాదాల దగ్గర వాక్యోపదేశము నేర్చుకోవాలి. అదే రీతిగా సంఘములో అనుభవజ్ఞులైన పెద్దలు, దైవ సేవకుల దగ్గర బోధకుల దగ్గర కూడా నేర్చుకోవాలి. అందరిలో అతి శ్రేష్ఠుడైన బోధకుడు మన ప్రభువు. ఆయనను పోలిన బోధకుడెవరున్నారు? (యోబు 36:22).

యెహోవా అబ్రహాముకు 12:7లో 3వసారి ప్రత్యక్షమై నీ సంతానమునకు కూడా ఈ దేశమిచ్చెదని చెప్పాడు. అమ్మా! దేవుడు మనకిచ్చిన వాగ్దానాలు, మన భక్తి జీవితం, వాక్యజీవితం మన నీతి, మన సేవా జీవితం మనతోనే అంతమవుట కాదు మన పిల్లలు కూడా ఆ అనుభవాలు కలిగియుండుట ఎంతో అవసరం. తండ్రి పుణ్యాన బావి త్రవ్వితే కొడుకు పుణ్యాన దాన్ని పుడ్చాడట' అనే సామెత వలె కాక మనం పొందిన ఆశీర్వాదాలు మన పిల్లలకు కూడా రావాలి. మొట్టమొదట పేతురు వాక్యము చెప్పగా 3,000 మంది రక్షించబడ్డారు. వారితో పేతురు - మీరు మారుమనస్సు పొంది,

పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి. అప్పుడు మీరు బాప్తిస్మము అను వరము పొందుదురు. ఈ వాగ్దానము మీకు మాత్రమే అనలేదు. మీకును, మీ పిల్లలకును, దూరస్థులందరికిని చెందునని చెప్పాడు. (అపొ.కా. 2:38,39.) అపొ.కా. 16:30లో కూడా ప్రభువైన యేసునందు విశ్వాసముంచుము అప్పుడు నీవును నీయింటివారును రక్షణ పొందుదురు అని వ్రాయబడింది. రక్షణ, బాప్తీస్మము, పరిశుద్ధాత్మ అనుభవాలు మనకే కాదు మన పిల్లలకు, యింటివారికి, దూరస్థులందరికీ అని దేవుడు వాగ్దానం చేయుట ఎంత దేవుని కృపయో కదా! మన మొక దారి మన పిల్లలదొక దారి కాకూడదు. మనదొక విశ్వాసం, మన పిల్లలది మరొక విశ్వాసం కాదు. అబ్రాహాము నీతి తన పిల్లల పిల్లల తరము వచ్చినట్లు, అబ్రహాముతో దేవుడు – వేయి తరముల వరకు నీ పిల్లలను కరుణింతును' అన్నాడు. తిమోతి యొక్క అవ్వయైన 'లోయి'లో వున్న విశ్వాసం అమె కుమార్తెయైన యునీకేలోను, యునీకెలో వున్న విశ్వాసం యునీకె కుమారుడైన తిమోతిలోను వశించినదని మనము చదువుట లేదా? ప్రియ సోదరీ! నీవైతే రక్షించబడి, బాగుగా ఆత్మీయంగా సాగిపోతున్నావేమో! మరి నీ పిల్లల సంగతి ఎట్లు? యెహో. 24:15వ.లో యెహోషువ "నేను నా యింటివారును యెహోవాను సేవిస్తామన్నాడు". ఆది. 18:19లో వ్రాయబడినట్లు అబ్రహాము తన తరువాత తన పిల్లలును, తన యింటి వారును నీతిన్యాయములు జరిగించుట యెహోవా మార్గమును గైకొనునట్లు అతడు వారికి ఆజ్ఞాపించాలని దేవుడు అబ్రహాముతో చెప్పాడు. అపొ.కా. 10:1,2లో వ్రాయబడినట్లు 'కొర్నేలి' తన యింటి వారందరితో కూడా దేవునియందు భయభక్తులు గలవాడని వ్రాయబడినట్లు మనము తరువాత మన పిల్లలు కూడా శరీరరీతిగా మన ఆస్తులు వారసత్వముగా పంచుకున్నట్లు, ఆత్మీయ ఆశీర్వాదములను కూడ వారు కలిగియుండాలి. అబ్రాహామును దేవుడు అన్ని విషయాల్లో ఆశీర్వదించాడు. అతని కుమారుడైన ఇస్సాకు కూడ ఆది 25:11లో అబ్రాహాము మృతినొందిన తరువాత దేవుడు అతని కుమారుడగు ఇస్సాకును ఆశీర్వదించెను. ఆది. 24:36లో అబ్రహాము తన కుమారుడగు ఇస్సాకును తనకు కలిగినది యావత్తును యిచ్చెనని వ్రాయబడింది. అలాగున మన ఆత్మీయ దీవెనలన్ని మనకంటే ఎక్కువగా మన పిల్లలు పొందాలని ప్రభువును ప్రార్థిద్దాము.

అలాగున తనకు 3వసారి ప్రత్యక్షమై తన పిల్లలకు కూడ ఆ దేశమిస్తానని చెప్పిన దేవునికి అబ్రహాము బలిపీఠము కట్టాడని ఆది 12:4లో చదువుతున్నాము. ఇప్పటికే అబ్రాహాము సింధూర వృక్షమైన ప్రభువునొద్ద అయన రక్తముతో కడుగబడి, మోరే, మమ్రే అనుభవాలను పొందిన బలమైన పుష్టికరమైన ఆత్మీయ ఆహారాన్ని భుజిస్తున్న అనుభవం కలిగిన అబ్రహాము ఇప్పుడు బలిపీఠపు అనుభవంలోనికి వచ్చాడు. బలిపీఠమును చూడగానే మనకొరకు బలి చేయబడిన యేసు ప్రభువు శరీరము, ఆయన చిందించిన రక్తము మనకు

గుర్తొస్తాయి. నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుడని చెప్పిన 'బల్ల ఆరాధన' అనుభవములోనికి అబ్రహాము వచ్చినట్లు తెలుస్తుంది. ప్రియ సోదరీ! రక్షించబడి, అపొస్తలుల బోధలో వున్న నీవు ఆరాధన కూడికకు వస్తున్నావా? ఆయనను జ్ఞాపకము చేసుకుంటున్నావా? నేను త్రాగిన చేదును, మాచిపత్రికను జ్ఞాపకము చేసికొనుమని ప్రభువు విలాప వాక్యములు 2:18లో కోరుతున్నాడు. ఎడతెగక నా ఆత్మ వాటిని జ్ఞాపకము చేసికొనుచున్నదని ఆయన చెప్తున్నాడు. అసలు ఆయన మనకొరకు అంతదురవస్థ పొందాడు. అంత శ్రమ పొందియుండగా ఆయనను మనం జ్ఞాపకం చేసుకోవాలి? ఎప్పుడెప్పుడు జ్ఞాపకం చేసుకోవాలి? ఎడతెగక అని విలా 3:20లో చదువుతున్నాము. అపో.కా. 2:42 ప్రకారం రొట్టె విరుచుటయందు ఎడతెగక వుండాలి. అయినా అతని తరము వారిలో ఎవరునూ ఈ సంగతిని (ప్రభువు సిలువవేయబడిన సంగతిని) ఆలోచించలేదు అని యెష. 53:8లో వ్రాయబడింది. సరే, ఈ తరము వాళ్ళమైన మనమైనా ఆయనను జ్ఞాపకము చేసికొని ఆరాధించడంలో ఎడతెగక వుందామా?

8వ.లో అబ్రహాము అక్కడ నుండి బయలుదేరి బేతేలుకును హాయికిని మధ్య గుడారము వేసుకున్నాడు. పరస్థలమునకు వచ్చిన అబ్రాహాము ముందు గుడారము కాదు కానీ, బలిపీఠము కట్టాడు. ఆ తరువాతే గుడారము వేసుకున్నాడు. గుడారం బేతేలుకు దగ్గరే వేసుకున్నాడు. బేతేలు అనగా సహవాసం. సంఘానికి గుర్తు. రక్షణ పొంది బాప్తిస్మము తీసికొని, ఆరాధనలో పాలుపొందే ప్రతి విశ్వాసి సంఘ సహవాసం కలిగి వుండాలి. కొందరు మానుకొనుచున్నట్లుగా సమాజముగా కూడుట మానక ఆ దినము సమీపించుట చూచుకొలది మరియెక్కువగా అలాగు కూడుకోవాలని హెబ్రీ. 10:24వ.లోని వాక్యం చెబుతుంది. మన సహవాసమైతే తండ్రితోను, ఆయన కుమారుడైన యేసుక్రీస్తుతో కూడను ఉన్నది. ఇలా తండ్రి కుమారులతో మాత్రమే కాక ఆయన పిల్లలతో కూడ మనము సహవాసంగా కూడాలి. సహవాసానికి వెళ్తున్నావా సోదరీ! సహవాసానికి ఆగిపోతే బాగుగా మండుచున్న పొయ్యిలో నుండి మండే కర్రను బయట పెట్టినట్టే. అంతవరకు మండిన కర్ర బయట పెట్టగానే ఆరిపోతుంది. అలాగుననే ఆత్మీయ జీవితం ఆరిపోతుంది. యోహా. 20:24లో పునరుత్థానుడైన ప్రభువు వచ్చినప్పుడు 12 మంది శిష్యులలో ఒకడైన దిదుమ అనబడిన తోమా వారితో లేకపోయాడు. తక్కిన శిష్యులు మేము ప్రభువును చూచితిమని అతనితో చెప్పగా – నేనాయన చేతులలో మేకుల గురుతును చూచి, నా వ్రేలు ఆ మేకుల గురుతులో పెట్టి నా చెయ్యి ఆయన ప్రక్కలో వుంచితేనే గాని నమ్మనే నమ్మనని వారితో చెప్పెను. ప్రభువు పునరుత్థానము మీద తోమాకు యింతటి అవిశ్వాసము రావడానికి కారణం ఆయన ఒక వారం క్రిందట శిష్యులతో సహవాసంలో లేకపోవటచేతనే గదా! వారంక్రిందట సహవాసమునకు వచ్చి వున్నట్లైతే అందరితోపాటు తోమా పునరుత్థానుడైన యేసు ప్రభువును

చూచివుండే వాడు కదా! కనుక సంఘ సహవాసము మనలని విశ్వాసమందు లోతుకు నడిపిస్తుంది. ప్రియ సోదరీ! మరి నీ సహవాస సంగతి ఏమిటి? నీవే సంఘానికెళ్ళకపోతే మరి నీ పిల్లల సహవాసము సంగతేంటి? యోవేలు 2:16లో 'జనులను సమకూర్చుడి. సమాజ కూటము ప్రతిష్ఠించుడి. పెద్దలను పిలునంపుడి. చిన్నవారిని స్తన్యపానము చేయు బిడ్డలను తీసికొనిరండి. పెండ్లి కుమారుడు అంతఃపురములో నుండియు, పెండ్లి కుమార్తె గదిలో నుండియు రావలెను" అని ప్రభువు చెప్పుచున్న మాటలను గమనించారా? ప్రభువు మాట విని సమాజ కూటముకు నేటినుండే మన చంటి పిల్లలతో కూడ వెళ్ళడం ప్రారంభించండి.

అబ్రహాము బేతేలుకు దగ్గరగా గుడారము వేసికొనినట్లు సాధ్యమైనంత వరకు వీలైనంత వరకు మన గృహాలు స్థానిక సంఘ సహవాసమునకు దగ్గరగా వుండునట్లు చూచుకుంటే అన్ని కూడికలకు వెళ్ళడానికి చాలా అనువుగా వుంటుంది. ఇది నా సలహా మాత్రమే. స్థానిక సంఘానికి దూరంగా ఇల్లు తీసుకుంటే అన్ని కూటములకు అన్నిసార్లు వచ్చే అవకాశాలు తగ్గుతాయి కదా! కొద్దిమంది మా యిల్లు సంఘానికి దూరంగా వుందని సంఘానికి గైర్హాజరౌతున్నారు. రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్, హాస్పిటల్, మార్కెట్, ఆఫీస్ లాంటివి ఇంటికి ఎంతో దూరంగా వున్నా రోజూ వెళ్తున్నారు గదా! కనుక ఇల్లు సంఘానికి దూరమైనా తప్పకుండా సంఘానికి రావడం నీ భక్తి జీవితానికి చక్కని సంకేతంగా వుంటుంది కదా!

ఆది 12:8వ.లో అబ్రాహాము బేతేలుకు హాయికి మధ్యలో గుడారం వేసుకొన్ని తరువాత అక్కడ మరొక బలిపీఠం కట్టినట్లు చదువుతున్నాం. ఒక బలిపీఠం మోరే, మమ్రేల దగ్గర కట్టాడు. ఇప్పుడు బేతేలు, హాయిల మధ్య మరొక బలిపీఠం కట్టి అక్కడ ప్రార్థన చేశాడని చదువుతున్నాము. ఇంతవరకు అబ్రాహాము జీవితంలో రక్షణ, బోధ మందిరము, రొట్టె విరవడం, అనే అనుభవాలను చూచాం. ఇప్పుడు అబ్రహాములో ప్రార్థన అనుభవాన్ని చూస్తున్నాము. క్రొత్తగా ప్రభువును నమ్మిన ప్రతి విశ్వాసిలో ఈ నాలుగు అనుభవాలు యెడతెగక వుండాలని అపో.కా. 2:43 చెబుతుంది. యేసు నామమున మనముసూ ప్రార్థనా అలవాటును కలిగి వుండాలి. ప్రార్థనా జీవితము విశ్వాసికి వెన్నెముక వంటిది. ప్రార్థించని జీవితము నీరు లేని పైరు చందము వంటిది. ప్రార్థన లేకపోతే వెన్నెముక లేనట్లే. ప్రార్థన లేకపోతే ఆత్మీయ జీవితంలో సరిగా నిలబడలేము. కొనసాగలేము. ప్రార్థనలో ప్రాతఃకాల ప్రార్థన వుండాలి. స్త్రీలకు "రేయి మొదట జామున లేచి నీ పసి పిల్లల కొరకును నీ చేతులు ఆయన తట్టు ఎత్తాలి" అని విలా. 2:19లో వ్రాయబడింది. దినములో ఒకసారైనా భార్యభార్తలు కలిసి ప్రార్థన చేయాలి. కుటుంబ ప్రార్థనలో ప్రార్థించాలి. నియమించబడిన సమయంలో సంఘముతో కలిసి గుంపు ప్రార్థనలు కూడ చేయాలి. నా నామమున మీరేమి నన్ను అడిగినను నేను మీకు చేతును యోహా. 14:13వ.లో

వ్రాయబడింది. కనుక ఆయన నామమున ప్రార్థన చేసే అనుభవాన్ని అబ్రహాము వలె మనము కలిగి యుండాలని అబ్రహాము జీవితం ద్వారా మనము నేర్చుకుంటున్నాము.

అతడు ఇంకనూ ప్రయాణము చేయుచు దక్షిణ దిక్కుకు వెళ్ళగా ఆ దేశములో కరువు వచ్చినట్లు 12:18వ.లో చదువుచున్నాము. కరువు భారముగా నున్నందున అబ్రహాము ఐగుప్తు దేశములో నివసించుటకు వెళ్ళాడని వ్రాయబడింది. అతని నివాసము కనానులోనే కానీ ఇహలోకానికి సాదృశ్యముగా వున్న ఐగుప్తులో కాదు. అలా ఐగుప్తులో ప్రవేశించుటకు సమీపించినప్పుడు దేవుని భయము లేని ఆ దేశస్థులు చక్కనిదైన తన భార్యను చూచి తనను చంపి ఆమెను బ్రతుకనిస్తారేమో అన్న చావుభయము అతనిలో పుట్టింది. ఆది. 25:7వ.ను బట్టి చూస్తే ఇతడు బ్రతికిన సంవత్సరములు 175 సంవత్సరములు. అతనికి ఇంకా నిండు నూరేళ్ళ ఆయుష్షు వున్నప్పటికి అనవసరంగా 75వ సం॥లోనే చావు భీతి అతన్ని వెంటాడుతోంది. లోకమనే ఐగుప్తు లోనికి అబ్రహాము వెళ్తున్నాడు కాబట్టే అతనికి లేనిపోని అనవసరమైన భయాలొస్తున్నాయి. ఇన్నాళ్ళు కనానులో నివసించినప్పుడు ఎన్నడైనా తాను ఏ విషయములోనైన భయపడినట్లు చూడడమే లేదు. నన్ను చంపి నిన్ను బ్రతుకనిస్తారు కాబట్టి "నీవు దయచేసి నా చెల్లెలు" అని చెప్పమని అబ్రాహాము తన భార్యయైన శారాతో అబద్ధము చెప్పమంటున్నాడు. కొలొ. 3:9వ. ప్రకారం మనము ఒకరితో నొకరు అబద్ధమాడకూడదు. ప్రాచీన స్వభావమును వదలిపెట్టి జ్ఞానము పొందు నిమిత్తము నూతన పరచబడుచున్న నవీన స్వభావమును ధరించుకోవాలి. కీర్త. 63:11లో వున్నట్లు అబద్ధములాడు వాని నోరు మూయబడును అని వ్రాయబడింది. నోరు ఎప్పుడు మూయబడుతుంది? పక్షవాయువు రోగము వచ్చినప్పుడే కదా! అంత పని మన నోటికి జరుగకముందే అబద్ధాల మాట్లాడే అలవాటు మానుకోవడం మేలు. అబద్ధాలు పాత స్వభావానికి చెందినవే.

అబ్రహాము తన భార్యను చూచి నీవు చక్కనిదానవన్నాడు. తనకు 75 సం॥లున్నప్పుడు శారా వయస్సు అప్పటికి 65 సంవత్సరాలు. 65 సం॥రాలు వయస్సు వచ్చినా కూడా ఆమె అతనికి చక్కగా కనబడుతోంది. మన పరమపెనిమిటికి మనము రక్షించబడి ఇన్ని సంవత్సరములైనా మన ఆత్మీయ అంతరంగం సౌందర్యంగా వుందా? సాధువైనట్టియు, మృదువైనట్టియునైన గుణమను అక్షయాలంకారముగల మన అంతరంగపు స్వభావము ప్రభువుకు అలంకారముగా వున్నదా? మన విషయమై మన ప్రభువు అలాగున చెప్పగలడా? రక్షించబడి ఎన్ని సంవత్సరములైనదో కానీ, ఇంతవరకు ఆత్మీయ అందాన్ని కాపాడుకున్నామా?

శారా మిక్కిలి సౌందర్యవతి అని ఐగుప్తీయులు కూడా చూచారని వ్రాయబడింది. ఫరో యొక్క అధిపతులు కూడ ఫరో ఎదుట ఆమెను పొగడారు కాబట్టి ఆమె ఫరో ఇంటికి

తేబడింది. రాజు యింటికి ఆమెను తెచ్చింది ఆమె అందమే. ఆ అందాన్ని బట్టి ఆమె ఆ సంపన్నుని, ఆ రాజు యింటిని చేరుకోగలిగింది. కానీ ఒక ఆత్మీయురాలు వుండతగిన స్థలమది కాదు. ఆనాడు ఆమె శరీర అందాన్నే అందరు చూచారు. ఆమె అందానికి ఆ ఫరో రాజు పెద్ద పీటయే వేశాడు. తన అంతఃపురములో ఈ లోకపు అందం ఆమెను అందలమెక్కించింది. పరలోకపు ఆత్మీయ అందం మనల్ని పరమరాజు యింటికి తీసుకెళ్తుంది. ఈ లోకపు రాజు, ఆయన ప్రజలు శారాలో శరీర అందాన్ని చూచారు. ఈ లోకం స్త్రీని ఎప్పుడూ ఒక భోగ వస్తువుగా చూస్తుంది. కానీ పరమరాజు ఆమెలో ఆత్మీయ అందాన్ని చూచాడు. అందుకే 1 పేతు 3:5 వచనములో ఇలా వ్రాయించాడు ప్రభువు. అటువలెనే పూర్వము దేవుని ఆశ్రయించిన పరిశుద్ధ స్త్రీలును, తమ స్వపురుషులకు లోబడియుండుటచేత, తమ్మును తాము అలంకరించుకొనిరి. ఆ ప్రకారము శారా అబ్రహామును శారా అబ్రహామును యజమానుడని పిలుచుచు అయనకు లోబడియుండెను. మీరును యోగ్యముగా నడచుకొనుచు ఏ భయమునకు బెదరక యున్న యెడల ఆమెకు పిల్లలగుదురు. ఈ వచనములనుబట్టి శారా యొక్క ఆత్మీయ, అంతరంగ, అక్షయ, అలంకారాన్ని మనము ఈ రీతిగా గమనించగలము. శారా 1. దేవుని ఆశ్రయించిన పరిశుద్ధ స్త్రీ అని, 2. ఆమె పరిశుద్ధ స్త్రీ, తన భర్తకు లోబడివుందని, 3. యోగ్యముగా నడచుకుందని, 4. ఏ భయమునకు బెదరని స్త్రీ అని 5. ఆమె పై నాలుగు గుణాలు కలిగిన వారికి ఆమె తల్లియని మనము గ్రహిస్తున్నాము.

**1. శారా ఎప్పుడు దేవునిని ఆశ్రయించింది?:–** హెబ్రీ 11:11 ప్రకారము విశ్వాసమునుబట్టి శారాయు వాగ్దానము చేసినవాడు. నమ్మదగినవాడని యెంచుకొనెను. తాను నమ్ముకొనిన దేవుడు తనకిచ్చిన వాగ్దానము ప్రకారము దేవుడు తనకివ్వబోయే గర్భమును ధరించుటకు లేదా మోయుటకు (9 నెలలు) కావలసిన శక్తి నిమిత్తమై దేవుని ఆమె ఆశ్రయించింది. ఈనాడు మంచి యవ్వన ప్రాయంలో యవ్వన స్త్రీలు గర్భములను ధరించు శక్తి లేనివారిగా ఉన్నారు. గర్భము ధరించినా ఆ గర్భాలను మోయలేని శక్తిహీనులుగా ఉన్నారు. డాక్టర్స్ వారికి బెడ్‌రెస్ట్‌లు, సజెస్ట్ చేస్తున్నారు. కదలకూడదు, బరువులు మోయకూడదు అలా చేస్తే అబార్షన్ అవుతుంది అని చెప్తారు. అంటే వారి గర్భాశయాలకు వారి గర్భాన్ని మోసే శక్తి కూడ లేదన్నమాటే. కాని 90 యేళ్ళ వృద్ధురాలు ఆ సమయములో గర్భము ధరించుటకు, ధరించిన గర్భాన్ని 9 నెలలు మోయుటకు గర్భానికి ఎంత శక్తి కావాలో ఆ శక్తిని ఏ ట్యాబ్లెట్స్ ద్వారానో, టానిక్కుల ద్వారానో, డాక్టర్ల వైద్యము ద్వారానో శారా పొందలేదు కాని, దేవుని ఆశ్రయించి శక్తి పొందింది. 1 తిమోతి 2:13–15వ.లో వ్రాయబడినట్లు ప్రియమైన గర్భవతులారా! హవ్వ మోసపరచబడి అపరాధములో పడటువలన ఆమెకు ఆమెకు మాత్రమే కాక స్త్రీ జాతి అంతటికి గర్భవేదన మిక్కిలి హెచ్చించబడింది. దానికి కారణం మన అపరాధమే. స్త్రీకి కాన్పు అవ్వడమనేది ఒక రీతిగా ప్రాణగండమే. కానీ సుఖ

కాన్పును ఆశించిన స్త్రీలందరు 1 తిమో. 2:14 ప్రకారము స్వస్థబుద్ధి కలిగి, విశ్వాస, ప్రేమ, పరిశుద్ధతలయందు నిలుకడగా ఉండిన యెడల శిశు ప్రసూతి ద్వారా (బిడ్డ పుట్టు ప్రసవ సమయంలో) స్త్రీ రక్షింపబడుతుంది" అని చెప్పబడిన ప్రత్యేకమైన వాగ్దానము మనకుండగా ఆ 1. స్వస్థబుద్ధి 2. ఆ విశ్వాసం 3. ఆ ప్రేమ 4. ఆ పరిశుద్ధతలు మీలో వుంటే మీకు ప్రభువు సుఖ కాన్పునిస్తారు.

**2. శారా పరిశుద్ధ స్త్రీ:-** దేవుని ఆశ్రయించే స్త్రీలు పరిశుద్ధంగానే జీవిస్తారు. దేవుని ఆశ్రయించని వారు సాతానును, మనుష్యులను ఆశ్రయించేవారు ఎప్పటికీ అపరిశుద్ధులుగానే జీవిస్తారు. ఆది 12వ అధ్యాయంలో ఫరో యింటికి తేబడినప్పుడు భర్త తన యొద్ద లేనప్పుడు ఎన్ని దినములు అతని యింటిలో వుండిందో కానీ ఆమె పరిశుద్ధ జీవితాన్ని పరిశుద్ధంగానే కాపాడుకుంది. శారా తన ప్రవర్తనను కాపాడింది. వెకిలి చేష్టలు చేయలేదు. పెండ్లియైన పోతీఫరు భార్య యోసేపును శోధించినట్లు శారా రాజును శోధించలేదు. ఫరోకు శారా పరస్త్రీయే. పరస్త్రీని తన యింటిలో వుంచుకున్న పాపానికే దేవుడు ఆమెనుబట్టి అతని యింటి వారిని మహావేదనలతో బాధించాడు. వట్టి వేదన మాత్రమే కాదు మహావేదన, అంటే ఎంత భయంకరమైన సంగతో కదా! ఆమెను యింటిలో వుంచుకున్న సమయంలో ఇక్కడ అబ్రాహాముకు నిద్ర పట్టి వుంటుందా? శారాను ఆ రాజు ఏమి చేస్తాడోనన్న భయంతో వుండి వుంటాడు కదా! ఎంత కలవరంగా అబ్రహాము వుండి వుంటాడో కదా! శారాను ముట్టిన వాడు, తన కనుగుడ్డు ముట్టినవానితో సమానమని దేవుడు మహావేదనల చేత వారిని బాధించినట్లు మనము గమనిస్తున్నాం. ఒకవేళ వారు చెల్లెలని అబద్ధమాడి తప్పించుకోచూచారు. ఇలాగు తమ స్వంత ప్లాన్స్ ద్వారా పరిస్థితిని మ్యానేజ్ చేసుకోవచ్చు అనుకున్నారు గానీ, మ్యానేజ్ కాదు గదా! డ్యామేజ్ చేసుకున్నట్టే అయ్యింది. దేవుడు ఈ సమయంలో ఫరో రాజు యింటివారికి మహా బాధలు కలుగజేయకపోతే ఆ రాజు శారాను ముట్టేవాడే. కానీ, దేవుడు ఆమెను, ఆమె గర్భాన్ని అపవిత్రం కాకుండా కాపాడాడు. ఎందుకంటే అదే గర్భం నుండి, ఇస్సాకు, యాకోబు, యూదాలు రావాలి. యూదాలో నుండి 'యూదా గోత్రపు కొదమ సింహమైన జగద్రక్షకుడైన యేసుప్రభువు రావడం మహా విశేషం. కనుక అబ్రహాము, శారాల అబద్ధాలు వారిని కాపాడలేదు. కాని దేవుని మూలముగానే ఆమె పరిశుద్ధ స్త్రీగా కాపాడబడ గలిగింది. అబద్ధములాడకుడని దాని గూర్చిన రెఫరెన్స్‌లు ఆ దినాల్లో వారికి ఇవ్వబడలేదు. ఈనాటి వాక్య వివరణ, వాక్యనేర్పు వారికి ఆనాడు లేవు గనుక వారు అబద్ధమాడారు అంటే అర్థముంది. మరి ఈనాడు ఇంత వాక్య సమృద్ధి కలిగి, వాక్యనేర్పు వాక్య సహాయకులను కలిగియుండి కూడా అబద్ధాలను ఆశ్రయిస్తే అది మనకు క్షేమమా? దేవుని మూలముగా పుట్టినవాడు తన్ను తాను భద్రము చేసికొనును గనుక దుష్టుడు వానిని ముట్టడు" అని 1 యోహా 5:18 వ్రాయబడినట్లు మనల్ని మనం ఈ

అపవిత్రత నుండి కాపాడుకోవాలి. అటువంటి బిడ్డలను దేవుడు కూడా తన కంచె వేసి కాపాడుతాడు. మన దేహాలను దేవుని ఆలయాలుగా పవిత్రమైనవిగా వుంచుకోవాలి. శోధనకు అపవిత్రతకు చోటివ్వకూడదు. 1 థెస్స. 4:3,4 మీరు పరిశుద్ధులగుటయే అనగా జారత్వమునకు దూరముగా వుండుటయే దేవుని చిత్తము. మీలో ప్రతివాడు దేవుని యెరుగని అన్యజనులవలె కామాభిలాషయందు కాక పరిశుద్ధతయందును, ఘనత యందును తన తన ఘటమును ఎట్లు కాపాడుకొనవలెనో అది యెరిగియుండుటయే దేవుని చిత్తము. 1 థెస్స. 4:7వ. పరిశుద్ధులగుటకే దేవుడు మనలను పిలిచెను కానీ, అపవిత్రులుగా వుండుటకు పిలువలేదు. మన ప్రభువు పరిశుద్ధుడైన ప్రకారం సమస్త ప్రవర్తన యందు మనము పవిత్రులమై వుండాలి. (1 పేతురు. 1:16).

**3. భర్తకు లోబడిన శారా:-** శారా భర్తకు లోబడిందని వ్యాక్యాధారము ఏమి చూపగలమని ఆది 18 అధ్యాయములో ఒక రోజు ఎండవేళ అబ్రహాము గుడాల ద్వారమందు కూర్చున్నాడు అంటే ఎండవేళ అప్పటికే భోజనం ముగించి కూర్చున్నాడేమో! ఇంతలో ముగ్గురు మనుష్యులు వారింటికి వచ్చారు. అప్పుడు అబ్రహాము శారాతో "నీవు త్వరపడి మూడు మానికల సన్నని పిండి తీసికొని పిసికి రొట్టెలు చేయుము" అన్నాడు. అప్పటికి శారా వయస్సెంత? మరుసటి యేట నీ కౌగిటిలో కుమారుడుంటాడని ఆ దూతలు శారాతో చెప్పారు. కాబట్టి 90 వ సం॥మందు ఆమెకు ఇస్సాకు పుట్టాడు. అంతకుముందు సంవత్సరము అనగా 89 సం॥ అని అర్థము. 89 సంవత్సరాలు ముసలామెను పిలిచి అబ్రహాము త్వరపడి, <u>3 మానికల, సన్నని పిండి తీసికొని పిసికి, రొట్టెలు</u> చేయమంటే ఆమె ఏమియూ, ఎదిరించక, సణగక, విసుకుపడక ఆతిథ్యము చేసింది. మనమైతే 3 మానికలనగా 6 శేర్ల పిండి ఎందుకు? ఒక్కొక్కరికి 3 రెండ్ల 6 లేక 3 మూళ్ళ 9 లేక 3 ఐదుల 15 రొట్టెలు మాత్రమే చేస్తాను. 3 మానికల పిండి ఎందుకు? అని ఎదురు చెప్పేవాళ్ళమేమో? పైగా "సన్నని పిండట, సన్నని పిండి కాకపోతే లావుపిండి తీసుకుంటాన?" పిసికి రొట్టెలు చేయమన్నావు. పిసికి కాకపోతే పిసకకుండా చేస్తానా? పైగా త్వరపడి చేయమంటున్నావు? ఇప్పుడే సంసారానికి వచ్చిన క్రొత్త పెళ్ళి కూతురుననుకున్నావా? నేను త్వరగా చేసేందుకు? వెళ్ళు, ఏ దాసీతో చేయించుకుంటావో చేయించుకో" అని ఒక పెద్ద క్లాస్ తీసుకునే వాళ్ళమేమో! శారా ఒక్క మాట కూడ ఎదురు మాట్లాడక భర్త మాటకు లోబడి ఆయన చెప్పిన రీతిగానే 3 మానికల, సన్నని పిండితో, పిసికి, త్వరపడి రొట్టెలు చేయుట చూడగా ఆమె ఎంతగా భర్తకు లోబడిన స్త్రీయో మనకర్థమవుతుంది. ఆ రోజు తమ యింటికి వచ్చిన మనుష్యులు దేవదూతలని ఎరుగకయే అతిథ్యము చేసింది శారా (హెబ్రీ. 13:1). శారా ఆ రోజు భర్త వంట పరిచర్య చేయమని చెప్పిన మాటకు విధేయత చూపకపోతే ఆమె సంతాన దీవెన పొంది వుండేది కాదు కదా? భార్యలమైన మనము భర్త మాటలకు విధేయత చూపకపోతే దేవుడిచ్చే ఎన్ని దీవెనలు పోగొట్టుకుంటున్నామో ఎన్నడైనా ఆలోచించామా? భర్త మాటలకు

విధేయత చూపినప్పుడు భర్త మనలను మెచ్చి ప్రతిఫలమేదియు మనకివ్వకపోవచ్చు. కానీ దేవుడు మనకిస్తాడు. పైగా ఆయన యిచ్చే దీవెనలు శాశ్వతమైనవిగా, శ్రేష్ఠమైనవిగా వుంటాయి. కనుక ఇకనుండియైనా మనం మన భర్తలకు లోబడి వుందామా!

**4. యోగ్యముగా నడచుకొన్న శారా:-** 2 పేతురు. 3:6 ప్రకారము శారా యోగ్యురాలు అనగా మేలు చేసిన స్త్రీగా వ్రాయబడింది. ఎవరికి ఏ మేలు చేసిందో బైబిల్‌లో వ్రాయబడలేదు. కానీ భర్తకు లోబడి జీవించడమే ఆమె భర్తకు చూపిన మేలు. అదే ఆమె కలిగియున్న యోగ్యత. కాబట్టి లోబడే భార్యలే భర్తతో కలసి జీవించడానికి యోగ్యులు. యోగ్యురాలు పెనిమిటికి కిరీటము. (సామె. 12:4). ఈలాగు భర్తకు లోబడుతూ జీవించడమే ఆమె తన భర్తకు చేసిన మేలు. భార్య దొరికిన వానికి మేలు దొరికెను. ఆమె అతనికి బ్రతుకు దినములన్నియు మేలే చేయును కానీ కీడు చేయదు" అనే మాటలు సామె. 31:12లో మనము చదువుతున్నాము. ప్రియ సోదరీ! మరి నీ సాక్ష్యము ఎలా వుంది? నీ భర్తకు లోబడడమే నీవు చేసే గొప్ప మేలు. లోబడనొల్లని భార్యవుగా వున్నావా? లేక లోబడుచూ శారావలె వున్నావా? భర్తకు లోబడకపోతే ఆయనకు నీవు పరోక్షంగా కీడు చేస్తున్నట్లే. ఆలోచించు. ఈ భర్తకు ఈ భార్య చక్కగా సరిపోతుంది అని అనిపించుకోడమే యోగ్యత అనిపించుకుంటుంది.

**5. ఏ భయమునకు బెదరని శారా:-** శారా తన జీవితంలో దేనికీ భయపడలేదని చదవగలగుచున్నాము. దేవుని పిలుపుననుసరించి కనానుకు వెళ్ళుటకు తన దేశాన్ని బంధువులను తన వారినందరినీ విడుచునప్పుడు భయపడలేదు. ఫరో రాజు తన యింటిలో ఆమెను తెచ్చిపెట్టుకున్నప్పుడు ఆ రాజు తనను ఏమి చేస్తాడోనని కూడ ఆమె భయపడలేదు. తనకు పిల్లలు లేరని కూడ భయపడలేదు. కానీ అబ్రహామే నేను పిల్లలు లేనివాడనైపోవుచున్నానే అని ఆది 15:2లో అన్నాడు కానీ శారా ఏనాడు భయపడలేదు. హాగరు తనకు తొందర కలిగించినప్పుడు కూడా దేవుని ఆశ్రయించి దేవుని ప్రేరేపణనుబట్టి హాగరును దాని కుమారుని వెళ్ళగొట్టమని ధైర్యంతో భర్త దగ్గర చెప్పింది. దేవుడు శారా మాటను వినమని అబ్రహాముతో ఆ సమయాన చెప్పడం ఈ సందర్భాలన్నింటిలో శారా ఎంత ధైర్యంగా ఆ నిర్ణయం తీసుకుందోనని అనిపిస్తుంది. కనుక ఏ భయానికి బెదిరిపోలేదు శారా. మనమును అలాగున మన జీవితములో ఎదురయ్యే సమస్యలో శోధనల్లో భయపడక ధైర్యంగా వుండాలి. న్యాయా. 13:23వ.లో మానోహా తన భార్యతో "మనము దేవుని చూచితిమి గనుక నిర్భయముగా చనిపోతాము అని భయపడినప్పుడు మనోహా భార్య యెహోవా మనలను చంపగోరితే ఆయన మన బలిని నైవేద్యాన్ని అంగీకరించడు, ఈ సంగతులు చూపించడు, వినిపించడు అని భయపడుతున్న భర్తను ధైర్యపరచింది. ప్రియ సోదరీ! నీవెప్పుడైన నీ భర్తనుగానీ, సంఘములో ఏ స్త్రీనైనను ధైర్యపరచావా? లేక చీటికిమాటికి నీవు భయపడి బెదిరిపోయి

అందర్నీ భయపెడుతున్నావా? నీతిమంతుడు సింహమువలె ధైర్యంగా వుంటాడని దేవుని వాక్యం సామె. 28:1 చెబుతోంది. సాధారణంగా బలహీన ఘటములైన భార్యలు ప్రతి చిన్న దానికి బెదిరిపోతూ భయపడుతూ, టెన్షన్ పడుతూ, క్షణానికో ఆలోచన ఆలోచిస్తూ ఎదుటి వాళ్ళనందరినీ భయాందోళనలో ముంచెత్తుతూ వుంటారు. కనుక శారా వలె స్త్రీలందరూ అన్ని పరిస్థితుల్లో ధైర్యంగా వుందాం.

**6. మనకందరికి తల్లియైన శారా:-** హెబ్రీ. 3:6వ. ప్రతి స్త్రీ శారా వలె దేవుని ఆశ్రయించి పరిశుద్ధ స్త్రీవలె వుంటూ, యోగ్యముగా నడచుకొనుచు ఏ భయమునకు బెదరక, ఇతరులు బెదిరిపోవునట్లు చేయకయు వుంటే మనము ఆమెకు పిల్లలమవుతాం. ఆమె మనకు తల్లి అవుతుంది. ఆమె విశ్వాసులకు తల్లి అని బైబిల్‌లో వ్రాయబడింది. నేడు మన సంఘాల్లో మన వృద్ధ స్త్రీలందరూ ఇలానే శారా వలె ఆత్మీయంగా తల్లులువలె వుండాలి. చీటికి మాటికి బెదిరే స్త్రీలుగా కాకుండ, దేవునిని ప్రార్థనలో ఆశ్రయించే పరిశుద్ధ స్త్రీలుగా వుండాలి. ఆదిలో నా ఉసురు నీకు తగులును గాక అని శారా భర్త మీద రుసరుసలాడినప్పటికీ ఆ తరువాత ఆమె భర్తకు లోబడినదని ఆమె విషయంలో చదువుచున్నాము. అలా లోబడి నేడు మనకందరికీ మంచి మాదిరియై విశ్వాస స్త్రీలందరికి తల్లియై నిలిచింది. మనమందరము ఆమె మాదిరిని అనుసరించాలి. యాయేలు సీసెరా అను శత్రువుని సంహరించుటలో ఎంత ధైర్యాన్ని ప్రదర్శించిందో కదా! 2 సమూ 20:19,20లో దావీదుకు ద్రోహము చేసిన బ్రికి కుమారుడగు షెబ యొక్క తలను ప్రాకారము మీద నుండి క్రింద పడవేయబడునని చెప్పిన ఆ బేల్ బేత్మయకాలోని యుక్తిగల స్త్రీ ధైర్యమెంత గొప్పదో కదా! ఆమె ఆలాగు చేసి తన పట్టణము వారిని రక్షించుకుంది. అలాగే న్యాయా. 9:50-54లో తెబేసులోని బలమైన గోపురమును కాల్చుటకు ఆ స్త్రీ పురుషుల మీద యుద్ధము చేయుటకు వచ్చిన అబీమెలెకు తలమీదికి గోపురము పైనుండి తిరుగటి రాయి విసరి అతని కపాలమును పగులగొట్టిన తెబెసు స్త్రీ యొక్క ధైర్యమెంతటి గొప్పదో కదా! ఆమె ధైర్యంతో ఈ పని చేసి తన వూరి వారందరిని రక్షించింది.

ఆలాగే ఎస్తేరు 4:16 నా నిమిత్తము ఉపవాసముండుడి. నేనును నా చెలికత్తెలును కూడ ఉపవాసముందుము. ప్రవేశించుట న్యాయ వ్యతిరిక్తముగా వున్నను నేను రాజు నొద్దకు ప్రవేశించుదును. నేను నశించిన నశించెదను అని 'డేర్ స్టెప్' తీసుకున్న ఎస్తేరు ఎంత ధైర్యవంతురాలో కదా! అలా ఏ భయానికి బెదరక తన యూదా జాతిసంతతినీ అదారు మాసం 13వ దినమున కత్తివాత నుండి రక్షించుకుంది. అలాగే హెబ్రీ. 11:23లో మోషే పుట్టినప్పుడు మోషే తల్లి యెకెబెతు ఆ శిశువు సుందరుడై యుండుట చూచి విశ్వాసమునుబట్టి రాజాజ్ఞకు భయపడక 3 మాసములు అతని దాచిపెట్టి రాబోయే కాలములో

ఇశ్రాయేలీయులను వాగ్దాన దేశమునకు నడిపించగల నాయకున్ని, ఇశ్రాయేలీయుల కొరకు ధర్మశాస్త్రమును తెచ్చిన వానిని రక్షించగలిగింది. మోషే లేకపోతే ఇశ్రాయేలీయులకు, నాయకుడు, ధర్మశాస్త్రము లేకపోయేవే కదా! ఆ మోషే తల్లి రాజాజ్ఞకు భయపడక ఎంత ధైర్యంగా ఆ బిడ్డను దాచిపెట్టడమే కాక, ధైర్యంతో మోషేను జమ్ము పెట్టెలో పడుకోబెట్టి నదీ తీరంలో వదలిపెట్టి వెళ్లింది. ఈలాగున ధైర్యవంతులైన స్త్రీలందరికీ శారా తల్లిగా వుంది. ఈలాగున ఈ 5 పాయింట్స్‌గా చెప్పబడిన ఆత్మీయ చక్కనిదనాన్ని దేవుడు శారాలో చూచాడు గానీ, ఐగుప్తు ఫరోరాజు అతని సేవకులు, లోకం ఆమెలోని శారీరక అందాన్ని మాత్రమే చూడగలిగింది. ఆ అందమే సామె 31:30వ. ప్రకారము ఆమెకు మోసకరమై పోయింది. అందమే ఆమెకు వ్యర్థమై పోయింది. తొందర తెచ్చింది. ఫరో యింటికి తన్ను తీసుకెళ్ళింది. దేవుడు చూచే అక్షయాలంకారము ఆమె కలిగి వుండింది. అదే ఆమెలో ప్రశంశనీయము. ఈలాటి ఆత్మీయ అందాన్నే స్త్రీలమైన మనమందరము కలిగి పరలోకపు రారాజు యింటికి వెళ్ళాలి. ఇటువంటి శారా చక్కనిదనాలన్ని స్త్రీలమైన మనమందరం కలిగియుండడానికి ప్రయత్నిద్దాం. మన ప్రవర్తనలు మార్చుకుందాం. ఆది 12:11 వచనంలో ఫరో శారానుబట్టి అబ్రహాముకు మేలు చేశాడని వ్రాయబడింది. 7 రకములైన ఆస్థిపాస్తులు యిచ్చాడు అవి 1. గొఱ్ఱెలు 2. గొడ్లు 3. మగ గాడిదలు 4. దాసులు 5. పనికత్తెలు 6. ఆడుగాడిదలు 7. ఒంటెలు. 7 అనేది సంపూర్ణ సంఖ్య. మనము ఇహలోకానికి దిగి వెళ్ళితే ఈ లోకం ఎప్పుడైనా మనకు లాభాలను ఇచ్చి ఎరచూపుతుంది. సైతాను ఒక్క పైసా లాభం చూపి 99 పైసల నష్టాన్ని చూపిస్తాడట. అందునుబట్టియే మేలుగా కనబడిన ఈ ఆస్థినిబట్టియే 13 అ.లో వారికి కీడును తెచ్చి పెట్టింది. 6 వలో వారు కలసి (అబ్రాహాము, లోతు) నివసించుటకు ఆ ప్రదేశము చాలక పోయింది. అందువలన అబ్రాహాము పశువుల కాపరులకు, లోతు పశువుల కాపరులకు కలహము కలిగింది. దాని మూలముగా వారు ఒకరినొకరు వేరై పోవలసి వచ్చింది. యెష 30:7నుబట్టి ఐగుప్తు వలని సహాయము వారికి పనికి మాలినదిగా నిష్ప్రయోజనమైనదిగా వుంది. అందుచేత దేవుడు ఐగుప్తుకు ఏమియు చేయక ఊరకుండు గప్పాల మారి అని దానికి పేరు పెట్టాడు. కావున గప్పాలమారి సహాయం వారికి పనికి మాలినదైనట్లు అయిపోయింది.

17వ.లో శారాను ఫరో తన యింటిలో వుంచుకొనిన దానిని బట్టి దేవుడు ఫరోను, అతని యింటివారిని మహా వేదనలచేత బాధించాడు. జెకర్యా 2:8లో ప్రభువు వ్రాసినట్టు తన బిడ్డలను ఎవరైనా ముట్టినట్లయితే తన కనుగ్రుడ్డును ముట్టిన దానితో సమానముగా ప్రభువు ఎంచుతాడు. కీర్త. 105:13-14వ. బట్టి ఇశ్రాయేలీయులు ఒక జనమును, మరొక జనమునకు, ఒక రాజ్యము నుండి మరో రాజ్యమునకు తిరుగులాడుచుండగా - నేనభిషేకించిన వారిని హింస చేయనియ్యలేదు. అందునుబట్టియే

ఫరో రాజు శారాను ముట్టకుండునట్లు దేవుడు వారికి మహా వేదనలు కలిగించాడు. కానీ తన ప్రియ కుమారుడైన యేసు ప్రభువును మాత్రం అందరూ ఆయనను ముట్టునట్లును, అందరూ ఆయనను హింసించునట్లును దేవుడు ఆయన చేయి విడిచాడు. ఇందులో మన మీద తండ్రి ప్రేమ ఎంత గొప్పదో, మనకర్థమవుతుంది.

ఈ సందర్భములో అబ్రహాము పొందిన కొన్ని నష్టాలు చూద్దాం. కనానులో కరువు రాగా దగ్గరలో వున్న ఐగుప్తుకు వెళ్ళాడు. మన ఆస్తి క్షేమంగా వున్నప్పుడు వ్యాపారం అభివృద్ధి అయినప్పుడు పిల్లలు అభివృద్ధి చెందుచున్నప్పుడు మంచి పనివారున్నప్పుడు ఆరోగ్యము బాగుగా వున్నప్పుడు దేవుని సన్నిధి మనతో కూడ ఉన్నది అనుకుంటాం. ఒకవేళ దేవుడు మన గూడును చెరిపినప్పుడు ఆయనలోనే మనము గూడు కట్టుకోవాలి. ఆయన రెక్కల క్రిందనే ఆశ్రయం పొందాలి. కానీ లోకంలో కాదు.

పౌలు ఫిలిప్పీకి వెళ్ళాలని దర్శనము వచ్చినప్పుడు అదే దేవుని చిత్తమని పౌలు అక్కడికి వెళ్తే అక్కడ చెరసాల, బొండ, దెబ్బలు ఎదురయ్యాయి. అట్టి సమయములో ఆయన స్తుతిగీతములు పాడాడు. ఆ పాటల సారాంశములో వున్న సువార్త విని ఒక చెరసాల నాయకుడు దేవుని ఏర్పాటులో వుండి రక్షించబడ్డాడు.

ఐగుప్తుకు వెళ్ళాలని అబ్రాహాముకు దేవుడు డైరెక్షన్ ఇవ్వలేదు. ఐగుప్తు దగ్గరగా వుండుటచే కరువు రాగానే అతడు ఐగుప్తుకు వెళ్ళాడు. ఐగుప్తులో భోగలాలసత్వ జీవితం జీవించడం కంటే బీదరికం పొందుటే మేలు. అబ్రాహాము ఫరో ద్వారా 7 రకముల మేలులు పొందాడు. కానీ, ఆత్మీయముగా ఎన్నో నష్టాలు అనుభవించాడు. ఐగుప్తులో ఆత్మీయత, దేవుని సన్నిధి, బలిపీఠ అనుభవము లేకపోవుట యిలా ఎన్నో నష్టాలు అనుభవించాడు. దేవుని మార్గములోని శ్రమలను తప్పించుకోడానికి ఎవరైతే ప్రక్కకు తొలుగుతారో వారు క్షీణతను, ఆత్మీయ గొడ్రాలితనమును, అనవసర భారాలను దుఃఖాలను పొందుకుంటారు. ఈ లోకంలోని ఫరోల ద్వారా డబ్బు, హోదా, మర్యాద, పేరు, ప్రతిష్ఠ అంతస్థు, ఆస్తి మనుషుల మధ్యలో పొందవచ్చు కానీ, యివన్నీ దేవుడిచ్చే సంతోషానికి సమానమౌతాయా? కావు. కొంత డబ్బుకోసం యూదా యిస్కరియోతు, ప్రభువునే అమ్ముకున్నట్లు క్షణికభోగాలకు పరిశుద్ధతను, ఆత్మ స్వాతంత్ర్యాన్ని, దోషారోపణ లేని హృదయాన్ని, గద్దించే మనస్సాక్షిని, ఆరాధించే ఆత్మను, ఫలభరితమైన సేవను, బలమైన సాక్ష్యాన్ని కోల్పోతాము. కనుక దేవుని యిరుకు మార్గమునుండి తొలగి శోధింపబడినప్పుడు గల. 1:4వ.లో వున్న మాటద్వారా మనల్ని మనము హెచ్చరిక చేసుకోవాలి. (దేవుని చిత్త ప్రకారము క్రీస్తు మనలను ప్రస్తుతపు దుష్టకాలములో నుండి విమోచించవలెనని మనము ఎల్లప్పుడూ ప్రార్థించుకుంటూ ఉండాలి. అందుకొరకే మన పాపముల నిమిత్తము ప్రభువు

తన్ను తానే అర్పించుకున్నాడు).

అబ్రహాము అబద్ధమాడుట వలన తనను తాను రక్షించుకోవచ్చును అనుకున్నాడు. కానీ, తన అబద్ధము ఆయనకు, ఆయన భార్యయైన శారాకు చిక్కులు తెచ్చిపెట్టింది. ఫరో రాజుకు, అతని ప్రజలకు మహావేదనకు కారణమయ్యింది.

**అబద్ధము వలన నష్టాలు:-** 1. శారా అబ్రహాముకు దూరమై ఉండకూడని ఫరో యింటికి వెళ్ళిపోవలసి వచ్చింది. 2. ఫరో వలన మేలుగా ప్రస్తుతానికి కనబడుచున్న గొఱ్ఱెలు, గొడ్లు మగగాడిదలు, దాసదాసీల వలన వారి ఆస్తి అబ్రహాము, లోతులు కలిసి నివసించలేనంత విస్తారమైపోవుట వలన అబ్రహాము కాపరులు, లోతు కాపరులు కలహించుకోడానికి కారణమయ్యింది. 3. వారిద్దరు విడిపోవడము జరిగింది. 4. ఫరో యిచ్చిన దాసీల ద్వారా ఐగుప్తీయురాలైన హాగరు అబ్రహాము యింటిలో ప్రవేశించుట వలన హాగరు గర్వము చూపి, యజమానురాలైన శారాను నీచపరచుట ద్వారా శారాకు, తద్వారా అబ్రహాముకు ఆమె తలనొప్పికి, నెమ్మది లేకపోడానికి, శారా ఆమెను శ్రమ పెట్టడానికి, హాగరు పారిపోవడానికి లేనిపోని సమస్యలకు కారణమయ్యింది. 4. హాగరు ద్వారా ఇష్మాయేలు పుట్టడం, అతడు వాగ్దాన పుత్రుడైన ఇస్సాకును హింసించడం, భవిష్యత్తులో ఇష్మాయేలు సంతానపు వారు ఇశ్రాయేలీయులకు ప్రక్కలో శూలాల్లాగ, బళ్ళెముల్లాగ శాశ్వత కాల శత్రువులుగా మారిపోవడం జరిగింది. 5. దేవుని చిత్తాన్ని తెలుసుకొని శారా హాగరును దాని కుమారుని వెళ్లగొట్టడం ద్వారా హాగరు భర్తను కోల్పోవడం, ఇష్మాయేలు తండ్రిలేనివాడవ్వడము జరిగిపోయింది. 6. అబ్రహాము శారాను తన చెల్లి అని అబద్ధమాడుటనుబట్టి ఆమె అవివాహిత అని భావించి ఫరో ఆమెను తన యింటిలో తెచ్చిపెట్టుకోడాన్నిబట్టి, అబ్రహాముకు భార్య దూరమై, వుండరాని అన్య రాజు యింటిలోనికి ఉండుట వలన నెమ్మది లేని రాత్రింబగళ్ళు ఎన్ని అనుభవించవలసి వచ్చిందో! 7. యెహోవా శారానుబట్టి ఫరోను, అతని యింటివారిని మహా వేదనలతో బాధించడం జరిగింది. విశ్వాసి ఎవరింటిలో వున్నప్పటికీ వారికి మేలు క్షేమము సమాధానం, ఆశీర్వాదం కలుగవలసి వుండగా శారానుబట్టి ఆ యింటిలో చిన్న వేదనలు కాదు మహా వేదనలు రావటానికి కారణమయ్యింది. ప్రియ సోదరీ! నీ యిరుగు పొరుగు వారికి నీవు నష్టము కలిగించేదానివిగా ఉన్నావా? వారు నీ ద్వారా కష్టము, నరకము, వేదన అనుభవిస్తున్నారా? సువార్త చెప్పి రక్షణలోకి నడిపించలేకపోవడానికి నీవే కారణమయ్యావా? 8. ఆది. 13:18వ.లో అప్పుడు ఫరో అబ్రహామును పిలిపించి నీవు నాకు చేసినది ఏమిటి? ఈమె నీ భార్య అని ఎందుకు తెలుపలేదు? ఈమె నా సహోదరి అని యేల చెప్పితివి? ఆమెను నేను భార్యగా చేసికొందునేమో? అని అబ్రహామును బోనులో ఉన్న ముద్దాయి వలె అతని మీద ప్రశ్నల

వర్షాన్ని కురిపించాడు. అయితేనేమి? ఇదిగో నీ భార్య. ఆమెను తీసికొని పొమ్ము అని అబ్రహాము అబద్ధాన్ని బయటికి వేయగా నీతిమంతుడైన అబ్రహాము ముఖము సిగ్గుతో నింపబడి తల ఎంతగా వంచుకోవాల్సి వచ్చిందో కదా! ఆమెను తీసికొని పొమ్ము అని ఫరో రాజు అన్నప్పుడు అబ్రహాము ఎంత అవమానాన్ని అనుభవించాడో కదా! నష్టము వెంబడి నష్టము అబ్రహాము పొందవలసి వచ్చింది. అబ్రహాము అబద్ధికుడని అందరికి తెలిసిపోయింది. 9. అతనిని అతని భార్యను, అతనికి కలిగిన సమస్తమును పంపివేయుమని ఫరో రాజు తన జనులకు ఆజ్ఞాపించాడు అని ఆది. 12:20వ.లో చదువుచున్నాము. కరువులో తిండికోసం ఐగుప్తులో కొన్ని రోజులు ఉండడానికి వెళ్ళిన అబ్రహామును అతని భార్యను, అతనికి కలిగిన సమస్తాన్ని పంపివేయండి అని ఆజ్ఞను ఫరో రాజు జారీ చేయగా వారు అర్జంట్‌గా వారిని పొండి, పొండి మీరెంత అర్జంట్‌గా వెళ్లిపోతే అంత అర్జంట్‌గా మా రాజుకు వారి యింటివారికి మహావేదనలు కలుగకుండాపోతాయి అన్నట్లే వుంది వారు అబ్రహామును శారాను పంపడం. ఒకప్పుడు శారాను తన యింటిలో సాదరంగా చేర్చుకొనిన రాజు ఇప్పుడు తన సేవకులచే అలాగున పంపివేస్తూవుండగా వారిద్దరూ అనుభవించిన పరాభవాన్ని, అవమానాన్ని తలంచుకుంటే ఎంత సిగ్గు చేటు? తన బిడ్డలు పంపివేయబడుతుండగా ప్రభువుకు ఎంత అవమానం? వ్రాయబడినట్లు మిమ్మునుబట్టియే కదా! నా నామము అన్యజనుల మధ్య దూషణపాలు అవుతోందని ప్రభువు వాపోతున్నాడు. మనం చేసిన అజ్ఞాన, అవివేకపు పనుల ద్వారా దేవుని నామాన్ని దూషణపాలు చేస్తున్నామేమో. అబ్రహాము చేసినట్లు మనము చేయకుందుము గాక! మన దేవుడు అబద్ధమాడనేరని దేవుడు. అబద్ధమాడుటకు ఆయన నరమాత్రుడు కాడు. యెష. 63:8వ.లో తన పిల్లలు కూడ తనవలె అబద్ధమాడనేరని పిల్లలు అనుకొని ఆయన వారికి రక్షకుడాయెను అని వ్రాయబడింది. ఆయన మనల్ని అబద్ధమాడనేరని పిల్లలు అనుకుంటూ వుంటే మనం నీళ్ళు త్రాగినట్లు అబద్ధాలాడుతున్నామా? అబద్ధాలాడితే కలిగే నష్టాన్ని వాక్యంలోనే చూద్దాం. కొలొ. 3:9–10లో ఈ రీతిగా వ్రాయబడింది: “ఒకనితో ఒకడు అబద్ధమాడకుడి. ఏలయనగా ప్రాచీన స్వభావమును దాని క్రియలతో కూడ పరిత్యజించి జ్ఞానము కలుగు నిమిత్తము దానిని సృష్టించిన వాని పోలికె చొప్పున నూతనపరచబడుచున్న నవీన స్వభావమును ధరించుకొనియున్నారు.” అబద్ధమనేది ప్రాచీన స్వభావమట. (అనగా పాత స్వభావమట) పాత స్వభావాన్ని దాని క్రియలతో కూడ పరిత్యజించాలట లేక విడిచిపెట్టాలట. అప్పుడే 1. జ్ఞానము కలుగుతుంది 2. సృష్టించిన వాని పోలిక వస్తుంది 3. నీవన స్వభావము లేక నూతన స్వభావము వస్తుంది. అలాకాక అబద్ధాలాడితే 1. జ్ఞానము కలుగదు. 2. సృష్టించినవాని పోలికె రాదు. 3. నూతన స్వభావము కాక పాత, ప్రాచీన స్వభావమే ఉంటుంది. అబద్ధాలాడితే మరి 3 నష్టాలు కొలొస్సయి పత్రికలో చదువుచున్నాము. అబద్ధము

చిన్న పాపమే అనుకుంటాము. అబ్రహాము జీవితంలో అబద్ధమాడుట ద్వారా 9 నష్టాలు కొలొస్సయి పత్రికలో 3 నష్టాలు మొత్తము ఒక అబద్ధానికి 12 నష్టాలైతే, లోకం 100 అబద్ధాలాడి ఒక పెళ్ళి చెయ్యాలి అని చెబితే అబద్ధాలను విసర్జించమని వాక్యం చెబుతుంది. ఒక అబద్ధానికి 12 నష్టాలైతే 100 అబద్ధాలకు 100×12=1200 నష్టాలు పొందుకుంటాం. అపార నష్టాలపాలవుతాం. ఇకనైనా అబద్ధాలు విసర్జిద్దాం.

## ఆదికాండము 13అ. అబ్రాహాము -లోతు వేరగుట

అబ్రహాము 12:10వ.లో దేవుడు తనతో చెప్పనిరీతిగా ప్రయాణం చేసి అనేక నష్టాలను అనుభవించుటచే 12వ అధ్యాయము ముగిసిపోయింది. ఇప్పుడు 13:1వ.లో యెహోవా తనతో చెప్పిన ప్రకారము (12:4) ఐగుప్తు నుండి పాలస్తీనాకు వెళ్ళాడు. 13వ. అధ్యాయంలో అబ్రహాము బహు ధనవంతుడయ్యాడని చదువుచున్నాము. అతడు బేతేలు వరకు ప్రయాణమై బేతేలుకు, హాయికి మధ్య మొదట తన నివాసానికి గుడారము కాక బలిపీఠము కట్టి, మొదట తాను ఉండి వెళ్ళిన స్థలానికి వచ్చాడు. ఒకవేళ విశ్వాసులమైన మనము ఆత్మీయంగా ఎక్కడ పడిపోయామో ఆ స్థలము నుండే లేచి ఆత్మీయ జీవితాన్ని తిరిగి ప్రారంభించాలి. అదే వాక్యాన్ని ప్రక. 2:5లో చూస్తాము. "నీవు యే స్థితిలో నుండి పడితివో అది జ్ఞాపకము చేసికొని మారుమనస్సు పొంది ఆ మొదటి క్రియలను చేయుము. అట్లు చేసి మారుమనస్సు పొందాలని ప్రభువు చెబుతున్నాడు. విశ్వాసులకే ప్రభువు మారుమనస్సు పొందాలి అని చెబుతున్నాడు. అలాగు పొందకపోతే నీ దీపస్తంభాన్నే (సంఘాన్నే) దాని చోటనుండి తీసివేస్తాను అన్నాడు. సంఘము నిలచి ఉండాలంటే మారుమనస్సు పొందాలట. ప్రియ సోదరీలారా! ప్రభువు రాకడ అంచుల్లో ఉంటున్న మనము మారుమనస్సు పొందాల్సిన అవసరం అతి ప్రాముఖ్యమై ఉన్నదని ఈ ధ్యానములో మనం తప్పనిసరిగా నేర్చుకోవాలి. మారుమనస్సు పొందకుండా నీవు ముందుకు సాగలేవు. ముందు మారుమనస్సు పొంది మిగతా ధ్యానాలు చదువమని మనవి చేస్తున్నాను.

13:6వ.లో వారికి విస్తారమైన ఆస్తి ఉండుటచే వారు నివసించు స్థలము వారికి చాలక, లోతు పశువుల కాపరులకు, అబ్రహాము పశువుల కాపరులకు కలహము పుట్టుట వలన అబ్రహాము "మనము బంధువులము మన మధ్య కలహముండకూడదు. దయచేసి నన్ను విడిచి వేరుగా వుండుము" అనగా లోతు "పెదనాన్నా! కలహము మన పశువుల కాపరుల మధ్యనే కదా! మన కాపరులకు మనము చెప్పుకుందాములే. నిన్ను విడచి నేనెక్కడికి వెళ్ళను" అనాల్సి వుండింది. అలా అనలేదు. ఇంకా "పెదనాన్నా! దేవుడు నీకే ముందు ప్రత్యక్షమయ్యాడు. నీవు ఎక్కడ ఉంటావో ముందు నీవే భూమిని సెలక్ట్ చేసుకో. తరువాత నీవు విడచిపెట్టినది నేను తీసుకుంటాను అని పెద్దనాన్నతో చెప్పలేదు. పెద్దనాన్న చెప్పగానే లోతు ఛాన్స్ దొరికింది కదా అనుకొని తన కన్నులెత్తి యొర్దాను ప్రాంతాన్ని అనగా యెహోవా

తోటవలె, ఐగుప్తు దేశమువలె నీళ్ళుపారు దేశమువలె ఉన్న ప్రాంతాన్ని కోరుకున్నాడు. లోతు కన్నులెత్తి మంచి మేలిమియైన భూమిని దురాశ కలిగిన కన్నులతో, వెలిచూపుతో చూచాడు. నేత్రాశతో చూచిన ఆ భూమిని ఒకరోజు కట్టుబట్టలతో విడచి పారిపోవేసి వచ్చింది. ఆది. 39:7లో పోతీఫరు భార్య రూపవంతుడును, సుందరుడైన యవ్వనస్థుడునైన యోసేపు మీద కన్నువేసి అతని తనతో శయనించుమని అతని పైవస్త్రాన్ని పట్టుకుంది ఈమె "కన్ను" యోసేపు రూపం మీద, సౌందర్యం మీద పడింది. కానీ అతన్ని పొందగలిగిందా? లేదు. ఆది తల్లియైన హవ్వ కన్నులు ఆది 3:6వ.లో అందమైనదియు వివేకము నిచ్చునదియు అని సైతానుతో చెప్పబడిన రమ్యమైన పండుమీద పడ్డాయి. ఈ మూడు సందర్భాలలో నేత్రాశ కనిపిస్తుంది. ఈ మూడు రెఫరెన్సులలో లోతు కోరిన భూభాగము కాని, పోతీఫరు భార్య కోరుకొనిన యవనేచ్ఛగానీ, హవ్వ కోరుకొనిన పండు గానీ, వారెవ్వరికీ మేలు చేయలేకపోయాయి. లోతు కోరుకున్న సొదొమ, గొమొఱ్ఱా ప్రాంతపు మనుష్యులు యెహోవా దృష్టికి దుష్టులును, బహుపాపులునై యుండిరి అని వ్రాయబడింది. దేవుడు అబ్రాహామును "నీవు కన్నులెత్తి ఉత్తర, తూర్పు, దక్షిణ, పడమట చూడుము. ఈ దేశమంతటిని నీకును, నీ సంతానమునకు సదాకాలము ఇచ్చెదను" అన్నాడు. (12:15). లోతు కోరుకున్నది అతనికి సదాకాలమునకు యివ్వబడలేదు. దేవుడే మనకిచ్చినవి మనకే కాక మన సంతానానికి కూడా సదాకాలము ఉపయోగిస్తాయి. 13:18వ.లో అబ్రహాము తన గుడారాన్ని హెబ్రోనులోని మమ్రే దగ్గర నున్న సింధూర వృక్షము నొద్ద దిగి అక్కడ బలిపీఠము కట్టాడు. 12వ అధ్యాయాన్ని ధ్యానించినప్పుడు సింధూర వృక్షము మన ప్రభువుని సూచిస్తుందని, మమ్రే అనగా పుష్టికరమైన ఆహారమున్న ప్రదేశమని దేవుని మందిరంలో మనకు దొరికే వాక్యానికి సాదృశ్యమని, హెబ్రోను అనగా సహవాసమని విశ్వాసులు తండ్రితోను, కుమారునితోను, పరిశుద్ధులందరితోను సహవాసాన్ని కలిగి ఉండాలని ముందే నేర్చుకున్నాము. ముందు 12:6వ.లో ఉన్న మొదటి చోటుకు వెళ్ళి అబ్రహాము మకాం చేసినట్లు చూస్తున్నాం. విశ్వాసులమైన మనము మన పడిపోయిన స్థలమేదో ఆ చోటికి పూర్తిగా రావాలి.

### అబ్రహాము లోతును చెరనుండి విడిపించుట. ఆది 14 అధ్యాయము

షీనారు రాజైన అమ్రాపేలు, ఎల్లాసరు రాజైన అర్యోకు, ఏలాము రాజైన కదొర్లె, యోమెరు, గోయీయుల రాజైన తిదాలు అనువారి దినములలో సొదొమ రాజైన బెరాతోను, గొమొఱ్ఱా రాజైన బిర్షాతోను, అద్మారాజైన షినాబుతోను, సెబోయీయుల రాజైన షెమేబెరుతోను, సోయరను బెలరాజుతోను సిద్దీము లోయలో యుద్ధము చేశారు. అనగా 5 రాజులు, 4గురు రాజులతో యుద్ధము చేశారు. ఆ సిద్దీము లోయలో విస్తారమైన మట్టికీలు గుంటలుండగా సొదొమ, గొమొఱ్ఱా రాజులు పారిపోయి వాటిలో పడిపోయారు.

ఈ సంగతులను అక్షరార్థముగా ధ్యానిస్తే మనకు పాఠము దొరకదు. ఆత్మీయముగా ధ్యానిద్దాము. రాజు లేంటి? పారిపోవడమేంటి? వాడెంతటివాడైనా పాపం మనిషిని పారిపోయేలా చేస్తుంది. నేడు రాజులేమి, సామాన్యులేమి, అందరూ ఆయా గుంటల్లో పడిపోతున్నారు. ఆ గుంట లేవి? కీర్తన. 40:2 దావీదు దేవుడు తనను నాశనకరమైన గుంట జిగటగల దొంగ ఊబి నుండి దేవుడు పైకెత్తాడని చెబుతున్నాడు. ప్రతి పాప మానవుడు ఏదో ఒక పాపమనే గుంటలో పడిపోతున్నాడు. నీవు పడిన గుంటలో నుండి నిన్ను లేపనెత్తువాడు యేసు ప్రభువు మాత్రమే. యేసు ప్రభువు తన జీవితంలో ఎన్నడైనా పాపము చేయనివాడు పాప గుంటలో పడనివాడు ఆ ప్రభువే. నీ పాప గుంట నుండి పైకెత్తి 'క్రీస్తు' అను బండ మీద నిలబెట్టగలడు. మరికొద్దిమంది సామె. 23:27లోని వేశ్యలోతైన గొయ్యి, పరస్త్రీ యిరుకైన గుంట అనే గుంటల్లో పడుతున్నారు. రాజులు, అధికారులు, మంత్రులు గొప్ప యింటివారు కులస్థులు, కులహీనులు ఒక్కరు కాదు అందరూ ఈలాంటి ఇరుకైన గుంటల్లో ఇరుక్కుపోయారు. ప్రయత్నించినా బయటకు రాలేకపోతున్నారు. కొద్దిమంది వేశ్య అనే గుంటల్లో, మరికొద్దిమంది పరాయిస్త్రీ అనే గుంటల్లో పడిపోయారు. ఆమె నీ స్వంత స్త్రీయైన భార్య కాదు. ఆమె పరాయి వాని భార్యయైన పరస్త్రీ. నీ పొరుగు వాని భార్యను ఆశించవద్దు అని ప్రభువు ఆజ్ఞ యివ్వలేదా? కొద్ది మందికి ఏ వూరికెళ్లినా పరభార్యల స్నేహితంలో యిరుక్కుపోతున్నారు. ఏ ఊరికెళ్ళినా, స్వంత వూరిలో వున్నా ఈలాటి స్త్రీల సాంగత్యాలలో యిరుక్కున్నవారు అనేకులున్నారు. మగని ఆలి మిక్కిలి విలువైన ప్రాణాలనే వేటాడుతుందని దేవుడు సామెతలు 6:26వ.లో చెప్పాడు. ఈలాటి స్త్రీలు విలువైన పురుషులనే తమ వలలో వేసుకుంటారు. పట్టణాలలో యిటువంటి స్త్రీలు తమ భర్తలు ఆఫీసులకు వెళ్ళగానే ఈ స్త్రీలు కూడా క్లబ్స్‌కు వెళ్తుంటారు. మరికొద్దిమంది పబ్‌లలో గడుపుతుంటారు. ఈలాటి స్త్రీల గుంటలలో అనేకమంది పురుషులు నేడు పడిపోవడం సాధారణమైపోయింది. వీటినుండి వీరి నుండి విడుదల కావాలా? ప్రభువును ప్రార్థించు ప్రభువు విడిపిస్తారు.

మరికొద్దిమంది కీర్త. 64:6లోని గుంటలో పడిపోతున్నారా? ప్రతివాని హృదయాంతరంగము అగాధము. ప్రతివాని హృదయమొక గుంట. ప్రతి ఒక్కొక్క స్త్రీ పురుషులు, యౌవనస్థులు, యౌవనరాండ్రు మరో స్త్రీ పురుషుల మరో యౌవనస్థుడు యౌవనస్థుల హృదయాలనే గుంటల్లో యిరుకున్నారు. చెడ్డ తలంపుల ద్వారా అపవిత్ర సంభాషణల ద్వారా సెల్‌ఫోన్స్ ద్వారా అపవిత్ర ప్రేమలలో పడి, ఒక్కొక్కరు మరొక్కొక్కరి హృదయమనే గుంటలో యిరుక్కుపోయారు. చదువుకోవలసిన సమయంలో చదువుకోరు. ఉద్యోగాలు చేయాల్సిన సమయంలో ఉద్యోగాలు చేయరు. భార్యను చాకగల సత్తా వారికుండదు. కానీ అప్పుడే పెళ్ళి అంటారు. చాలామంది పెళ్ళి అయ్యేవరకు ఉండట్లేదు.

"ఎలాగూ నిన్నే కదా పెళ్ళి చేసుకునేది. మనసులు ఒకటయ్యాయి శరీరాలు కూడ ఒకటవుదామంటారు. ఈలాగు ఒకరి హృదయపు గుంటల్లో మరొకరు పడుతున్నారు. నీవు లేక నేను లేను. నీవు లేని జీవితాన్ని వూహించుకోలేను. నా ఆరాధ్య దైవం నీవే. నీవు లేక క్షణమైన నేనుండలేను. నా జీవితం నీ కొరకే. ఎన్ని జన్మలకైనా మన బంధం వీడిపోదు" అని డ్యూయెట్లు పాడుకుంటారు, రాసుకుంటారు. నేటి యువతీయువకులు ఈ అనాలోచిత, ఆవేశపూరిత, అవివేక ప్రేమలన్ని కొన్ని రోజుల వరకే వుంటాయి. మంచువలె కరిగిపోతాయి. భవిష్యత్తు ప్రస్తుతం అగమ్య గోచరమౌతుంది. ప్రియ యవనస్థులారా! మీరు ఈ గుంటలో చిక్కుకొని మోసపోయారా? నీ జిగట గల దొంగ ఊబి నుండి నిన్ను విడిపించువాడు ప్రభువైన యేసు ఒక్కడే. నీ పాపముల కొరకు ఘోరమైన సిలువలో గాయాలు పొంది తన అమూల్యమైన రక్తాన్ని కార్చి, మరణించి సమాధి అనే గుంటకు వెళ్ళి మృత్యుంజయుడై మూడవ రోజు తిరిగీ జీవంతో తిరిగి లేచిన యేసుప్రభువే నిన్ను నీ పాపపు గుంటనుండి విడిపించగలడు. "ప్రభువా! నన్ను నా గుంట నుండి విడిపించమని" ప్రభువుకు ప్రార్థనలో నీ హస్తాన్ని చూపిస్తావా? ప్రభువు నిన్ను నీ గుంట నుండి పైకి లేపి క్రీస్తను బండ మీద నిలిపి నీకు క్రొత్త జీవితాన్ని ప్రసాదిస్తాడు. కావున నీవు ఈ క్రింది ప్రార్థన దావీదు లాగ చేస్తావా? కీర్త. 69:14 నేను దిగిపోకుండ ఊబిలో నుండి నన్ను తప్పించుము. అగాధ జలములలో నుండి నన్ను తప్పించుము. అగాధ సముద్రము నన్ను మ్రింగనియ్యకుము. గుంట నన్ను మ్రింగనియ్యకుము.

ఈలాగున ఆ నలుగురు రాజులు సిద్దీము లోయలోని మట్టి కీలు గుంటల్లో చిక్కుకుపోగా ఆది 14:10 మరి కొందరు కొండలకు పారిపోయారు. తమ్మెతాము ఆపదనుండి, శత్రురాజుల నుండి తప్పించుకోవాలనుకున్న రాజులు గుంటల్లో యిరుక్కుపోగా మరి కొద్ది మంది కొండలకు పారిపోయి తప్పించుకుందామనుకున్నారు. ఈనాడు కూడా మన దేశంలో ముఖ్యంగా తమ పాపకర్మలనుండి రాబోయే నరకాగ్ని నుండి తప్పించుకోవడానికి కొండల మీది దేవుండ్లు, దేవతలనబడే వారిని పూజించుటకు వెళ్తున్నారు. తలనీలాలర్పిస్తున్నారు. కానీ తలలు బోడియైనా తలంపులు బోడి కావు. "కోటి పాపాలు చేసి కోనేట్లో మునిగినా పై మన్నే గాని లోపలి మన్ను పోదు గదా"! అనిన బ్రహ్మం గారి మాటలు వాస్తవమే కదా! ప్రభువు నీ హృదయం నాకిమ్మంటున్నారు. ప్రభువుకు హృదయమివ్వక ఈ కొండలనాశ్రయిస్తున్న వీరందరూ ఒకరోజు యేసు ప్రభువు రెండవ రాకడరోజు ఈ భూరాజులు, ఘనులు, సహస్రాధిపతులు, ధనికులు, బలిష్టులు, ప్రతి దాసుడు, ప్రతి స్వతంత్రుడు కొండగుహలలోను, బండ సందులలోను దాగుకొని గొఱ్ఱెపిల్ల యొక్కయు ఉగ్రత మహాదినము వచ్చెను. దానికి తాళజాలినవాడు ఎవడు? మీరు మామీదపడి ఆయన సన్నిధిని గొఱ్ఱెపిల్ల ఉగ్రతకు మమ్మును మరుగుచేయుడని తాము ఎక్కుతున్న

కొండలతోను, పర్వతాలతోను చెబుతారు. ఈ కొండలు, పర్వతాలు వారిని రక్షిస్తాయా? ప్రతి కొండయు, ప్రతి ద్వీపమును వాటి వాటి స్థానము తప్పుచుండగా ఏ కొండ, ఏ పర్వతము, దేవతాలయాల్లో నెలవైన ఏ విగ్రహము, వారిని రక్షిస్తుంది? యెష. 2:20-21లో వ్రాయబడినట్లు ఆ దినమున యెహోవా భూమిని గజగజ వణికింప లేచునప్పుడుఆయన భీకర సన్నిధినుండియు, ఆయన ప్రభావ మహాత్మ్యము నుండియు కొండలగుహలలోను, బండ బీటలలోను దూరవలెనన్న ఆశతో నరులు తాము పూజించుటకై చేయించుకొనిన వెండి విగ్రహములను, సువర్ణ విగ్రహములను ఎలుకలకును, గబ్బిలములకును వారు పారవేస్తారు అని వ్రాయబడింది. మరి, ఈనాడు కొండలు, పర్వతాలు ఎక్కి తమ్మును తాము తమ పాప, ఖర్మల నుండి రక్షించుకుంటాము అనుకున్న వారికి ఆ రోజు ఎంత గొప్ప నిరాశ కలుగుతుందో కదా!

ఈలాగున ఆది 14:10లో కొద్దిమంది పారిపోయి మంటికీలు గుంటల్లో పడిపోగా కొద్దిమంది కొండలకు పారిపోగా, మరికొద్ది మందిని అందులో ముఖ్యంగా లోతును అతని ఆస్తిని, భోజన పదార్థములను శత్రువులు చెర తీసికొని వెళ్ళిపోయినట్లు 14:11లో మనము చదువుచున్నాము. ఈనాడు అనేకులు సాతానుచే చెరపట్టబడుతున్నారు. త్రాగుడు అనే చెర, వ్యభిచారము అనే చెర, ఆయా నేరాలు చేసి అక్షరార్థమైన కారాగారమనే చెరలోనికి చాలామంది వెళ్ళుచున్నారు. ఈలాగు చెరలోకి వెళ్ళిన లోతును విడిపించినవాడు అబ్రహామే. అలాగే ప్రియ దేవుని బిడ్డా! నిన్నును సాతాను చెరలోనుండి విడిపించువాడు పరమ అబ్రహామైన దేవుడే. యెషయా 14:2-4లో వ్రాయబడినట్లు వారు తమ్ముడు చెరలో పెట్టిన వారిని చెరలో పెట్టి తమ్మును బాధించినవారిని ఏలుదురు. నీ బాధను ప్రయాసమును నీ చేత చేయించబడిన కఠిన దాస్యమును కొట్టివేసి యెహోవా నిన్ను విశ్రమింపచేసిన దినమున నీవు బబులోను రాజును గూర్చి అపహాస్యపు గీతము ఎత్తి పాడుదువు" అని వ్రాయబడింది.

14వలో తన తమ్ముడైన లోతు చెరపట్టబడ్డాడని అబ్రహాము విని తన యింట పుట్టి అలవరచబడిన మూడువందల పదునెనిమిది మందిని వెంటబెట్టుకొని ఆ రాజులను తరిమి ఆస్తి యావత్తు తిరిగి తెచ్చి తన తమ్ముడైన లోతును అతని ఆస్తిని, స్త్రీలను, ప్రజలను తిరిగి తీసికొని వచ్చాడు. అలాగే యేసు ప్రభువు పాపమునుబట్టి మనమందరము సాతాను చెరలో ఉండగా ప్రభువు ఒంటరిగా ద్రాక్షాగానుగను త్రొక్కి ఎవరి సహాయము కూడ లేక మనలనందరినీ పాపపు చెరనుండి విడిపించాడు. సొదొమ రాజు అబ్రహామును ఎదుర్కొనుటకు షావే లోయకు బయల్దేరి వచ్చాడు. మరియు షాలేము రాజైన మెల్కీసెదెకు రొట్టెను, ద్రాక్షారసమును తీసికొని వచ్చాడు. ఇది ప్రభువు బల్లకు సాదృశ్యముగా ఉంది. ఈ కూడికలో వున్న అబ్రహామును షాలేము రాజు ఆశీర్వదించాడు. లోతు ఆస్తి తీసికొని తిరిగి తన మొదటి చోటుకు వెళ్ళిపోయాడు. ఈ కూడికలో లోతు ఉండివుంటే ఎంత

ఆశీర్వాదముగా అతనికి ఉండేదో! యేసు ప్రభువు యిష్టపడే ఆశపడే కోరిక ఈ కూడికే. లూకా 22:15వ.లో "మీతో కూడ పస్కాను భుజింపవలెనని ఆశించాను" అని ప్రభువు కోరుతున్నాడు. ప్రభువు ఆశ మనము ఈ కూడికలోనే తీర్చగలం. ఎవరైతే ఈ ఆరాధనాబల్ల కూడికకు హాజరవుతారో వారే అబ్రహామువలే ఆశీర్వదించబడతారు. లోతు ఈ కూడికలో లేడు. ఆశీర్వాదం పొందుకోలేకపోయాడు. ప్రియ సోదరీ! మరి నీ సంగతేంటి? ప్రతి ఆదివారం ఆరాధనా కూడికకు వస్తున్నావా? అట్లైతే ఆశీర్వాదం నీవంతే. 13:3 ప్రకారం అప్పటికే అబ్రహాము బహుధనవంతుడని వ్రాయబడింది. ఇప్పటినుండి మరియింకెంత ఆశీర్వాదం అభివృద్ధి అయ్యేందేదో! అప్పుడు అబ్రహాము సర్వోన్నతుడైన దేవుని యాజకునికి అన్నింటిలో దశమభాగము యిచ్చాడు. ఈ విషయమై పౌలు హెబ్రీ. 7:4లో ఈలాగున వ్రాస్తున్నాడు. ఇతడెంత ఘనుడో చూడుడి! మూల పురుషుడైన అబ్రహాము అతనికి కొల్లగొన్న శ్రేష్ఠ వస్తువులలో పదియవంతు యిచ్చాడు. అలాగే మనమును మహాఘనుడైన సర్వోన్నతుడైన దేవుని ప్రధాన యాజకుడైన యేసుప్రభువుకు శ్రేష్ఠ వస్తువులలో పదియవంతు యివ్వాలి. ఆ ప్రభువు అందరిలో అతి శ్రేష్ఠుడు గనుక. లోతు మాత్రము తనయావత్తు ఆస్తిని తీసికొని తన సొదొమకు వెళ్ళిపోయాడు కానీ తన ఆస్తిలో దశమభాగము షాలేము రాజుకు ఇవ్వలేక పోయాడు. తరువాత సొదొమ రాజుల మనుష్యులను నాకిచ్చి ఆస్తిని నీవే తీసికొనుమని అబ్రహాముతో చెప్పాడు. కానీ అబ్రహాము - "నేనే అబ్రామును ధనవంతునిగా చేసితినని" నీవు చెప్పకుండునట్లు "ఒక్క నూలు పోగైనను, చెప్పుల వారైనను, నీవాటిలో దేనినైనను తీసికొనననని" ఆకాశమునకును, భూమికిని సృష్టికర్తయైన సర్వాధికారియైన దేవుని యెదుట చెయ్యి ఎత్తి ప్రమాణము చేసియున్నాను అన్నాడు. ఇచ్చేవాడు ఇస్తుండగా (సొదొమ రాజు) వద్దని చెప్పి అబ్రహాము దేవుడిచ్చిన వాటి విషయమై ఎంత సంతృప్తి కలిగి వున్నాడో కదా! ఎవరేమిస్తారా తీసుకుందామనుకునే ఈనాటి మనుష్యుల్లాగా కాకుండ అబ్రహాము ఎంత సంతృప్తి కలిగియున్నాడో కదా!

## శారా - హాగరు 16వ. అధ్యాయము

**VI. భర్తకు రెండవ పెండ్లి చేసిన శారా:-** 16:14వ.

ఆదికాండము 16వ అధ్యాయంలో హాగరును గూర్చిన వివరాలు మనము ఎక్కువగా చదువగలము. కానీ ఆమె ఆవిర్భావము ఆది. 12:16లోనే ఫరో శారాకిచ్చిన దాసదాసీలలోనే మనకు కనిపిస్తుంది. ఆది. 16:1వ.లో శారా అబ్రహాముకు పిల్లలను కనలేదు అని వ్రాయబడింది. కారణం, యెహోవాయే ఆమెను పిల్లలు కనకుండా చేశాడని 2వ వచనము చెబుతోంది. అవును, లేఖనాల్లో హన్న గర్భము మూసినది యెహోవాయే. పెనిన్నా గర్భమును తెరచినది యెహోవాయే. కీర్త 127:3వ. ప్రకారము గర్భఫలము యెహోవా ఇచ్చు బహుమానము. కుమారులు యెహోవా అనుగ్రహించు స్వాస్థ్యము అని

వ్రాయబడింది. పిల్లలంటే శారాకు చాలా మక్కువ (craze) అని తెలుస్తుంది. ఎలాగంటే 16:2లో నీవు దయచేసి నా దాసితో పొమ్ము. ఆమె వలన నాకు పిల్లలు కలుగవచ్చును అని తన భర్తతో చెబుతోంది. సంతానము భర్త కొరకు అని గానీ, మన యిద్దరికీ అని గాని చెప్పుట లేదు. కానీ, నా కొరకు అని చెబుతోంది. పిల్లలు భార్య కొరకు కాదు, భర్త కొరకు కాదు. యెహె. 16:20వ.లో మరియు నీవు నా కొరకు కనిన నీ పిల్లలు అని వ్రాయబడింది. కనుక మనము మన పిల్లలు దేవుని కొరకే. కానీ శారా పిల్లలంటే తనకున్న మోజునుబట్టి తగిన ఆలోచన లేక పిల్లలు తన కొరకు అంటోంది. స్త్రీలారా! పిల్లలు మన కొరకు కాదు, మనం వృద్ధులైనప్పుడు మనము మంచములో పడినప్పుడు మన యోగక్షేమాలను చూచుకుంటారు అని మాత్రమే అనుకోకూడదు. అలా చూచుకోవాల్సింది వారి బాధ్యతే. కానీ మనము, మన పిల్లలమూ దేవుని కొరకే అని మరచిపోకూడదు. నేనును, నా యింటివారును యెహోవాను సేవించెదము అని యెహోషువ చెప్పినట్లు మనము, మన పిల్లలతో సహా ఆయననే సేవించాలి. అందుకే శారా తన కొరకే పుట్టించుకున్న ఇష్మాయేలును దేవుడు ఆత్మీయంగా ఆశీర్వదించలేదు. మన కొరకు ఏదీ, ఎవర్నీ వినియోగించుకోకూడదు. అబ్రహాము శారా మాట విన్నాడు కానీ ఈ విషయము దేవుని చిత్తానుసారమా, కాదా? అని అతడు ప్రార్థించి తెలుసుకోలేదు. శారా తన దాసిని తన పెనిమిటియైన అబ్రహాముకు భార్యగా వుండునట్లు యిచ్చింది. ఈ పెండ్లికి పెద్ద శారాయే. దేవున్ని పెండ్లిపెద్దగా చేసుకోలేదు. ఆయనకు ఈ బాధ్యతను అప్పగించలేదు. ఏ పెళ్లిలోనైతే ప్రభువుకు ప్రాముఖ్యత వుండదో ఆ పెళ్ళి విచ్ఛిన్నమే అవుతుంది. ప్రార్థనకు దేవుని చిత్తానికి ప్రభువుకు స్థానం లేని పెళ్ళిళ్ళు సఫలము కానివాటిని నేడు ఎన్నిటినో మన దైనందిన జీవితంలో చూస్తూనే ఉన్నాం. పెళ్ళిళ్ళ విషయంలో మనుషుల మాటకాదు గానీ, దేవుని మాట వినాలి.

**ఇప్పుడు హాగరు జీవితాన్ని ధ్యానిద్దాము (ఆది. 16అధ్యా.)**

**I. ఐగుప్తీయురాలైన, దాసియైన హాగరు:-** ఆది 16:1 హాగరు ఐగుప్తీయురాలైన దాసియైన వ్యక్తిగా గమనిస్తున్నాము. ఐగుప్తు ఇహలోకానికి గుర్తు. ఈ లోకానికి దాసియైన హాగరుగా చూస్తున్నాము. లోకంలో శరీరాశ, నేత్రాశ, జీవపు డంబానికి గుర్తుగా వున్న పాపాలు ఎన్నో ఉంటాయి. అట్టి పాపాలకు నిలయమైన ఐగుప్తులో ఈ పాపాలకు దాసిగా ఉంటూ ఉండిన హాగరుగా చూస్తున్నాం. అలాగే రోమా 8:17వ.లో వ్రాయబడినట్లు మనమునూ పాపమునకు దాసులమై యుంటిమి. కానీ ప్రభువు యొక్క ఉపదేశక్రమమునకు అప్పగించుకొని దానికి హృదయపూర్వకముగా లోబడినవారై పాపము నుండి విమోచించబడినవారమై నీతికి దాసులమయ్యాం. ఇప్పుడు పాపము నుండి విడిపించబడి దేవునికి దాసులైనందున పరిశుద్ధతయే దానికి ఫలము. దాని అంతము నిత్యజీవము.

అలాగున మునుపు ఐగుప్తు దేవతలకు దాసియైన హాగరు అబ్రహాము యింటికి వచ్చాక జీవముగలవాడును, సత్యవంతుడైన యెహోవా దేవున్ని తెలుసుకొని ఇప్పుడు క్రీస్తుకు దాసురాలు అయ్యింది. అలాగున ప్రియ సోదరీ! నీవును దేవునికి దాసురాలవయ్యావా?

**II. అబ్రహాము భార్యయైన హాగరు:-** ఆది.16:3. ఒకప్పుడు దాసి ఇప్పుడు అబ్రహాముకు భార్యయైపోయిన హాగరు: హాగరు మొదట ఐగుప్తు దాసి విగ్రహారాధికురాలు, ఆ తరువాత శారా దాసి, నేడు అబ్రహాము భార్య అయ్యింది. ఈ హెచ్చింపుకు కారణం యజమానురాలైన శారాయే. అలాగే పాప దాసులమైన మనలను, మన యజమానుడైన ప్రభువు మనలను తన రక్తముచే విమోచించాడు. యెష 54:5వ.లో నిన్ను సృష్టించినవాడు నీకు భర్తయైయున్నాడు అని వ్రాయబడినట్లు మన ప్రభువు మనల్ని తన పెండ్లి భార్యగా చేసుకున్నాడు. దానికి మనము ఎంతో కృతజ్ఞులముగా ఉండాలి. ఆయన ప్రేమచేతనే ఈ అత్యంత హెచ్చింపు ప్రభువు మనకిచ్చారు? ఎవరైన ఈ లోకంలో ఇట్టి రీతిగా ప్రేమించి హెచ్చించేవారున్నారా? ఇన్ని మేళ్ళు చేశాను కాబట్టి జీవితాంతం నా పాదదాసిగా ఉండమని చెబుతారేమో కానీ, ప్రభువు తానున్న చోటికి, తానున్న సింహాసనం మీదికి హెచ్చించి తన పెండ్లి భార్యగా చేసుకున్నాడంటే ఆయన ఎనలేని, అంతులేని, వర్ణింపలేని, అమోఘమైన, దివ్యప్రేమ వివరించలేకపోతున్నాము. నిజముగా ఎలా ఆయనను కొనియాడగలము? ఏమని కీర్తించగలము? ఏమని ఎంచగలము? ఓ ప్రభువా! నీ ప్రేమ కొరకు ఎన్ని స్తుతులు చెల్లించినా అది తీరక అట్లుండవలసినదే ప్రభువా!

**III. యజమానురాలిని నీచపరచిన హాగరు:-** (ఆది. 16:5) ఈ లోకంలో ఏ స్త్రీయైననూ, మరో స్త్రీకి ఏమైనా, ఏవైనా దానము, ధర్మము చేస్తుంది కానీ, ఏ స్త్రీయైనసూ తన భర్తను మరి ఏ స్త్రీ కౌగిటికి అప్పగించదు. కానీ శారా, తనకు పిల్లలను కనాలనే ఉద్దేశ్యంతోనే తన భర్తయైన అబ్రహామును హాగరు కౌగిటికి అప్పగించింది. ఈ విషయంలో దాసియైన హాగరును అబ్రహాముకు భార్యగా నుండుటకు తనను ఇంతగా హెచ్చించిన యజమానురాలైన శారాకు ఎంతో కృతజ్ఞతగా హాగరు ఉండవలసింది కానీ, దేవుడు ఆమెకు గర్భఫలము ఇవ్వగానే దేవునికి, కృతజ్ఞత చెప్పలేదు. నాకే గర్భమొచ్చింది, శారా ఎంత మొదటి భార్యయైనా, ఆమెకు పిల్లలు లేరు కదా అని ఆమెను నీచమైనదిగా చూస్తోంది. ఇలా తనను హెచ్చించిన యజమానురాలికి కృతజ్ఞత చూపక ఆమెను నీచమైనదిగా చూచింది. అలా నీచురాలిగా చూచుట కృతజ్ఞత కాదు. చేసిన మేలును మరువటమే. ఎవరికో లేనిది మనకుందని, అందమున్న వారు అందం లేనివారిని హోదా అంతస్థు, బంగారు, వెండి, ఆస్తిపాస్తులు, పిల్లలు, ధనధాన్యాలు ఇవన్నీ ఉన్నవారు అవి లేని వారిని నీచముగా చూడకూడదు. పెనిన్నా తనకు పిల్లలు పుట్టారని, హన్నా గొడ్రాలని ఆమెను నీచముగా చూచి, ఆమెను కోపానికి గురిచేస్తూ, విసిగిస్తూ దుఃఖాన్ని కలుగచేస్తూ ఉండింది. ఒకనాడు దేవుడు హన్నా గర్భాన్ని

తెరచాడు. ఒకరికి 5 మంది పిల్లల్ని దేవుడామెకిచ్చాడు. కావున వున్నవారు లేనివారిని తిరస్కరించి, నీచముగా చూడకూడదు. మనకు అన్ని ఇచ్చే ఆ ప్రభువును స్తుతించి ఆయనను ఘనపరచలేకానీ, మనల్ని హెచ్చింపచేసిన ఆ ప్రభువుని మరువకూడదు. ఇశ్రాయేలీయులు మలాకీ 1:7వ.లో గ్రుడ్డి, కుంటి, రోగము గల దానిని యెహోవాకు అర్పించి ఆయన భోజనపు బల్లను నీచపరిచారు. ఆయన ఘనమైన మహారాజు. ఆయనను ఘనపరచాలి. ఆయనను నీచపరిస్తే మనకు శాపమని మలా. 1:14వ.లో వ్రాయబడింది.

ఈలాగున హాగరు తనను నీచపరచిన సంగతి శారా అబ్రహాముతో చెప్పినప్పుడు అబ్రహాము – ఆమె నీ దాసి నీ యిష్టము వచ్చినట్లు చేయుమని చెప్పగా శారా ఆమెను శ్రమ పెట్టినట్లుగా చూస్తున్నాము. ఏమైనా సమస్య మన యింటిలో వచ్చినప్పుడు మన మనస్సుకు వచ్చినట్లు మనం చేయకూడదు. అలాంటప్పుడు దేవుని మనస్సేంటి? ఆయన చిత్తమేంటి? అని ప్రార్థించి తెలుసుకొని అలాగు ప్రవర్తించాలి. కానీ శారా ఆమెను శ్రమ పెట్టింది. ఈ శ్రమకు ఆమె గుణపడిందా లేదు ఆమె పారిపోయింది. కనుక మన స్వంత ఆలోచనలతో అబ్రహాములాంటి మానవుల సలహాలు సమస్యను పరిష్కరించలేవు. ప్రార్థించి ప్రభువు ఆలోచన కొరకు కనిపెట్టుకొని సమస్యలు తీర్చుకోవాలి. ఎఫెసీ. 6:9లో "యజమానులారా! మీకును, వారికిని యజమానుడైనవాడు పరలోకమందున్నాడని ఆయనకు పక్షపాతము లేదని యెరిగినవారై వారిని బెదిరించుట మాని ఆ ప్రకారమే వారి యెడల ప్రవర్తించుడి" అనే వాక్యాన్ని జ్ఞాపకానికి తెచ్చుకోవాలి.

**IV. శ్రమ తెచ్చుకున్న హాగరు:–** శారా దాసత్వము నుండి విడిపించి హాగరుకు స్వాతంత్ర్యాన్ని ప్రసాదిస్తే, గర్భమొచ్చిందని గర్వించి తనను ఈ స్థితికి హెచ్చించిన తన యజమానురాలిని నీచపరచినప్పుడు ఆ యజమానురాలు ఆమెను శ్రమ పెట్టినట్లు చూస్తున్నాము. ఈ శ్రమను తెచ్చుకున్నది హాగరే. తన స్వయంకృత అపరాధ ఫలితంగా ఆమె శ్రమ తెచ్చుకున్నట్లు చూస్తున్నాము. యిర్మీ. 2:19వ.లో నీ దేవుడైన యెహోవాను విసర్జించుటయు, నీకు నా యెడల భయభక్తులు లేకుండుటయు, బాధకు, శ్రమకు కారణమగునని నీవు తెలిసికొని గ్రహించునట్లు నీ చెడుతనము నిన్ను శిక్షించును. నీవు చేసిన ద్రోహము నిన్ను గద్దించును' అని సైన్యములకు అధిపతియగు యెహోవా సెలవిచ్చుచున్నాడు అని వ్రాయబడియున్నది. ఈ వచనము ప్రకారము హాగరుకు శ్రమ రావడానికి కారణము శారాను విసర్జించుట, ఆమెయందు భయభక్తులు లేకుండుట. ఈ రెండునూ కారణములని మనకు తెలియుచున్నది. కనుక యజమానురాలిని నీచపరచిన చెడుతనమే ఆమెను శిక్షిస్తుంది. సేవ చేయకుండ పారిపోతున్న ఆమె చేసిన ద్రోహమే ఆమెను గద్దించుచున్నదని శారాకాదని దేవుని వాక్యములో మనము గ్రహించగలము. మలా. 1:7వ.లో ఇశ్రాయేలీయులు దేవుని బలిపీఠము మీద అపవిత్రమైన భోజనమును, గ్రుడ్డివాటిని, కుంటివాటిని, రోగము గలవాటిని దోచబడిన

దానిని అర్పించి నీచపరచారని దేవుడు చెబుతున్నాడు. **14వ.**లో ఆయన ఘనమైన మహారాజై యుండగా తెగులు దానిని చెడిపోయిన దానిని అర్పించువాడు శాపగ్రస్తుడు అని దేవుడు చెబుతున్నాడు. ఇశ్రాయేలీయులు దేవునికర్పించేవాటి విషయంలో దేవుని బల్లను నీచపరిచారు. ప్రియ సోదరీ! దేవుని విషయాల్లో నీవు ఏవేవి నీచముగా భావిస్తున్నావు? ప్రార్థించడాన్ని నీచపరిచావా? బైబిల్ స్టడీ, ప్రభువుకిచ్చుట, సేవ చేయుట ఇవన్నీ ఇప్పుడు నీకు నీచంగా తోస్తున్నాయా? ఇలా చేస్తే నేడు మన కొచ్చిన శాపాలు కష్టాలు మనము తెచ్చుకున్నవే. అర్థమయ్యిందా! అది దేవువునికి మనము చేసిన ద్రోహమని వాక్యం చెబుతోంది. తప్పులొప్పుకొని తిరిగీ ప్రభువును ఘనమైన రీతిగా ఘనపరుద్దాం. కారణం ఆయన ఘనమైన మహారాజు కదా! శాపాన్ని పోగొట్టుకుందాం.

**V. శ్రమలో పారిపోవుచున్న హాగరు:–** ఆది. 16:6లో శారా హాగరును శ్రమ పెట్టగా ఆమె పారిపోయినట్లు చదువుచున్నాము. హెబ్రీ. 12:3 శ్రమలో మనము హాగరు వలె అలసట పడకయు, మీ ప్రాణములు విసుకుపడకయు, పాపాత్ములు తనకు వ్యతిరేకముగా చేసిన తిరస్కారమునంతయు ఓర్చుకొనిన ఆయనను తలంచుకొనవలసి ఉన్నది. కానీ హాగరుకు ఈ బైబిలు వ్రాతలు లేవు. మనకైతే ఇటువంటి వాక్యములున్నాయి. ఈ వాక్యములు ఆమెకు లేవు. కనుక హెబ్రీ. 12:5వ.లో ఇలా వ్రాస్తున్నాడు ప్రభువు, నా కుమారుడా! ప్రభువు చేయు శిక్షను తృణీకరించకుము. ఆయన నిన్ను గద్దించినప్పుడు విసుకకుము. కానీ యజమానురాలు శిక్షించినప్పుడు - నాదే తప్పు కదా! నా యజమానురాలు నన్ను హెచ్చించినప్పుడు నేను కృతజ్ఞురాలుగా ఉండనందున ఆమె నన్ను శిక్షించడం న్యాయమే కదా! అని హాగరు శిక్షకు విసుకుపడక, తృణీకరించకుండ ఉండవలసింది కానీ శిక్షకు శ్రమకు తలవంచక నీ క్రింద నేనెందుకు ఉంటాను? అన్నట్లుగా తలబిరుసుతనముతో, మెడ వంచక పారిపోతున్నది. యిర్మీ. 2:20వ.లో ఈ విధంగా వ్రాయబడింది. "పూర్వకాలము నుండి నేను నీ కాడిని విరుగగొట్టి నేను నీ బంధకములను తెంపివేసితిని. నేను సేవచేయను" అని చెప్పుచున్నావు. ఈ వాక్యములో వ్రాయబడిన రీతిగానే దాసిగా హాగరు యొక్క బంధకాలు, దాస్య శృంఖలాలు శారా విరుగగొట్టి, బంధకాలు తెంచివేసి, స్వేచ్ఛనిచ్చి అబ్రహాముకు భార్యగా చేస్తే "నేను శారా సేవ చేయను" అన్నరీతిగానే పారిపోతున్నట్లు చూస్తున్నాం. ప్రియ సోదరీ! నీవు ఎన్నడైనా తప్పు చేసినప్పుడు ప్రభువు నిన్ను శిక్షించినప్పుడు, ఒకవేళ గద్దించినప్పుడు అది మన మేలు కొరకే అనే విషయాన్ని గమనించాలి. సేవను మానుకొని పారిపోకూడదు.

**శ్రమల ద్వారా వచ్చే లాభాలను కొన్నింటిని బైబిల్ రెఫరెన్స్‌ల ద్వారా చూద్దాం:**

1. శ్రమనొంది యుండుట నాకు మేలాయెను. ఏలయనగా నీ కట్టడలను నేను నేర్చుకొన్నాను. కీర్త. 119:71.

2. శ్రమ కలుగక మునుపు త్రోవ విడిచితిని. ఇప్పుడు నీ వాక్యము ననుసరించి

నడుచుకొనుచున్నాను. కీర్త. 119:67.

3. తన పరిశుద్ధతలో పాలుపొందవలెనని మన మేలు కొరకే ఆయన శిక్షించుచున్నాడు. హెబ్రీ. 12:10.

4. శ్రమ ఓర్పును, ఓర్పు పరీక్షను, పరీక్ష నిరీక్షణను కలుగజేయును. రోమా 5:3.

5. ఆ ఆదరణతో ఎట్టి శ్రమలలో ఉన్నవారినైనను ఆదరించుటకు. (2 కొరి. 1:4.) ఆయన మా శ్రమ అంతటిలో మమ్మును ఆదరించుచున్నాడు.

6. నేను శ్రమలపాలై దీనుడనైతిని. కీర్తన. 70:5.

7. ఆయన నన్ను శోధించిన తరువాత, నేను సువర్ణము వలె కనబడుదును. యోబు 23:10.

1. కట్టడలను నేర్చుకొనుటకు 2. వాక్యము ననుసరించి నడుచుకొనుటకు 3. పరిశుద్ధతలో పాలుపొందుటకు 4. ఓర్పును, నిరీక్షణను నేర్చుకొనుటకు 5. ఆదరణ పొందుటకు, ఇతరులను ఆదరించుటకు 6. దీనులగుటకు, 7. సువర్ణమువలె కనబడుటకు ఇన్ని విధాలుగా ప్రయోజనకరమైన మేలులను శ్రమలలో పొందుకొనకుండా హాగరు పారిపోయింది. మేళ్ళను గ్రహించలేకపోయింది. తప్పును సరిదిద్దుకొనలేకపోయింది. అలాగే ప్రియ చదువరీ! శ్రమలలో నీవు కూడా పారిపోతున్నావా? అలాగున చేయవద్దు. ఉన్నచోటే ప్రభువుకు అప్పగించుకో. ప్రభువా ఈ శ్రమ ఎందుకు వచ్చింది? నాకు నీవు నేర్పదలచుకున్న పాఠమేంటి? అని ప్రభువుని ప్రార్థనలో అడగాలి. శ్రమలు అనే బడిలో మనము చక్కని పాఠాలు నేర్చుకుంటాం.

**VI. తప్పును ఒప్పుకున్న హాగరు:-** ఆది 16:8. పారిపోతూ శ్రమకు లోబడని హాగరును దేవుని దూత నీటిబుగ్గ యొద్ద కనుగొన్నాడు. మనమునూ దేవుడు మనకిచ్చిన బైబిలు అను నీటి బుగ్గ దగ్గరే దేవుని కనుగొంటాము. బైబిలు ద్వారా దేవుడు మన తప్పులను చూపించి వాటిని దిద్దువాడుగా ఉన్నాడు. కీర్త. 119:104వ.లో 'నీ ఉపదేశముల వలన నాకు వివేకము కలిగింది. తప్పు మార్గములన్నియు నాకసహ్యములాయెను' అని దావీదు అంటున్నాడు. వాక్యమనే బుగ్గ దగ్గరికి రానంత వరకు మన తప్పులు కనబడవు. వాక్యము దగ్గరకు వచ్చినప్పుడు మన తప్పు మార్గాలను మనం కూడ అసహ్యించుకుంటాం. ప్రియ సోదరీ! ఈ రోజు నీవు వాక్యమనే బైబిల్ బుగ్గ దగ్గరికి వచ్చి ప్రభువు స్వరాన్ని విన్నావా? ప్రభువు దూత "శారాయి దాసివైన హాగరూ! ఎక్కడ నుండి వచ్చితివి? ఎక్కడికి వెళ్ళుచున్నావు? అని అడుగుతున్నాడు. దేవుని దూత హాగరూ! అని పిలువలేదు. లేక అబ్రహాము భార్యయైన హాగరూ, లేక మిస్సెస్ అబ్రహామ్ (Mrs. Abraham) అని పిలువలేదు. ఆమె అబ్రహాము భార్యగా శార హెచ్చించిన తరువాత అయ్యింది. ముందు

ఆమె స్థితి ఏది? శారా దాసిగా వుండుటే ఆమె స్థితి. ఆమె అబ్రహాము భార్యగా హెచ్చించబడిన స్థితిని చూచి వెనుకటి స్థితిని (శారాయి దాసిగా) మరచిపోయి, గర్భము రాగానే గర్వముతో యజమానురాలికి విధేయత చూపక పారిపోతోంది. దేవుడు బుగ్గ దగ్గర ఆమెను కలుసుకున్నాడు. ఆమె తప్పును ఆమెతోనే ఒప్పించాడు. ఎక్కడి నుంచి ఎక్కడికెళ్తున్నావని ప్రశ్నించాడు. ఆమె పేరేంటో తెలిసిన దూతకు ఆమె ఎక్కడినుండి ఎక్కడికి వెళ్తున్నదో తెలియదా? తెలుసు. కాని జవాబును ఆమెతోనే ఒప్పించాలని ఆయన యిష్టపడ్డాడు. నేను నా యజమానురాలైన శారాయి యొద్దనుండి పారిపోవుచున్నానని చెప్పింది. అలాగు మనము కూడా చేసిన తప్పును ఆయన దగ్గర ఒప్పుకోవాలి. సామె. 28:13వ.లో అతిక్రమములు దాచిపెట్టువాడు వర్ధిల్లడు. వాటిని ఒప్పుకొని విడచిపెట్టువాడు కనికరము పొందును అన్న వాక్య ప్రకారము, మన తప్పులను ఒప్పుకుంటే ప్రభువు కనికరమును పొందుకుంటాం. సోదరీ! ఈ సమయంలో నీ దోషాన్ని ఒప్పుకుంటావా? లేక కప్పుకుంటావా? యోబు 31:33-34వ.లో వ్రాయబడినట్లు ఆదాము చేసినట్లు మన దోషములను దాచిపెట్టుకొని మహా సమూహమునకు భయపడి రొమ్ములో మన పాపమును కప్పుకొనిన యెడల పరమున ఉన్న దేవుని దృష్టికి మనము వేషధారులమవుతాము. అలాగున కాక ఒప్పుకొని విడిచిపెట్టి కనికరము పొందుదాము.

**VII. తప్పును దిద్దుకున్న హాగరు:-** తప్పు ఒప్పుకున్న హాగరుతో "నీ యజమానురాలి యొద్దకు వెళ్ళి అణిగియుండుమని దూత చెప్పినప్పుడు అలా వెళ్ళి అణిగి యుండుటకు ఒప్పుకొనిన హాగరుగా ఆది 16:9వ.లో చదువుచున్నాము. ఈలాగున తన తప్పును దిద్దుకొన్న హాగరుగా ఇప్పుడు చూస్తున్నాము. ఒకప్పుడు అణిగియుండడము ఆమెకిష్టము లేకుండా ఉండింది. దోశెపిండిని గాని, ఇడ్లీ పిండిని గాని రాత్రి రుబ్బి పెట్టిన తరువాత ఉదయమున చూచినప్పుడు ఆ పిండి పొంగినట్లు ఉండుట చూస్తాం. కానీ ఒక గరిటెతో దాన్ని కలిపితే ఆ దానిలో ఉన్న గాలి అంతా బయటికి పోయి పిండి మామూలు స్థితికి వస్తుంది. అలాగే పొంగిపోయే జీవితంగా మన జీవితం ఉండకూడదు. తగ్గింపు, దీనత్వం మన జీవితంలో ఉండాలి. 1 పేతు. 5:5-6వ.లో వ్రాయబడినట్లు పెద్దలకు లోబడి, దీనమనస్సు అను వస్త్రము ధరించుకోవాలి. అహంకారులను ఎదిరించి దేవుడు దీనులకు కృపనిస్తాడు. తగిన సమయమందు నిన్ను హెచ్చించునట్లు ఆయన బలిష్ఠమైన చేతిక్రింద దీనమనస్కులై ఉండాలి.

**VIII. మొఱ్ఱపెట్టి దీవెన పొందిన హాగరు:-** తనకు మగపిల్లవాడు పుట్టాలని, తన సంతానం భూమి మీద విస్తరించాలని తన సహోదరులందరి యెడల అతడు నివసించాలని హాగరు దేవుని ప్రార్థించింది. అలాగే దేవుడు చేసినట్లు 16:10,11 వచనాలలో "యెహోవా నీ మొరను వినెను" అని చదువుచున్నాము. కానీ 16:12లో అతడు అడవి గాడిదవంటి

మనుష్యుడు. "అతని చేతులు అందరికిని, అందరి చేతులు అతనికిని విరోధముగా వుండును" అని దేవుని దూత చెప్పినప్పుడు ఆమె ఊరకున్నట్లుగా చూస్తున్నాం. అందుకామె "ఏమిటి ప్రభువా! నాకు కుమారున్ని యిస్తానన్నావు. అతని సంతానాన్ని భూమి మీద విస్తరింపజేస్తానన్నావు మంచిదే కాని అతడు అడవి గాడిద వంటి వాడవుతాడు. అందరి చేతులు అతనికిని, అతని చేతులు అందరికినీ విరోధమవుతాయి" అని చెప్పావే? అతడు అందరికీ విరోధి అవుతాడా? అడవి గాడిద వంటి స్వభావముతో పుడతాడా? ఆ అడవి గాడిదల్లాంటి అతని సంతానము భూమి మీద విస్తరిస్తుందా? అలాంటి సంతానమైతే నాకెందుకు ప్రభువా! అందరికీ స్నేహితుడయ్యే అబ్బాయిగా ఉండాలి కానీ! అందరికీ విరోధిగా ఎందుకు? గాడిదలాంటి అపవిత్ర జీవితం వద్దు. గాడిద అపవిత్ర జీవి. అలాంటి అబ్బాయి నాకు వద్దు అని ప్రభువును అడుగలేదు. అబ్బాయి పుడితే చాలనుకుంది. అమ్మా! ఎవరో ఒకరు అబ్బాయి పుడితే చాలు అని నీవు కూడా అనుకుంటున్నావా? నాణ్యమైన గుణాలతో, దేవుని స్వభావముతో, వాక్యానుసారమైన ఆత్మీయ పిల్లలను, ప్రార్థనా పరులైన పిల్లలను, భక్తిపరులైన, సేవకులయ్యే పిల్లలను పొందుకోవాలి. అటువంటివారి కొరకే దేవున్ని అడుక్కోవాలి. కానీ భక్తిలేని, అపవిత్ర పిల్లలు, అడవి గాడిదలాంటి పిల్లలు, హేరోదును ప్రభువు "ఆ నక్కతో ఈలాగు చెప్పుడి" అని చెప్పిన జిత్తులమారి నక్క, మోసపు నక్క టక్కరి నక్కలాంటి పిల్లలు ఫరోను పెద్ద మొసలీ! అని సంభోదించడం, యెహె. 32:2లో చూస్తాం. అలాంటి మొసలి లాంటి క్రూరమైన పిల్లలను కనడంకంటే దావీదు లాంటి సుబుద్ధి గల పిల్లలను, దానియేలు లాంటి శ్రేష్ఠమైన బుద్ధిగల పిల్లలను, పౌలులాంటి సంఘముల మీద చింతగల పిల్లలను ఎస్తేరులాంటి, రూతులాంటి ప్రార్థనాపరులై చక్కని తీర్మాణం చేసిన పిల్లలని కనడం ఎంతో మంచిది. రాహేలు తన దాసియైన బిల్హా ద్వారా కనబడిన కుమారుడు పేరు ఆది. 49:17వ.లో 'దాను' అని వ్రాయబడింది. 'దాను' త్రోవలో సర్పముగాను, దారిలో కట్లపాముగాను ఉండును" అని వ్రాయబడింది. ఈ 'దాను' గోత్రమునుండే దారిలో కట్లపాము, సర్పము అను క్రీస్తు విరోధి 7 యేండ్ల శ్రమలకాలములో సాక్ష్యాత్తు మన ప్రభువుకు శత్రువుగా రాబోతున్నాడు. రాహేలు అనాలోచనగా ప్రార్థన చేయకుండా యాకోబుతో "నా దాసితో పొమ్ము ఆమె ద్వారా నాకు పిల్లలు పుడతారు అనింది. కానీ ఫలాన భక్తిపరులు, ప్రార్థనాపరులు, మోషేలాంటి నమ్మకస్థులు, యోసేపులాంటి పవిత్రులు, పుట్టునట్లు చేయుమని దేవున్ని రాహేలు ప్రార్థించలేదు. ప్రియ సోదరీలారా! మన పెళ్లిరోజే భార్య భర్తలు ఇంకా ఏకము కాకమునుపే మనకు పుట్టబోయే పిల్లల పెండ్లి కొరకు మన పెళ్ళినాడే ప్రార్థించాలట. ఎంత అడ్వాన్స్‌గా ప్రార్థించాలో గమనించండి. పూర్వపు మిషనరీలు అలాగున ప్రార్థించారు గనుకనే వారు ఇండియాకు

తమ పిల్లలను మిషనరీలుగా అనేకులను పంపగలిగారు. ఈలాగున హాగరు నా యజమానురాలికి పిల్లలు పుట్టలేదు. నాకు మాత్రమే పిల్లలు పుడుగున్నారు అని కేవలము శరీరకంగా కుమారుడు పుట్టాలి అనుకుందే కానీ, ఎలాంటి కుమారులు కావాలో దేవున్ని అడుగలేదు. అందుకే అడవి గాడిదవంటి ఇష్మాయేలీయులు పుట్టారు. అందరితో పోట్లాడే నేర ప్రవృత్తి గలిగిన ఉగ్రవాద చర్యలు కలిగిన ఆల్‌ఖైదా, లష్కరే తోయిబాలాంటి ఉగ్రవాదులైన వారు ఇష్మాయేలు సంతానమే. హన్నా అనేక యేండ్లుగా ప్రభువు సంతానమిచ్చే ఆ రైట్‌టైమ్ (right time) వరకు ప్రార్థించింది. కనుకనే ప్రార్థనాపరుడైన, న్యాయాధిపతియైన, యాజకుడైన రాజ్యాంగ పద్ధతిని ప్రవేశపెట్టినవాడునైన, బహువిధ ప్రయోజకుడైన సమూయేలు పుట్టాడు. అట్టి సమూయేలు పేరట 1 సమూయేలు, 2 సమూయేలులాంటి రెండు గ్రంథములు బైబిల్‌లో వ్రాయించుటకు ప్రభువుకు ఇష్టమైంది. కనుక క్రైస్తవ స్త్రీలోకమంతా ప్రార్థించి పిల్లలను కనాలని నేర్చుకుందాం. మన కుమార్తెలకు కూడ అట్టి ఆలోచన (councelling) నేర్పిద్దాం.

ఇట్లు హాగరు తన సంతానానికి శరీర సంబంధమైన దీవెన కోరుకుంది. కానీ, ఆత్మసంబంధమైన దీవెన కోరలేదు. ఆది. 17:18,19లో ఉన్నట్లు ఇష్మాయేలు సంతానమును అత్యధికముగా ఆశీర్వదించి, విస్తరింపజేసి 12 మంది రాజులు వచ్చి గొప్ప జనమవుతారు అని వ్రాయబడింది. మంటి దీవెనెలే కానీ, మింటి దీవెనలు లేవు. మన పిల్లలు, మనము ఆత్మ దీవెనలను కోరుకొందుము గాక!

**IX. యెహోవాకు పేరుపెట్టిన హాగరు:-** 13వ.లో లేఖనములలో మొట్టమొదట యెహోవాకు ఒక క్రొత్త పేరు పెట్టిన ఘనత స్త్రీకే అనగా హాగరు అను స్త్రీకే దక్కింది. "చూచుచున్న దేవుడవు నీవే" అను పేరు పెట్టింది. తన ఐగుప్తు దేవతలు ఏవీ చూచే దేవుళ్ళు కాదన్నట్లుగా, "చూచుచున్న దేవుడు నీవే, ఇక ఎవ్వరూ చూచే దేవుళ్ళు కారు అని ఆమె చెప్పింది. నిర్గ 3:7వలో దేవుడు ఐగుప్తులో తన ప్రజల బాధను, వారు అనుభవిస్తున్న హింసను చూచాడని వ్రాయబడింది. నీవొక్కడవే చూచుచున్న దేవుడవు అని ఒప్పుకున్నట్లుగా హాగరు తన అనుభవములో కనుగొన్నట్లుగా చూస్తున్నాము. ఈ దేవుడు తనను చూచిన దేవుడు, తన కష్టము నెరిగిన దేవుడు అని తన పేరును "హాగరు" అని ఎరిగిన దేవుడు అని తన గర్భములో ఉన్న శిశువు మగ శిశువని ఎరిగిన దేవుడు అని అతని పేరు ఇష్మాయేలు అని ఎరిగిన దేవుడని, ఆ బిడ్డ భవిష్యత్తును ఎరిగిన దేవుడు అని తన అనుభవములో ఆమె ఎరిగి దేవునికి 'చూచుచున్న దేవుడని' పేరు పెట్టింది. అవును, యెహోవా దేవుడు ఆదిలోనే అంతాన్ని యెరిగియున్న దేవుడు కూడా. అటువంటి చూచే దేవున్ని తాను చూచానని ఆ చోటికి "బెయేర్ లహాయిరోయి" అని పేరు పెట్టింది. దేవునికి పేరు పెట్టడం మాత్రమేకాక

ఆ చోటికి కూడా హాగరు పేరు పెట్టింది. యోబు 19:26,27 వచనాలలో 'నా చర్మము చీకిపోయిన తరువాత శరీరము లేనివాడనై నేను దేవుని చూచెదను. నా మట్టుకు నేనే చూచెదను. మరి ఎవరుసూ కాదు. నేనే ఆయనను కన్నులారా చూచెదను' అని యోబు అన్నాడు. కాని యోబు 42:5 వ.లో దేవున్ని తాను బ్రతికి ఉండగానే దేవున్ని చూచాడని చూచినప్పుడు "వినికిడిచేత నిన్ను గూర్చిన వార్తను విన్నాను. ఇప్పుడు కన్నులారా! నిన్ను చూచుచున్నాను. కావున నన్ను నేను అసహ్యించుకొని ధూళిలోను, బూడిదలోను పడి పశ్చాత్తాపపడుచున్నాను అన్నాడు. కానీ, హాగరు దేవున్ని చూచినప్పుడు "నన్ను నేను అసహ్యించుకొని ధూళిలోను, బూడిదలోను పడి పశ్చాత్తాపడుచున్నాను" అని తన్ను తాను తగ్గించుకోలేదు. మరియు దేవుడు "నా సేవకుడైన యోబు పలికినట్లు మీరు నన్ను గూర్చి యుక్తమైనది పలుకలేదు. గనుక నా కోపము నీ మీదను నీ ఇద్దరు స్నేహితుల మీదను మండుచున్నది అని తేమానీయుడైన ఎలిఫజుతో దేవుడైన యెహోవా సెలవిచ్చాడు. హాగరు దేవునికి ఒక క్రొత్త పేరు మాత్రమే పెట్టింది. కానీ యోబువలె తన్ను తాను తగ్గించుకోలేదు. కానీ "నన్ను చూచుచున్న సజీవుని బావి" అని ఆ బుగ్గకు పేరు పెట్టింది. ఆ సజీవుని బావి దేవుడు నిత్యము మనతో మాట్లాడుచున్న బైబిలే. దిగుడు బావులకు మెట్లు ఎలాగుంటాయో ఈ బైబిలులో కూడా 66 పుస్తకాలు 66 మెట్లవలె ఉన్నాయి. ఈ 66 మెట్ల వారిగా గ్రంథాల లోనికి వెళ్ళి ధ్యానాలు చేసి అందులోని ఆత్మీయ ఉదకాన్ని (నీటిని) త్రాగి ఆత్మ దాహాన్ని తీర్చుకోవాలి. పాత నిబందన గ్రంథములో ఎప్పుడో ఒకప్పుడు దేవుడు మాట్లాడేవాడు. కానీ క్రొత్త నిబంధన కాలములో నేడు అనుక్షణము తన వాక్యము ద్వారా మనతో మాట్లాడుచున్నాడు. హాగరును చూచిన దేవుడు తనతో మాట్లాడాడు కూడ. హాగరు దేవతలు ఎన్నడూ తనను చూచినవారు కారు, మాట్లాడినవారు కారు. హాగరు ఆయనను నన్ను చూచాడు. నేనూ ఆయనను చూచుట మాత్రమే కాక ఆయన నాతో మాట్లాడాడు" అన్నది. కానీ యోబులాగ తనను తాను చూచుకొని అసహ్యించుకోలేదు. వాక్యము ద్వారా దేవుడు మనతో మాట్లాడినప్పుడు ఎన్నిసార్లు మన నిజజీవితాన్ని ఆయన వాక్యకాంతిలో చూచుకొని, ఎప్పుడైన మనల్ని మన రోత జీవితాన్ని అసహ్యించుకున్నామా? దేవుని సన్నిధిలో ఆయనను గురించి యుక్తమైన విషయాల్ని పలికామా? మనకిది ఎంతగానో పాఠము కదా! ఆయన సన్నిధిలో ఆయన్ను మాత్రమే చూచి ఆయనకు పేర్లు పెట్టి ఆరాధించడం మాత్రమే కాక, మనల్ని మనం చూచుకొని ఆయన సన్నిధిలో మనల్ని మనం తగ్గించుకొంటున్నామా? అబ్రహాము <u>ధూళియు, బూడిదను</u> అని తగ్గించుకోగా మనమేలాటి వారము? ఆయనను చూడగా <u>నేను చచ్చిన వానివలె పడితిని</u> అని యోహాను అన్నాడు. యెషయా ఆయనను చూచినప్పుడు <u>"నేను అపవిత్రుడను, అపవిత్ర పెదవులు కలిగినవాడను.</u> నేను దేవుని చూచితిని నశించెదను, నశించెదను అంటున్నాడు. (యెష. 6:5,6). ఆయన

సన్నిధిలో మన రహస్య పాపములను ఒప్పుకొని యెషయా వలె తన అగ్ని వంటి వాక్యముతో శుద్ధి చేసికొందుము గాక!

## ఆది. 17వ అధ్యాయము

**VII. ఆశీర్వదించబడిన శారా:–** ఆది. 17:15. దేవుడిచ్చే ఆశీర్వాదాలు అనేక రకాలుగా ఉంటాయి. ముందుగానే శారా ఆశీర్వదింపబడింది కదా! ఇంకేమి ఆశీర్వాదం? అనుకోవచ్చు ధన ధాన్యాదులు, వెండి బంగారములు, దాసదాసీలు ఆశీర్వాదం ఆమెకు ఉండవచ్చు. కానీ సంతానమనే ఆశీర్వాదం ఆమెకు లేకుండా ఉండింది. ఈ ఆశీర్వాదం ఆమె ఎప్పుడు పొందుకుంది? లేఖనాల్లో చూద్దాం. ఆది. 17:5వ.లో దేవుడు "నీ భార్యయైన శారాయి పేరు 'శారాయి' అనవద్దు. ఏలయనగా ఆమె పేరు 'శారా'. నేను ఆమెను ఆశీర్వదించి ఆమె వలన నీకు కుమారుని కలుగజేతును" అన్నాడు. 'శారాయి' అనగా 'కలహప్రియ' అని అర్థము. కలహారంభము నీటిగట్టున పుట్టు వూట వంటిది. వివాదము అధికము కాకముునుపే దాని విడచిపెట్టుము అని వాక్యము సామె. 17:14వ.లో చెబుతోంది. హాగరును గర్భవతి అని కూడా చూడకుండ ఆమెను శ్రమపెట్టిన కలహప్రియగా శారాను చూస్తున్నాం. హాగరు తాను గర్భవతినని తెలిసికొని గర్వించి యజమానురాలిని నీచపరచినప్పుడు 'నా ఉసురు నీకు తగులును గాక!' అని భర్తయైన అబ్రహాముతో కలహించినట్లు చూస్తున్నాం. అబ్రహాము ఆ యిద్దరు ఆడవాళ్ళను పిలచి యజమానుడుగా ఇద్దరికి బుద్ధి చెప్పవలసింది. కానీ ఆమె ఉసురు, గిసురు అని మాట్లాడుతూ, ఉసురు తగులును గాక, అని కోపంతో శాపవచనము మాట్లాడుతుండగా అబ్రహాము భయపడినట్లు తెలుస్తోంది. అందుకే "నీ దాసి నీ చేతిలో ఉంది నీ యిష్టము వచ్చినట్లు చేసుకో' అన్నాడు. అబ్రహాము అలా చెప్పియుండకూడదు. హాగరుతో 'నీవు హెచ్చింపబడుటకు కారణం శారాయే. నీ యజమానురాలిని నీవెందుకు నీచపరిచావు? అని ఆమెను గద్దించవలసింది. అలాగే శారాను కూడ ఒకవేళ దాసియైన హాగరు అన్యురాలు కదా! బుద్ధిలేక ఆమె నిన్ను నీచపరచినప్పుడు దేవుని బిడ్డగా నీవు గర్భవతియైన ఆమెను అంతగా శ్రమ పెట్టవచ్చునా? అని ఆమెను మందలించి హాగరును గద్దించి వుండాల్సింది కానీ దురుసు నోరు కలిగి, నా ఉసురు నీకు తగులును గాక అనే భార్యను గద్దించే ధైర్యం అబ్రహాముకు లేదు కనుకనే, నీ దాసిని నీ మనసు వచ్చినట్లు దానిని చేయుము" అన్నాడు. మనము మన దాసులు మన చేతిలో కాదు, అందరము దేవుని చేతిలో ఉన్నాము. మన ఇష్టము మన మనసు వచ్చినట్లు కాదు, క్రీస్తు యేసు మనసు మనము కలిగి ఉండాలి. కానీ హాగరుపట్ల క్రీస్తు మనసేంటో శారా ప్రార్థించి కనుక్కోలేదు. భర్తపట్ల, హాగరు పట్ల కలహమాడిన కలహప్రియగా ప్రవర్తించింది. గర్భవతియై యుండగా మోయరాని బరువులు మోయించిందేమో, దయతలచక విసికించే పనులన్నీ చేయించిందేమో. విధేయత, కృతజ్ఞత లేని హాగరు "మీ యింట్లో నేనెందుకు

పని చేయాలి" అని తల బిరుసుతనముతో అణిగిమణిగి పనిచేయక 'పారిపోవుట' అనే అర్థమిచ్చే తన పేరుకు తగినట్లుగానే ఇల్లు వదలి ఎవరికీ చెప్పకుండా పారిపోయింది. లేనిపోని సమస్యలు ఆ కుటుంబములో జరిగాయి. సామె. 20:3వ.లో కలహమునకు దూరముగా ఉండుట ఘనత అని వ్రాయబడింది. కీర్తన 120:6వ.లో కలహప్రియుని యొద్ద నేను చిరకాలము నివసించినవాడను. అయినను నేను కోరునది సమాధానమే అని వాక్యాలు చెబుతున్నాయి. చిరకాలం కలహప్రియుని యొద్ద నివసించినా ఎదుటివాడు సమాధానం కోరితే ఇక సమస్యే రాదు. కలహము ఎక్కువ కాకమునుపే దానిని మానెయ్యాలి. ఈ మాటలన్ని క్రొత్త నిబంధన క్రింద ఉన్న మనకు తెలుసు. 1 కొరిం. 1:11. మీలో కలహములు కలవని క్లోయెవారివలన వింటిని. 1 కొరింథీ. 3:3 మీలో అసూయలు, కలహములు ఉండగా మీరు శరీర సంబంధులై మనుష్యరీతిగా నడచుకొనువారు కారా? ఈ మాటల ప్రకారం ప్రభువును నమ్మినప్పటికీ ఆ కలహ జీవితం శారాలో మొదట్లో వారు కనానుకు వచ్చిన 10 యేండ్ల వరకు ఆమెలో ఉండింది. కానీ రాను రాను ఆది. 17:17వ.లో అబ్రహాము 100 యేండ్లవాడని వ్రాయబడింది. అప్పుడు శారా వయస్సు 90 యేండ్లు. దాదాపు 25 సం॥ కాలమైన తరువాత దేవుడు శారాలో మార్పు చూడగలిగాడు. అబ్రహామా! నీ భార్య పేరు ఇక నుండి 'కలహ ప్రియ' అని అర్థమిచ్చే 'శారాయి' కాదు. ఆమె పేరు 'శారా' అనగా 'రాజకుమారి' అని ఆమె పేరు దేవుడు మార్చాడు. రాజకుమారిగా ఆమె కలహాన్ని దూరము చేసుకున్నప్పుడే దేవుడామెకు సంతాన ఆశీర్వాదమిచ్చాడు. చూడండి కలహము, కక్షలు, అసూయలు, సంతాన ఆశీర్వాదము పొందకుండ 25 సం॥ అడ్డగించాయి అని అనిపిస్తుంది. ఇట్టి కలహాలకు, కక్షలకు, అసూయలకు స్త్రీలందరు గుడ్‌బై చెబుదాం. ఎన్నో ఆశీర్వాదాలకు తలుపులు తీద్దాం. ఇప్పుడు రాజకుమారి అయ్యింది శారా. ఆమె జనములకు తల్లి అని దేవుడు చెప్పాడు. ఆమె రాజుల తల్లి అయ్యింది రాజులకు రాజైన యేసురాజుకు కూడా తల్లి అవ్వడం విశేషం. రాజులకు తల్లి మాత్రమే కాక జనాంగములకు కూడ తల్లి అయ్యింది. ఆమె కోడలైన రిబ్కా "వేలవేలకు తల్లి" ఆది. 24:60 అని దీవించబడింది. రిబ్కా కోడండ్రైన రాహేలు, లేయాలు ఇశ్రాయేలు వంశములను వర్ధిల్ల చేసిన తల్లులుగా పిలువబడటం మాత్రమే కాక రూతు కూడ ఇశ్రాయేలు వంశమును వర్ధిల్లచేసిన స్త్రీగా సాక్ష్యము (రూతు 4:11వ.) పొందింది. న్యాయా. 5:7వ.లో దెబోరా ఇశ్రాయేలీయులకు 'నేను తల్లిని' అని తానే చెప్పింది. హవ్వ (ఆది 3:20వలో) జీవము గల ప్రతివానికి తల్లి అని వ్రాయబడింది. రోమా 16:13లో పౌలు 'రూఫుకు వందనములు. అతని తల్లికి వందనములు. ఆమె నాకున తల్లి" అని అన్నాడు. బైబిల్లో ఇంతమంది 'తల్లులు' అని పిలువబడ్డారు. ప్రియ సహోదరీ! నీవు ఎంతమందికి తల్లిగా వున్నావు? శారీరకంగా కాదు, ఆత్మీయంగా ఎంతమందిని క్రీస్తు కొరకు కన్నావు? ఎంతమందికి సువార్త చెప్పావు?

తల్లి కొంగుచుట్టూ పిల్లలున్నట్లు నీ ఆత్మీయ పిల్లలు నీ చుట్టూ వున్నారా? వట్టి చేతుల్తో ప్రభువు దగ్గరికెళ్తావా? ఆత్మలను తీసికొని నిండుచేతులతో వెళ్తావా? నీవెలాంటి తల్లివై యున్నావు? పరీక్షించుకొని ఇకనుండియైన జగడగొండ్లు కాక కలహాలు, కక్ష్యలకు దూరమై ప్రభువుతో ఆశీర్వదించబడి ఆత్మీయ పిల్లల్ని సంపాదించాలని ప్రభువు కోరుతున్నాడు.

## అబ్రహాము - శారా ఆది 18వ. అధ్యాయము 6-15వ.

**VIII. పరిచర్య చేసిన శారా:-** ఆది. 18:6-15వ. అబ్రహాము యింటికి ఒకరోజు ఎండవేళ ముగ్గురు మనుష్యులు వచ్చినప్పుడు అబ్రహాము గుడారములో ఉన్న శారా యొద్దకు త్వరగా వెళ్ళి నీవు త్వరపడి మూడు మానికల మెత్తని పిండి తెచ్చి పిసికి రొట్టెలు చేయుమని చెప్పాడు. స్త్రీలు వంటన్నియూ ఉదయాన్నే చేసి ఎండవేళలో తిని రెస్ట్ తీసుకునే సమయమది. ఆ సమయంలో ముగ్గురు మనుష్యులు వారింటికి వచ్చినప్పుడు ఎండవేళ రెండవసారి వంట చేయాలంటే మనసు, దేహము సహకరించవు. స్పెషల్ భోజనమునకు (special menu) అబ్రహాము ప్లాన్ చేసి అవి ఏర్పాటు చేయమని శారాకు చెప్పాడు. 3 మానికల పిండితో రొట్టెలు త్వరపడి చేయమన్నాడు. ఆ రోజు యింటికి వచ్చినవారు ముగ్గురే కదా! 3 మానికల పిండి ఎందుకు? మానిక అంటే 2 శేర్లు. 3 మానికలంటే 6 శేర్ల పిండి ఎందుకు? వచ్చినవారు ముగ్గురే కదా! మూడు రెండ్లు ఆరు లేక మూడు ముళ్ళ 9 రొట్టెలు లేక మూడు నాలుగులు 12 రొట్టెలు సరిపోవా? 3 మానికల పిండి ఎందుకు? అందులోను మెత్తని పిండి అట. మెత్తని పిండి కాకపోతే గరుకుపిండి తీసుకుంటానా? పైగా పిండి పిసికి చేయమంటున్నావు? పిసికి కాకపోతే పిసకకుండా చేస్తానా? పైగా త్వరపడి అంటున్నావు, 89 సం॥వయస్సులో వున్న ముసలిదాననైన నన్ను క్రొత్త పెళ్లి కూతురువలె త్వరగా చేయమంటున్నావు అని తన భర్తయైన అబ్రహాముపై గొణుక్కుంటూ, సణుగుకుంటూ ఒక చిన్న క్లాస్ తీసుకోలేదు. ఆయన చెప్పినట్లే, కోరినట్లే విధేయతతో అన్నీ రొట్టెలు 3 మానికల మెత్తని పిండి తీసికొని పిసికి త్వరగా రొట్టెలు చేసి పెట్టింది. అలాగే సేవకుడు కూడ దూడను త్వరగా సిద్ధపరచువాడు. అబ్రహాము అందరికీ పని చెప్పి ఆయన పైపైన తిరుగలేదు. తానును వెన్నను, పాలను తీసుకొచ్చాడు. వారు ఎరుగకయే దేవదూలతకు పరిచర్య చేశారని హెబ్రీ. 13:1లో ఈ రీతిగా వ్రాయబడింది. 'సహోదర ప్రేమ నిలువరముగా వుండనీయుడి. ఆతిథ్యము చేయ మరువకుడి. దాని వలన కొందరు ఎరుగకయే దేవదూతలకు ఆతిథ్యము చేసిరి". హెబ్రీ. 6:10. మీరు పరిశుద్ధులకు ఉపచారము చేయుచు యింకను ఉపకారము చేయుటచేత తన నామమునుబట్టి మీరు చూపిన ప్రేమను మరచుటకు ఆయన అన్యాయస్థుడు కాడు. ఈ వాక్య ప్రకారము అబ్రహాముకు శారాకు దేవుడు సంతానముగా ఇస్సాకును అనుగ్రహించాడు. మనము చూపిన ప్రేమను ఆయన జ్ఞాపకము చేసుకునే దేవుడు. రోమా 12:13 శ్రద్ధగా ఆతిథ్యము యిచ్చుచుండుడి. పరిచర్య శ్రద్ధగా చేయాలట. ప్రేమతో

చేయాలట. ఈలాగున ఈ ముసలి వయస్సులో దేవదూతలకు వారు పరిచర్య చేస్తున్నారని వారికి తెలియక పోయినా వారు పరిచర్య చేశారు. సంతాన భాగ్యం పొందారు. అప్పగించుకొని త్వరత్వరగా, పరుగెత్తి శ్రద్ధగా పరిచర్య చేశారు. ప్రభువు వలన స్వాస్థ్యముగా ఇస్సాకు అనే కుమారుని పొందారు.

**IX. గుడారములో ఉన్న శారా:–** ఆది 18:9వ.లో ఆ ముగ్గురు మనుష్యులు అబ్రహాముతో నీ భార్యయైన శారా ఎక్కడ? అని అడిగినప్పుడు అతడు ఆమె గుడారములో ఉన్నదని చెప్పాడు. న్యాయా. 5:24వ.లో గుడారములో నుండు స్త్రీలలో ఆమె దీవెన పొందును' అను మాట ప్రకారము గుడారములో ఉన్న శారా ఆ ముగ్గురు మనుష్యులచే దీవెన పొందింది. ఆమె దీవెన 'సంతానాన్ని గురించిన దీవెనగా' ఉన్నది. ఇద్దరు మనుష్యులు లోతు ఇంటికి 19 అ.లో వెళ్ళినప్పుడు లోతు భార్య యింటిలో లేదు. వారికి పొంగని రొట్టెలు లోతు వండి పెట్టినట్టుంది. లోతు భార్య యింటిలో లేదు. ఏ షాపింగ్‌కు వెళ్ళిందో, ఏ క్లబ్‌కు వెళ్ళిందో తెలియదు. ఇంట్లో లేని కారణాన ఆమె దీవెన పొందలేక పోయింది. ఆమె పాదములు ఆమె యింటిలో నిలువలేకపోయాయి. అలాటి ఆమె గూడు విడచి తిరుగు పక్షితో సమానము. కానీ శారా యాయేలు లాంటి వారు గుడారములలోనే ఉండినట్లు వాక్యంలో గమనిస్తున్నాము. ఇంట ఉండి స్త్రీలు పనిచేసికొనుచు ఉండాలని దేవుని వాక్యము తీతు 2:5వ.లో చెప్పబడింది. స్త్రీలారా! మనమెలా ఉన్నాం? మనం ఇంటిలో ఉండి దేవుని పని, యింటిపని చేస్తూన్నామా? లేక యిరుగు పొరుగు యిండ్లకు వెళ్ళి మనము పని చేసికోకుండ, చేసే వారిని ఆటంకపరచుచూ ఉన్నామా? మనల్ని గురించి యితరులు 'ఎందుకబ్బా ఈ స్త్రీ మాటిమాటికి వచ్చి మా సమయాన్ని వ్యర్థం చేస్తోందని సణుక్కుంటున్నారా? నీ పొరుగు వాని యింటికి మాటిమాటికి వెళ్ళవద్దని దేవుని వాక్యం చెబుతుంటే కొద్దిమంది స్త్రీలు టి.వి. కార్యక్రమాలు ముఖ్యంగా సినిమాలు, సీరియల్స్ చూడడానికి పొరుగు యిండ్లకు వెళ్తూ అత్యధిక సమయం, భర్తలు సాయంకాలము ఇండ్లకు వచ్చేంతవరకు అక్కడే ఉంటారు. పొరుగింటి వాళ్ళు తినడానికి, త్రాగడానికి కూడా స్వేచ్ఛ లేకుండా వారి ప్రైవసీకి, ప్రత్యేకతకు భంగం కలుగచేస్తూ ఉంటారు. ఎవరింటిలో వారుండి ఎవరి పనిని వారు చేసుకుంటూ వుంటే ఏ తంటారాదు.

## ఆది 20:2–18

అబ్రహాము మమ్రే దగ్గరనున్న సింధూర వృక్షవనము దగ్గరి నుండి దక్షిణ దేశమునకు తరలిపోయి గెరారులో కొన్నాళ్ళు ఉండుటకు వెళ్ళాడు. అక్కడ కూడా అబ్రహాము తన భార్యయైన శారాను గురించి ఆమె నా చెల్లెలని చెప్పాడు. గనుక రాజైన అబీమెలెకు ఆమెను (శారాను) పిలిపించి తనయింట చేర్చుకున్నాడు. ఇదే అబద్ధము ఫరో రాజుతో కూడా ఆది. 12:12వ.లో చెప్పాడు. మళ్ళీ గెరారు రాజుతో చెబుతున్నాడంటే అబద్ధాలాడడం

అబ్రహాము బలహీనతగా ఉంది. ఆ అన్యరాజులు బహు భార్యాత్వము కలవారు. శారా తన భార్య అని చెబితే తనను చంపి తన భార్యయైన శారాను పెండ్లి చేసుకుంటాడేమో అనుకొని అబ్రహాము అబద్ధము చెప్పాడు. ఆది.వ 17:16లో దేవుడు "నేను శారాను ఆశీర్వదించెదను. ఆమె వలన నీకు కుమారుని కలుగజేసెదను. ఆమె జనములకు తల్లియైయుండును. జనముల రాజులు ఆమె వలన కలుగుదురు" అని ప్రత్యేకంగా ఆమె పేరు చెప్పి క్లియర్‌గా ఆశీర్వదిస్తానని దేవుడు వాగ్దానము చేసాడు గనుక అబ్రహాము అబద్ధమాడకుండా విశ్వాసంతో గెరారు రాజుకు భయపడకుండా ఉండాల్సింది. ఆది 17:21లో శారా నీకు కనబోవు ఇస్సాకుతో నా నిబంధన స్థిరపరచెదను" అని ప్రభువు చెప్పినందుననుబట్టి కూడా అబ్రహాము గెరారు రాజుకు భయపడకుండా ఉండాల్సింది. అబ్రహాముకు ఒకటి లేక రెండు వాగ్దానాలు ప్రభువు ఇచ్చాడు. మనకైతే అమూల్యములును, అత్యధికములైన వాగ్దానములిచ్చాడు. వాగ్దానముల మూలమున లోకమందున్న భ్రష్టత్వమును (గెరారు రాజు లాంటి వారి ద్వారా మనకెదురయ్యే ప్రతి శోధన భయము, భ్రష్టత్వములనుండి) తప్పించుకొని దైవస్వభావమునందు పాలివారమగునట్లుగా దేవుడు వాటిని మనకనుగ్రహించాడు కనుక శారాలాంటి మన భార్యలకు గానీ, అబ్రహాములాంటి మన భర్తలకు గానీ, ఇస్సాకులాంటి మన పిల్లలకు గానీ ఏ అపాయము రాకుండా కాపాడుతాడని మనము వాగ్దానములను ఉన్నది ఉన్నట్లు గట్టిగా విశ్వసించాలి. (2 పేతురు 1:4). ఇన్ని వాగ్దానములున్న సంఘకాలంలో ఉన్న మనమే విశ్వాసములో తొణికిసలాడుతుంటే ఇక పాత నిబంధనలో ఉన్న వారు ఎంత అవిశ్వాసంతో తొణికిసలాడుతారో మనం ఆలోచించాలి. కనుక పాతనిబంధన భక్తులకంటే క్రొత్త నిబంధన భక్తులమైన మనము వారికంటే ఎంత అధిక విశ్వాసములో ఉండాలో కదా! అబ్రహాము యిట్టి భయాలతో ఉన్నప్పటికీ అస్థిర విశ్వాసంతో ఉన్నప్పటికి దేవుడు తానే కలుగచేసుకొని వారిని కాపాడుతూ వచ్చాడు. 20:3వ.లో ఆ రోజు రాత్రి దేవుడు స్వప్నమందు అబీమెలెకుతో "నీవు నీయింట చేర్చుకొనిన స్త్రీ ఒక పురుషునికి భార్య గనుక ఆమె నిమిత్తము నీవు చచ్చినవాడవు సుమీ" అని చెప్పాడు. మరొక పురుషుని భార్యను మరెవరినైనా ముట్టినట్లయితే వారు ఎంతటి రాజులైనా, మంత్రులైనా, అధికారులైనా వారు చస్తారని దేవుడే చెబుతున్నాడు. 26:10వ.లో గెరారు రాజైన అబీమెలెకు 'అలాగున చేయడం పాతకమని' ఇస్సాకుతో చెప్పడం మనము చదువుతాం. సామె. 6:29వ.లో తన పొరుగు వాని భార్యను కూడువాడు ఆ ప్రకారమే నాశనమగును. ఆమెను ముట్టువాడు శిక్ష తప్పించుకొనడు. శిక్ష రకరకాలుగా రావచ్చును. సంసోను దెలీలాను మోహింపగా ఫిలిష్తీయులు న్యాయా 16:21లో కన్నులు ఊడదీసి సంకెళ్ళతో బందీ గృహములో బంధించారు. చిన్న కుమారుడు దూరదేశములో తండ్రి ఆస్తిని వేశ్యలతో తిని త్రాగి పాడుచేయగా అంతా నాశనమైపోయి పందుల పొట్టు కూడ దొరకని శిక్ష వచ్చింది.

మరికొద్దిమందికి ఈ దినాల్లో 'ఎయిడ్స్' అనే వ్యాధి రావడం చూస్తున్నాం. సామె. 6:32వ.లో 'జారత్వము చేయువాడు స్వనాశనమును కోరువాడే. వాడు దెబ్బలకు, అవమానమునకు పాత్రుడగును. వానికి కలుగు అపకీర్తి యెన్నటికినీ తొలగిపోదు". ఈలాగున వ్యభిచార నేరానికి శిక్షలు అనేకములు బైబిల్‌లో వ్రాయబడ్డాయి. ఈ సంగతులు క్రైస్తవ యౌవన బిడ్డలందరూ తెలుసుకోవాలి. అప్పుడే వారు దేవుని యందు భయభక్తులు కలిగి ఉంటారు. అందుకే 20:4వ.లో అబీమెలెకు రాజు దేవుని మాటకు భయపడి శారాతో పాపము చేయలేదు. 20:6వ.లో దేవుడు - నీవు నాకు విరోధముగా పాపము చేయకుండ నేను నిన్ను అడ్డగించితిని. అందుకే నేను నిన్ను ఆమెను ముట్టనియ్యలేదు. కనుక ఆ మనుష్యుని భార్యను అతనికప్పగించుము. అతడు ప్రవక్త. అతడు నీకొరకు ప్రార్థన చేయును. నీవు బ్రతుకుదువు. నీవు ఆమెను అతనికి అప్పగించని యెడల నీవును నీవారందరును నిశ్చయముగా చచ్చెదరని తెలుసుకొనుమని దేవుడు స్వప్నములో అతనితో మాట్లాడడం మనము చదువుకొంటున్నాం. ఈ వచనాల్లో అబ్రహాము ప్రవక్త అని చెప్పబడ్డాడు. అతడు ప్రార్థన చేస్తే అబీమెలెకు బ్రతుకుతాడట. ప్రవక్తలు, ప్రార్థనాపరుల్లాంటివారు కూడా అవిశ్వాసంతో, అస్థిరతలతో, ఆత్మీయ అనుమానాలకు, అవిశ్వాసము వల్ల కలిగే భయములకు చోటిచ్చినప్పుడు సహితము (వారు పనికిమాలినివారు, మాటిమాటికి తప్పులు చేయువారు అని వారిని విసర్జించక) వారు నా బిడ్డలు, వారు నా సేవ చేయువారు, వారు నా ప్రవక్తలు, వారు ప్రార్థించువారు అని మన విషయమై మంచి గౌరభావముతో చెప్పి, మన విరోధుల క్షేమము కొరకు అపనమ్మకస్తులమైన మనల్నే ప్రార్థించమని చెప్పడంలో ప్రభువెంత కృపగలవాడో కదా! తన ప్రజలను ముట్టితే తన కనుగుడ్డును ముట్టినవాడని యెంచి తనకు ఘనత తెచ్చుకునేవాడని జెకర్యా 2:8వ.లో చదువుతాము. మన అపరాధములలో అనేకములు ఆయన మరచిపోతున్నాడు. మన విషయములో తన కోపమును బిగబట్టుకుంటున్నాడు. యోబు దేవునితో ఎంతో వాదించాడు. అయినా తన స్నేహితులమీద దేవుని కోపము మండినప్పుడు ఆ స్నేహితుల కొరకు మళ్ళీ యోబునే బలి చేయమన్నాడు. యోనా దేవుని ప్రవక్త అతడు యొప్పేకు వెళ్ళక తర్షీషుకు వెళ్ళినా దేవుడు అతనికి ఆపద రప్పించినప్పుడు అతడు మొఱ్ఱపెట్టగా అతని ఆపదనుండి రక్షించి తిరిగి తన పని కొరకై యొప్పేకు పంపి వాడుకున్నాడు. అనేకుల రక్షణ కొరకు యోనాను వాడుకోవడం దేవునికిష్టమైంది. 20:14వ.లో అబ్రహాము భార్యను తన యింటిలో ఉంచుకున్నందుకు అబీమెలెకు అబ్రహాముకు గొఱ్ఱెలు, గొడ్లు, దాసదాసీలను ఇచ్చి శారాను అతనికి తిరిగి అప్పగించాడు. 16వ.లో అబీమెలెకు శారాతో - ఇదిగో నీ అన్నకు వెయ్యి రూపాయలు ఇచ్చియున్నాను. ఇదినీ యొద్ద నున్న వారందరి దృష్టికి ప్రాయశ్చిత్తముగా ఉండుటకై ఇది నీ పక్షముగా ఇచ్చియున్నాను. ఈ విషయమంతటిలో నీకు న్యాయము తీరిపోయింది' అన్నాడు. 1000 ఇచ్చి నీవారందరి

దృష్టికి ప్రాయశ్చిత్తముగా ఉండుటకై నేను దీనిని ఇస్తున్నాను అన్నాడంటే తన ఇంటిలో ఊరకనే శారాను ఉంచుకున్నందుకు 1000 రూ. ఇస్తే, ఆమెతో అబీమెలెకు పాపము చేసి ఉంటే అట్టి అపరాధానికి ఇంకెంత రుసుము ఇవ్వాల్సి వుండేవాడో కదా. ఇక్కడ 1000 రూ. ప్రాయశ్చిత్తంగా ఇస్తే భర్తయైన అబ్రహాము ఊరుకున్నాడు. కానీ సామె. 6:32-34వ.లో 'జారత్వము జరిగించువాడు కేవలము బుద్ధిశూన్యుడు. ఆ కార్యము చేయువాడు స్వనాశనమును కోరువాడే. వాడు దెబ్బలకును, అవమానమునకును పాత్రుడు. వానికి కలుగు అపకీర్తి ఎన్నటికి పోదు. భర్తకు పుట్టు రోషము మహా రౌద్రము గలది. ప్రతీకారము చేయు కాలమందు అట్టివాడు కనికరపడడు. ప్రాయశ్చిత్తమేమైనను నీవు చేసిననువాడు లక్ష్యపెట్టడు. ఎంతగొప్ప బహుమానములు నీవిచ్చినను, అట్టివాడు కనికరపడడు' అని వ్రాయబడింది. ఏ పాపము శారాతో అబీమెలెకు చేయలేదు కాబట్టి అబ్రహాము ప్రాయశ్చిత్తముగా శారా ద్వారా 1000 రూ. తీసుకున్నాడు. నిజముగా పాపము జరిగితే ఏ భర్త కూడా ప్రాయశ్చిత్త క్రయధనము తీసికొని తప్పుచేసిన వానిమీద కనికరపడుటకు ఇష్టపడడు. కానీ మన ప్రభువైన యేసుక్రీస్తు మన తప్పిదముల కొరకై, తానే మనలో ఎవడును మన పాపముల ప్రాయశ్చిత్తము కొరకు కట్టలేని విలువైన క్రయధనముగా తన విలువైన రక్తమును తానే కార్చాడు. అది ఎన్నటికినీ తీర్చబడక అట్లుండవలసినదే. అంతగొప్ప పెనాల్టీని ప్రభువే తన శరీరమప్పగించుట ద్వారా తీర్చాడు. పాపత్ములమైన మన యెడల ఆయనకు ఎంత ప్రేముందో కదా! ఆయన ప్రేమనుబట్టి ఆయనను ఎంతగా మనము స్తుతించాలో కదా! భర్తకు పుట్టు రోషమే అంత రౌద్రము గలదైతే, పరమ భర్తయైన మన ప్రభువుకు పుట్టవలసిన రౌద్రము ఇంకెంత గొప్పదై ఉండాలి? కానీ, ప్రభువు మన విషయమై ఎంత ఓర్చుకుంటున్నాడో. అనేకమార్లు ఆయనను విడచి మరిచి, భయము లేక చేసిన పాపములన్నీ ఓర్చుకొని కనికరించి క్షమించుటకు మనము చెల్లించవలసిన ప్రాయశ్చిత్త క్రయధనము చెల్లించలేమని తెలిసి తానే తన ప్రాణరక్తమును సిలువలో ఒలికించిన ఆయన ప్రేమను మనము ఇంకెంతగా కొనియాడి మహిమ పరచి ఆరాధించాలో కదా! అలాగు చేయుదుము గాక!

20:17వ.లో అబ్రహాము దేవుని ప్రార్థించగా దేవుడు అబీమెలెకును అతని భార్యను అతని దాసదాసీలను బాగు చేసెను. ఏలయనగా అబ్రహాము భార్యయైన శారాయినిబట్టి దేవుడు అబీమెలెకు యింటిలో ప్రతి గర్భమును మూసి యుండెను అని చదువుచున్నాం. జెకర్యా. 2:8వ ప్రకారము 'దేవుని బిడ్డలను ముట్టితే దేవుని కనుగ్రుడ్డును ముట్టినట్లే' కనుక దేవుడు కీర్త. 105:14-15వ.లో తాను అభిషేకించిన వారిని ముట్టకూడదనియు, నా ప్రవక్తలకు కీడు చేయకూడదనియు ఆయన ఆజ్ఞ ఇచ్చి ఆయన ఎవనినైనను వారికి హింస చేయనియ్యలేదు. ఆయన వారికొరకు రాజులను గద్దించెను అను మాటలు అబ్రహాము

శారాల విషయమై దేవుడు నెరవేర్చాడు. ఇక్కడ మరో విషయమేమిటంటే అబ్రహాముకు, శారాలకు ఇంతవరకు 20వ అధ్యాయము వరకు పిల్లలు పుట్టలేదు. కానీ అబ్రహాము ప్రార్థన చేయుట వలన అబీమెలెకును, అతని భార్యను దాసదాసీలను బాగు చేశాడు. వారికి పిల్లలు కూడా పుట్టారు. కొన్నిసార్లు తన సేవకులకు కూడా ఇలాగే జరుగుతూ ఉంటుంది. దేవుని సేవకులకు ఎన్నో అవసరాలు ఉంటాయి. ఎన్నో ప్రార్థనలకు జవాబులు రానట్లుగా ఉంటాయి. కానీ, అదే సేవకులే యితరుల అవసరాల కొరకు ప్రార్థిస్తే ఆ యితరుల అక్కరలు అవసరాలే ముందుగా నెరవేరుతూ ఉంటాయి. ఇది దేవుని సేవకులకు పరీక్షగానే ఉంటుంది. కానీ, తన సేవకులను ఆయన నిత్యము మరువడు. తరువాతి 21వ అధ్యాయం మొదటి వచనములోనే శారాను దేవుడు తాను చెప్పినట్లే దర్శించి, ఇస్సాకు అను కుమారున్ని ప్రసాదించాడు. యెహోవా! అందరికీ ఉపకారి. ఆయనలో పక్షపాతముండదు. ఆయన్ను నమ్మి సిగ్గునొందిన వారు లేనే లేరు.

## శారా – హాగరు 21వ. అధ్యాయము

### X. యెహోవా ఇచ్చిన మాటచే దర్శింపబడిన శారా:-

యెహోవా ఎవరినైనా దర్శించాడంటే వారికి మేలు చేయడానికే దర్శిస్తాడు. ఇంతవరకు దేవుడు అబ్రహాముకే ప్రత్యక్షమవ్వడం, మాట్లాడడం చూశాము. కానీ మొట్టమొదటిసారి శారాతో తన మాటనుబట్టి దర్శించడానికి యెహోవా వచ్చినట్లు ఆది 18:9వచనంలో చదువగలము. నీ భార్యయైన శారా ఎక్కడ ఉన్నది? అని అడిగాడు. అబ్రహాము గుడారములో ఉన్నది అని చెప్పాడు? గుడారములో ఉన్న స్త్రీ దీవెననొందును గాక! అని న్యాయా 5:24వ.లో వ్రాయబడియున్నట్లు యెహోవా ఆమెను దీవించాడు. ఈ దీవెన ఆది.వ 18:10వ.లో వ్రాయబడింది. "మీదటికి ఈ కాలమున నీ యొద్దకు నిశ్చయముగా మరల వచ్చెదను. అప్పుడు నీ భార్యయైన శారాకు ఒక కుమారుడు కలుగునని చెప్పెను. కనుక ఆది. 18:10వ.లో చెప్పిన మాట ప్రకారము చేయుటకు ఆది. 21:1వ.లో యెహోవా శారాను దర్శించాడు. యెహోవా తానిచ్చిన మాట చొప్పున శారాను గూర్చి చేశాడు. శారా విషయములో మాత్రమే కాదు ప్రతి ఒక్కరికి తానిచ్చిన మాట చొప్పున అందరికీ చేస్తాడు. సంఖ్యా. 23:19వ.లో దేవుడు అబద్ధమాడుటకు ఆయన మానవుడు కాడు. పశ్చాత్తాపపడుటకు ఆయన నరపుత్రుడు కాడు. ఆయన మాట యిచ్చి స్థాపింపకుండునా? హబక్కూకు 2:2. ఈ దర్శన విషయము నిర్ణయకాలమున జరుగును. సమాప్త మగుటకై ఆతురపడుచున్నది. అది తప్పక నెరవేరును. అది ఆలస్యముగా వచ్చినను దాని కొరకు కనిపెట్టుము అది తప్పక జరుగును. జాగు చేయక వచ్చును. లూకా 1:37వ. దేవుడు చెప్పిన యేమాటయైనను నిరర్థకము కానేరదని ఆమెతో చెప్పెను. అందుకు మరియ ఇదిగో ప్రభువు దాసురాలను నీ మాట చొప్పున నాకు జరుగును గాక అనెను. లూకా

1:45వ. ప్రభువు ఆమెకు తెలియచేయించిన మాటలు సిద్ధించును గనుక నమ్మిన ఆమె ధన్యురాలు అనెను. కనుక పై మాటలన్నిటిలో ప్రభువు మాట యిచ్చి స్థాపించేవాడని, ఆయన మాటలు నిర్ణయకాలములో జరుగుతాయని, అవి తప్పక జరుగుతాయని, జాగు చేయక జరుగుతాయని దేవుని మాట నిరర్థకము కాదని అట్టి దేవుని మాట ప్రకారము తనకు జరుగును గాకని మరియ చెప్పడం, దేవుని మాటలు సిద్ధించేవి అని మరియ నమ్మి ధన్యురాలయ్యిందని చదువుచున్నాము. అలాగు మనమందరమూ నమ్మినట్లైతే మనకు కూడ ఆ మాటలు నెరవేరుతాయి. మనమునూ మరియవలె ధన్యులౌతాము. ఆకాశం, భూమియైనా గతిస్తాయి కానీ, నా మాటలెన్నడూ గతించవని దేవుని వాక్యంలో ప్రభువు చెప్పారు. ఆయన మాటల్లోనున్న, అరసున్న, పొల్లు అయినా తప్పదు. ఈ రీతిగా యెహోవా దేవుడు శారాకు తానిచ్చిన మాట చొప్పున ఆమెకు చేశాడు దేవుడు అబ్రహాముతో కూడ చెప్పిన నిర్ణయకాలములో శారా గర్భవతియై అతని ముసలితనమునందు అతనికి కుమారుని కనింది. ఆది. 16:2 నా కొరకు పిల్లలను హాగరు కంటుంది అని శారా అనింది. కానీ 21:3లో అబ్రహాము కొరకు శారా పిల్లలను కనిందని వ్రాయబడింది. అవును, పిల్లలు మన కొరకు కాదు, మన పరమ అబ్రహామైన ప్రభువు కొరకే.

**XI. దేవునిచే నవ్వు పొందిన శారా:–** ఆది 21:6 దేవుడు నాకు నవ్వు కలుగజేసెనని శారా చెబుతోంది. అవును, శారాకు గానీ, మరి ఎవ్వరికి గానీ నవ్వు, అనగా సంతోషమిచ్చేది దేవుడే. శారా 90వ యేట బోసినోటితో హృదయపూర్వకంగా నిజమైన నవ్వు నవ్వింది. ఇదే శారా 18వ అధ్యాయం 12వ వచనములో 'నేను బలము ఉడిగిన దాననైన తరువాత నాకు సుఖము కలుగునా? నా యజమానుడును వృద్ధుడై యున్నాడు కదా! అని తనలో తాను అనుమానస్పద నవ్వు నవ్వింది. కానీ ఆ నవ్వును దేవుడు నిజమైన నవ్వుగా చేశాడు. కీర్త. 126:2 ప్రకారము, ఆయనే మన నోటి నిండా నవ్వు ఇస్తాడు. మన నాలుకలను ఆనంద గానములో నింపుతాడు. ఆ యింటిలో శారాకు ఎంతో ధనము, సంపద, దాసదాసీలు, ధాన్యము, ఎంతవున్నా సంతోషము, నిజమైన నవ్వు లేదు. కానీ ఇస్సాకు పుట్టినప్పుడే నోటినిండ నవ్వు వచ్చిందట. అలాగే పరమ ఇస్సాకు నీ హృదయంలో జన్మిస్తేనే నీకు కూడ నిజమైన పరలోకపు ఆనందము నవ్వు నోటి నిండా కలుగుతుంది. ఇదే అధ్యాయంలో 7వ వచనములో ఇస్సాకు ద్వారా అబ్రహాము శారాలకు నిండా నవ్వు కలిగింది. ఇదే 21 అధ్యా 11 వచనంలో ఇష్మాయేలు కుమారునిబట్టి మిక్కిలి దుఃఖము కలిగింది. ఇస్సాకు నవ్వుల కుమారుడు, ఇష్మాయేలు దుఃఖపుత్రుడు.

ఇస్సాకు జన్మించినప్పుడే శారా అబ్రహాములకు నవ్వు సంతోషము కలిగినట్లు ప్రియ సోదరీ! నీకు కూడ నవ్వు, ఆనంద సంతోషాలు కావాలంటే నీ హృదయంలో ఆ ప్రభువు జన్మించాలి. యేసు ఉన్న హృదయమనే ఇంటిలో నిజమైన సంతోషం వుంటుంది.

అది లోకమిచ్చే సంతోషం కాదు. తింటే, త్రాగితే, పండుగంటే, పెండ్లి అంటే, క్రొత్త బట్టలు, స్నేహితులు, బంధువులు వీరందరూ వీటన్నిటి ద్వారా కలిగే సంతోషం క్షణికకాలమే. కానీ, యేసును నీవు నమ్మి నీ హృదయంలోకి ఆయనను ఆహ్వానించి "నీ రక్తముతో ప్రభువా నా పాపాల్ని కడగండి" అని నీవు అడిగితే ప్రభువు నీ హృదయంలోకి ఆయన వస్తాడు. నీ జీవితంలో నిజమైన నిత్యానందము నీకు కలుగుతుంది. ప్రభువు ఈ లోకంలో జన్మించినప్పుడు మహా సంతోషము కలిగింది. (లూకా 2:10) మత్తయి 2:10వ.లో అత్యానందుమ కలిగింది. యెష 36:9వ.లో వారి తలల మీద నిత్యానందముండును. వారు ఆనంద సంతోషములు గలవారై వచ్చెదరు అని వ్రాయబడినట్లు నోటినిండా నవ్వు ప్రభువిస్తాడు. యోబు 8:22లో ఆయన ఇంకను నీకు నోటినిండ 'నవ్వు' కలుగజేయును. ప్రహర్షముతో నీ పెదవులను నింపును అని వ్రాయబడింది. ప్రియ సోదరీ! పై వచనాలన్నింటి ద్వారా ఆనందము, సంతోషము, ప్రహర్షము, నోటినిండ నవ్వు సంపూర్ణ సంతోషము ప్రభువు మాత్రమే ఇవ్వగలరని నీకు తెలిసింది కనుక నీకు నిజమైన సంతోషం కావాలంటే యేసుప్రభువును విశ్వాసంతో అడుగు. వేరే దారే లేదు.

శారా తాను నవ్వడమే కాదు 'వినువారెల్లా నన్ను గూర్చి నవ్వెదరు' అని అనింది. అలాగే మనం సంతోషించి యితరుల జీవితాలలో కూడ సంతోషాన్ని నింపుదాం. నీ ద్వారా కూడ అనేకులు ప్రభువుని నమ్మి నిజ సంతోషంతో నోటినిండా నవ్వు నవ్వుతారు. శారా ముసలితనములో ఇస్సాకు స్తన్యమిచ్చింది. అలాగే మనము కూడ ముసలిదశలో కూడ ఆత్మలను కని వాక్యమనే స్తన్యమిచ్చి వారిని పోషించవలసిన వారముగా ఉన్నాము.

**XII. దాసిని దాని కుమారుని వెళ్ళగొట్ట చేసిన శారా:-** ఆది. 21:10 అబ్రహాము ఇస్సాకు పాలు విడిచిన దినమందు గొప్ప విందు చేశాడు. అప్పుడు ఇష్మాయేలు ఇస్సాకును పరిహాసించుట శారా చూచి, ఈ దాసిని దాని కుమారుని వెళ్ళగొట్టుము. దాసి కుమారుడు నా కుమారుడైన ఇస్సాకుతో వారసుడై యుండనేరడని శారా అబ్రహాముతో చెప్పినట్లు చదువుచున్నాము. ఈలాగున శారా తన కుమారుడైన ఇస్సాకు యొక్క శత్రువుని, వాని తల్లిని వెళ్లగొట్టి తన కుమారునికి భద్రతను చేకూర్చుచూ ఉన్నట్లు చూస్తున్నాము. శారా కుమారుని కనడమే కాక వాడికి శత్రువుచేత కలుగబోయే నష్టాలను, కష్టాలను, ఆటంకాలను అడ్డు తొలగించి, బిడ్డ భవిష్యత్తుకు బంగారు బాట వేస్తున్న తల్లిగా చూస్తున్నాము. చాలా మంది స్త్రీలమైన మనము పిల్లలు కావాలి, పిల్లలు కావాలి అని ఆశిస్తూ వున్నామే కానీ వారి బంగారు భవిష్యత్తుకు బాటవేయడములో, శత్రువుని చేతినుండి సాతాను శోధనలనుండి వారిని కాపాడుకొనుటలో మనము మనసు నిలపడము లేదు. వారిని సాతాను చేతిలో పడకుండ కాపాడుకొనుటలో ఆత్మీయ దృష్టి ప్రార్థనా భారము కలిగియుండుటలో దేవుని చిత్తము వారిలో నెరవేరబడాలనే ఆకాంక్ష, ఆశ, తల్లులకు లేకుండుట గమనిస్తున్నాము.

లోక సంబంధంగా, శరీర సంబంధంగా వారి భవిష్యత్తు అందరికంటే బాగుండాలని ప్రయత్నిస్తున్నాము కానీ వారి ఆత్మీయ, సేవా జీవిత భవిష్యత్తును గురించి ఆలోచన గానీ, వారిని శారా వలె కాపాడుకొనే దూరపు ఆలోచన లేకుండానే వుంటున్నాము. శారా ఆనాడు దాసిని దాని కుమారుని వెళ్లగొట్టకుండా ఉంటే ఇస్సాకు జీవితానికి ఇష్మాయేలు ద్వారా అడుగడుగునా అపాయాలు, గండాలు ఎదురయ్యేవి. శారా ఇస్సాకును కనింది, స్తన్యమిచ్చింది. ఇక నా పని అయిపోయింది అని గాలికి ఇస్సాకును వదిలెయ్యలేదు. వెయ్యి కళ్ళతో చూచినట్లు ఇస్సాకుకు ఏమి జరుగుతుందోనని కనిపెట్టి కాపాడుకుంటూ ఉంది. ఇస్సాకును ఈ రోజు ఇష్మాయేలు పరిహసిస్తున్నాడు. ఒకవేళ గిల్లాడో, గిచ్చాడో, ఏడిపిస్తున్నాడో, రేపు ప్రొద్దున మరి ఇంకేమైనా చేయొచ్చు. ఇదే విషయం గలతీ. 4:29వ.లో శరీరమునుబట్టి పుట్టిన ఇష్మాయేలు ఆత్మనుబట్టి పుట్టిన ఇస్సాకును ఏలాగున హింసపెట్టాడో వ్రాయబడింది. కనుక ఇస్సాకు దగ్గర ఇష్మాయేలుంటే ఇస్సాకుకు హింస కలుగుతుంది. అవును, సాతాను మన యింటిలో వుంటే, మన పిల్లల దగ్గరవుంటే, మన పిల్లలోనే వుంటే అట్టి సాతానును తల్లులమైన మనము ప్రార్థన ద్వారా, విశ్వాసము ద్వారా వాక్యము ద్వారా వారిలో నుండి తరుమవలసిన వారముగా లేక సాతానుని వెళ్ళగొట్టవలసినవారముగా ఉన్నాము. కొద్దిమంది పిల్లలు తల్లిదండ్రులకు తెలియకుండానే సాతాను కబంధ హస్తాలలోకి ఇప్పటికే వెళ్ళిపోయిన వారుగా ఉన్నారు. అటువంటి పిల్లలను గూర్చి తెలిసిన తరువాత యెరికో కోట గోడలను ఇశ్రాయేలీయులు ఆర్భటించి కేకలు వేసి ఎలా పడగొట్టారో అలాగున మన పిల్లల చుట్టూ సాతాను నిర్మించిన కోటగోడలను విశ్వాససహితమైన వాక్య వాగ్దానాల మూలమున, స్తుతుల మూలమున పడగొట్టి వారి చుట్టూ ప్రభువు కోటగోడ నిర్మించడానికి తల్లులు పూనుకోవాలి. ప్రియ సోదరీ! దేవుడు నీకిచ్చిన పిల్లల దరిదాపుల్లో సాతాను వాడి దూతలు నివసించకుండా వారిని వెళ్లగొట్టే పని, వారిని విడిపించే బాధ్యత నీదని నీవు గ్రహించాలి. ఈ సంగతిని అబ్రహాము కంటే శారా ముందే గ్రహించింది. ఇష్మాయేలును బయటికి పంపడం అబ్రహాముకు మిక్కిలి దుఃఖము కలుగజేసింది. కారణం ఇష్మాయేలు కూడా అబ్రహాముకు కుమారుడే కదా! కానీ, ఇష్మాయేలు శరీర సంబంధి. చిన్నవాడులే ఏమి తెలియదులే అని నిర్లక్ష్యము చేసినట్లయితే వాగ్దాన పుత్రుడైన ఇస్సాకుకు హాని కలుగుతుంది. ప్రస్తుతానికి శారా చెప్పిన విషయం అబ్రహాముకు దుఃఖాన్ని కలిగించవచ్చు. రేపు ఇస్సాకుకు ఏమైన జరుగరానిది జరిగితే అప్పుడు ఇంకెంత దుఃఖపడాలి? కనుక దేవుడు కూడ శారా మాట వినమని చెప్పాడు. ఈ సందర్భములో దేవుని చిత్తాన్ని కూలంకుషంగా తెలిసికొనుటలో శారా ముందుంది. చాలా జాగ్రత్తగా ఇస్సాకు జీవితాన్ని ఆమె కాపాడుతూ ఉంది. లేకపోతే జరుగకూడనివి జరిగితే ఆ తరువాత చేసేదేమి

ఉండదు. అందుకే దేవుడు విలా. 2:19వ.లో "నీవు రేయి మొదటి జామున మొఱ్ఱపెట్టుము. నీ పసిపిల్లల ప్రాణము కొరకు నీ చేతులు ఆయన తట్టు ఎత్తుము. నీళ్ళు కుమ్మరించునట్లు నీ పసిపిల్ల ప్రాణము కొకు నీ చేతులను ఆయన తట్టు ఎత్తుము' అని వ్రాయించాడు. మనమలా చేతులెత్తి వారి ప్రాణములను కాపాడుకొనకపోతే సాతానుడు వారిలో తిష్టవేసి కూర్చుని వారి ప్రాణాలకు హాని చేస్తాడు. కావున యాకో. 4:7వ.లో వ్రాయబడినట్లు 'అపవాదిని ఎదిరించుడి. అప్పుడు వాడు మీ యొద్ద నుండి వాడు (మీ పిల్లల యొద్ద నుండి) పారిపోవును' అన్న మాట ప్రకారం తల్లులము, తండ్రులమైన మనము, మన పిల్లల చుట్టూ, మన సంఘాల చుట్టూ ఉన్న ప్రాణహాని, ఆత్మీయ హాని చేసే సాతానును వెళ్ళగొట్టవలసిన వారముగా ఉన్నాము. సొలొమోను రాజ్యంలో నిన్నటిరోజు మొద్దు నిద్రలో తన కుమారుని మీద పడి వాడిని చంపుకున్న ఒక వేశ్య, మరో వేశ్య యొక్క కుమారుని తన ప్రక్కన వేసికొని చచ్చిన తన కుమారుని ఆ మరో వేశ్య యొక్క ప్రక్కన పరుండబెట్టగా ఇద్దరు వేశ్యలు బ్రతికియున్న బిడ్డ నా బిడ్డ, నా బిడ్డ అని యిద్దరూ చెప్పుచుండగా రాజు ఆ బ్రతికిన బిడ్డను ఖడ్గముతో రెండు భాగములుగా చేసి చెరి ఒక భాగము ఇస్తానని తీర్పు తీర్చినప్పుడు నిజమైన తల్లి, తన బిడ్డ చంపబడబోతుండగా ప్రేగులు తరుగుకొనిపోయినదై రాజు నొద్ద 'నా యేలినవాడా! బిడ్డను ఎంతమాత్రమును చంపక దానికే యిప్పించుమని మనవి చేసింది. రెండవ స్త్రీ అది నాదైనను, దానిదైనను కాకుండ చెరి సగము చేయుమనెను. నాదైనను, ఆమెదైనను కాకుండునట్లు అంటే తన కుమారుడుగా ఉంచుకోవడం ఇష్టము లేనప్పుడు బ్రతికిన బిడ్డ నా బిడ్డ అని ముందు ఎందుకు వాదించింది? తాను ఆ బిడ్డను బ్రతికించుకోడానికి, కాపాడుకోడానికి కాదు. నా బిడ్డ చచ్చాడు. ఈమె బిడ్డ కూడా 'చావాలి' అంతే ఆమె కోరిక. కానీ, నిజమైన తల్లి యేలినవాడా! బిడ్డను ఎంత మాత్రమును చంపక దానికే యిప్పించుడి అనింది. అవును మన మందరము మన పిల్లలకు నిజమైన తల్లులమైతే మన పిల్లల మీద ఎంతమాత్రమైనను సాతాను కత్తి పడకుండా ప్రభువును ప్రేగులు తరుక్కుపోయినంత దుఃఖముతో ప్రార్థించి పిల్లలను రక్షించుకోవాలి. ప్రభువు ప్రతి తల్లికి ఈలాటి ప్రార్థనాభారమిచ్చును గాక!

శారా దాసిని దాని కుమారుని వెళ్ళగొట్టుము అని మాత్రమే కాక, దాసి కుమారుడు నా కుమారునితో వారసుడై యుండడు అని చెప్పింది. ఇష్మాయేలును శారా వెళ్ళగొట్టకపోతే ఇస్సాకు వారసత్వానికి నష్టమొచ్చేది. కాని సరియైన సమయంలో శారా తన కుమారుని తన కుమారుని వారసత్వాన్ని కాపాడింది. శారాలాగ మనమును మన పిల్లలను వారు పొందబోయే మహిమా స్వాస్థ్యాన్ని నష్టపరచిన వాళ్ళముకాక వారిని రక్షణలోనికి నడిపించి వారి ఆత్మీయతకు భంగము కలిగించే వాటన్నిటినుండి వారిని మన ప్రార్థనా జీవితం ద్వారా కాపాడుకొందము గాక!

**XIII. మృతి చెందిన శారా:-** హెబ్రోనులోని కిర్యతర్బాలో శారా తన 127వ యేట మరణించినట్లు ఆది 23:2వ.లో చదువుచున్నాము. కుమారుడైన ఇస్సాకును, ఇష్మాయేలు చేత నుండి ఏ సమస్యా భవిష్యత్తులో రాకుండా భద్రపరచి, వారసత్వానికి లోటు లేకుండా చేసింది. అంతవరకేనేమో ఆమె పని. కుమారునికి పెళ్ళి చేయక మునుపే దేవుడు ఆమెను తన యొద్దకు పిలుచుకున్నాడు. కుమారునికి పెళ్లి ఏర్పాటు చేసే పని కొరకు దేవుడు అబ్రహామును వాడుకున్నట్లుగా చూస్తున్నాము. ఒకవేళ తల్లియైన శారా ఇస్సాకను తన కుమారుని పెళ్ళి కొరకు ప్రార్థిస్తూ ఉండి ఉంటుంది. కుమారుని కని 37 సంవత్సరములు కుమారుని ప్రేమతో పెంచి ఎంతగానో పోషించి పరిచర్య చేసింది. ఎంతప్రేమతో పరిచర్య చేసిందో! అందుకే, 3 యేండ్లుగా తల్లి కొరకు నివారణ లేని దుఃఖము పొందుతు వచ్చాడు ఇస్సాకు. సాధారణంగా మగపిల్లలు ఏడ్వరు కానీ ఒకటి కాదు మూడు సంవత్సరాలు ఇస్సాకు ఏడ్చాడంటే శారా కుమారునికి ఎంత ప్రేమ పంచిందో కదా! ప్రియ సోదరీ! నీవు చనిపోయాక నీ ప్రేమను స్మరిస్తూ, నీ ప్రేమను జ్ఞాపకం చేసుకుంటూ ఏడ్చేవాళ్ళుంటారా? మొత్తానికి 'సహవాసము' అని అర్థమిచ్చే చోటనే దేవునితోను పరిశుద్ధులతోను సహవాసం చేసే అనుభవం కలిగియుండే స్థితిలోనే మరణం వరకు జీవించడాన్ని శారా జీవితంలో చూస్తున్నాం. మనమును మన చివరి దినము వరకూ తండ్రి కుమార, పరిశుద్ధాత్మ, పరిశుద్ధుల సహవాస అనుభవంలోనే మన జీవితాలు శారా వలె ముగించాలి. 1 యోహాను. 1:3.

**XIV. మనము ఆలోచించవలసిన శారా:-** యెష 51:2వ.లో దేవుడు "మీ తండ్రియైన అబ్రహాము సంగతి ఆలోచించుడి. మిమ్మును కనిన శారాను ఆలోచించుడి" అని చెప్పిన ప్రకారము ఆమెను గురించి 13 లేక 14 అంశాలుగా ఆలోచించాము. అలాగే మిమ్మును కనిన అబ్రహామును గూర్చి కూడ ఆలోచించమన్నాడు. కనుక ఒక కుటుంబముగా భార్యభర్తలైన వారిద్దరిని గూర్చి కూడ ఆలోచిస్తూ వచ్చాము. ఎందుకు దేవుడు వారిద్దరిని గూర్చి ఆలోచించమన్నాడు. యెష 51:2వ.లో అతడు+ఆమె ఒంటిరయై యుండగా నేను వారిని పిలచితిని. అతనిని +ఆమెను, ఆశీర్వదించి అతనిని+ ఆమెను పెక్కుమందియగునట్లు చేసితిని అని దేవుడు చెబుతున్నాడు. ఈ ఇద్దరినీ దేవుడు రక్షించి, బలహీనతలు సరిదిద్ది, వారినాశీర్వదించి వారి పట్ల, తన వాగ్దానాలు నెరవేర్చి వారు పెక్కుమందియగునట్లు చేశాడట. మనల్ని కూడ దేవుడు ఒంటిరవారమై యుండగా పిలచి రక్షించి అనేక బలహీనతలను సరిదిద్ది, క్షమిస్తూ ఆశీర్వదిస్తూ మనపట్ల తన వాగ్దానాలు నెరవేర్చుచూ వచ్చాడు. మరి మనం నేటికీ ఒంటరిగానే వుంటున్నామా? లేక పెక్కుమందిమి అయ్యామా? మన విశ్వాసము ద్వారా మన సేవద్వారా మన ప్రార్థన ద్వారా మన దేవునికి అనేక ఆత్మలను కన్నామా? వారిలో ఒంటరియైనవాడు పదివందలగును అని దేవుని వాక్యము చెప్పుట లేదా? అబ్రహాము, హాగరు ద్వారా ఇష్మాయేలును కన్నాడు. వారు ఇసుక రేణువుల్లాగా కనబడుతున్న ఇష్మాయేలీయులు. వీరు అబ్రహాముకు భూసంబంధమైన సంతానము. కానీ

అబ్రహాముకు, శారా ద్వారా కనబడిన సంతానమైన ఇశ్రాయేలీయులు ఆకాశ నక్షత్రాల్లాంటివారు. వీరు అబ్రహాముకు ఆత్మీయ సంతానము. అబ్రహాము, శారాలు జనములకు తండ్రి, తల్లి అని దేవుడే వారికి ఆది 17:5,16వ. పేరుపెట్టాడు. ఆ పేర్ల ప్రకారమే వారు పెక్కుమందిని లెక్కింపశక్యముకానీ ఆత్మీయ పిల్లలను కన్నారు. (ఆది. 15:5) కనాను దేశమును అతడును, అతని సంతానమును స్వతంత్రించుకుంటారని పిల్లలు పుట్టకముందే దేవుడతనితో ఆది. 15:7వ.లో చెప్పారు. పైన చెప్పబడిన రీతిగా రక్షింపబడిన మనమొక్కొక్కరము జనములకు ఆత్మీయ తల్లిగా, తండ్రిగా వుండి అనేక ఆత్మలను (లెక్కింపశక్యము కాని) రక్షణలోనికి నడిపించి వారందరు పరలోక దేశాన్ని స్వతంత్రించుకొనునట్లు చేయమనే ప్రభువు మనల్ని శారాను, అబ్రహామును ఆలోచించమని చెప్పాడు. కనుక మనమును దాని 12:3వ.లో వున్నట్లు నీతిమార్గము ననుసరించి నడుచుకొనునట్లు ఎవరు అనేకులను త్రిప్పుదురో, (శారా, అబ్రహాములవలె) వారు నక్షత్రములవలె నిరంతరమును ప్రకాశించెదరు" అన్న మాటను మన జీవితములో మనము కూడ నెరవేర్చాలనే అబ్రహాము, శారాను గూర్చి ఆలోచించమని దేవుడు చెప్పాడు. వారిద్దరిలాగ పెక్కుమందిని క్రీస్తు కొరకు సంపాదించాలని పౌలు ఏమి చేశాడో చూద్దాం. 1 కొరింథీ. 9:19వ.లో నేను క్రీస్తు కొరకు ఎక్కువమంది సంపాదించుకొనుటకై అందరికినీ నన్ను నేనే దాసునిగా చేసికొంటిని. యూదులను సంపాదించుకొనుటకు యూదులకు యూదునివలెను, ధర్మశాస్త్రమునకు లోబడిన వారిని సంపాదించుకొనుటకు, ధర్మశాస్త్రమునకు లోబడినవానివలెను, ధర్మశాస్త్రము లేనివారిని సంపాదించుకొనుటకు ధర్మశాస్త్రము లేనివానివలెను బలహీనులను సంపాదించుకొనుటకై బలహీనునివలెను, ఏవిధము చేతనైనను కొందరిని రక్షింపవలెనని అందరికి అన్ని విధముల వంటి వాడనై యున్నాను అని వ్రాస్తున్నాడు. ప్రియ దేవుని బిడ్డలారా! ఎందుకు ఇంత సుదీర్ఘముగా శారా, అబ్రహాములను గురించి ఆలోచించామంటే, మనమునూ వారివలె జనములకు తల్లి, తండ్రిగా ఉండాలి అలా ఉండటానికి దాసులమై అందరికీ అన్ని విధములవంటి వారముగా ఉండాలనే ధ్యానించాం. ముఖ్యముగా నరులమైన మనలను రక్షించుటకై దేవునితో సమానముగా వుండుట విడచిపెట్టుకొనని భాగ్యమని ఎంచుకొనక యేసు ప్రభువు మనుష్య పోలికగా పుట్టి, దాసుడై రిక్తుడైన దాసుడై మరణము పొందునంతగా అనగా సిలువ మరణము పొందునంతగా తన్ను తాను ఈ భూలోకంలోని అందరు దాసులకంటే ఆయన తగ్గించుకోలేదా? (ఫిలిప్పీ 2:6-8వ.). అలాగున మనలను మనమే తగ్గించుకొని, తండ్రియైన దేవునికి విధేయత చూపితే అనేకులను ప్రభువు వైపునకు, నీతిమార్గము ననుసరించునట్లు త్రిప్పాలి అని నేర్చుకుంటున్నాం.

ఈలాగున యేసుప్రభువు మనలను దేవుని వైపుకు త్రిప్పటానికి ఆయన తన్ను తాను ఇంకా ఎలా తగ్గించుకున్నారో చూద్దాం. కీర్త. 76:4వ. ప్రకారము దుష్టమృగములుండు

పర్వతముల సౌందర్యముకంటే అధిక తేజస్సు కలవాడైన ప్రభువు ఈ లోకానికి మనలను రక్షించుటకు వచ్చిన సమయంలో తన్ను తాను తగ్గించుకొని ఆ తేజస్సును ప్రక్కనపెట్టి తేజస్సు లేనివాడుగానే మట్టి మానవుడుగా పుట్టాడు. యోబు గ్రంథములో 37:22వ.లో భీకరమైన మహిమను ధరించుకొనిన ఆ ప్రభువు మహిమ లేనివాడుగా అబ్రహాము సంతాన స్వభావముతో మనందరి వలె దిగంబరుడుగానే పుట్టాడు. ప్రభావమును వస్త్రముగా కలిగినవాడు. తన్ను తాను తగ్గించుకొని పొత్తి గుడ్డలచేత చుట్టబడ్డాడు. భీకరమైన మహిమతో ఆయన జన్మించినట్లయితే మన మెవ్వరము ఆ మహిమను చూడజాలము. భయపడతాము కూడా. కనుక ఆయన తన భీకరమహిమను ప్రక్కనపెట్టి తగ్గించుకొని ఈ లోకానికి వచ్చాడు. గనుక ఆయన ఈ లోకానికి వచ్చినప్పుడు అందరూ ఆయనను చూడగలిగారు. ఆయన న్యాయమును నీతిని ఏ మాత్రము చెరుపనివాడు అని యోబు 37:23వ.లో వ్రాయబడియుండగా ప్రభువు ఈ లోకానికి వచ్చి సిలువలో వ్రేలాడీయక మునుపు ఆయన తన్ను తాను దాసునివలె తగ్గించుకొని అన్యాయపు తీర్పును పొందుకున్నారు. బలమునే నడికట్టుగా కట్టుకున్న ప్రభువు తన బలముచే పర్వతములను స్థిరపరచువాడు. ఈ లోకానికి నరావతారములో వచ్చినప్పుడు బలమును చిల్ల పెంకువలె చేసుకున్నాడు. సిలువలో శక్తిని కోల్పోయాడు. బలహీనతచే ముమ్మారు భూమి మీద పడిపోయాడు. కెరూబులమధ్య నివసించువాడు తన్ను తాను తగ్గించుకొని ఎక్కడ ఇద్దరు ముగ్గురు నా నామమున చేరి వస్తారో వారి మధ్యన నేనుంటానని ప్రభువు తన్ను తాను తగ్గించుకొని నరావతారములో ఈ లోకానికి వచ్చాడు. భవిష్యత్తులో కూడ తన రాజ్యమును భూలోకానికి రెండవసారి వచ్చినప్పుడు, తన నిత్యపాలనలో కూడ ఆయన మనుష్యులతో కాపురము చేయబోతున్నాడు. (ప్రక 21:3). అత్యున్నతమైన సింహాసనాశీనుడైన ఆ ప్రభువు ఈ లోకంలో తన్నుతాను తగ్గించుకొనినవాడై గాడిదమీద ఊరేగించబడ్డాడు. యోబు 36:33వ.లో ఆయన గర్జనము ఆయనను ప్రసిద్ధి చేసేదిగా ఉండగా ఈ లోకానికి వచ్చినప్పుడు గర్జించకుండా తన్ను తాను తగ్గించుకొని అందరితో దయగా మాట్లాడాడు. ఇలా అనేక రీతులుగా ప్రభువు తన్ను తాను తగ్గించుకున్నాడు కనుక ఆయన అనేకులను తనవైపు త్రిప్పుకున్నాడు. మనమునూ ప్రభువు వలె మనల్ని మనం తగ్గించుకొని ఆయన సేవ చేస్తే అనేకులను ప్రభువు కొరకు సంపాదించి ప్రభువు వైపు త్రిప్పగలము. అబ్రహాము కూడ ఘనమైన మహారాజుగా ఉండినప్పటికీ ధూళియు, బూడిదెయునైన నేను అని దేవుని సన్నిధిలో తగ్గించుకున్నాడు. అందుకే ఒంటరియైనవాడు పెక్కుమంది అగునట్లు దేవునిచే ఆశీర్వదించబడ్డాడు. మనమును ప్రభువువలె తగ్గించుకొని ఆయనను హెచ్చిస్తూ అనేక ఆత్మలను ప్రభువువైపు త్రిప్పుదుము గాక!

# రిబ్కా కుటుంబము

## (ఇస్సాకు, ఏశావు, ఏశావు భార్యలు, యాకోబు, యాకోబు భార్యలు)

**I. స్వదేశియు–బంధువునుయైన రిబ్కా:–** ఆది 24:4వ.లో అబ్రహాము తన యింటి పెద్ద దాసునితో – "నా స్వదేశమందున్న నా బంధువు యొద్దకు వెళ్ళి నాకుమారునికి భార్యను తీసికొని రమ్మని" చెప్పాడు గనుక మొట్టమొదటిదిగా 'స్వదేశియు–బంధువునైయున్న రిబ్కా అని మొదటి అంశముగా ఆమె జీవితాన్ని మనము ధ్యానించవచ్చు. అబ్రహామువలె నేటి విశ్వాసులమైన మనమును మన పిల్లలకు పెండ్లి చేయాలంటే పెండ్లి కుమార్తెను తేవాలంటే మనము ఈనాడు ఏ స్వదేశానికి వెళ్ళాలి? మన పౌరసత్వము యెక్కడుందో అదే మన స్వదేశము. ఫిలి. 3:20వ. ప్రకారము మన పౌరస్థితి పరలోకమందున్నది. కాబట్టి ప్రియ సోదరీ! నీ కుమారునికి పెండ్లి చేయాలంటే నీకు వచ్చే కోడలు పరలోక సంబంధియై యుండాలి. ఆ పరలోక సంబంధియైన బంధువు ఎవరు? రక్త సంబంధులైన వారినే బంధువులంటాము కదా! అట్లయితే ప్రభువు రక్తములో కడుగబడి, ఆ ప్రభువు రక్తములో నిబంధన చేయబడినవారే మన బంధువులు. విశ్వాసి విశ్వాసినే పెండ్లాడాలి. నిర్గమ. 2:2లో లేవీ వంశస్థుడొకడు వెళ్ళి లేవీ కుమార్తెను పెళ్ళాడాడు. 1 కొరింథీ. 6:14–16వరకూ ఉన్న వచనాలలో పౌలు భక్తుడు ఈలాగు సెలవిస్తున్నాడు. మీరు అవిశ్వాసులతో జోడుగా ఉండకుడి. నీతికి దుర్నీతికి ఏమి సాంగత్యము? వెలుగుకు చీకటితో ఏమి పొత్తు? క్రీస్తుకు బెలియాలుతో ఏమి సంబంధము? అవిశ్వాసులతో విశ్వాసికి పాలెక్కడిది? దేవుని ఆలయమునకు విగ్రహములతో ఏమి పొందిక? విశ్వాసులమైన మనము జీవముగల దేవుని ఆలయమై యున్నాము. అవిశ్వాసులను పెండ్లాడితే ఒక నిర్జీవ శవాన్ని జీవితాంతము మెడకుకట్టుకున్నట్లే. అట్టి వివాహ జీవితము సంతోషకరంగా ఉంటుందా? సంఖ్యా. 26:59వ.లో స్వాస్థ్యము ఒక గోత్రములో నుండి వేరొక గోత్రములోనికి పోకుండు నిమిత్తమై సెలోపెహాదు కుమార్తెలు తమ తండ్రి గోత్రవంశములోనే పెండ్లి చేసికొనవలెనని దేవుడు వారికి చెప్పాడు. సెలోపెహాదు కుమార్తెలు మోషెకు దేవుడు అజ్ఞాపించినట్లే పెండ్లి చేసుకున్నారు. అలాగే నేటి యువతీ యువకులందరూ యెహోవా అజ్ఞాపించిన పెళ్ళిళ్ళే చేసుకోవాలి. దేవుని చిత్తము ప్రకారమే పెళ్ళి చేసుకోవాలి. మన వంశం 1 పేతురు 2:9వ.లో వ్రాయబడినట్లు ఏర్పరచబడిన వంశము. ప్రపంచములో ఎందరో గొప్పవారు పేరు ప్రతిష్ఠలున్నవాళ్ళు, రాజులు, రాణులు ఉండగా వారిలో అత్యధికుల్ని ప్రభువు ఏర్పరచుకోలేదు. కానీ నిన్ను, నన్ను ఎన్నికలేనివారిని, తృణీకరింపబడినవారిని, వెట్టివారిని దేవుడు ఏర్పరచుకున్నాడు. మనల్ని మాత్రమే ప్రభువు సెలెక్ట్ చేసుకున్నాడు. క్రైస్తవ గుంపులో నుండి గంపలోనికి అనగా స్థానిక సంఘములోనికి చేర్చాడు. మనలాగ ఏర్పరచబడిన విశ్వాసులైన స్థానిక సంఘమనే గంపలోని వారినే పెళ్ళాడాలని దైవ వాక్యం సెలవిస్తుంది.

ప్రియమైన సోదరీ! నీ పెళ్ళి ఇస్సాకు, రిబెకా లాంటి దేవుడు నడిపించిన, దేవుడు ఆజ్ఞాపించిన పెళ్లియేనా? నీ కుమారునికి విశ్వాసియైన అమ్మాయితో పెండ్లి చేయుటకిష్టపడుచున్నావా? అలాకాక, అవిశ్వాసియైనా పరవాలేదు అని డబ్బును, అందాన్ని అంతస్తును చూచుకొని నా యింటికొచ్చాక ఆ అమ్మాయిని మార్చుకుంటానులే అనుకుంటే, ఆ అమ్మాయిని నీవు మార్చలేకపోగా, ఆ అమ్మాయే మిమ్ములను మార్చేయాలనుకుంటుందేమో! జాగ్రత్త. 1 కొరి.7:16వ.లో ఓ స్త్రీ! నీ భర్తను రక్షించెదవో లేదో నీకేమి తెలియును? అని వ్రాయబడినట్లు, ఓ అత్తగారూ! నీ కోడలిని నీవు రక్షించెదవో లేదో నీకేమి తెలియును? అని ఆ వాక్యాన్ని నీవు చదువుకోవాల్సి వస్తుంది. విశ్వసించిన నీ కుమారుడు దేవుని ఆలయముగా ఉండగా అవిశ్వాసియైన కోడలు ఆ ఆలయంలో ఒక విగ్రహముగా ఉన్నట్లుంటుంది. పెండ్లిరోజు వీరిద్దరినీ ఏకం చేసినప్పటికీ అనుదిన సంసార జీవితములో వీరిద్దరు ఒద్దికగా, ఐక్యముగా, అనురాగంగా, కలిసిమెలిసి ఉండలేరు. కనుక విశ్వాసి విశ్వాసినే పెళ్ళాడాలి.

**II. ఇంటిని యేలు పెద్దదాసుని వెంట వచ్చుటకు యిష్టపడిన రిబ్కా:-** ఆది. 24:8వ.లో రిబ్కా ఇస్సాకు స్వదేశియు మరియు బంధువు అయినప్పటికీ ఆమె వచ్చుటకు ఇష్టపడకపోతే ఆ పెండ్లికి అబ్రహాము అభ్యంతరము చెబుతున్నాడు. ఇక్కడ మనము అబ్రహామును తండ్రియైన దేవునికిని, ఇస్సాకు కుమారుడైన దేవునికిని, ఇంటిని యేలు పెద్దదాసుని పరిశుద్ధాత్మ దేవునికిని, రిబ్కాను విశ్వాసికిని, సాదృశ్యముగా తీసుకుంటే, వివాహము చేసుకునే విశ్వాసి, పరిశుద్ధాత్మకు సాదృశ్యముగా ఉన్న పెద్దదాసుని వెంట పరమ ఇస్సాకైన యేసునొద్దకు రావాలి. అందుకే పౌలు రోమా 8:12-14వచనాలలో ఈలాగు చెబుతున్నాడు. కాబట్టి సహోదరులారా! శరీరానుసారముగా ప్రవర్తించుటకు మనము శరీరమునకు ఋణస్థులము కాము. మీరు శరీరానుసారముగా ప్రవర్తించిన యెడల చావవలసినవారై యుందురు గానీ ఆత్మచేత శారీరక క్రియలను చంపిన యెడల జీవించెదరు. ప్రియ సోదరీ! నీ విశ్వాస జీవితములో పరిశుద్ధాత్మ నడిపింపులోనే వెళ్తున్నావా? ఆయన స్వరానికి విధేయత చూపుతున్నావా? గల. 5:7వ.లో వ్రాయబడినట్లు సాతాను ప్రేరేపణచేత అడ్డగించబడుతున్నావా? అపొ. 5:3,9 వచనాలలో అననీయ సప్పీరా పరిశుద్ధాత్మతో కాక సాతానుతో ప్రేరేపించబడినప్పుడు అనగా పరిశుద్ధాత్మ వెంట రానప్పుడు వారిద్దరు శవాలైపోయి దేవుని గొప్ప తీర్పు పొందినట్లు చూస్తున్నారు కదా! ప్రియ సోదరీ! నీవు ప్రభువును విశ్వసించి రక్షించబడ్డావంటే నీలో క్రీస్తు ఆత్మ ఉన్నట్లే. ఎవడు క్రీస్తు ఆత్మ లేకపోతే వాడు ఆయనవాడు కాడని ప్రభువే చెప్పాడు. కనుక పరమ ఇస్సాకును పెండ్లి చేసుకొనబోయే నీవు పరిశుద్ధాత్మ వెంట నీవు తప్పక రావలసినదానవుగా ఉన్నావు. అలా పరిశుద్ధాత్మ ప్రేరేణతో నడుచుకుంటే గొప్ప ఆత్మీయ ఆశీర్వాదాలు పొందుకుంటావు.

ఆత్మానుసారంగా నడుచుకోక శరీరమునననుసరించి, శరీరాశలనుబట్టి నడుచుకుంటే 'మీరు చావవలసియుందురు' అనే మాటలో ఎంత తీవ్రమైన భయంకరమైన నష్టాన్ని తెచ్చుకుంటామో వ్రాయబడింది. కనుక పరిశుద్ధాత్మ ననుసరించి శారీరక క్రియలను చంపి ప్రభువునే వెంబడించుటకు ఇప్పుడే తీర్మానించుకొని ఆత్మీయ ఆశీర్వాదాలను పొందుకుందాం. అలాగు ప్రభువు కృప చూపును గాక!

**III. ఇంటిని యేలుచున్న పెద్దదాసుని ద్వారా నానావిధములైన శ్రేష్ఠమైన వస్తువులను పొందిన రిబ్కా:-** ఆది. 24:10. ఎవరైతే పరిశుద్ధాత్మ ప్రేరేపణకు లోబడి జీవిస్తూ ఆయనను వెంబడిస్తారో వారికి మన తండ్రియైన దేవుడు యిచ్చే నానావిధములైన వరములను గురించి యాకో. 1:16వ.లో 'శ్రేష్ఠమైన ప్రతి యీవియు, సంపూర్ణమైన ప్రతి వరమును పరసంబంధమైనదై జ్యోతిర్మయుడగు తండ్రి యొద్ద నుండి వచ్చును. తండ్రి మనకిచ్చే యీవులన్నియూ, సంపూర్ణమైనవిగాను, పరసంబంధమైనవిగాను ఉన్నాయని గమనించాలి. ప్రియ సోదరీ! నీవు నేడు అనుభవించే ఈవులన్నియూ ఇహసంబంధమైనవిగానే, మనుషులిచ్చినవిగా ఉన్నాయేమో! దేవుడిచ్చే పరసంబంధమైనవి ఎంత శ్రేష్ఠమైనవో కదా! అలాగున ప్రియసోదరీ! నీవు పరిశుద్ధాత్మను వెంబడించినట్లయితే శ్రేష్ఠమైన ఆశీర్వాదాలు పొందగలవు. రిబ్కా ఎలియాజరు ద్వారా పొందిన ఆశీర్వాదాలు ఇహసంబంధమైనవి. ఆ ఇహసంబంధమైన ఈవులు 10 ఒంటెలు మోసినంత బరువుగలవి. కానీ, పరమ తండ్రి నీకు ఆకాశవాకిండ్లు విప్పి పట్టజాలనంత విస్తారమైన దీవెనలనిచ్చువాడుగా ఉన్నాడు. 1 కొరిం. 12:7-11వచనాలలో ఈలాగున వ్రాయబడింది. "అందరి ప్రయోజనము నిమిత్తము ప్రతివానికి ఆత్మ ప్రత్యక్షత అనుగ్రహించబడుచున్నది. ఏలాగనగా ఒకనికి ఆత్మ మూలముగా బుద్ధి వాక్యము, మరియొకనికి ఆ అత్మ మూలముగా జ్ఞానవాక్యమును, మరియొకనికి ఆత్మ వలననే విశ్వాసమును, మరియొకనికి ఆ ఆత్మ వలననే స్వస్థపరచు వరములను, మరియొకనికి అద్భుత కార్యములను చేయు శక్తియు, మరియొకనికి ప్రవచనవరమును, మరియొకనికి ఆత్మల వివేచనయు, మరియొకనికి నానావిధభాషలును, మరియొకనికి భాషల అర్థము చెప్పు శక్తియు అనుగ్రహింపబడియున్నవి. అయినను వీటన్నిటిని ఆ ఆత్మ ఒక్కడే తన చిత్తము చొప్పున ప్రతివానికి ప్రత్యేకముగా పంచి యిచ్చుచు కార్యసిద్ధి కలుగజేయుచున్నాడు. కనుక సంఘములో ప్రతి ఒక్కరికి పరిశుద్ధాత్మ వరములనిస్తూ ప్రభువు కార్యములను జరిగిస్తాడు కనుక ప్రియసోదరీ! నీవు తప్పక పరిశుద్ధాత్మను అనుసరించి ఆయన వెంట నడుస్తూ ఆయన ప్రేరేపణకు విధేయత చూపినట్లయితే పైన చెప్పబడిన ఆత్మీయ ఈవులన్నియు నీవు పొందుకునేదానవుగా ఉంటావు. అలా చేయడానికి ప్రభువు తన కృప చూపును గాక!

**IV. మిక్కిలి, చక్కని, చిన్నదైన రిబ్కా:-** ఆది 24:16వ.లో చిన్నది అంటే టీనేజ్‌లో వున్న

రిబ్కాగా మనము ఆమెను చూడవచ్చు. రిబ్కా టీన్‌ఏజ్‌లో మిక్కిలి చక్కని చిన్నదిగా ఉన్నదని వాక్యము చెబుతోంది. ఈ టీన్‌ఏజ్‌లో పిల్లల శరీరాలలో అనేక గ్రంథులు స్రవించుటనుబట్టి ఆ గ్లాండ్స్ యొక్క సెక్రీషన్స్‌బట్టి వారికి ఎన్నెన్నో శరీర సంబంధమైన కోరికలు పుట్టవచ్చు. ఈ సెక్రేషన్స్ వల్ల పిల్లల దేహములో ఎన్నో మంచి మార్పులు గానీ, చెడు మార్పులుగానీ రావచ్చు. టీన్‌ఏజ్‌లో పిల్లలు జీవితంలో బాగుపడవచ్చు లేక చెడిపోవచ్చు కానీ దేవుడు తనకిచ్చిన మిక్కిలి చక్కదనాన్ని రిబ్కా బజారుపాలు చేసికోలేదు. విశ్వాసులమైన మనలో కూడ ప్రభువు ముఖరూపాన్ని లక్ష్యపెట్టుట లేదు. కానీ తాను అంతరంగాన్ని లక్ష్యపెడుతున్నాడు. 1 పేతు. 3:4వలో ఉన్నట్లు సాధువైనట్టియు మృధువైనట్టియునైన గుణమను అక్షయాలంకారము గల హృదయపు అంతరంగపు స్వభావమే మనము కలిగియుండవలసిన చక్కనిదనము, మరియు 1 తిమో. 2:9-15వ.ల ప్రకారము స్త్రీలు అణకువయు, స్వస్థబుద్ధియు గలవారై యుండి... దైవభక్తి గల స్త్రీలకు తగినట్లు సత్క్రియలచేత తమ్మును తాము అలంకరించుకోవడం మౌనముగా ఉండడం, సంపూర్ణ విధేయతతో నేర్చుకోవడం, స్వస్థబుద్ధి కలిగి, విశ్వాస, ప్రేమ, పరిశుద్ధత కలిగి యుండడమే దేవుడు యిష్టపడే చక్కనిదనం.

ప్రియసోదరీ! ఈ చక్కనిదనం నీలో ఉన్నదా? రిబ్కా మిక్కిలి చక్కనిదేలే. మరి నీ సంగతేంటి? నీ ఆత్మీయ జీవితం చక్కనిదిగా ఉందని చెప్పగలవా? నీ ఆత్మీయ జీవితం చక్కగా ఉన్నదని ప్రభువు చెప్పగలడా? మన ప్రభువు చక్కనివాడే. నరులలో అతిసుందరుడు, ధవళవర్ణుడు, రత్నవర్ణుడు, పదివేల మందిలో అతనిని గుర్తించవచ్చును' అని పరమగీతము 5:10వ.లో చదువగలము. ఇట్టి సుందరుడైన మన ప్రభువు హెబ్రీ. 7:26 ప్రకారము పవిత్రుడు నిర్దోషి, నిష్కల్మషుడు, పాపులలో చేరక ప్రత్యేకముగా ఉన్నవాడు అని కూడ చదువుచున్నాము. ప్రియ సోదరీ! ఆయనలాంటి చక్కనిదనమును నీవునూ కలిగియున్నావా? ఆయన ఏలాగున్నాడో ఆయన సంఘమైన మనమునూ అలాగుననే ఉండాలని ప్రభువు ఇష్టపడుచున్నాడు.

**V. కన్యకయైన రిబ్కా:-** ఆది. 24:16వ. మిక్కిలి చక్కని అందాన్ని కలిగియున్న రిబ్కా కన్యకగా చెప్పబడింది. కన్యత్వపు లక్షణాలు కలిగిన పెళ్ళి కాని చిన్నదానినే కన్యక అని వాక్యప్రకారము చెప్పవచ్చును. చిన్నదైన రిబ్కా కన్యకయైన రిబ్కా తన కన్యాత్వాన్ని తన శీలాన్ని పెళ్లి అయ్యేవరకు కాపాడుకుంది. ఆది 6వ. అధ్యాయంలో వున్న నరుల కుమార్తెల వలె తమ మనసుకు వచ్చిన వాళ్ళను పెండ్లి చేసుకోలేదు. అలాగున మన మనసుకు ఇష్టమైన వాళ్ళను మనము పెండ్లి చేసుకోకూడదు. ఈ విషయంలో దేవుని మనస్సును తెలుసుకోవాలి. ప్రభువా! నా పెళ్ళి విషయములో నీ నిర్ణయమేమి? ఏ వ్యక్తిని నీవు నాకు శిరస్సుగా ఇచ్చావు? నీ చిత్తమును తెలుపుమని, ఆదాము పెళ్ళి చేసిన దేవా! నా పెళ్లిని

కూడా నీవే నీ చేతులమీదుగా జరిగించుమని ప్రభువుకు ప్రార్ధన చేయాలి. పరిశుద్ధాత్మ సాదృశ్యంగా ఉన్న ఇంటిని యేలుచున్న పెద్దదాసుడు చూపించిన ఇస్సాకునే ముందుకు రిబ్కా పెండ్లి చేసుకోబోతోంది. కానీ ఈనాటి యువకులు యువతీమణులు అనుకునేట్లు కనబడిన వ్యక్తులందరికి I love you, I love you అని చెప్పి, రిబ్కా ఇష్టానుసారమైన వ్యక్తులతో పెండ్లి సంబంధాలు కుదుర్చుకోలేదు. అలాగే ఈనాటి యౌవనస్త్రీలు యౌవనస్థులకు రాఖీలు కట్టి పరిచయాలు, స్నేహాలు చేసికొని రోడ్స్‌లో తిరుగుతున్నట్లు తిరుగలేదు. రిబ్కా క్లబ్స్‌లో, పబ్స్‌లో, లాడ్జెస్‌లో సైట్ సీయింగ్స్‌లో (site seeings) బజారుల్లో అబ్బాయిలతో అమ్మాయిలు కలిసి తిరిగినట్లు రిబ్కా కలిసి తిరుగలేదు. బజార్‌లో తన శీలాన్ని పోగొట్టుకోలేదు. ఈ దినాల్లో పెళ్ళికి ముందే అన్నీ అయిపోతున్నాయి. వివాహము అన్ని విషయములలో ఘనమైనది. పాన్పు నిష్కల్మషమైనదిగా ఉండాలని, అలా ఉండక వేశ్యాసంగులుగా వ్యభిచారులుగా ప్రవర్తిస్తే దేవుడు అటువంటి వారికి తీర్పు తీరుస్తారని హెబ్రీ 13:4వ.లో వ్రాయబడిన వాక్యమును తల్లిదండ్రులు, సంఘపెద్దలు, యూత్ లీడర్స్ విధిగా యౌవన పిల్లలకు తెలియజేయవలసిన బాధ్యత ఉన్నది. వాక్య ప్రకారము వివాహము ముందు, తరువాత పాన్పు, నేటి యవనస్థులు పాన్పు ముందు తరువాత పెళ్ళి అంటున్నారు. చేసుకోవలసిన ఒక పెళ్ళికి, ఎంతమందితో ఎన్ని పాన్పులెక్కుతున్నారో దేవునికే తెలియాలి. ఇస్సాకు, రిబ్కాల వివాహం బైబిల్‌లో ఒక మాదిరి పెళ్ళిగా దేవుడు మనందరి కొరకు వ్రాయించాడు. తండ్రి ఆజ్ఞ ప్రకారం రిబ్కాను తోడుకొని రాగా పెండ్లియైన తరువాత ఆది 24:67వ. ప్రకారం 'ఇస్సాకు రిబ్కాను శారా గుడారములోనికి తీసికొనిపోయి ఆమెను పరిగ్రహింపగా ఆమె అతనికి భార్య ఆయెను. అతడు ఆమెను ప్రేమించెను' అని వ్రాయబడింది. ఈనాటి యువకులవలె దేవునికి, తల్లిదండ్రులకు, బంధువులకు, ఆత్మీయులకు ఆమోదయోగ్యంకాని పెళ్ళిని ఎవరికీ తెలియకుండ దొంగపెళ్ళిని ఇస్సాకు చేసికోలేదు. ఏ లాడ్జిలోకో, రిబ్కాను తీసుకెళ్ళలేదు. పెళ్లికి ముందే రిబ్కాను పరిగ్రహించి భార్యగా చేసుకోలేదు. అందరికీ ఆమోదయోగ్యమైన పరిశుద్ధాత్మ ప్రేరేపితమైన పెళ్ళి చేసుకున్న తరువాత ఆమెను పరిగ్రహించిన తరువాతనే ఆమెను ప్రేమించినట్లు వాక్యములో చదువుచున్నాము. కానీ నేటి యువకులు ముందు ప్రేమించుకోవాలి. ఆ తరువాత పెండ్లి అంటున్నారు. రీసెంట్‌గా ఒక సినీ యాక్టర్ ఈలాగు చెప్పింది. "జీవితకాలమంతా కలిసి ఉండాల్సిన ఒక వ్యక్తితో కనీసం మూడు సం॥రాలైనా కలిసి సహజీవనం చేయకుండా నేను ఎలా పెళ్ళి చేసికోగలను?" అని చెప్పింది. కానీ, బైబిల్‌లో దేవుడలా చెప్పలేదు. ఆదాము పెళ్ళికి ముందు హవ్వతో ఒక్క గంటయైనను కలసి సహజీవనం చేశారా? ఇస్సాకు రిబ్కాలు అలాగే చేశారా? అలా చేయలేదే. వాక్యమే మన మాదిరి కానీ ఈనాటి యువకులను మాదిరిగా తీసుకోకూడదు.

పెళ్ళి చేసుకోకముందే ఒక యవసుడు, మరో యవనస్థురాలితో కలిసి తిరుగకూడదు. కలసి సహజీవనం చేయకూడదు. అలా చేసే వేశ్యాసంగులకు, వ్యభిచారులకు దేవుడు తీర్పు తీరుస్తాడట. చాలా జాగ్రత్తగా ఈ విషయాలు ఆలోచించాలి. అలా చేస్తే యవనస్థులారా! మీ పెళ్ళి, మీ సహజీవనం మూడునాళ్ళ ముచ్చటే అవుతుంది. మీ పెళ్ళి మీకొక నరకప్రాయంగా తయారవుతుంది. రీసెంట్‌గా టి.వి.లో ఒక యవనస్థుడు, యవనస్థురాలు ప్రేమించుకున్నారు. తమ యిష్టాన్ని తల్లిదండ్రులకు తెలుపగా వారూ అంగీకరించారు. ఇంతలో అమ్మాయి దూరప్రదేశంలో జాబ్ రాగా ఒంటరిగా ఆ అమ్మాయి ఆ దూరప్రాంతంలో ఉండలేదు కనుక ఆమెకు తోడుగా ఉండుటకై ప్రేమించిన అబ్బాయిని కూడ పంపి పెండ్లి కాకమునుపే సహజీవనము చేయటానికి కూడ తల్లిదండ్రులు ఓ.కే. చెప్పారు. అబ్బాయికి జాబ్ వచ్చాక పెళ్ళి చేస్తామన్నారు పేరెంట్స్. ఉద్యోగమొచ్చాక పెళ్ళి చేసుకుందాము అని అమ్మాయి అడిగితే అబ్బాయి అప్పటినుండి ముఖం చాటెయ్యడం ప్రారంభించాడట. తీవ్రమైన మనస్తాపన చెందిన అమ్మాయి తాము నివసించిన యింటిలోనే ఉరివేసికొని చనిపోవడం టి.విలో చూపించారు. పెళ్ళికాకముందే సహజీవనం చేస్తే జరిగే మోసాలు, చేదు పరిణామాలు, ఇలాగే ఉంటాయి. ఎవరెలా జీవించినా మనకు పట్టదు. కానీ, క్రైస్తవ పిల్లలు, సేవకుల పిల్లలు ఇంకా విశ్వాసులు అని రక్షించబడ్డాము, బాప్తీస్మము తీసుకున్నామనే పిల్లలు కూడా ఇలాగే జీవిస్తుండడం ప్రభువుకు, తల్లిదండ్రులకు అవమానం, అపకీర్తి తీసుకురావడమే అవుతుంది. అలా చేయటం మీ స్వనాశనానికే కారణం అవుతుంది. దయచేసి సామె. 6:25–32 వచనాల వరకూ వున్న వాక్యాలను చదువుకోండి. దేవుని చిత్తానికి లోబడండి. జీవితాన్ని సుఖవంతము చేసుకోండి.

ఆది 24:16వ.లో ఆమె కన్యక అని వ్రాయబడిందంటే ఆమె కన్యాత్వ లక్షణాలతో ఉందని చెప్పుకున్నాం. కన్యక అంటే ఎలా ఉండాలో 1 కొరింథీ. 7:34వ.లో వ్రాయబడింది. 'అటువలె పెండ్లి కాని స్త్రీయు, కన్యకయు తాము శరీరమందును, ఆత్మయందును పవిత్రురాండ్రై యుండుటకు ప్రభువు విషయమైన కార్యములను గూర్చి చింతించుచుందురు' అని వ్రాయబడింది. ఈ వాక్య ప్రకారం పెండ్లి కాని స్త్రీని కన్యక అంటారు. అంటే ఆమెకు పురుష సంబంధము ఏమీ ఉండకూడదనే అర్థమిస్తోంది. అట్లయితే పెండ్లి కాని స్త్రీ శరీరమందును, ఆత్మయందును పవిత్రురాలై ఉండాలి. ఈనాటి కన్యకలు పెళ్ళి ముందు పురుషుని ఎరుగనివారుగా ఉన్నారా? ప్రియ చదువరీ! నీవు అలా ఉన్నావా? లోకపోకడ ననుసరించి అపవిత్రురాలై పోయావా? వాక్యాన్ని చూడు. ఇక ఆ పాపపు బ్రతుకు మానేసేయ్. నీ దేవుడు నిన్ను పవిత్రురాలు అంటాడా? చాలామంది దేవుని యెడల హృదయం పవిత్రంగా ఉండే చాలు కదా! ఈ శరీరం మట్టికి మన్నై పోతుంది. ఈ శరీరం ఎలా ఉంటే ఏమి? శరీరం పరలోకానికెళ్ళదు కదా! అనుకుంటారు. 1 కొరిం. 6:19వ.లో దేవుడిలా

వ్రాయించాడు. 'మీ దేహములు దేవుని వలన మీకనుగ్రహించబడి మీలో ఉన్న పరిశుద్ధాత్మకు ఆలయములై యున్నవని మీరెరుగరా మీరు మీ సొత్తు కారు. విలువ పెట్టి కొనబడినవారు. మీ దేహములతో దేవుని మహిమ పరచుడి. ఈ దేహమును మీరు పాడుచేస్తే దేవుడు మిమ్మును పాడు చేయును' అని వ్రాయించాడు. దేహాలతో దేవున్ని మహిమపరచవలసి ఉండగా ఇట్టి దేహాలతో పాడుపనులు చేసుకుంటూ దేవుని తీర్పుకు స్వనాశనానికే కారణంగా జీవిస్తే లాభమేంటి? ప్రియ యువతీ యువకులారా! మీరు ఈ వాక్యములన్ని ఎరుగక పోవటము వలననో, లోకం వైపు చూచుటవలననో, లేక శోధనను జయించలేక పోవుటవలననో, ఈ యుగసంబంధమైన దేవత మీ మనో నేత్రములకు గ్రుడ్డితనము కలుగజేయుటవలననో అనేక పాపాల్లో పడిపోయి వున్నారా? మీ వివాహ జీవితాలను పాడు చేసుకున్నారా? నెమ్మది కుటుంబ జీవితంలో లేకపోయిందా? నిజమైన పశ్చాత్తాపంతో ప్రభువు నొద్దకు రండి. మీ పాపములు రక్తమువలె ఎర్రనివైనను అవి హిమమువలె తెలుపుగా చేస్తాడు ప్రభువు. మీ పాపములు కెంపువలె ముదురు ఎరుపువైనను అవి గొర్రెబొచ్చువలె తెల్లగా చేస్తాడు ప్రభువు. ప్రభువు రక్తాన్ని ఆశ్రయించండి. పాపములు కడుక్కోండి. క్షమాపణ వేడుకోండి. ఇక నుండియైన సమ్మతించి ఆయన మాటలు విని మీ కుటుంబ జీవితాన్ని కట్టుకోండి. దేవుని యొద్దకు మీరు రండి. అప్పుడు ఆయన మీ కుటుంబంలోనికి వస్తాడు. అప్పుడు మీరు పవిత్రమైన సంతోషంతో కుటుంబ, వ్యక్తిగత, ఆధ్యాత్మిక జీవితాన్ని జీవించగలరు. ఈ సమయంలో దయచేసి యెష. 1:18-20 వరకు అలాగే యాకోబు పత్రిక 4:8 వ. ఇప్పుడే చదువుకోండి. దేవుడు మిమ్మును రక్షించును గాక.

ధర్మశాస్త్ర ప్రకారం ద్వితీ. 22:20వ. ప్రకారము ఒక చిన్న దానియందు కన్యాత్వపు లక్షణములు కనబడకపోతే ఆమె వూరివారు ఆమెను రాళ్ళతో చావగొట్టవలెనని వ్రాయబడింది. అది దుష్కామకార్యము. అట్లు ఆ చెడుతనమును మీ మధ్యనుండి పరిహరింపబడును అని వ్రాయబడింది. అలాంటి శిక్షలు ఈ కృపాకాలంలో దేవుడు పంపడం లేదు కనుక పాపాలు విస్తరించిపోతున్నాయి. పాకిస్తాన్, ఇరాన్, ఇరాక్ లాంటి దేశాల్లో పాపం చేసిన వారికి కఠినముగా శిక్షిస్తున్నారు. కానీ అందరూ అంతటా మారుమనస్సు పొందాలని దేవుడు తన కృపను విస్తరింపజేస్తున్నాడు. తన దీర్ఘశాంతాన్ని చూపిస్తున్నాడు. దేవుని కృపను వ్యర్థము చేసికొనవద్దని వాక్యము చెబుతోంది. ఈ దినాల్లో కన్యాత్వము పోగొట్టుకున్నవాళ్ళుగానే అనేక అమ్మాయిలు ఉన్నారు. ఈనాటి మన హైద్రాబాద్‌లో కాల్ సెంటర్స్‌లోని అన్ని బాత్‌రూమ్స్‌లోని అన్ని డస్ట్‌బిన్స్ ఉదయం లోపల 'కండోమ్స్'తో నింపబడి ఉంటున్నాయి. అంటే, అందులో పనిచేసే ఆ ఆడపిల్లలకు కన్యాత్వ లక్షణాలు ఉన్నట్టా? లేనట్టా? ఆలోచించుకోవాలి. అన్యుల సంగతి వద్దు. ప్రియ క్రైస్తవ బిడ్డా! నీ సంగతేంటి? రిబ్కా కన్యక అని వ్రాయబడింది. నీ విషయమై వ్రాయలంటే ప్రభువు ఏమని వ్రాయగలడు?

నీ దేహము దేవుని ఆలయమని మరిచిపోవద్దు. నేడే నీ పాపములు ఒప్పుకో. నీ పాపపు దాగులు యేసు ప్రభువు పవిత్ర రక్తములో కడుక్కో. దేహంలోను, ఆత్మలోను పవిత్రంగా ఉండు. ప్రభువు రాబోతున్నాడు. నీవు పవిత్రురాలైన కన్యగా ఉండాలంటే తన ప్రాణాన్ని నీ కొరకు, ప్రత్యేకంగా ప్రభువు అప్పగించుకున్నాడు. ఆయన ప్రేమను ఒక్కసారి ఆలోచించు. నిన్ను ప్రేమిస్తున్నానని ఎందరో చెప్పి మోసం చేసివుండవచ్చు. నిన్ను తమ స్వార్థానికి వాడుకొని నిన్ను చినిగిపోయిన అరటాకులాగా చేసి, నీ జీవితానికి ఎంతో 'డ్యామేజ్' చేసి వెళ్ళి నీకు మొహం చాటుచేస్తున్నారేమో! మరి కొందరు నీ రహస్య జీవితాన్ని గురించిన 'ఫొటోలు' తమ కెమెరాల్లో, సెల్‌ఫోన్లలో బంధించి వాటిని బయటపెడతామని బెదిరిస్తున్నారేమో! ఇలా నీ జీవితాన్ని చీకట్లో నెట్టేసుకున్నావేమో! అయినా పరువాలేదు. యిర్మీయా 3:1వ.లో నీవు అనేకులైన నీ విటకాండ్రలో వ్యభిచారము చేసినను నా యొద్దకు రమ్మని యెహోవా సెలవిచ్చుచున్నాడు. 12వ.లో ద్రోహినివగు ఇశ్రాయేలు తిరిగి రమ్ము. ఇదే యెహోవా వాక్కు మీ మీద నా కోపము పడనీయను. నేను కృపగలవాడను. నేనెల్లప్పుడు కోపించువాడను కాను. 14వ.లో భ్రష్టులగు పిల్లలారా! తిరిగి రండి. నేను మీ యజమానుడను అంటున్నాడు. చెడ్డపనులు చేసినవారిని, అసహ్యమైన, అవమానకార్యాలను చేసినవారిని మన అక్కచెల్లెల్లని, బంధువులని చెప్పుకోవడానికి మనం సిగ్గుపడతాము. వారిని ఇష్టపడము. కానీ ప్రభువు నేను మీ యజమానుడని చెప్పుకోవడానికి సిగ్గుపడలేదంటే ఆయనకు నీ మీద ఎంత ప్రేమయో కదా! యాకో. 4:1లో ఇశ్రాయేలూ! నీవు తిరిగి రానుద్దేశించిన యెడల నా యొద్దకే రావలెను. ఇటు అటు తిరుగుట మాని నీ హేయక్రియలను నా సన్నిధి నుండి తొలగించు' అని పిలుస్తుండగా, బిడ్డలారా! దేవుని యొద్దకు రండి మీ జీవితాలను ప్రభువు బాగుచేస్తాడు. ప్రభువును మీ స్వంత రక్షకుడుగా, యజమానుడుగా మీ ప్రభువుగా అంగీకరించండి. ప్రభువు మిమ్మును దీవిస్తారు.

**VI. ఏ పురుషుని ఎన్నడును కూడని రిబ్కా:-** ఆది 24:16. రిబ్కా అను చిన్నది, మిక్కిలి చక్కనిది. ఆమె కన్యక అని రిబ్కాను గురించి యింతవరకు ధ్యానించాం. పరిశుద్ధాత్మ దేవుడు ఆమె కన్యక అని మాత్రమే చెప్పి వదలివేయలేదు. ఏ పురుషుడును ఆమెను ఎన్నడూ కూడలేదు అని ఆమెలోని విశేషతను ఎత్తి వ్రాస్తున్నాడు. ఎందుకు ఈ మాట దేవుడు వ్రాయించాడు? అంటే, ఆ రోజుల్లో అనేకమంది కన్యకదశలోనే పురుషుని కూడే వాళ్ళుగా ఉండగా ఈమె మాత్రమే తన కన్యాత్వము విషయమై ప్రత్యేకమైన సాక్ష్యమును కలిగి యున్నట్లుగా మనము చూస్తున్నాం. అనాటి సమాజములోని ఆడపిల్లలకు భిన్నముగా రిబ్కా మంచి సౌశీల్యాన్ని కలిగివున్నట్లు మనము గమనిస్తున్నాము. మీరు వారిలో నుండి బయలు వెళ్ళి ప్రత్యేకముగా ఉండండి అని 1 కొరిం. 6:18వ.లో వ్రాయబడిన ప్రకారము

రిబ్కా ప్రత్యేకతను కాపాడుకుంది. ప్రియ యవనస్థురాండ్లారా! మీరు ఈ ప్రత్యేక సాక్ష్యాన్ని కలిగి వున్నారా? కన్యక జీవితాన్ని కన్యాత్వ లక్షణాలతో కాపాడుకునే జీవితాన్ని కలిగి ఉన్నారా? పెళ్ళికాకముందు పురుషునితో కలసి జాడలు వేయకూడదు. చాలామంది పురుషులతో గంటల కొలది సెల్‌ఫోన్స్‌లో సంభాషణ చేస్తూన్నారు. ఫ్రెండ్‌షిప్ చేస్తున్నారు. అనవసరమైన సమస్యలలో ఇరుక్కుంటున్నారు. రీసెంట్‌గా ఇద్దరు ప్రేమికులను గురించి న్యూస్‌పేపర్‌లో చదివాను. ఇద్దరూ ప్రేమించుకున్నారు. ఏదో కారణంచేత ఆ అబ్బాయికి, ఆ అమ్మాయిమీద కోపం వచ్చింది. ఒకరోజు ఆ అబ్బాయి ఆ అమ్మాయితో "మా అక్క కూతుర్రి బర్త్‌డేకు రమ్మని పరాయి ఊరికి ఆ అమ్మాయిని ఆహ్వానించగా ఆ అమ్మాయి వెళ్ళింది. వెళ్ళగా అక్కడ ఆ అమ్మాయి ముఖం మీద, ఆ అబ్బాయి ఆసిడ్ చల్లాడు. మగపిల్లలు ఎక్కడికైనా పిలిస్తే ఆడపిల్లలు ధైర్యం చేసి వెళ్తున్నారు. అబ్బాయిలతో సినిమాలకు, షికార్లకు, హెూటెల్స్‌కు, ఆయా స్థలాలకు వెళ్తున్నారు. భద్రతను కోల్పోతున్నారు. ముఖ్యంగా ఆడపిల్లలూ! మీ భద్రతను కాపాడుకోండి. మీ దేహాలు జర భద్రంగా కాపాడుకోండి. అరటాకు ముళ్లు మీద పడినా, ముళ్లు అరిటాకు మీదపడినా డ్యామేజ్ అయ్యేది మీకే. క్షణిక కాల సంతోషము కొరకై జీవితాలను ఫణంగా పెట్టుకుంటారా? జ్ఞానయుక్తంగా నడచుకోండి. మీకీమాటలు లోకంలో ఎవ్వరూ చెప్పరు. కానీ దేవుడు బైబిల్లో వాటిని గురించి చెప్పాడు. చదువుకొని మీ జీవితాలను కాపాడుకోండి. రిబ్కా కన్యకగానే ఉంది. పెళ్ళి అయ్యేంతవరకు పురుషునితో ఆమె జాడ కనపడదు. అందుకే మంచి వివాహ జీవితం ఆమె జీవించగలిగినది. ఏ పురుషుడును ఎన్నడూ ఆమెను కూడలేదు. ఈనాడు ఇట్లాంటి రిబ్కాలు చాలా అరుదుగా కనబడతారు. ప్రియ యౌవనస్థులారా! నీ సంగతేంటి? చాలామంది యౌవ్వనంలో తమ ఒళ్ళు కాపాడుకొనక పెళ్ళి కాక మునుపే పురుష సాంగత్యాలు చేసి గర్భవతులౌతున్నారు. అబార్షన్ చేయించుకుంటున్నారు. కనిన పిల్లల్ని డస్ట్‌బిన్‌లో పారేస్తున్నారు. ఒకామె అక్రమ సంబంధం ద్వారా కనిన పిల్లను తాను చంపలేక ఒక పాత్రలో నీళ్ళు పోసి ఆ అక్రమ సంతానంగా పుట్టిన బిడ్డను ఆ పాత్రలో ఉంచి వెలిగించిన స్టౌమీద ఆ పాత్రను పెట్టి ఆ బిడ్డ పడే బాధ, వేదన, ఏడ్పు చూడకుండునట్లుగా యింటికి తాళం వేసి బయటికి వెళ్ళిపోయింది. విషయం తెలిసి ఆ బేబి ఏడ్పు కేకలు విన్నవారు పోలీస్ వారికి కంప్లైంట్ యివ్వగా ఆ బిడ్డ తల్లిని పోలీసులు అరెస్ట్ చేసి కటకటాల వెనక్కి పంపారట. ఇట్లు, ఎంతమంది యౌవనస్థురాండ్రు ఎంతమంది పిల్లలను చంపి నరహంతకులయ్యారో? చాలామంది అమ్మాయిలు అక్రమ సంతానాన్ని కలిగిన గర్భవతులై అబార్షన్స్ చేసుకోవడం ద్వారా అట్టి పిల్లలకు తల్లుల గర్భాశయాలే సమాధులౌతున్నాయి. దేవుడు ఇవన్నీ తీర్పులోనికి తీసుకొనిరాడా? కొద్దిమంది అబార్షన్స్ చేసుకోకపోయినా పిల్లలను కని ఆస్పత్రులలో

వదిలేసిపోవడమో, బస్‌స్టాండ్స్‌లో వదలిపోవడమో, చేస్తున్నారు. కాబట్టి అట్టి పిల్లలు ఎక్కడ పెరుగుతున్నారో, వారి ఆలనా, పాలనా, పోషణ, సంరక్షణ, నీతి, భక్తి భయము సంగతులేంటి? ఎక్కడుంటున్నారో ఆ పిల్లలు పట్టించుకునే నాధులెవరు? కన్నతల్లికే ప్రేమ లేనప్పుడు ఇక ఎవరికుంటుంది ప్రేమ. అట్టి పిల్లలు దొరికితే ఇతరులకు అమ్ముకొని డబ్బులు సంపాదించుకుంటున్నారు మరికొందరు. ప్రియ యవ్వన బిడ్డా! నీ సంగతేంటి? ఎందుకింత అవినీతి జీవితము? ఈ దొంగ చాటున జీవించే అపవిత్ర జీవితమెందుకు? తలెత్తుకొని జీవించే పవిత్ర జీవితం కావాలా? నేడే యేసుప్రభువుని ఆశ్రయించు. మారుమనస్సు పొందుకో, పాపాలన్ని ఒప్పుకో. పరాయివాడిని నమ్మి నీ జీవితం ఆ అపనమ్మకస్తునికి అప్పగించుకొని జీవితం నాశనం చేసుకునే బదులు ఒక్కడే నమ్మదగిన పురుషుడైన నీ కొరకు ప్రాణం పెట్టి చనిపోయి, తిరిగి లేచిన యేసుప్రభువుని నీ ప్రాణనాధునిగా నమ్ముకొని ఆయనను నీ హృదయంలో చేర్చుకొని గుణవతిగా, సౌశీల్యవతిగా తీర్చిదిద్దబడాలని కోరుతున్నాడు నీ నిజ ప్రేమికుడైన యేసు ప్రభువు.

**VII. బావిలోని నీళ్ళతో కడవను నింపుకుంటున్న రిబ్కా లేక పనిచేయుచున్న రిబ్కా:-**

ఆది. 24:16వ. ప్రకారము ఇక్కడ రిబ్కాను ఒక పనిమంతురాలిగా చూస్తున్నాం. మిక్కిలి చక్కనిది. చక్కనిదనము ఎక్కడ పాడవుతుందో, చర్మం కందిపోతుందో అని పనిచేయకుండ ఉండే సుకుమారి కాదు రిబ్కా. కొందరు అమ్మాయిలు తల్లి పాత్రలు తోముతుంటే చేతులు పాడవుతాయి మమ్మీ అనే వాళ్ళున్నారు. పనులు చేయుటం, ఇష్టము లేనివాళ్ళున్నారు. పనులు చేసినా తేలికైన పనులు, నీడలో చేయడానికి ఇష్టపడేవాళ్ళుగా ఉంటారేమో. ఎండలో, నీళ్ళు చేదిపోసేలాంటి బరువు పనులు చేసే అమ్మాయిలు రిబ్కాల్లాంటివారు ఈ దినాల్లో కనబడరు. సుకుమారుల్లాగా పెరుగుతున్నారు. పెళ్ళిచూపులప్పుడు, నాకు వంటరాదని పెళ్ళి చేసుకోబోయే అబ్బాయిలతో చెప్పే ఆడపిల్లలున్నారు. నీకు వంట రాకపోతే 'నేను వంట చేసిపెడతాననే' అబ్బాయిలు కూడా ఉన్నారు. యవనస్త్రీలు వివాహము చేసికొని పిల్లలను కని, గృహపరిపాలన చేస్తూ ఇంటవుండి పనిచేసుకోవాలని దేవుని వాక్యము 1 తిమో. 5:14వ.లోను తీతు 2:5వ.లోను వ్రాయబడింది. వారు ఉద్యోగాలు చేసినా, చేయకపోయినా ఇంటి పనులు తప్పక చేసుకోవాల్సిందే. దావీదు రాజు కుమార్తెయైన తామారు అన్నయైన అమ్నోనుకు వంట చేయడానికి దావీదు వెళ్ళమంటే అమ్నోను ఇంటికి వెళ్ళింది. తామారు రాజకుమార్తెయైనప్పటికీ వంట చేయడం నేర్చుకుందన్నమాట. ఈనాడు ఇంట్లో వంట చేసేవారు తక్కువైపోయారు. హోటల్స్‌లో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్స్‌లో తెచ్చుకొని తినేవారు ఎక్కువైపోయారు. రిబ్కా కష్టపడి దిగుడు బావిలోనికి దిగి కడవను నీళ్ళతో నింపుకొని బరువు మోసికొని మెట్లు ఎక్కి నీళ్ళు తెచ్చేది. రోజూ ఇంటివారి దాహాన్ని తీర్చేది. ఈ రోజు అబ్రహాము దాసుని దాహాన్ని, ఆయన ఒంటెల దాహాన్ని తీర్చింది. నిజంగా ఈ

దినము తన పెళ్ళి చూపులదినమని రిబ్కాకు తెలియదు. సాధారణంగా పెళ్ళి చూపులు తమ తమ ఇళ్ళలో చూచుకుంటారు. కానీ, రిబ్కా నీళ్ళు మోయుచుండగా అబ్రహాము దాసుడు ఇస్సాకు కొరకై ఆమెను చూచుటకు ఆ రోజు రావటం జరిగింది. ఎందుకు బావి దగ్గర ఆమెను చూచాడంటే తన యజమానుడైన అబ్రహామును అన్ని విషయాలలో ఆశీర్వదించి యుండగా ఆ ఆశీర్వాదములను కాపాడుకోవలసిన బాధ్యత ఆ యింటికి రాబోయే కోడలుపై ఉంది. కనుక తన యజమానునికి కాబోయే కోడలు ఒక పనిమంతురాలిగా ఉండాలి అని అతని ఆలోచన. ప్రియ సోదరీ! దీని ఆత్మీయ భావమేంటంటే, రిబ్కా బావిలోనికి దిగిపోయినట్లు మన పరమ ఇస్సాకైన మన ప్రభువుకు కాబోయే పెండ్లి భార్యయైన సంఘములోని సంఘస్తులమైన మనమొక్కొక్కరము 66 దిగుడు మెట్లు అనే 66 పుస్తకాలను కలిగిన బైబిలు అను బావిలోనికి దిగిపోయి దేవుని వాక్యమనే వుదకాన్ని (నీటిని) మన హృదయమను కడవలో నింపుకొనేవారముగా ఉండాలని దీని భావము. రిబ్కా 20వ.లో తిరిగి తిరిగీ వెళ్ళి బావిలో నీళ్ళు చేదుకొని వస్తోంది. ప్రియసోదరీ! బైబిలును దినములో ఎన్నిసార్లు, చదువుతున్నావు? ఎంత టైమ్ బైబిల్‌తో గడుపుచున్నావు? ఎంత వాక్యజ్ఞానాన్ని నేర్చుకున్నావు? కీర్త. 119:98వ.లో దావీదు 'నీ ఆజ్ఞలు నాకు తోడుగా ఉన్నవి. నా శత్రువులను మించిన జ్ఞానము, నా బోధకులను మించిన జ్ఞానము. వృద్ధులను మించిన జ్ఞానము నాకు కలదు' అంటున్నాడంటే ఎంత సమయము ఆయన ధర్మశాస్త్రాన్ని చదివి ధ్యానించుటలో గడుపుచున్నాడో అర్థమవుతుంది. కీర్త. 55:17వల్లో ఉదయ, మధ్యాహ్న, సాయంకాలమున ఒక దినములో మూడుసార్లు చదువుతున్నాడని చెబుతున్నాడు. 3 సార్లు ప్రార్థన కూడా చేస్తున్నాడని చెబుతున్నాడు. వాక్యాన్ని ప్రార్థనను ఎంత ప్రేమిస్తున్నాడో కదా. బైబిల్‌ను సోదరీ! నీవెన్నిసార్లు చదివావు? జార్జిముల్లర్ భక్తుడు 200సార్లు చదివాడట. అదోని రామ్ జడ్సన్ అనే మిషనరీ రోజుకు 14 గం॥ బైబిలు చదివేవాడట. బిల్లీగ్రాహం గారి బైబిలు ఎప్పుడూ తెరువబడే ఉంటుందట. కొద్దిమంది ఒక సంవత్సరానికి ఒక్కసారి బైబిల్ చదివి ముగించేవారున్నారు. అమ్మా సోదరీ! నీవెన్నిసార్లు రోజులో చదువుతున్నావు? బైబిల్ కాకుండా డిటెక్టివ్స్, నావెల్స్, ఫిలింపెయిర్స్, సితారా, స్వాతి, సచిత్ర వార పత్రికలు లాంటివి చదువుతూ టి.వి. దగ్గర అధిక సమయం గడుపుతూ ఉన్నావా? కొద్దిమంది బైబిలు చదివినా మొక్కుబడిగా చదవాలి అని అలవాటుగా పైపైకి మాత్రమే చదువుచున్నావా? నీవు సముద్ర తీరాన ఇసుకలో వెతికితే గువ్వలు మాత్రమే దొరుకుతాయి. కొంచెము లోతుకు నీళ్ళలోకి వెళ్ళితే చేపలు కనబడతాయి. ఇంకా లోపలికెళ్తే ఆణిముత్యాలు దొరుకుతాయి. అలాగున లోతైన వాక్యము దొరకాలంటే లోతుకు వెళ్ళి ప్రార్థనా పూర్వకంగా, ధ్యానపూర్వకంగా చదవాలి. ఆశ్చర్యకరమైన సంగతులు చూచునట్లు చేయుమని ప్రభువుని

ప్రార్థించి చదవాలి. యిర్మీ. 33:3వ.లో నాకు మొఱ్ఱపెట్టుము. నీవు గ్రహించలేని గొప్ప సంగతులు గూఢమైన సంగతులు నేను నీకు తెలియజేసెదను అని ప్రభువు వాగ్దానం చేశారు.

రిబ్కా తాను చేదిన నీళ్ళతో పరిశుద్ధాత్మకు సాదృశ్యంగా ఉన్న అబ్రహాము దాసుని దాహాన్ని తీర్చింది. ఈ దినాన పరిశుద్ధాత్మని దాహమేంటి? ఆయన దాహము ఆత్మల కొరకైన దాహమే. ఆ దాహాన్ని మనం తీర్చాలి. రిబ్కా ఒంటెల దాహాన్ని కూడ తీర్చింది. మనము ధ్యానించిన వాక్యాన్ని ఇతర మనుషులకు కూడ మన హృదయమను కడవ నుండి వారికి దాహమివ్వాలి. వ్యభిచారమను పాపదాహముతో ఉన్న సమరయ స్త్రీకి ప్రభువు వాక్యమందించారు. ఆమె పాప దాహం తీరింది. ఇక ఆమె పాపం జోలికెళ్లలేదు. పాపులను మార్చే ఈ వాక్యాన్ని నీవు ఎంతమందికి అందిస్తున్నావు? రోజూ రిబ్కా సాయంకాల సమయాల్లో నీళ్ళు చేదుకోవడానికి బావి యొద్దకు వస్తోంది. నీ సాయంకాల సమయాలు నీవెక్కడ గడుపుతున్నావు? ఉదయ, మధ్యాహ్న, సాయంకాలాల్లో ఎంత సమయం వాక్యానికి గడపాలనుకుంటావో తీర్మానించుకుంటావా?

**VIII. పనికి ఫలితాన్ని పొందిన రిబ్కా:-** ఆది. 24:22వ.లో ఒంటెలు నీళ్ళు త్రాగుటయైన తరువాత అరతులము ఎత్తుగల బంగారపు ముక్కు కమ్మిని ఆమె చేతులకు పది తులముల ఎత్తుగల రెండు బంగారు కడియములు అబ్రహాము దాసుడు తీసి రిబ్కాకిచ్చాడు. ఈ పది ఒంటెల దాహాన్ని తీర్చడం చిన్నపని కాదు. రిబ్కా 16 లేక 17 యేళ్ళ చిన్నది. కానీ ఒకటి కాదు, రెండు కాదు, వరుసగా 10 ఒంటెల దాహాన్ని తీర్చిందంటే చాలా పెద్దపని చేసిందన్న మాట. బైబిల్లో చిన్నవారినే దేవుడు పెద్దపనులు చేయుటకు వాడుకున్నారు. చిన్న యోర్దాను నది నయమాను యొక్క పెద్ద రోగమైన కుష్ఠురోగాన్ని బాపుటకు దేవుడు వాడుకున్నాడు. నయమాను ఇశ్రాయేలు దేశానికి వెళ్తే అక్కడి ప్రవక్తయైన ఏలీషా ద్వారా కుష్ఠ రోగం బాగవుతుందని నయమాను భార్యతో మాట్లాడుటకు దేవుడు ఇశ్రాయేలు దేశపు చిన్న దానిని వాడుకున్నారు. పెద్ద సైన్యాధిపతి అనే అధికారం కలిగిన నయమాను 'ఈ చిన్న నదిలో మునిగి శుద్ధినొందాలా?' అని తన దేశానికి వెళ్ళి పోవాలని అనుకొనుచుండగా అతని కోపాన్ని నివారించుటకు ఒక పనివానిని దేవుడు వాడుకోలేదా? ఎస్తేరు అను చిన్నదాన్ని యూదులను రక్షించుటకు దేవుడు వాడలేదా? అలాగే రిబ్కా చిన్నదైనప్పటికీ ఒంటెల దాహాన్ని తీర్చుటకు వాడుకున్నాడు. 10 ఒంటెలు కొన్ని గ్యాలన్ల నీళ్ళు త్రాగుతాయి. తమ కడుపుల నిండ త్రాగుట మాత్రమే గాక వాటి కడుపుల్లో ఉన్న తిత్తులలో కూడ నీళ్ళు నింపుకొని ఎడారి ప్రదేశాల్లో త్రాగుటకు నీళ్ళు తమకు దొరకనప్పుడు ఆ తిత్తులలోని నీళ్ళు త్రాగి బ్రతుకుతాయట. కనుక ఒక్కో ఒంటె ఎన్ని నీళ్ళు త్రాగిందో కాబట్టే రిబ్కా మాటిమాటికి బావి లోనికి దిగి, ఎక్కి నీళ్ళు పోసింది. ఈ కష్టానికి మెచ్చి ఎలియాజరు రిబ్కాకు అరతులము ఎత్తు కలిగిన ముక్కు కమ్మిని, పది తులముల ఎత్తు కలిగిన రెండు బంగారు కడియములను

ఆమెకిచ్చినట్లు చదువుచున్నాము. 10 ఒంటెలకు నీళ్ళు పోయడానికి 1 గంట సమయము పట్టియుండవచ్చు. ఒక గంట పనిచేస్తే అబ్రహాము దాసుడు ఆమెకు ఇచ్చిన ఫలితము యొక్క విలువ ఎన్ని రూపాయలు ఉంటుందో లెక్క వేద్దాం. ఒక్కొక్క బంగారు కడియము 10 తులములైతే, 2 బంగారు కడియములు 20 తులములౌతాయి. అలాగే అరతులము ముక్కు కమ్మి అన్ని కలిపితే 20 $^1/_2$ తులాలౌతాయి. నేటి రేట్లలో 1 తులము ఖరీదు 30 వేల రూ. అనుకుంటే 20 తులాల బంగారురేటు 3000×20=60,000 రూ.లు అలాగైతే 1 గంట పని చేసినందుకు రిబ్కాకు 60,000 రూ.లు ఇస్తే మన ప్రభువు ఒక గంట మనమాయన పనిచేస్తే ఎన్ని రూపాయల విలువగల బహుమానం ఇస్తాడో కదా! మన కొలతలకంటే ఆయన కొలతలు నూరురెట్లుగా ఉంటాయి. అలాగైతే దేవుడు రిబ్కాకిచ్చే జీతము 60,000×100=60,00,000రూ. ఒక గంట పనిచేస్తే 60 లక్షల రూ. ఇచ్చే ప్రభుత్వము ఈ ప్రపంచములోని ఏ దేశములో ఉంది? ఏ అగ్రదేశము కూడ ఇవ్వలేదు. అందుకే ప్రభువు పని మిక్కిలి గొప్పది అన్నాడు నెహెమ్యా. ఇట్టి గొప్ప పనిని విడిచి నేనెందుకు రావలెను అన్నాడు నెహెమ్యా. నెలంతా కష్టపడితే సాఫ్టవేర్ ఉద్యోగులకు ఒక లక్ష రూపాయలు జీతమొస్తుందేమో! కానీ, ఒక గంటకు 60,00,000 రూపాయలిచ్చేవారు ఎవరున్నారు? గంటకే 60 లక్షలైతే దినమంతా 8గం॥ పనిచేస్తే ఎంత జీతమొస్తుందో. నెలకు ఎంత జీతమిస్తారో ప్రభువు ఊహించగలమా? ప్రియ దేవుని బిడ్డలారా! దేవుడు తానిచ్చే గొప్ప జీతాన్నిబట్టి ఆయన పని ఎంత గొప్పదో మనకర్థమవుతుంది కదా! ఇప్పుడు చెప్పండి. మీకు లౌకిక ఉద్యోగము కావాలా? ఆత్మీయ ఉద్యోగమైన దేవుని సేవకావాలా? చాలామంది దేవుని సేవ విలువ తెలియక, ఈ దినాల్లో ఎవ్వరూ దేవుని సేవకు సమర్పించుకోవటం లేదు. కారణం లోకం దేవుని సేవకులను చిన్న చూపు చూస్తుందని. దైవ సేవకులకు ఈ లోకంలో జీతం రాకపోవచ్చు. విశ్వాసంతో ప్రభువు వైపు చూచినప్పుడు ప్రభువు మనకు సహాయము చేయువాడై యున్నాడు. రెండవ రాకడలో ప్రభువు ఈ లోకానికి వచ్చేటప్పుడు ప్రతివానికి తాను సిద్ధపరచిన జీతము తీసికొని రాబోతున్నాడు. ఈలోక ప్రభుత్వ ఉద్యోగస్తులకు నెలలో 30 లేక 31 తారీఖుల్లో జీతము వస్తుంది. కనుక ఆ దినము వారికెంతో సంతోషము కానీ దైవసేవకులకు ప్రభువు వచ్చే దినము ఎంత సంతోషకరము. తమ ప్రభువును చూచుట మాత్రమే కాక గొప్ప విలువైన జీతాలు పుచ్చుకోబోతారు. ఆ రోజు దైవసేవలో కష్టపడిన వారు జీతాలు తీసుకోవడంలో ఎంత సంతోషమనుభవిస్తారో కదా! ప్రభువు పని లేశమైనను చేయనివారికి ఆరోజు ఈ సంతోషముండదు. ఈ లోకంలో ఇప్పుడు దైవ సేవకులు పేదలుగా కనబడవచ్చు. పరలోకంలో వారిని పోలిన ధనికులుండరు.

ఈలాగున రిబ్కా చిన్నదే కానీ, ఆమె చేసిన పని గొప్పది, పెద్దది. ఆమె పనికి ఆమె పొందిన జీతం కూడా గొప్పదే. మనం కూడ పనివారమై ఉండాలి. ఆదాముకు

ఏదేను తోటలో కూడ ప్రభువు పని పెట్టాడు. మనం వెళ్ళే పరలోకంలో పని ఉండదు. పాతాళానికెళ్ళే వాళ్ళకూ పని ఉండదు. ఈ లోకంలోనే పని చేయాలి. చేయుటకు మన చేతికి వచ్చిన పనిని శక్తిలోపం లేకుండా చేయాలి. ప్రభువు పని చేస్తే ప్రభువు జీతమిస్తాడు. పనివాడు జీతమునకు పాత్రుడు. ప్రతివాడు తాను చేసిన కష్టము కొలది జీతము పొందుతాడు. సోమరివాడు ఆ దినాన ఏడుస్తాడు. దేవుడు కూడ పనిచేయువాడుగా ఉన్నాడు. దేవుడు తన పని యేడవ దినములోగా సంపూర్తి చేసి యేడవ దినమున విశ్రమించెను. ఆది 2:2వ.లో వ్రాయబడింది. నా ఒంటెలకు కూడ నీవు నీళ్లుపోస్తావా? అని అడుగకముందే రిబ్కా తానే (ఇష్టపూర్వకంగా) ఆ పనిని అప్పగించుకుంది. ఆ పనిని చేయుటకు మనస్సు కలిగిన రిబ్కాగా ఆమెను చూస్తున్నాం. రిబ్కాకు అబ్రహాము దాసుడు బంధువు కాదు, తెలిసినవాడు కాదు. పశువుల దాహాన్ని గుర్తించగలిగిన, పశువుల సంగతి తెలుసుకోగల వ్యక్తిగా రిబ్కాను గమనిస్తున్నాం. నరులకు వానివాని పనులనుబట్టి ఆయన ప్రతీకారము చేయునన్న సామె. 24:2వ. ప్రకారము గొప్ప ప్రతిఫలము పొందిన రిబ్కాగా ఆమెను చూస్తున్నాం. నేడు రిబ్కా అంటూనే ఎవరికైనా గుర్తొచ్చేది ఆమె ఒంటెలకు నీళ్ళు పోసిందనే గుర్తొస్తుంది. సామె. 31:31వ.లో ఆమె పనులు ఆమెను కొనియాడును అని వ్రాయబడినట్లు రిబ్కా తాను చేసిన పనినిబట్టి నేటి వరకు కూడ ఆమె కొనియాడబడుతూ ఉంది. అసలు రిబ్కాకు ఇస్సాకుతో పెళ్ళి జరగడానికి కారణము ఆమె చేసిన పని (ఒంటెలకు నీళ్ళు పోయుట)యే కారణము. ఎందుకంటే నా దాహం తీర్చుటే కాక నా ఒంటెల దాహం కూడా తీరుస్తానని ఎవతె చెప్తునో ఆమెయే ఇస్సాకు భార్య అవుతుందని అబ్రహాము దాసుడు ప్రార్థన చేసుకున్నట్లుగానే రిబ్కా చేయడం ద్వారా పితరులలో రెండవవాడైన ఇస్సాకు భార్య కాగలిగింది. నీళ్ళు పోసిన దానికి ప్రతిఫలముగా యిచ్చినది 20 1/2 తులము మాత్రమే కాక, రిబ్కా ఇంటికి వెళ్ళిన తరువాత ఆది. 24:53 ప్రకారం ఆమె వెండి, బంగారు నగలను, వస్త్రములను పొందడమే కాక పెళ్లియైన తరువాత ఇస్సాకునే గొప్ప ప్రతిఫలముగా పొందింది. అలాగే ప్రియసోదరీ! దేవున్ని సేవించే నీవు కూడా బయట, ఇంట్లో పరలోకంలో అన్ని చోట్ల ప్రతిఫలములను పొందుతావు.

**IX.బెతూయేలు కుమార్తెయైన రిబ్కా:-** ఆది. 24:5వ. నీవెవరి కుమార్తెవు? అన్న ప్రశ్నకు రిబ్కా నేను బెతూయేలు కుమార్తెనని చెప్పింది. బెతూయేలు పేరుకు 'దేవునియందు నివసించుట' అని అర్థము. బెతూయేలు కుమార్తె అంటే దేవునియందు నివసించు వాని కుమార్తె అని అర్థము. అలాగైతే బెతూయేలు దేవునియందు నివసిస్తున్నవాడని అట్టివాని కుమార్తె అనగా ఆమె కూడ దేవునియందు నివసించుచున్నదిగానే తన గుణలక్షణాలనుబట్టి మనము చెప్పగలము. అమ్మా! నీవెవరి కుమార్తెవు? అని ఎవరైనా నిన్నడిగితే నేను దేవునియందు నివసిస్తున్నానని నీవు చెప్పగలవా? నేను దేవుని కుమార్తెను అని చెప్పగలవా?

ఎందరాయనను అంగీకరిస్తారో వారందరికి దేవుని పిల్లలయ్యే అధికారము దేవుడు వారికిస్తాడు. (యోహాను 1:12). ప్రియ సోదరీ! ప్రభువును విశ్వసించి, నీ రక్షకుడుగా స్వీకరించి ప్రభువు బిడ్డవయ్యావా! ప్రభువు బిడ్డవయ్యే అధికారం ప్రభువు నీకిచ్చాడు. ఆ అధికారం పొందుకుంటావా? లేక సాతాను కుమార్తెవేనా, నీవు నీ తండ్రియైన అపవాది పిల్లవేనా?

**X. అతిథి ప్రియురాలైన రిబ్కా:-** ఆది 24:24వ. అబ్రహాము దాసుడు 'ఈ రాత్రి మీ తండ్రి యింటిలో బసచేయుటకు స్థలమున్నదా' అని అడిగినప్పుడు ఆ అమ్మాయి, ఆలోచించి చెబుతాసండీ అని గానీ, మా తల్లిదండ్రులనడిగి చెబుతానని గాని, తప్పించుకు తిరిగే మోసపు మాటలుగానీ పలుకక 'మా యొద్ద చాలా గడ్డియు మేతయు రాత్రి బస చేయుటకు స్థలమును ఉన్నవని చెప్పుటలో ఆమె ఎంత అతిథి ప్రియురాలో అర్థమౌతుంది. మాకు బస చేయుటకు స్థలమున్నదా' అని మాత్రమే అడిగాడు. కానీ ఒంటెలకు స్థలము, గడ్డి ఉన్నవా? అని అడుగలేదు. బావి దగ్గర కూడా దాహమునకు నీళ్ళమని అడిగితే నీ ఒంటెలు త్రాగుమట్టుకు నీళ్ళు చేది పోస్తానని పోసింది. మనుష్యుల దాహం మాత్రమే కాక, పశువుల దాహము పశువుల ఆకలి కూడ ఆలోచించి గ్రహించగలిగిన బిడ్డగా ఆమెను చూస్తున్నాం. ఎంతో దాతృత్వము ఉదారస్వభావము గలదిగా రిబ్కా యిక్కడ కనబడుతోంది. వారింట్లో చాలా గడ్డి, చాలా మేత వుందట అవును, నీతిమంతుని ఇల్లు గొప్ప ధననిధి. ఫిలేమోను ఇల్లు పరిశుద్ధులకు విశ్రాంతి తీసుకునే ఇల్లుగా ఉంది. ప్రియ సోదరీ! నీ ఇంటిలో దేవుని పరిశుద్ధులకు విశ్రాంతి ఇల్లుగా ఉందా? పరిశుద్ధుల అవసరములు తీర్చే ఇల్లుగా నీ ఇల్లు ఉన్నదా? దేవుని పిల్లల విషయములో ఉదార బుద్ధి చూపిస్తున్నావా? కేవలం నీకూ నీ పిల్లకు మాత్రమే నీ ఇల్లు వాడుతున్నావా? కొద్దిమంది పిల్లికి కూడ బిక్షము పెట్టని వాళ్ళుగా ఉంటారు. ఎవరినీ వారింటికి ఆహ్వానించరు. భక్తులను ఇంటికి పిలువరు. ఒక్క పూటయైననూ భోజనానికి పిలిచి ఆతిథ్యమియ్యరు. ఉపచారము చెయ్యరు. తెలియకయే అబ్రహాము దేవదూతలకు పరిచర్య చేశారు. తత్ఫలితముగా వారు ఇస్సాకును పొందుకున్నారు. హెబ్రీ. 6:10వ.లో మీరు పరిశుద్ధులకు ఉపచారము చేయుచు ఇంకనూ ఉపచారము చేయుచుండుటచేత తన నామమున మీరు చేసిన పరిచర్యను మరచుటకాయన అన్యాయస్తుడు కాదు. మీకు ప్రతిఫలమిస్తాడు. రిబ్కాకు ఆది.24:53వ.లో అబ్రహాము దాసుడు వెండి, బంగారు నగలను వస్త్రములను యిచ్చాడు. ఆమె సహోదరునికి తల్లికి విలువగు వస్తువులను ఇచ్చాడు. ప్రభువు మనకు ఋణముండడు.

**XI. అబ్రహాము దాసుని మాటలు తన యింటివారికి తెలిపిన రిబ్కా:-** ఆది 24:28వ. పరిశుద్ధాత్మునికి సాదృశ్యముగా ఉన్న అబ్రహాము దాసుని మాటలను రిబ్కా తన ఇంటివారికి తెలిపినట్లు మనమునూ, మనము వినిన ప్రభువు వాక్యపు మాటలను ఇతరులకు

తెలియజేయాలి. బోయజు పొలములో ఇచ్చిన పేలాలను రూతు తానొక్కతే తినక తన అత్తకు కూడ మూట కట్టుకొని ఇచ్చినట్లు, సంఘానికి రాలేని ముసలివారికి ఆ రోజు రానివారికి మనము విన్న వాక్యాన్ని వారికి కూడ తెలియచేయాలి. 2తిమో. 2:2లో పౌలు 'నీవు నావలన వినిన సంగతులను ఇతరులకును బోధించుటకు సామర్థ్యము గల నమ్మకమైన మనుష్యులకు అప్పగింపుము' అని చెబుతున్నాడు. కనుక మనము విని నేర్చుకున్న వాటిని ఇతరులకు కూడ పంచాలి. చాలాసార్లు ముఖ్యంగా స్త్రీలు తంటాల మాటలు ఇతరులకు వద్దన్నా చేరవేస్తూ ఉంటారు. అలాటి వారివల్ల ఎన్నో కొట్లాటలు జరుగుతుంటాయి. కొన్నిసార్లు కుటుంబాలు కూడ విచ్ఛినమవుతూ ఉంటాయి. భార్యభర్తలు విడిపోవడానికి హేతువవుతూ ఉంటాయి. కొరుకుడు పుండు వ్యాపించినట్లు అలాంటి వారిమాటలు వ్యాపించి సంఘ ఐక్యతకు కూడ భంగం కలిగిస్తుంటాయి. ప్రియ సోదరీ! ఆ యింటి సంగతులు ఈ యింటికి యీ ఇంటి సంగతులు ఆ ఇంటికి మోసుకెళ్ళి చెప్పి తంటాలు తగాదాలు పెట్టడం మానేసి ప్రభువు సంగతులే తీసుకెళ్ళి సమరయ స్త్రీ చెప్పినట్లు చెబితే నీవు కూడ ఒక లేడి మిషనరీలాగ ప్రభువుకు సాక్షిగా వుండగలవు. ప్రభువు నిన్ను అలాగున ఇక నుండి వాడుకొనునట్లు ప్రభువును ప్రార్థించు.

**XII. అబ్రహాము పెద్ద దాసుని ద్వారా దీవెన పొందిన రిబ్కా:–** ఆది. 24:23వ. ఎలియాజరు యొక్కయు ఒంటెల యొక్కయు దాహము తీర్చుటచే యించుమించు $20^1/_2$ తులముల బంగారు ప్రతిఫలముగా పొందుట మాత్రమే కాక, అబ్రహాము దాసుని తన ఇంటికి ఆహ్వానించి, ఆయనకు ఆయన ఒంటెలకు ఇంటిలో స్థలమిచ్చి, ఒంటెలకు గడ్డి, చాలా మేతను యిచ్చి, తన యజమానుడైన అబ్రహాము కుమారుడైన ఇస్సాకును పెండ్లి చేసుకోడాని అంగీకరించిన రిబ్కాకు, రిబ్కా అన్నయైన లాబానుకు, ఆమె తల్లికి అబ్రహాము దాసుడి వెండి నగలు, బంగారు నగలు, విలువైన వస్తువులను దీవెనగా ఇచ్చినట్లు 53వ.లో చదువుచున్నాము. అలాగే పరిశుద్ధాత్ముడు యాకో. 1:17వ.లో తనను నమ్మి హృదయంలో చోటిచ్చిన ప్రతి విశ్వాసికి 'శ్రేష్ఠమైన ప్రతి యీవియు, సంపూర్ణమైన ప్రతి వరమును, పరసంబంధమైన, జ్యోతిర్మయుడగు తండ్రి యొద్ద నుండి మనకు ఇచ్చువాడై యున్నాడు.' 1 కొరి. 12:7–12వ.లలో దేవుడు 'అందరి ప్రయోజనము కొరకు ప్రతివానికి ఆత్మ ప్రత్యక్షత అనుగ్రహించబడుచున్నది. ఏలగనగా ఒకని ఆత్మ మూలముగా బుద్ధి వాక్యమును మరి యొకనికి ఆత్మ మూలముననే జ్ఞానవాక్యమును, మరియొకనికి ఆ ఆత్మమూలముననే విశ్వాసమును, మరియొకనికి ఆ ఒక్క ఆత్మ మూలముననే స్వస్థపరచు వరములను, మరి యొకనికి ఆత్మ వివేచనయు, మరియొకనికి నానావిధములైన భాషలును, మరియొకనికి భాషల అర్థము చెప్పు శక్తియు అనుగ్రహింపబడియున్నవి. వీటినన్నిటిని ఆత్మ యొక్కడే తన చిత్తము చొప్పున ప్రతివానికి ప్రత్యేకముగా పంచి యిచ్చుచు కార్యసిద్ధి కలుగజేయుచున్నాడు'

అని వ్రాయబడిన ప్రకారము సంఘములో రిబ్కాలాంటి ప్రతి స్త్రీకి, ప్రతి పురుషునికి ప్రభువు ప్రత్యేకముగా ఈ వరములను మనకు ఇచ్చి దీవిస్తున్నారు. ప్రియ సోదరీ! నీవు కూడ ఈ వరములు కావలెనని కోరుచున్నావా? చాలామంది స్వస్థపరచే వరమును, భాషలు మాట్లాడే వరమునే నేటి దినాల్లో అపేక్షిస్తున్నారు. కానీ భాషల అర్థము చెప్పే వరాన్ని ఎవ్వరూ కోరుకొనుట లేదు. జ్ఞాన వాక్యము, బుద్ధివాక్యము, విశ్వాసము, ఈలాంటి వరములను కోరుకొనుట లేదు. అయితే ఏ వరమును కోరుకోవాలో అదియు ప్రభువు 1 కొరింథీ. 14:1వ.లో చెప్పాడు. 'ఆత్మ సంబంధమైన వరములను ఆసక్తితో అపేక్షించుడి. విశేషముగా మీరు ప్రవచన వరము అపేక్షించుడి' ఈ వచనములో ఉన్నట్లు చాలామంది ప్రవచన వరము అపేక్షించుట లేదు. కానీ, భాషల ద్వారా దేవునితో మాట్లాడాలనుకుంటున్నారు. 4:3వ.లో క్షేమాభివృద్ధియు హెచ్చరికయు, ఆదరణయు కలుగునట్లు ప్రవచించువాడు మనుష్యులతో మాట్లాడుచున్నాడు. ప్రవచించువాడు సంఘమునకు క్షేమాభివృద్ధి కలుగజేయును' గనుక ప్రియ దేవుని బిడ్డలారా! దేవుని బిడ్డలు ఎవరైనను ప్రవచింపకపోయిన యెడల బోధింపకపోయిన యెడల వారి వలన సంఘానికి ఏమి ప్రయోజనము? 14:5వ.లో పౌలు 'మీరందరు భాషలతో మాటలాడవలెనని కోరుచున్నాను. గాని మీరు ప్రవచించవలెనని మరి విశేషముగా కోరుచున్నాను. సంఘము క్షేమాభివృద్ధి పొందు నిమిత్తము భాషలలో మాట్లాడువాడు అర్థము చెప్పితేనేగాని, వానికంటే ప్రవచించువాడే శ్రేష్ఠుడు' అని చెబుతున్నాడు. ఇంకనూ 22వ.లో 'భాషలు విశ్వాసులకు కాదు అవిశ్వాసులకే సూచకయై యున్నది. ప్రవచించుట అవిశ్వాసులకు కాదు, విశ్వాసులకే సూచకయై ఉన్నది. కనుక పరిశుద్ధాత్ముడు ప్రత్యేకంగా పంచి ఇచ్చే వరాలలో శ్రేష్ఠమైన వరము ప్రవచన వరమే.

అలాగున రిబ్కా ఎలియాజరు ద్వారా పది ఒంటెలు మోయగలిగిన బరువుగల దీవెనలు పొందినట్లు విశ్వాసులమైన మన మీద (ప్రభువు) 100 రెట్లుగా దీవెన పంపే దేవుడుగా ఉన్నారు. ఆకాశపు వాకిండ్లు విప్పి పట్టజాలని దీవెనలు కుమ్మరించు దేవుడై ఉన్నారు. (మలాకి 3:10). ప్రియ సోదరీ! నీవు దేవుని నుండి ఎన్ని ఆత్మీయ దీవెనలను పొందుకున్నావు? ఎన్ని ఆత్మవరాలను పొందుకున్నావు? ఎన్ని తలాంతులను కలిగియున్నావు? వాటన్నిటిలో ప్రభువు సేవలో వాడుచున్నావా? లేక పాతిపెట్టావా? దీవించబడిన రిబ్కాగా ఉన్నావా? ఈ లోకసంబంధమైన దీవెనలున్నాయేమో! అవి నీవెంట పరలోకానికి రావు. ఆత్మీయ దీవెనలున్నాయా? ఆత్మీయ దీవెనలతో నింపబడిన రిబ్కాలాంటి దీవెనలకై, ఆత్మ వరాలకై ప్రభువును అపేక్షిస్తావా? అందులో అతిశ్రేష్ఠమైన వరము ప్రవచించుటయే.

**XIII.** ఇస్సాకు నొద్దకు వెళ్ళుటకు సంసిద్ధముగా ఉన్న రిబ్కా:- ఆది. 24:58వ.లో ఈ మనుష్యునితో కూడ వెళ్ళుదువా? అని రిబ్కాను అడుగగా ఆమె వెళ్ళెదననెను" అని చదువుచున్నాము. అలాగే సంఘమైన మనమందరము ఆయన పెండ్లి కుమార్తెగా మన

పెండ్లి కుమారుడైన ప్రభువును సంధించబోతూ ఉన్నాము. అలా సంధించుటకు రిబ్కావలె సిద్ధంగా వున్నామా? 2 తిమో. 4:7వ.లో పౌలు 'నేను వెడలిపోవు కాలము సమీపమై యున్నది. మంచి పోరాటము పోరాడితిని. నా పరుగు కడముట్టించితిని. విశ్వాసము కాపాడుకొంటిని. ఇకమీదట నా కొరకు నీతికిరీటముంచబడి యున్నది. ఆ దినమందు అది నాకును, నాకు మాత్రమే కాక తన ప్రత్యక్షతను అపేక్షించు వారికందరికి అనుగ్రహించును' అని పౌలు భక్తుడు పరమ ఇస్సాకును ఆకాశమండలములో సంధించుటకు నేను వెడలిపోతాను అని సిద్ధముగా ఉన్నాడు. అంతమాత్రమే కాక ఏడేండ్ల విశ్వాసుల తీర్పు కొరకును ప్రభువు ఇవ్వబోవు నీతి కిరీటమును పొందుకొనుటకును, ఆయన ప్రత్యక్షతను అపేక్షించుటకును సిద్ధముగా ఉన్నాడు. చేయవలసిన సేవ అంతయూ చేసి సిద్ధముగా ఉన్నాడు. ఆత్మలన్నీ రక్షించి ప్రభువుకు అప్పగించుటకు సిద్ధముగా ఉన్నాడు. రోమా 15:19వ.లో యెరూషలేము మొదలుకొని 'ఇల్లూరికు' ప్రాంతము వరకు క్రీస్తు సువార్తను పూర్ణముగా ప్రకటించియున్నాను. 21వ.లో 'క్రీస్తు నామ మెరుగని చోట్లను సువార్తను ప్రకటించవలెనని మిక్కిలి ఆశగలవాడనై యుండి అలాగున ప్రకటించాను' అన్నాను. 23వచనములో 'ఇప్పుడైతే ఈ ప్రదేశములలో నేనిక సంచరింపవలసిన భాగము లేదు' అని ధైర్యముగా చెబుతున్నాడు. ప్రియ దేవుని బిడ్డలారా! అలాగు ఆయన సేవను చేసి, ఇక సేవలో సంచరించవలసిన భాగము లేదని చెప్పి సిద్ధముగా ఉన్నామా? ఇలా చెప్పుటలో పౌలు ప్రభువును సంధించుటకు చక్కగా పని అంతయు చేసి సర్వసిద్ధముగా ఉండుటలో మనకెంత గొప్ప మాదిరిగా ఉన్నాడో కదా! ఇట్టి సిద్ధపాటు లేనివారు ప్రభువు సహాయమున సిద్ధపడి ఉండుటకు వెంటనే ప్రయత్నిద్దాము. మన పోకడకైనా, ఆయన రాకడకైనా సిద్ధపడి ఉండాలి. భక్తులందరూ సిద్ధపడి వేచి ఉండి ప్రభువైన యేసూ! రమ్ము అని పరమార్థజ్ఞానియైన యోహాను సిద్ధపడి ప్రభువును రమ్మని కోరుకుంటున్నాడు. (ప్రక. 22:20వ). 17వలో ఆత్మయు, పెండ్లి కుమార్తెయు (అనగా సంఘము) రమ్ము అని చెప్పుచున్నారు' అంటున్నాడు. అమ్మా! సంఘములో ఉన్న నీవు, నేను అందరం ఆయనను రమ్మని చెప్పాలట. వినువాడును చదువువాడును అందరునూ యేసూ! రమ్ము అని సంసిద్ధతతో చెప్పాలట. అలా చెప్పడానికి సిద్ధపడదామా! 'ఎవర్ రెడీ బ్యాటెరీస్' లాగా సిద్ధపడదామా? మత్త 25:10వ.లో ఉన్నట్లు అప్పుడు పెండ్లి కుమార్తెవలె సిద్ధపడిన వారు ఆయనతో కూడ పెండ్లి విందుకు వెళ్ళిరి అని చదువుచున్నాము. ప్రక. 21:2వ.లో నూతన యెరూషలేము పట్టణము అనగా సంఘము నివసించబోవు పట్టణము కూడ 'భర్త కొరకు అలంకరించబడిన పెండ్లి కుమార్తెవలె' సిద్ధపడిందట. సంఘమనే పెండ్లి కుమార్తె తన పెండ్లి భర్త కొరకు ప్రకాశమానములును, నిర్మలములునైయున్న సన్నపునారబట్టలు ధరించుకొని (నీతి వస్త్రములు) తన్నుతాను సిద్ధపడి యుండగా (ప్రక 19:7,8వ.) ఆ సంఘ వధువు నివసించబోయే నూతన యెరూషలేము పట్టణమును కూడ ప్రభువు తన భర్త కొరకు అలంకరింపబడిన పెండ్లి కుమార్తె వలె అలంకరించి

సిద్ధపరిచాడట. ప్రియ సోదరీలారా! మనం నివసించబోయే నూతన యెరూషలేము పట్టణము సర్వాంగసుందరంగా సిద్ధమైంది. మరి మనం సిద్ధంగా ఉన్నామా? సిద్ధముగా లేనియెడల ప్రభువా! నీవు నన్ను హెచ్చరిస్తున్న ప్రకారం నన్ను సిద్ధపరచుము ప్రభువా అని ప్రార్థించుకోండి. సోదరీ! అసలు నీవు రక్షణ కూడ పొందుకోలేదా? రక్షణ వస్త్రమే నీవు ధరించలేదా? అట్లయితే ప్రకాశమానములును, నిర్మలమునైన నీతిక్రియలనే సన్నని నారవస్త్రములు నీకు లేనే లేవేమో! ఆ నీతి క్రియలనే వస్త్రములు లేక నీవెలా సిద్ధంగా ఉండగలవు? నీ స్వనీతితోనే ఉన్నావా? నీ స్వనీతి క్రియలన్నీ దేవుని యెదుట మురికి గుడ్డలుగానే ఉన్నాయని యెష 64:6వ.లో లేఖనము చెబుతోంది. అలి అర్జంటుగా ఇప్పుడే ప్రభువును నీ స్వంత రక్షకునిగా అంగీకరించుకొని నీ పాపము నుండి ఆయన రక్తముతో కడుగబడి ఆయన రాకడకై సిద్ధపడుమని మరోసారి ప్రభువు నిన్ను ప్రేమతో హెచ్చరిస్తున్నాడు.

**XIV. దీవించబడిన రిబ్కా:-** ఆది 24:60 ఇస్సాకును పెండ్లి చేసికొనుటకు వెళ్ళుచున్న రిబ్కా ఇంటివారు "నీవు వేలవేలకు తల్లివగుదువు గాక' అని దీవించారు. ఈ దినాల్లో 'చిన్న కుటుంబం చింతలేని కుటుంబం' అని అంటున్నారు. కానీ పూర్వకాలంలో వంశాభివృద్ధి కొరకు 'వేలవేలకు తల్లి' అవ్వాలని అందరూ కోరుకునేవారు. ఈమె కోడండ్రైన రాహేలు, లేయా ఇశ్రాయేలు వంశాన్ని కనుటలో పోటీపడినట్లు కని వర్థిల్ల చేశారు. అలాగే దెబోరా న్యాయా. 5:7వ.లో ఇశ్రాయేలీయులకు తల్లిగా (12 గోత్రాలకు) అభివర్ణింపబడింది. అలాగే హవ్వ 'జీవము గల ప్రతి వానికి తల్లి'గా పిలువబడింది. పౌలు రోమా 16:13వ.లో రూఫు తల్లికి వందనములు. ఆమె నాకును తల్లి అన్నాడు. ఈలాగున చదువుచున్న ప్రియ సోదరీ! నీవు ఎంతమందికి తల్లివని పిలువబడుతున్నావు. శరీర రీతిగా పరిమిత సంతానం కలిగి ఉన్నావేమో! జనాభా సమస్యనుబట్టి మన ప్రభుత్వాలు చెప్పుచున్నట్లు 'ముగ్గురు వద్దు, ఇద్దరు ముద్దు' అనే స్లోగన్స్ మనము ఈ దినాల్లో వింటున్నాము. కానీ ఆత్మీయంగా నీవెంతమందిని ప్రభువు నొద్దకు నడుపుచున్నావు? 'మీ దగ్గరే నేను ప్రభువు కొరకు తీర్మాణం చేసుకున్నాను' అని ఎంతమంది నీతో చెప్పగలుగుచున్నారు? లేక 'మీరే నేను ప్రభువు రక్షణ లోనికి వచ్చుటకు సహాయం చేశారని' ఎంతమంది నీతో చెప్పగలుగుచున్నారు? ఈ సాక్ష్యము ఈ దినాల్లో ఎంతో అవసరం. ఆత్మీయ పిల్లలను కనడం మనకెంత భాగ్యం! వివాహము తరువాత పిల్లలను కనడం స్త్రీ లక్షణం. అది ఆమెకు ఆశీర్వాదం. స్త్రీలో ఆ మాతృత్వం ఉండాలి. 1 తిమో. 5:14వ.లో ఉన్నట్లు యవ్వన స్త్రీలు వివాహము చేసికొని పిల్లలను కని గృహ పరిపాలన జరిగించాలని వ్రాయబడిన ప్రకారము పిల్లలను కనుట దేవుడు ఆమెకిచ్చిన బాధ్యత. ప్రియులారా! అలాగే ఆత్మీయ పిల్లలను కనుట కూడ మన బాధ్యతే. రిబ్కా దీవించబడిన రీతిగా మనం కూడ పదులు, వందలు, వేలు, లక్షలలో ఆత్మలను కనాలి. ఇంతవరకు ప్రియ సోదరీ! నీవు ఆత్మీయముగా ఒక్క బిడ్డనైననూ కనకపోతే

ఆత్మీయ గొడ్రాలితనము నుండి మాతృత్వ స్థితికి రావాలి. సమరయ స్త్రీ సాక్ష్యము చెప్పి తన వూరి వారెందరినో ప్రభువు కొరకు ఆత్మీయ సంతానంగా కనింది. ప్రార్థించి నీవు కూడ ఆ స్థితికి రావాలి. ఆ ఆశ వుంటే తప్పక ప్రభువు నీ ఆశను తీరుస్తారు. నీ ఆశను భంగము చేయదు. ప్రభువుని ప్రార్థించి చూడు. అలాగున నీవు కూడ సంతాన దీవెన పొందగలవు.

రిబ్కా ఎలాంటి సంతానాన్ని కనాలని దీవించబడింది? పగవారి గవిని స్వాధీనపరచుకునే సంతానాన్ని కనాలని దీవించబడింది. మన విశ్వాసుల పగవాడును విరోధియునైన సాతాను స్వాధీనంలో నేడు అనేకమైన పిల్లలు చెరపట్టబడియున్నారు. అనేకమైన మానసిక బలహీనతల ద్వారా దుష్ట సాంగత్యము ద్వారా సాతాను గవినిలో, ఉరిలో, ఉచ్చులో చెరపట్టబడిన పిల్లలను ప్రభువు స్వాధీనములోనికి తెచ్చే సంతానాన్ని కంటుందట రిబ్కా. అలాగైతే రిబ్కా సంతానం, ఎంత మాదిరియైన సంతానమో కదా! పుడితే ప్రతి విశ్వాసికి అలాంటి సంతానమే పుట్టాలని ప్రభువును ప్రతి స్త్రీయు అలాగున వేడుకోవాలి. మనమును, మన పిల్లలును అలాగ సాతాను చెర నుండి అనేకులను విడిపించే వారుగా ఉందుము గాక! ప్రియ సోదరీ! నీ సంతానములో ఎవరైనా ఇట్లు పగవాని గవిని నుండి విడిపించి ప్రభువు పక్షాన చేర్చేవారెవరైనా ఉన్నారా?

**XV. కాబోయే భర్తకు ముసుకువేసిన రిబ్కా:-** రిబ్కా దూరమునుండి ఇస్సాకును చూచినప్పుడు ఒంటె దిగి ముసుకు వేసింది. ఇది విధేయతకు గుర్తు. భర్తకు భార్య అన్ని విషయాల్లో లోబడాలని దేవుని వాక్యం ఎఫె. 5:24లో చదువుతాం. తల్లి ఈనాడు భర్తకు లోబడితే పిల్లలు కూడ తండ్రికి, తల్లికి లోబడుతారు. రిబ్కా ఎప్పుడూ ఇస్సాకుకు ఎదురు చెప్పనే లేదు. వారిద్దరూ ఎంతో సఖ్యతగాను, ప్రేమగాను, సరసంగాను ఉండినట్లు ఆది. 26:8వ.లో వ్రాయబడింది. ఆ చిన్న వయస్సులో రిబ్కా భర్తకు లోబడడం నేర్చుకున్నది. ఆనాటి తల్లిదండ్రులు భర్తలకు లోబడాలని పిల్లలకు నేర్పించేవారు గనుకనే రిబ్కా తల్లి నేర్పునుబట్టి భర్తకు ముసుకువేసింది. ఆయన ఏలుబడి క్రింద ఉండటానికి నేర్పబడి ఇష్టపూర్వకంగా లోబడింది. ఈలాటి నేర్పు తల్లిదండ్రుల ద్వారా ఈనాటి యవ్వన పిల్లందరూ నేర్చుకున్నారా? తల్లిదండ్రులు ఈ నేర్పు తమ పిల్లలకు నేర్పి పెళ్ళిళ్ళు చేస్తున్నారా? సంఘములో స్త్రీల మీటింగ్స్‌లో నేడు ఈలాటి నేర్పు నేర్పిస్తున్నారా? భర్త ఎదుటనే రిబ్కా ముసుకు వేసిందంటే, పరమ భర్త సన్నిధిలో (ప్రభువు సన్నిధిలో) ముసుకు వేయాలా? వద్దా? దీని విషయమై వాక్యమేమి సెలవిస్తుంది చూద్దామా? 2 కొరి. 11:2 వ.లో 'నేను మీకు అప్పగించిన కట్టడలను గైకొనుచున్నారని నేను మిమ్మును మెచ్చుకొనుచున్నాను అని ఈ అధ్యాయాన్ని మొదలు పెట్టి 3వ-16వ. వరకు, స్త్రీ వేసికొనవలసిన ముసుకును గురించి వ్రాస్తున్నాడు. అనగా స్త్రీ ముసుకు వేసికోవడం అది దేవుడు పౌలు ద్వారా మనకిచ్చిన కట్టడ అనగా

ఆజ్ఞయే కానీ, మన ఇష్టాఅయిష్టాలు అందులో లేవు. 1 కొరింథీ. 14:37 తాను వ్రాయుచున్నవి ప్రభువు ఆజ్ఞలని దృఢముగా తెలిసికోవాలని పౌలు వ్రాస్తున్నాడు. అవి తన ఆజ్ఞలు కావని చెబుతున్నాడు. ఈ సందర్భాన్ని గురించి ఒకామె 'నేను పరలోకానికి వెళ్ళిన తరువాత ఎందుకన్నా పౌలన్నా! నీవు స్త్రీల మీద పక్షపాతంగా ఎందుకు మాట్లాడినావని' అడుగుతానని చెబుతోంది. 5వ.లో ఏ స్త్రీ తలమీద ముసుకు వేసికొనక ప్రార్థన చేయునో లేక ప్రవచించునో ఆ స్త్రీ తన తలను అవమానపరచును అని వ్రాయబడింది. స్త్రీ తన తలను అవమానపరచును అంటే స్త్రీ యొక్క తల పురుషుడని 3వ.లో వ్రాయబడింది. కనుక స్త్రీ ముసుకు వేసికొనకపోతే అవమానం స్త్రీకి కాదు ఆ స్త్రీ యొక్క భర్తకే ఆ స్త్రీ అవమానం తెచ్చినట్టు. ఈనాడు మందిరంలో ముసుకు వేసికొనని ప్రతి స్త్రీ తన భర్తకు అవమానం తెస్తోందని గుర్తించాలి. అవమానమంటే సిగ్గు తెస్తోందన్నమాట. ముసుకు వేసికొని యోగ్యురాలుగా భర్తకు కిరీటము తేవాల్సిన భార్యలందరూ నేడు తమకు తెలియకుండానే ముసుకు విషయమైన వాక్యగ్రహింపు లేకుండా చాలామంది స్త్రీలు తమ భర్తలకు సిగ్గు తెస్తున్నారు. ఈ సంగతి ఇప్పుడైనా అర్థమయ్యిందా? మరియు 10వ.లో స్త్రీ తన తలమీద ముసుకు వేసుకొనుట ద్వారా తాను తన భర్త అధికారము క్రింద వుంటున్నానని తెలియ చేస్తుందని, అలా స్త్రీలు తమ భర్తలకు లోబడి వుందుటను ప్రభువుకు లోబడి ఉండుటను దేవదూతలు చూస్తూ (angles are gazing) ఉన్నారట. అలా లోబడి వుండక ముసుకు వేసుకొనక పోవుటను వారు చూస్తూ ఉన్నారు. దేవదూతలు పరమందు ఇహమందు దేవుడు ఏమి ఆజ్ఞాపిస్తే ఆ ఆజ్ఞలు విధేయతతో చేస్తున్నారు. దేవదూతలు రక్షణ పొందిన మనకు పరిచారకులై ఉన్నారని హెబ్రీ 1:14 చెబుతుండగా, దేవుని పరిచారకులమైన మనము ప్రభువు ఆజ్ఞను వినకపోతే దూతలు మనలను చూచి ఏమనుకుంటారో ఆలోచించండి. (Angles are gazing at our disobedience) 'అతడు నిన్ను ఏలును' అని హవ్వతో దేవుడు చెప్పిన విషయాన్ని స్త్రీలందరూ ఇక్కడ గమనించాలి. పురుషుని అధికారం లేదా ఏలుబడి క్రింద మనమున్నామా లేదా అని దేవదూతలు మనల్ని తేరిచూస్తున్నారట. మనము దేవుని ఆజ్ఞను పాటిస్తూ ఉన్నామా? లేక పాటించుట లేదా అన్న విషయాన్ని దేవదూతలు చేస్తున్నారట. దూతలు అలాగున చూస్తూ ఉన్నప్పుడు మనము ఆ ఆజ్ఞను పాటించకపోతే (ముసుకు వేసికొనపోతే) మనము ఇహలోక భర్తలకును, పరలోక భర్తకును లోబడుట లేదని వారి అధికారమును ధిక్కరిస్తున్నామని దూతలు అర్థం చేసుకుంటారు. తన రక్తమిచ్చి మనలను కొనుకున్న దేవునికి మన మీద అధికారము ఆయనకు వున్నదా లేదా? ఆయనకు నీవు విధేయత చూపిస్తున్నావన్న సూచనగా ముసుకు నీ తలమీద వేసుకోవడం నీకు నామోషిగా అనిపిస్తోందా? సృష్టిలో అన్నియూ ఆయన అధికారమునకు ఒప్పుకొనగా ఓ స్త్రీ! నీవు మాత్రమే ఆయన అధికారానికి ఒప్పుకోలేకపోతున్నావా? ప్రభువుకు

1. పాపముల మీద అధికారము 2. బోధించుటకు అధికారము 3. గాలిమీద అధికారము 4. రోగముల మీద అధికారము (లూకా 4:39). 5. అపవిత్రాత్మల మీద (లూకా 4:36), 6. రాజ్యముల మీద (దాని. 4:17) 7. దేవదూతల మీద (1 పేతురు 3:22) 8. తీర్పు తీర్చుటకు అధికారము ఉన్నది. (యోహాను 5:25). 9. పురుషునికి ఇంటి మీద, భార్యయైన నీ మీద అధికారం ఉంది. (1 తిమోతి 2:12). కానీ! ప్రభువుకు నీ మీద అధికారమిచ్చావా? నన్నేలుకో ప్రభువా అని ఎప్పుడైనా నీ ప్రవర్తన అంతటియందు సామె. 3:6 వచనములో వ్రాయబడినట్లు ఆయన అధికారము నీమీద ఉండునట్లు ఎప్పుడైన ప్రభువుకు నీ జీవితాన్ని అర్పించి ఆయన అధికారాన్ని ఒప్పుకున్నావా? అలా ఒప్పుకున్నట్లయితే నీ ప్రవర్తన అంతటిమీద ఆయన అధికారముండని దానికి సూచనగా ఇక నుండి నీ తలమీద ముసుకు వేసుకోవడానికి పరిశుద్ధాత్ముడు నిన్ను ఒప్పించడము లేదా! పరిశుద్ధాత్మకు విధేయత చూపించి ప్రభువు ఆజ్ఞకు లోబడు. సృష్టి అంతా ఆయనకు లోబడుతోంది. మరి ముసుకు వేసుకోమని ప్రభువిచ్చిన ఆజ్ఞకు విధేయత చూపుతూ నీ మీద ఆయన అధికారానికి ఒప్పుకోవడం నీ బాధ్యత. నీకు ఈ ముసుకు విషయమై గ్రహింపు కలిగాక కూడ, దానిని వ్యర్థము చేసుకోవద్దు. కొందరు 'ఈ సంగతి ఫలానా భక్తునికి దేవుడు చెప్పలేదా? ఆ భక్తుని సేవను దేవుడు ఎంతో దీవించాడు కదా!' అని వితండవాదము చేస్తున్నారు. వాక్యము చూడండి, చదవండి, నమ్మండి. అంతేకానీ, ఆ భక్తుడికి దేవుడు తెలియచేయలేదా? ఈ భక్తుడికి దేవుడు తెలియజేయలేదా? అని వ్యర్థ ప్రశ్నలు వేసి దేవుని ఆజ్ఞను విస్మరించే ప్రయత్నం చేయొద్దు. చేసింది చాలు. ఇకనూ కంటిన్యూ చేయవద్దు. 2 కొరి. 11:16వ.లో ఎవడైననూ ముసుకు విషయములో కలహప్రియుడుగా కనబడిన యెడల మాలోనైనను,దేవుని సంఘములోనైననూ ఇట్టి ఆచారము లేదని వాడు తెలిసికొనవలెనని పౌలు వ్రాశాడు. ఎట్టి ఆచారము లేదని పౌలు చెబుతున్నాడు? స్త్రీ తలమీద ముసుకు వేసుకొనని ఆచారము మాలోనైనను, సంఘములోనైననూ లేదని పౌలు చెబుతున్నాడు. అంటే తలమీద ముసుకు వేసుకునే ఆచారమే ఉందని పౌలు చెబుతున్నది వాస్తవమని మనకు బహాటముగా తెలియుచూ వుండగా కూడా ఇంకను ఒప్పుకునే మనసు లేనివారితో ప్రభువే మాట్లాడును గాక!

కొద్దిమంది స్త్రీలు మొదట ముసుకు వేసికొనినా అది ఒకసారి జారిపోతే ఇక మరలా వేసుకునే ప్రయత్నమే చేయుట లేదు. ఒకసారి ఒక మీటింగ్‌లో నాకు ముందు వరుసలో కూర్చున్న సోదరి తన తలమీది ముసుకు జారిపోతే తిరిగి తలమీద ముసుకు వేసుకోనేలేదు. చాలాసేపటికి ఒక జోరిగ తన చెవిచుట్టూ తిరుగుతూ శబ్దము చేస్తుండగా ఆ జోరిగ తన చెవిలో ఎక్కడ దూరుతుందేమోనని భయపడి అప్పుడు ముసుకు వేసుకుంది. ఇప్పుడు చెప్పండి, ఆ స్త్రీ ప్రభువు ఆజ్ఞకు భయపడి ముసుకు వేసిందా? లేక జోరీగ చెవిలో దూరుతుందని భయపడి ముసుకు వేసుకుందా? జోరీగకు భయపడివేసిందని అర్థమౌతుంది.

ఈగకు భయపడుతున్నారు కానీ ప్రభువు ఆజ్ఞలను లక్ష్యపెట్టుట లేదు. 13వ. పౌలు 'మీలో మీరే యోచించుకొనుడి స్త్రీ ముసుకులేనిదై దేవుని ప్రార్థించుట తగునా? అని అంటున్నాడంటే, తగదు అని అర్థమే కదా! ఇంత క్లియర్‌గా దేవుని వాక్యము వ్రాయబడి ఉండగా ఇంకనూ ఆ వాక్యానికి విధేయత చూపడము వారికి ఇష్టము లేకపోతే దేవుడికి వారే ఉత్తరవాదులవుతారని గ్రహించుకోవాలి. ఇక దీని విషయము కలహించే కలహ ప్రియులుగా మనముండకూడదు. వ్యాజ్యాలు మనకెందుకు? ఈలాగున రిబ్కా అనే ఈ చిన్నది తన చిన్నవయస్సులోనే భర్తకు లోబడి యుండుటను తన తల్లి దగ్గర నేర్చుకుంది కాబట్టి తన కాబోయే భర్తయైన ఇస్సాకును దూరము నుండి చూచి ముసుకు వేసింది. ఈ సందర్భంగా ఒక భక్తుడిలా అన్నాడు: రిబ్కా తన సుదీర్ఘ ప్రయాణంలో ఎంతోమంది పురుషులను చూచి ఉంటుంది. కానీ వారిలో ఎవ్వరికి కూడ ఆమె ఒంటెదిగి ముసుకు వేసుకోలేదు. ఇస్సాకును చూచినప్పుడే ముసుకు వేసింది. ఈనాటి ఆడపిల్లలు ఎక్కడ యువనస్థులు కనిపిస్తే వారందరికీ ముసుకు వేసినట్లు చేస్తారు. నీవు నీ స్వంత పురుషునికే విధేయత చూపాలి. మాయమాటలు చెప్పి నిన్ను ప్రేమిస్తున్నట్లు నటించేవారు చెప్పే మాయమాటను నమ్మి వారికి విధేయత చూపనవసరము లేదు. నీ వివాహము విషయములో ప్రభువు చెప్పిన వివాహమే చేసుకోవాలి. నీ స్వంత భర్తకే నీవు విధేయత చూపాలి.

**XVI. గర్భస్థ శిశువులు గర్భములో పోట్లాడుచుండగా యెహోవాను అడుగ వెళ్ళిన రిబ్కా:-** భర్త ప్రార్థన ద్వారా, ఒకడిని అడిగితే దేవుడు ఇద్దరిని రిబ్కా గర్భములో ఉంచాడు. అడిగిన దానికంటే, ఊహించినదాని కంటే అత్యధికము దేవుడిచ్చాడు. దేవుడిచ్చిన పిల్లలే పోట్లాడుకుంటున్నారు. ఆ... మనమందరం దేవుని పిల్లలమే. మనలో కొట్లాటలు లేవా? పౌలు 1కొరింథీ. 1:11వ.లో మీలో కలహములున్నవని క్లోయె ఇంటివారి వలన తెలుసుకున్నానన్నాడు. 2 కొరి. 11:18లో మీలో కక్షలు కలవని వినుచున్నానన్నాడు. రిబ్కా పిల్లలు తల్లి గర్భములో నుండి బయటకొచ్చాక కాదు, వారు పిండదశలోనే పోట్లాడుకునేవారుగా ఉన్నారంటే, ఇక బయటకొచ్చాక ఇంకెంతగా పోట్లాడుకుంటారేమో, ఇలాంటి పిల్లలని కనడం కంటే ఇప్పుడే నేను చనిపోతే వారు కూడ చనిపోతారు కదా అని నేనెందుకు బ్రతకాలి? అని ఆలోచన తనకు వచ్చినప్పుడు రిబ్కా ఆ విషయమై దేవుని అడుగ వెళ్ళింది. అనగా ప్రార్థనా గదిలోనికి వెళ్ళిందని అర్థము. వెళ్ళితే ప్రభువు "పెద్దవాడు చిన్నవానికి దాసుడౌతాడు. ఒక జనపదము కంటె ఒక జనపదము బలిష్ఠమై యుండును అని దేవుడు ఆమెకు తెలియజేశాడు. అవును, కుటుంబములో ఏ సంగతిని గూర్చియైనా మనము కలవరపడినప్పుడు, ఆలోచన కావాల్సినప్పుడు ప్రభువునడిగితే ఆయన మనల్ని చక్కగా నడిపించగలరు. ప్రియ సోదరీ! నీవు కూడ నీ యింటి పరిస్థితులతో చావాలనుకుని డిప్రెషన్‌లో ఉన్నావా? అలాంటప్పుడే నీకు యెహోవాను ప్రార్థనలో అడగాలి, సంప్రదించాలి.

ప్రభువు తగిన జవాబు అనుగ్రహిస్తారు. ఇంతకు మునుపు పిల్లలు లేనప్పుడు ఇస్సాకు ప్రార్థించాడు. ఇప్పుడు పిల్లలను దేవుడు గర్భములో ఉంచిన తరువాత రిబ్కా ఇప్పుడు ప్రార్థిస్తోంది. గర్భములో తొందర కలిగినప్పుడు ఆమెకు వైద్యులు గుర్తుకు రాలేదు. కానీ ప్రభువునే అడిగి ప్రార్థించింది. ఈ కుటుంబంలో భర్త, భార్యలు ఇద్దరూ ప్రార్థించువారుగా ఉన్నారు. కానీ యోబు కుటుంబంలో యోబు మాత్రమే ప్రార్థనాపరుగా కనిపిస్తున్నాడు. ఆయన భార్య ప్రార్థనాపరురాలిగా మనం చూచుట లేదు. పైగా మూర్ఖురాలుగా చూస్తున్నాము. ప్రియ సోదరీ! నీ కుటుంబంలో నీవు ఒక ప్రార్థనాపరురాలుగా ఉంటున్నావా? హన్నా ఎంత ప్రార్థనాపరురాలుగా ఉండిందో కదా! ప్రార్థనకు పేరెన్నికగన్నదిగా హన్నాను మనము లేఖనాలలో చూడగలం. క్రైస్తవ లోకంలో ప్రియ సోదరీ! నీవు ఎలాంటి దానవుగా పేరు తెచ్చుకున్నావు? ప్రార్థనాపరులైన తల్లిదండ్రులను మన పిల్లలు, మన సంఘాలు కలిగియుండడము మన కుటుంబాలకు, సంఘాలకు ఎంత ప్రయోజనకరమో కదా!

అలాగు సంఘములలో కక్షలు, కలహములు ఉన్నప్పుడు ఎంతమంది తల్లులు సంఘ ఐక్యత కొరకు ప్రార్థించి సంఘానికి మేలు చేయుచున్నారు? సంఘ సమస్యలు, ఒకరితో ఒకడు చెప్పుకోవడమేనా? వ్యాప్తి చేయడమేనా? లేక రిబ్కావలె ప్రభువు దగ్గర ప్రార్థించి జవాబు పొందుచున్నారా? ఈలాటి తల్లిదండ్రులు ఈనాటి సంఘాలకు ఎంతో అవసరం. అడుగుడి మీకు దొరుకును అని ప్రభువు చెప్పుచుండగా ప్రార్థనలో అడుగుదాం. దేవున్ని అడుగుట లేదు కనుకనే మీరు పొందడం లేదు. అడిగినా భోగేచ్ఛల కొరకు దురుద్దేశ్యముతో అడుగుతున్నారు. లోక స్నేహము చేసి అనగా లోకంతో వ్యభిచారము చేసి అడుగుతున్నారట. అనగా లోకాశ కొరకు అడుగుతున్నారు. సంఘాల కొరకు, ఆత్మీయత కొరకు అడుగుట లేదు. యాకో. 4:1-5వ.లలో ఈలాగు వ్రాయబడింది. 6వ.లో ఉన్నట్లు ఆత్మ మత్సరపడునంతగా లోకాశ, నేత్రాశ, జీవపుడంబముల కొరకు అడుగుచున్నారు. దేవునికి శత్రువలగుచున్నారు? ప్రభువు నొద్దకు రండి. లోకాన్ని లోక స్నేహాన్ని విడచిపెట్టి రండి. అవయవాలను, హృదయములను మనస్సులను శుభ్రము చేసికొని ప్రార్థనకు రండి అని ప్రభువు చెబుతున్నాడు. (యాకో. 4:6-10). ఆయన యొద్దకు వచ్చువారిని ఆయన ఎంతమాత్రమును త్రోసివేయడు. ఆత్మీయత కొరకు ఆత్మల కొరకు ప్రార్థిస్తే ఆత్మ మత్సరపడడానికి అవకాశముండదు. పిల్లలతో వచ్చే సమస్యల కొరకు వారి భవిష్యత్తు సమస్యల కొరకు కూడ తల్లులు ప్రార్థించవలసినవారుగా ఉన్నారు. పిల్లల విషయమైన anxieties కొరకు తల్లులము ప్రార్థించాలి. హన్నా తన కుమారుని కొరకు ఎంతగా ప్రార్థించిందో అందుకే సమూయేలు దేవుని చిత్తాన్ని తన జీవితంలో చక్కగా నిర్వర్తించాడు. కావున తల్లులు పిల్లలు కావాలని ప్రభువుని ప్రార్థించి వారు పుట్టిన తరువాత వారిని పట్టించుకొనకుండా ఉండకూడదు. వారి ప్రస్తుత జీవితం కొరకు వారి భవిష్యత్తు

జీవితం కొరకు ప్రార్థించాలి. చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లల కొరకు తరగని ఆస్తులు సమకూర్చుచున్నారు కానీ వారి ఆత్మీయ అభివృద్ధి కొరకు, వారు చేయవలసిన దైవ సేవ కొరకు ప్రార్థించరు. వారి ఐక్యత కొరకు ప్రార్థించరు. పిల్లలు పుట్టేటప్పుడు అన్నదమ్ముళ్ళుగా పుడతారట. పెరుగుతూ దయాదుల్లాగ మారుతారట. ఇప్పుడు రిబ్కాకు పుట్టబోయే ఏశావు, యాకోబుల భవిష్యత్తు అలాగే తయారవబోతోంది. ఆగర్భ శత్రువులుగా వారు కనిపిస్తుండగా వారి భవిష్యత్తు తెలియక వారు భవిష్యత్తులో ఏమవుతారోనని ఆమె దేవున్ని ప్రార్థించడానికి వెళ్ళింది. దేవుని నుండి రిబ్కా వారి భవిష్యద్విషయాల విషయమై జవాబు పొందింది. ఆమె జవాబు ఫలితంగానే పిల్లల మధ్య ఆశీర్వాదాన్ని మోసంగా యాకోబు తీసుకున్నా అన్నదమ్ములిద్దరూ భవిష్యత్తులో కలుసుకున్నా ఏశావు యాకోబును చంపకుండా ప్రభువు యాకోబును కాపాడాడు. రిబ్కా ఇప్పుడు బ్రతికి ఉండలేదు. ఆమె చనిపోయింది. కానీ ఆమె వారి విషయమై వారు గర్భములో వున్నప్పుడు చేసిన ప్రార్థన చనిపోలేదు. ఏశావు యాకోబును క్షమించి తన చోటికి వెళ్ళిపోయినట్లు చూస్తున్నాము. మన ప్రార్థనకు జవాబు దగ్గరి భవిష్యత్తులో కాకపోయిన దూర భవిష్యత్తులో చూడగలము. అలా యాకోబు తన తండ్రి యిల్లు విడచి మామ గారింటికి వెళ్ళి ఒక భార్య కొరకు 14 సం॥ కొలువు చేశాడు. పిల్లల సంపాద్యము కొరకు మరి 7 సం॥ కొలువు చేసి మొత్తము 21 సం॥ తరువాతనే తన అన్నను కలిసినప్పుడు అన్న తమ్ముడైన యాకోబును చంపకుడా సమాధానంగా వెళ్ళిపోయాడు. కనుక తల్లియైన రిబ్కా ప్రార్థనకు దూర భవిష్యత్తులో జవాబు వచ్చింది. తల్లులు ప్రార్థనాపరులు కాకపోతే పిల్లల జీవితానికి రక్షణ లేకుండా పోతుంది. రిబ్కా ప్రార్థించినందువల్లే అన్నదమ్ముళ్ళిద్దరూ ఒకరి నొకరు కొట్టుకొని, చంపుకొనకుండా సమాధానంగా ఏశావు వెళ్లిపోవడానికి కారణమయ్యింది. ఓ స్త్రీ! మన ప్రార్థన వ్యర్థము కాదు. ఆ పిల్లలు భవిష్యత్తులో పోట్లాడుకునేటట్లైతే నేను బ్రతుకుట ఎందుకు? అనుకుంది. ఈ సమస్యను పరిష్కరించింది ప్రార్థనయే. ప్రార్థన విలువ యింత గొప్ప విలువగలదై యుండగా ప్రియ సోదరీలారా! ప్రార్థనకై సిద్ధపడి రండి. ప్రార్థనే మన ఆయుధం.

**XVII. కోడండ్రచే మనోవేదన పొందిన రిబ్కా:-** ఆది 26:34,35వ. రిబ్కా జ్యేష్ఠ కుమారుడైన ఏశావు 40 యేండ్లవాడై హిత్తీయుడైన బెయేరీ కుమార్తెయైన 'యహూదీతును' హిత్తీయుడైన ఏలోను కుమార్తెయైన 'బాశెమతును' పెండ్లి చేసుకున్నాడు. వీరు ఇస్సాకునకును, రిబ్కాకును మనోవేదన కలుగచేసిరి. సాధారణముగా అత్తకోడండ్లకు సరైన పొందిక లేకుండా, సమాధానము లేకుండుట మనము గమనిస్తుంటాము. మరి యిక్కడైతే రిబ్కాకు మాత్రమే కాక ఇస్సాకుకు కూడా ఈ కోడండ్లు మనోవేదన కలుగచేశారని ఖచ్చితంగా అర్థమవుతుంది. ఈ సమయములో ఏశావు 40 యేండ్లవాడుగా ఉన్నప్పుడు ఈ హేతు కుమార్తెలను పెండ్లి చేసుకున్నప్పుడు తండ్రియైన ఇస్సాకు వయస్సు 100 సం॥. ఇక తల్లియైన రిబ్కా వయస్సు

90 యేండ్లు దరిదాపుగా ఉండవచ్చు. ఇంతటి పండు వృద్ధాప్యములో ఈ కోడండ్రు వారిమీద తమ భీకరత్వాన్ని బెదిరింపును, చూపి వారికి మనోవేదన కలిగించారంటే ఇది ఎంత అన్యాయమో గమనించండి. అత్త కోడండ్రను తమ తల్లిదండ్రుల వలె సన్మానించే కోడండ్రు కాదు వీరు. 'వీరు ఎందుకు ఇలా వేదన కలిగించారు?' అనే ఆలోచన చేస్తే వీరు హిత్తీయులకు పుట్టినవారు. హిత్తీయులు అనగా భయంకరులు లేక బెదిరించువారు అని అర్థము. తండ్రి బెదిరించువాడైతే అతని కుమార్తెయైన యహూదీతు కూడ బెదిరించేదేమో. అందుకే అత్త మామకు వేదన కలిగించే కోడలుగా యహూదీతు వుండింది. ఎఫెసీ. 6:9వ.లో 'యజమానులారా! మీకును వారికిని యజమానుడైనవాడు పరలోకమందున్నాడనియు, ఆయనకు పక్షపాతము లేదనియు, ఎరిగినవారై వారిని బెదిరించుటమాని ఆ ప్రకారము వారి యెడల ప్రవర్తించుడి! అని వ్రాయబడింది. కానీ ఈ కుటుంబములో యజమానుల్లాంటి అత్తమామలు బెదిరించుట లేదు కానీ, చిన్నవారైన కోడండ్రే పెద్దవారైన అత్తమామలను బెదిరిస్తున్నవారుగా ఉన్నారు. రూతు కోడలు నయోమియైన అత్తను అలా బెదిరించిందా? లేదా. అత్తను ఎంతో ప్రేమించింది. తన జన్మభూమిని, తల్లిదండ్రులను తన వివాహాన్ని త్యాగం చేసింది. తన సుఖాన్ని చూచుకోలేదు. అత్త కొరకు పొలము లోనికి వెళ్ళి పరిగె ఏరి అత్తను పోషించింది. అత్త మాట విని బోయజు కళ్ళానికెళ్ళింది. అత్త చూపిన మార్గంలో వెళ్ళింది. అత్త చెప్పిన వివాహమే చేసుకుంది. అత్త చెప్పిన వస్త్రాలే వేసుకుంది. అత్త చెప్పిన రీతిలోనే బోయజు పొలంలో ప్రవర్తించింది. చిన్న విషయము గాని, పెద్ద విషయములోగానీ అత్త చెప్పిన ప్రకారమే నడుచుకుంది. వీరు ఒకరికొకరు ఎంత అన్యోన్యంగా, ఆప్యాయంగా ఉన్నారు కదా! ప్రభువును నమ్మిన ప్రతి అత్తా, కోడళ్ళూ అలాగే ఉండాలి కానీ, హిత్తీయుడైన ఏలోను కుమార్తెయైన, బాశెమతు పేరుకు 'సువాసన గలది' అనే అర్థము ఉండినప్పటికీ ఆమె అత్తమామల యెడల జీవించిన జీవితపు సాక్ష్యము సువాసనగా లేదు. వారిని బెదిరించినందున దుర్వాసన గలదిగా చెడ్డ సాక్ష్యము గలదై ఉన్నది. యహూదితు, బాశెమతు వీరద్దరు భయంకరులకు పుట్టినవారు. కనుక వారునూ వారి తండ్రులవలె బెదిరించువారుగానే ఉన్నారు. దేవుని వాక్యములో హబ. 2:17లో నీ పశువులను నీవు బెదిరించు బెదురును నీమీదకి వచ్చును" అని వాక్యములో వ్రాయబడివుంటే ఇక మనుష్యులను బెదిరించే ఈ కోడండ్రకు దేవుడు ఇంకెంతగా వారిని బెదిరిస్తాడో పాఠకులందరూ గ్రహించుకోవాలి. ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే చెల్లిపోతుంది అనుకుంటున్నారు చాలామంది. మన ఇష్టము కాదు, వాక్యాన్ని చదివి గ్రహించి ఆ రీతిగా నడచుకోవాలి. రేపు తీర్పు దినాన కూడ ప్రభువు వాక్యమును బట్టియే తీర్పు తీర్చుతారని గమనించాలి. ప్రియ కోడళ్ళారా! మీరు చిన్నవారై యుండియూ వయసులో పెద్దవారైన మీ అత్తమామలను బెదిరించేవారుగా ఉన్నారా? కొద్దిమంది కోడళ్ళు లేనిపోని అబద్ధపు కేసులు అత్తమామలమీద పెడుతూ వారిని జైళ్ళపాలు కూడా చేస్తున్నారు. ఒకమ్మాయి మరో వ్యక్తితో 'నేను కడప పిల్లను

ఏమనుకున్నావో' అని బెదిరిస్తోంది. కొద్దిమంది తమ భర్తల మీద కూడా బెదిరిస్తూ అబద్ధపు కేసులు పెడుతున్నారు. ఆది. 27:46వ.లో రిబ్కా ఇస్సాకుతో హేతు కుమార్తెల వలన నా ప్రాణము విసిగిపోయింది. యాకోబు ఈ దేశస్థురాండ్రైన హేతు కుమార్తెలలో వీరివంటి ఒకదానిని పెండ్లి చేసికొనిన యెడల నా బ్రతుకు వలన నాకేమి ప్రయోజనకరము? అని అనింది. అత్తకు హేతు కుమార్తెలు అనబడిన కోడండ్రవలన ప్రాణానికి విసుకు కలిగింది. అందువలన రిబ్కాకు బ్రతకాలని అనిపించలేదు. ప్రాణం మీద విసుకు వచ్చేసింది. కోడండ్ర వలన అత్తలు చావాలనుకుంటున్నారా? ఈ దినాల్లో యింత అధ్వాన్న పరిస్థితి అత్తలకు దాపురించిందా? అనిపిస్తుంది. కోడండ్రు ఇంత భయంకరులైతే ఎలా? రేపు ప్రొద్దున యాకోబు కూడా ఇలాంటి హేతు కుమార్తెనే పెండ్లి చేసుకుంటే నా బ్రతుకు వలన నాకు ఏమి ప్రయోజనము? అని రిబ్కా ఇస్సాకుతో అంటోంది. అలాగైతే ఈ మాటలను బట్టి కోడండ్ర వలన అత్తల ప్రాణాలకు 'విసుకు' 'హాని' కాదు గానీ ప్రాణాలకు 'హాయి' కలగాలి, అత్తలకు వారు ప్రయోజనకారులుగా కూడ వుండాలని వాక్యము హెచ్చరిస్తోంది? అమ్మా కోడళ్ళారా! మీ అత్తల ప్రాణాలకు హాయి మీ ద్వారా దొరుకుతోందా? మీరు అత్తలకు ప్రయోజనకారులుగా ఉంటున్నారా? మీ భర్తలకు, పిల్లలకు మాత్రమే, హాయి కలిగిస్తూ ప్రయోజనకారులుగా ఉంటున్నారా? మరి అత్తల సంగతి ఏమి చేస్తున్నారు? రూతు వలన తన అత్తయైన నయోమికి ఎంత హాయి కలిగిందో, ఎంత ప్రయోజనం కలిగిందో, ఆ విషయాలన్ని ప్రభువు తన కృప ద్వారా నా చేత వ్రాయించిన 'రూతు గ్రంథ ధ్యానములు' అనే పుస్తకంలో మీరు చదువవచ్చు. ఆ సంగతులు మీకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. మీరు మీ అత్తలకు ప్రియులుగా ప్రయోజనకారులుగా ఉండగలరు.

ఈ సమయములో మన ప్రభువైన యేసుక్రీస్తును జ్ఞాపకం చేసుకుందాం. యేసు ప్రభువు 1 పేతురు 3:23వ.లో ఆయన దూషింపబడియు బదులు దూషించలేదు. శ్రమ పెట్టబడియు బెదిరింపలేదు అని వ్రాయబడింది. ప్రభువే సర్వశక్తిగల, సర్వోన్నతుడైన ప్రభువే బెదిరించలేదు అంటే పనికిమాలిన మానవులమైన మనము ఎవరినైననూ బెదిరించుటకు మనకు అర్హత ఉన్నదా? ఎవరి పట్లనూ మనము భీకరంగా ఉండకూడదు. భీకరుల ఊపిరి గోడకు తగిలే గాలివానగా ఉంటే, మన దేవుడు దీనులకు ఆశ్రయంగా ఉంటాడని యెష. 25:3వ.లోని వాక్యము చెబుతుండగా బెదిరించే జీవితం మనలో ఎవ్వరికీ ఉండకూడదు. అలాకాక, జంతువులను గానీ ఎవరినైనా గానీ మనం బెదిరిస్తే ఆ బెదురును దేవుడు మళ్ళీ మన మీదికే పంపిస్తారు అను వాక్యాన్ని గుర్తుతెచ్చుకొని, ఏమైనా అన్యాయము మనకు జరిగివుంటే న్యాయముగా తీర్పు తీర్చు దేవునికి మనల్ని మనం అప్పగించుకోవాలని నేర్చుకుంటున్నాం.

**XVII. పిల్లల్లో బేధము లేక పక్షపాతము చూపిన రిబ్కా:–** తండ్రి పెద్ద కుమారుడైన ఏశావును 'నాకుమారుడా! అని పిలుస్తుండగా తల్లి చిన్న కుమారుని 7వ.లో నా కుమారుడా! అని

పిలుస్తున్నారు. ఒకడు తండ్రి కుమారుడైతే మరొకడు తల్లి కుమారుడుగా కనిపిస్తున్నారు. ఇరువురు తలిదండ్రులు ఒక్కో కుమారుని పంచుకున్నట్లున్నారు. పిల్లలిద్దరూ తన గర్భములో తొందర చేస్తుండగా రిబ్కా వారి కొరకు ప్రార్థించగా పెద్దవాడు చిన్నవాడికి దాసుడవుతాడని ప్రభువు చెప్పిన కారణాన రిబ్కా యాకోబునే ప్రేమిస్తోంది. ఏశావు జ్యేష్ఠుడు గనుక జ్యేష్ఠునికే ఆశీర్వాదం రావాలని ఇస్సాకు ఏశావును ప్రేమిస్తున్నాడు. తండ్రి ఏశావును దీవించుటకు వేటకు వెళ్ళి వేటాడిన మాంసముతో భోజనము తయారు చేసి తీసుకురమ్మంటే, తల్లి యాకోబుతో మందలోని మేకపిల్లలను తెప్పించి భర్తకిష్టమైన భోజనము చేసి భర్తకు యాకోబుతో పంపింది. మందకు వెళ్ళి యాకోబు తెచ్చిన పొట్టేళ్ళతో తల్లి త్వరగా వంటచేసి యాకోబును తండ్రి యొద్దకు పంపింది. యాకోబు మోసంగా తండ్రి దీవెన పొందుకున్నాడు. ఆ తరువాత ఏశావు భోజ్యాలను సిద్ధపరచి తండ్రి యొద్దకు తెచ్చి తిని ఆశీర్వదించమన్నాడు. తండ్రి ఆశ్చర్యపడ్డాడు. తన తమ్ముడు ముందే తండ్రి యొద్దకు వచ్చి మోసంగా ఆశీర్వాదం పొంది వెళ్ళాడని తెలిసి ఏశావు తన తండ్రి మరణించాక తమ్ముడైన యాకోబును చంపుదామనుకున్నాడు. తల్లి పెద్దవానికి కాదు చిన్న కుమారునికే ఆశీర్వాదం రావాలి అని తన స్వంత ప్రయత్నంతో అలా చేయుట వలన ఇద్దరు కుమారుల మధ్య భేదాభిప్రాయాలు, చంపాలనుకోవడము యివన్నీ జరిగాయి. పెద్దవాడు చిన్నవానికి దాసుడు అవుతాడని, చిన్నవాడు దీవించబడుతాడని దేవుడు చెప్పింది నిజమే కానీ, చెప్పిన దేవుడే రిబ్కా ప్రయత్నం లేకుండా చేస్తాడు కానీ, దేవునికి తానే సహాయం చేయాలి అన్నట్లు రిబ్కా తన స్వంత ప్రయత్నం చేయుట ద్వారా పిల్లల మధ్య ఐక్యత లేకుండా బద్ధ విరుద్ధం ఏర్పడటానికి కారణమయ్యింది. దేవుడేమో చిన్నవాడిని దీవించాలని ఉన్నాడు. ఇస్సాకేమో పెద్దవాడిని దీవించాలని అనుకున్నాడు. రిబ్కాతో దేవుడు చిన్నవాడే దీవించబడతాడని చెప్పాడు గనుక రిబ్కాయే ఇలా యాకోబుతో డ్రామా ఆడించినట్లు చూస్తున్నాము. రిబ్కా అలాగు చేయక ప్రభువా ఈ సందర్భములో మీరే సహాయం చేయమని నీ చిత్తమే ఎలా నెరవేర్చుతావో, నెరవేర్చమని దేవున్ని ఇంతకుముందు అడుగ వెళ్ళినట్లు లేదా ప్రార్థించినట్లు ఇప్పుడు కూడ ప్రార్థించినట్లయితే బాగుండేది? కానీ, దేవుని కార్యాలకు మన స్వంత ఐడియాలను జోడిస్తే సంగతులు వికటిస్తాయి. సమధానంగా జరుగవలసిన సంగతులు అసమాధానంగా, క్లిష్టంగా, భయభీతుల మధ్య, ఆందోళనల మధ్య జరుగుతాయి. ఎన్నో టెన్షన్లకు మనము గురికావాల్సి వస్తుంది. ఇలా రిబ్కా తన పిల్లల మధ్య తారతమ్యాలను చూపడం వలన ఏశావు తన తమ్ముని చంపాలి' అనుకునే ఆలోచనలోకి వెళ్ళిపోయినట్లు చూస్తున్నాం. ఆమెనుబట్టియే పిల్లల మధ్య ఈ విరుద్ధ భావాలు ఉత్పన్నమైనట్లు చూస్తున్నాం. సోదరీలారా, మనకు దేవుడిచ్చిన పిల్లలందరినీ ఒకే ప్రేమతో తారతమ్యము లేకుండా ప్రేమించాలి. వారందరూ ఒకరినొకరు ప్రేమించుకునేలా పెంచాల్సిన అవసరం ఉన్నది. ప్రియ సోదరీలారా! ప్రతి సమస్య కొరకు మనము ప్రార్థన చేయవలసి ఉన్నది. ఒకవేళ ఇస్సాకు పెద్ద కుమారుడైన ఏశావునే దీవించినప్పటికీ దేవుడు తాను చెప్పిన ప్రకారము యాకోబును తన స్వంత

సమయంలో దీవించుకోలేదా? రిబ్కా యాకోబు దీవించబడే విషయము దేవునికే వదిలేయాల్సి ఉండింది. అలా చేయక ఏశావుకు, యాకోబుకు తనకు మధ్య భేదాభిప్రాయాలు, అనైక్యతలు, కలిగించడానికి కారణమయ్యింది.

18. కార్యాంభము కంటే కార్యాంతము మేలుగా లేని రిబ్కా- రిబ్కా మరణాన్ని గురించిగానీ, ఆమె సమాధి గురించి గానీ బైబిల్‌లో ఎక్కడనూ వ్రాయబడలేదు. కానీ ఆది. 35:8వ.లో రిబ్కా దాదియైన దెబోరా చనిపోయి 'బేతేలు'కు దిగువను వున్న సింధూర వృక్షము క్రింద పాతిపెట్టబడెను' అని వ్రాయబడింది. ఆచోటికి 'అల్లోను బాకూత్' అని పేరు పెట్టబడినట్లు చదువుచున్నాము. ఆదినాల్లోనే రిబ్కా కూడ మరణించుటనుబట్టి ఇద్దరి కొరకునూ బంధువులు ఏడ్చినట్టు ఏడ్పుల చెట్టుగా ఆ చెట్టుకు పేరుపెట్టినట్లు చరిత్రకారులు చెప్పుచున్నారు. రిబ్కా మరణము సమాధి అంత్యక్రియలు కొన్ని కారణాలనుబట్టి మర్మంగా ఉంచబడ్డాయి. కారణం, ఏశావు యొక్క జ్యేష్ఠత్వపు, ఆశీర్వాదాలు యాకోబు తీసుకొనుట, యాకోబు తన తల్లిదండ్రుల మాట ప్రకారం తన మామయైన లాబాను నొద్దకు, పద్దనరాము వెళ్ళుట, యాకోబు తండ్రిని మోసగించి అశీర్వాదాలను పొందుటకు తల్లియైన రిబ్కా సహాయము చేసిందని ఆమె మీద ఏశావుకు అయాసముండుట. ఏశావు యాకోబును చంపదలంచుట, ఈ కారణాలన్నిటినిబట్టి రిబ్కా మరణము, ఆమె సమాధి గోప్యంగా ఉంచబడినవని చరిత్ర చెబుతోంది. రిబ్కా చనిపోయినప్పుడు, యాకోబు పద్దనరాములో ఉండిపోవుట ఇస్సాకు మందదృష్టితో ఉండుట, ఏశావు రిబ్కా మీద ఆయాసముగా ఉండుట వలన రిబ్కా మరణ, భూస్థాపన మరుగులో ఉంచబడ్డాయి. రిబ్కాకు ప్రియమైన చిన్న కుమారుడు తల్లి మరణ సమయంలో వచ్చినట్లు బైబిల్‌లో కనపడుటలేదు. ఏశావుకు కూడ తల్లిమీద అయాసముంది కనుక ఏశావుకు కూడ ఆ విషయము గోప్యముగా వుంచబడినట్లుంది. తల్లి మరణ సమయాన పిల్లలు తల్లిని, తల్లి పిల్లలను ఆఖరి చూపులుగా చూచుకోలేకపోయారంటే రిబ్కా జీవితం ఎంత విశాదంగా ముగిసిందో కదా! 16 అంశాలలో మాదిరిగా వుండిన రిబ్కా జీవితం 17వ అంశములో పిల్లలలో భేదాభిప్రాయాలను పుట్టించినందు వలన, ఆమె ప్రేమలో తారతమ్యాలు చూపించుట వలన కార్యాంభముకంటే కార్యాంతము మేలుగా వుండలేకపోయింది. ఇది కడు శోచనీయము. రిబ్కా చేసిన తప్పును మనము చేయకుండవలెనని మనకు బుద్ధి కలుగునట్లు ప్రభువు మన మేలు కొరకే ఆమెలో మాదిరి లేని 17వ అంశాన్ని కూడ ప్రభువు మన కొరకు వ్రాయించి పెట్టారు. ప్రియ సోదరీ! భార్యా భర్తలైన మీ ఇరువురికి వ్యతిరేకమైన తలంపులు ఉన్నట్లయితే ఇద్దరు గానీ, నీవొక్కతెవైనా గాని ప్రార్థించాలే కానీ, ఏదో ఒకటి నీకు తోచినట్లు చేయకూడదు. దేవుడు నీకేమైనా బయలుపరచి వున్నట్లయితే అది దేవుడే చేసుకుంటాడు. ఆయన చేయాల్సిన పనిని మనచేతుల్లోకి తీసుకొని మనం చేయకూడదు అనే పాఠాన్ని చాలా గట్టిగా మనం నేర్చుకోవాలి. అలాంటి తప్పు మనం ప్రభువు కృప ద్వారా చేయకుందుము గాక!

వీరిరువురు అబ్రహాము కోడలైన రిబ్కా యొక్క కోడళ్లు. అబ్రహాము కుమారుడైన ఇస్సాకు, రిబ్కాలకు జన్మించి వీరిద్దరు యాకోబు తన తల్లిదండ్రులు చెప్పిన ప్రకారము తన మామయైన పద్దనరాములో నివసించుచున్న లాబాను కుమార్తెలైన లేయా, రాహేలులను వివాహము చేసుకున్నాడు. లాబాను కుమార్తెలలో పెద్దదాని పేరు లేయా.

**1 లేయా జబ్బుకళ్ళదైన లేయా:-** ఆమె జబ్బు కళ్ళలో మాత్రమే ఉన్నట్లు చూస్తున్నాము. ఇక ఏ అవయవములోనూ జబ్బులేదు. మనకున్న పాపమనే జబ్బు కళ్ళకు మాత్రమే కాదు. 'తల నుండు విషము ఫణికిని, వెలయంగా తోకనుండు వృశ్చికమునకున్, తలతోక అనక ఉండును ఖలునకు నిలువెల్లా విషము" అన్నట్లు నరమానవులమైన మనకు అరికాలు మొదలుకొని నడినెత్తివరకు స్వస్థ కొంచెమైనను లేనివారమైయున్నాము. ఆమె కళ్ళు జబ్బు కళ్ళు. అది శరీర సంబంధమైన జబ్బే కానీ, పాప సంబంధమైన జబ్బు మాత్రము కాదు. ఆమె కళ్ళతో పాపము చేసినట్లు లేఖనాలలో ఎక్కడనూ చదవలేము. మత్తయి 6:22,23వ.నాలలో ఈలాగు వ్రాయబడింది. దేహమునకు కన్ను దీపములాంటిది. మత్త 6:22వ.లో వ్రాయబడినట్లు మనకన్ను తేటగా పాపము మచ్చలు లేనిదైతే దేహమంతయు వెలుగుమయమై పాపము లేనిదిగా పరిశుద్ధముగా ఉంటుంది. మన కన్ను చెడుచూపులతో చెడినదైతే మన దేహమంతయూ చీకటిమయమవుతుంది. ఉదాహరణకు దేవుని హృదయానుసారుడైన దావీదు స్నానము చేయుచున్న స్త్రీని చెడు దృష్టితో చూచి ఆమెతో పాపము చేయగా తన దేహమంతయు చీకటియై పోయింది. చూచిన దానినిబట్టి ఆశించి నేత్రాశలో పడి దావీదు చెడిన దేహము కలవాడై దేవుని ఉగ్రతను దేవుని దండనను అనుభవించవలసి వచ్చింది.

అలాగే లోతు ఆది 12:10లో కన్నులెత్తి యొర్దాను ప్రాంతమంతటినీ యెహోవా తోటవలెను, ఐగుప్తు దేశము వలెను నీళ్ళు పారు దేశముగా ఆ ప్రాంతమంతటిని నేత్రాశతో చూచాడు. ఆ ప్రాంతమే చివరికి అగ్ని గంధకాలతో కాల్చబడ్డాయి. అలాగే ఈ నేత్రాశ అనే జబ్బుతోనే న్యాయాధిపతియు నాజీరునుయైన సంసోను న్యాయా. 16:1లో వేశ్యనొకతెను చూచి ఆమె యొద్ద చేరెను అని చదువుచున్నాము. మొదటిసారి ఏ సమస్య లేదు కానీ రెండవసారి 16:4,5వ.లో వేశ్యనొకతెను మోహించాడు అనగా చూపుతోను, హృదయముతోను మోహించాడు. అందుకే ఆ మోహపు కళ్ళు ఊడదీయబడి బంధింపబడ్డాడు. ఈలాగున మన కళ్ళు మన దేహాలకు దీపాలుగా ఉన్నాయి. ఇవి చెడిపోతే దేహమంతా చెడి అపవిత్రమైపోతాయి. కనుక ఇటువంటి కళ్ళతో మనం పాపము చేయకుండా యోబువలె నిబంధన చేసుకుంటే మంచిది. యోబు 31:1లో యోబు తన 7గురు కుమారులకు భార్యలను తేడానికి పెళ్ళిచూపులకు వెళ్ళాల్సింది. కానీ కన్యకను నేనేలాగు చూచుదును?

నేను నా కన్నులతో నిబంధన చేసికొంటిని' అన్నాడు. అలా యౌవనస్థులందరు నిబంధన చేసుకుంటే కళ్ళకు పాపపు జబ్బే లేకుండా ఉంటుంది. దేహమునకు దీపమైన కన్ను తేటగా ఉంటుంది. అప్పుడు తమ యవ్వన జీవితమంతా వెలుగుమయమై ఉంటుంది.

లేయా తన జబ్బు కళ్ళనుబట్టి యాకోబు ప్రేమకు నోచుకోలేకపోయినట్లు మన కన్నులలో కూడ పాపపు చెడుగు ఉన్నట్లైతే దేవుని ప్రేమను, పొందలేమని గుర్తుంచుకోవాలి.

## రాహేలు పరిచయము

రాహేలు బైబిల్లో ఆది. 29:6వ.లో కనిపిస్తుంది. రాహేలు పేరుకు ఆడుగొఱ్ఱె అను అర్థముంది. 'గొఱ్ఱె' ఇశ్రాయేలీయులలో అభివృద్ధికి, భద్రతకు గుర్తు. ఆడు గొఱ్ఱె అను అర్థమిచ్చు రాహేలు గొఱ్ఱెల వెంట వచ్చుచున్నదని చదువుచున్నాము. 9వ.లో రాహేలు తండ్రి గొఱ్ఱెలమందను తోలుకొని వచ్చెననియు ఆమె వాటిని మేపునది అనియు ఆమెను గురించి వ్రాయబడింది. గొఱ్ఱెల వెంట వచ్చునది, గొఱ్ఱెలను తోలుకొని వచ్చెననియు, ఆమె వాటిని మేపునది అంటే ఆమె గొఱ్ఱెల కాపరి అని మనకు ఇట్లే అర్థమవుతుంది. లాబానుకు ఇద్దరు ఆడపిల్లలలో చిన్నదైన రాహేలు తండ్రి మందను కాయుచున్నట్లు తెలుస్తుంది.

మన పరలోకపు తండ్రికి కూడ సంఘము అనే గొఱ్ఱెల మంద ఉన్నది. అందులో ఎన్నో, ఆడు గొఱ్ఱెలు, మగ గొఱ్ఱెలు ఉన్నాయి. ప్రియ సోదరీ! నీవు ఆడు గొఱ్ఱెలను, రక్షించి మందలో చేర్చి వాటికి వాక్యమను మేతను పెట్టి, బలిష్ఠమైన వాటిని కాయుచున్నావా? ఆ ఆడు గొఱ్ఱెల మధ్య దేవుని పనిని చేయుచున్నామా? ఆ గొఱ్ఱెలను ప్రార్థనలో కాయుచున్నామా? రగూయేలు 7గురు కుమార్తెలు కాపరిపనియే చేశారు. అసలు యేసు ప్రభువు యోహాను సువార్త 10:11వ.లో నేను గొఱ్ఱెలకు మంచి కాపరిని. మంచి కాపరి గొఱ్ఱెల కొరకు తన ప్రాణము పెట్టును అన్నట్లు ఆ ప్రభువు గొఱ్ఱెలమైన మన కొరకు తన ప్రాణము పెట్టాడు. అలాంటి కాపరి ఈ లోకంతోనే లేడు. ఒకసారి యేసు ప్రభువు యోహాను సువార్త 21:15వ.లో 16వ.లో, 17వ.లో సీయోను వీరికంటే నీవు నన్ను ఎక్కువ ప్రేమించుచున్నావా? అని మూడుసార్లు అడుగగా నేను నిన్ను ప్రేమించుచున్నానని నీవే ఎరుగుదువని సీయోను ప్రభువుతో చెప్పారు. వీరికంటే అంటే ఈ మిగత శిష్యులకంటే అని ఒక అర్థము, మరొక బైబిల్ వర్షన్‌లో (version) వీటికంటే అనగా వారు పట్టిన చేపలకంటే అని కూడ అర్థమొస్తుంది. సీమోను శిష్యులకంటే, వారు పట్టిన ఈ చేపలకంటే నిన్నే ఎక్కువగా ప్రేమించుచున్నానని చెప్పినట్లు వాక్యంలో చూస్తున్నాము. అట్లయితే యేసును అందరికంటే, అన్నిటికంటే ఎక్కువగా ప్రేమించువారే సంఘాన్ని ప్రేమించగలడు అని అర్థమవుతుంది. ప్రభువును ప్రేమించువారే సంఘమును ప్రేమిస్తారు. ప్రియ సోదరీ! నీవు ప్రభువును ప్రేమిస్తున్నావా? అలాగైతే ప్రభువును అందరికంటే, అన్నిటికంటే ప్రేమించాలి.

అదే సమయములో సంఘములోని ఆడుగొఱ్ఱెలను మేసే పని, కాచేపని నీవు చేయగలవు. రాహేలు ఆ గొఱ్ఱెలను మేపింది. వాటి వెంట వచ్చింది, వాటిని కాచింది. అంటే నీవు కూడ దేవుని వాక్యమును మేతను పెట్టాలి. వారి కొరకు ప్రార్థించి వారిని కాయాలి. రాహేలు వెంట కొన్ని గొఱ్ఱెలు వచ్చినట్లు ప్రియసోదరీ, నీవెంట ఎన్ని గొఱ్ఱెలు సంఘానికి వస్తున్నాయి? ఎంతమందిని రక్షించి సంఘానికి నడిపించావు? లేక ఎంతమంది నిన్ను బట్టి బయటికి వెళ్ళిపోతున్నారు?

**సుందరవతియు, రూపవతియునైన రాహేలు:–** రాహేలు సుందరవతియు, రూపవతియునై యుండుటనుబట్టి యాకోబు రాహేలును ప్రేమించాడని ఆది 29:17వ.లో వ్రాయబడింది. మానవుడు బాహ్య రూపాన్ని లక్ష్యపెడతాడు. కానీ దేవుడు అంతరంగ సౌందర్యాన్ని లక్ష్యపెడతాడు. అంతర్యంలో ఆత్మీయ అందాన్ని మనము కలిగియున్నప్పుడు దేవుడు మనల్ని కూడ ప్రేమించేవాడుగా వున్నాడు. రాహేలు సౌందర్యవతియే, రూపవతియే కానీ అంతర్యములో సౌందర్యవతి కాదని 30:1వ. ద్వారా తెలుస్తుంది. తన అక్కకు యాకోబు ద్వారా పిల్లలు పుట్టారని తన అక్క యందు అసూయపడింది అసూయపడడమే కాక యాకోబుతో నాకు గర్భఫలమిమ్ము లేనియెడల నేను చచ్చెదనని భర్తను 'బ్లాక్ మెయిల్' చేయడం తన భర్తను చస్తాను అని బెదిరించడంలాంటివి తన ఆత్మీయతకు రూపాన్ని చూపిస్తున్నాయి. మనమును పైకి బాగావున్నట్లుండినను <u>ఆత్మీయతకు రూపానికి నిదర్శనంగా</u> ఉన్న 1కొరి. 3:3,4వ.లో వ్రాయబడినట్లు అసూయలు కలహాలు, గల.5:18–20వ.లలో వ్రాయబడినట్లు శరీర కార్యాలైన జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, అభిచారము, ద్వేషములు, కలహము, మత్సరములు, అసూయలు, మత్తతలు, అల్లరితో కూడిన ఆటపాటలు మొదలైనవి. ఎఫె. 4:31వ.లో వ్రాయబడినట్లు సమస్తమైన ద్వేషము, కోపము, క్రోధము, అల్లరి, దూషణ, సకలమైన దుష్టత్వము, కరుణ, క్షమాపణలేనితనము, కొలొ. 2:5లో వ్రాయబడినట్లు ఆగ్రహము, మీ నోట బూతులు, అబద్ధములు, ప్రాచీన స్వభావము వీటన్నిటిని మనము విసర్జించాలి. అలాగున వీటన్నిటిని మనము విసర్జించినప్పుడు మన ఆత్మీయ సౌందర్యాన్ని ప్రభువు చూచి మనలను ప్రేమించువారుగా ఉన్నారు.

బాహ్యముగా అందమున్న రాహేలు కోసం యాకోబు 7 యేండ్లు కొలువు చేస్తానన్నాడు. నిజానికి 7+7=14 యేండ్లు రాహేలు కోసమే యాకోబు కొలువు చేశాడు. కానీ ఆత్మీయంగా కురూపంతో ఉన్న అంధవిహీనమైన మన కొరకు ప్రభువు 33 ½ సం॥లు ఈ లోకంలో కొలువు చేశారు. మన కొరకు ప్రాణమిచ్చి సమాధి చేయబడి తిరిగి లేచి తండ్రి కుడిపార్శ్వమున కూర్చుండి విజ్ఞాపన ప్రార్థన అనెడి కొలువు కూడ చేస్తున్నారు. పరలోకము కట్టుచున్నారు. ఆదినుండి అంత్యము కొరకు సంఘము కొరకే కొలువు చేస్తున్నారు. తేజోవాసులను మనల్ని చేసి స్వాస్థ్యాలను సిద్ధపరస్తున్నారు. మన కొరకు భవనములను రమ్యముగా కట్టుచున్నారు? ఎఫె. 1:6వ.లో భూమి పునాదులు వేయకముందే

ప్రేమతో క్రీస్తులో మనలను దేవుడు ఏర్పరచుకొని అదినుండే మన కొరకు కొలువు చేస్తున్నాడు.

యాకోబు మామ తన కుమార్తెను అన్యునికిచ్చుటకంటే నీకిచ్చుట మేలు అన్నట్లు, విశ్వాసులమైన మనము అన్యులను వివాహమాడుట కంటే విశ్వాసులను వివాహము చేసుకోవడం మనకు మేలు. 1 కొరిం. 6:14వ.లో వ్రాయబడిన వాక్యం అదే చెబుతోంది. విశ్వాసికి, అవిశ్వాసికి పాలెక్కడిది? పాలుపంపులే కుదరదంటే ఇక జీవితాంతము విశ్వాసి, అవిశ్వాసి వివాహంలో ఏకమవడం వారితోనే జీవించడము అంటే అది ప్రభువుచిత్తము కాదుగదా. ఈ విషయాన్ని అనేకులు గమనించడం లేదు. దేవుని ఆజ్ఞలు విధులు పాటించినట్లయితే మన కుటుంబ వ్యక్తిగత జీవితాలకు ఎంతో క్షేమము నెమ్మదిని కలిగి ఉంటాయి.

యాకోబు రాహేలును ప్రేమించుట వలన ఆ మొదటి 7 యేండ్ల కొలువు అయనకు కొద్ది దినములుగా తోచాయి అంటే యాకోబుకు రాహేలు మీద ఉన్న ప్రేమ ఎంత త్యాగసహితమైన, నమ్మకమైన గొప్ప ప్రేమయో కదా! ప్రభువు ప్రేమ పాప కురూపుల ప్రేమ ఎలాంటిదంటే అది నిన్న మొన్నటి ప్రేమ కాదు. జగత్తు పునాది వేయబడకమునుపే, నేలమట్టి రవ్వంతైనను పుట్టకముందే సంఘమైన మనకొరకు వధింపబడుటకు సిద్ధముగా ఉన్నాడంటే జగత్తు పుట్టకమునుపు నుండీ మన కొరకు ప్రాణమిచ్చి ప్రేమించుట కిష్టమైన ప్రేమ. యుక్తకాలమున మానవ పోలికలో, రక్తమాంసాలతో పుట్టిన ప్రేమ, నిర్ణయ కాలాన అన్యాయపు తీర్పునొంది యెరూషలేము వీధుల వెంబడి సిలువను మోయుచు క్రింద పడుతూ లేస్తూ వెళ్లిన ప్రేమ, రక్తము కార్చిన ప్రేమ, ముళ్ళ కిరీటము మొత్తించుకున్న ప్రేమ, మారుమాట మాటలాడని ప్రేమ, సిలువలో సాగిపోయిన ప్రేమ కొరడా దెబ్బలు తిన్న ప్రేమ, దిగంబరత్వాన్ని అనుభవించిన ప్రేమ, ఎండకు ఓర్చుకొనిన ప్రేమ, సురూపమును, సొగసును కోల్పోయిన ప్రేమ. తండ్రిని, పరలోకరాజ్యాన్ని మహిమను, సింహాసనమును, శక్తులను దేవదూతల స్తుతిగానాలను, అన్నిటిని కోల్పోయిన ప్రేమ, చనిపోయి, తిరిగి లేచి పరలోకానికి ఆరోహణమై, పరలోకాన్ని మన కొరకు సిద్ధపరచి తిరిగి రానున్న ప్రేమను, ఆయన మన పట్ల చూపారు. అయన ప్రేమ ఇంత సుదీర్ఘ కాలము నుండి చూపిస్తున్న ప్రేమ. ఇంతటి ప్రేమను చూపిన వారు వర్తమాన భూత భవిష్యత్కాలాలో ఎవరునూ లేరు. ఇంతటి అపారమైన ఎనలేని, కనలేని, అసమానమైన ప్రాణమిచ్చిన ప్రేమను చూపించిన ప్రభువు ఎంతగానో శ్రమనొంది వేదనపొంది రక్తమును, నీళ్ళను కార్చారు. తన బలమంతటిని చిల్లపెంకుగా మార్చుకున్నారు. త్యాగసహితమైన ఆ ప్రేమని వర్ణించతరము కాదు. అట్టి ప్రేమను చూపగా మనము దేవుని విశ్వసించి కృపచేత నమ్మి రక్షించబడ్డాము. మనము రక్షించబడి దేవుని పిల్లలమగుట ద్వారా తాను పొందిన వేదననుబట్టి ఆయనకు తృప్తి కలిగింది. ఇట్టి ప్రేమను చూపినవారు ఈ జగత్తులో ఎవరునూ

లేరు. ప్రియసోదరీ! ఇట్టి ప్రేమగల ప్రభువుని వివాహము చేసికొనుట నీకిష్టమేనా? ఇష్టమైతే నేడే నీ పాపములొప్పుకొని ప్రభువును నీ హృదయములో చేర్చుకొని రక్షించబడుమని ప్రభువు పేరట నిన్ను కోరుచున్నాను. ఈలాగున ప్రభువు నిన్ను మానవ సృష్టికి పూర్వమునుండి నిన్ను ప్రేమిస్తూ ఉన్నాడు. ఈ సృష్టి సృష్టించబడి క్రీస్తుకు పూర్వము 4వేల ఏండ్లు క్రీస్తు తరువాత ఇప్పుడు దాదాపు 2000 ఏండ్లు. మొత్తం 6000 సం॥లు. ఇంతకు పూర్వమే మన జగత్తుకు పునాదులు వేయకమునుపే నిన్ను ప్రేమించుట అనగా భూమి పునాదులు ఎప్పుడు వేయబడ్డాయో ఎవ్వరూ ఊహించలేదు. ఆది. 1:1లో ఆదియందు దేవుడు భూమ్యాఆకాశములను సృజించెను అని వ్రాయబడింది. భూమ్యాకాశాలు ఆదియందు సృజించాడు ఆది. 1:2వ.లో ఆ ఆదిలో సృజించబడిన భూమి దేవుని కోపానికి గురియై పోయి నీళ్ళలో మునిగి పోగా, కొన్ని కోట్ల సంవత్సరాల తరువాత ఆది. 1:3వ.లో ఆ నీళ్లచేత కప్పబడిన భూమిని దేవుడు మళ్ళీ సరిచేసి తాను సృజించిన ఆదాము హవ్వలను అందులో వుంచాడు. అలాగైతే నిన్ను నన్ను ప్రభువు ఆది. 1:1వ.లో భూమిని సృజించక మునుపు నుండే ప్రేమిస్తున్నాడు. అనగా నిన్ను నన్ను అనాదికాలము నుండే ప్రేమిస్తున్నాడు ప్రభువు. నీమీద ఉన్న ప్రేమచే ఈ అనాది కాలము నుండి ఆయన చేయుచున్న కొలువు కొన్ని దినాలుగానే ఆయనకు తోస్తున్నాయి. కారణం ఆయన ప్రేమ, ప్రేమ, ప్రేమ.

ఆది 29:21వచనంలో తన దినములు సంపూర్ణమైన తరువాత తన భార్య యొద్దకు పోవునట్లు రాహేలును తనకిమ్మని యాకోబు తన మామయైన లాబానును అడిగినట్లు వ్రాయబడింది. 7సం॥లో మామ తన కుమార్తెను అతనికిచ్చే పర్యంతము ఆమె కొరకు వేచియున్నాడు. 7 సం॥లు క్రితమే వారి వివాహ విషయమై నిర్ణయింపబడింది. కాని వివాహ సమయము వచ్చేంత వరకు రాహేలును ఆయన కలునుకోలేదు. ఇది ఈనాటి యవనులకు ఎంతో పాఠముగా ఉన్నది. వివాహ సమయము కాక మునుపే ఈనాటి యవనస్థులు ఆడపిల్లలు మగపిల్లలు కలసి తిరుగుతున్నారు. శృంగారంలో పాల్గొంటున్నారు. పరిశుద్ధతను కోల్పోతున్నారు. జారత్వములోను, వ్యభిచారములోను జీవిస్తున్నారు. అలాగే యెఫ్తా కుమార్తె ఏ పురుషుని ఆమె ఎరుగనే లేదని, అలాగే రిబ్కా విషయములో 'ఏ పురుషుడును ఎన్నడును ఆమెను కూడలేదనియు, అలాగే యోసేపు కన్య మరియ ఒక యింటిలో ఉన్నప్పటికీ యేసు ప్రభువుకు ఆమె జన్మనిచ్చువరకు వారిద్దరూ ఒకరినొకరు ఎరుగకుండిరి అని ఎంతో మంచి సాక్ష్యము వారి విషయమై వ్రాయబడింది. ఇక్కడ యాకోబు, రాహేలు తమ పెండ్లి దినము వరకు పవిత్రతను కాపాడుకున్నట్లుగా చూస్తున్నాము.

ఆ ప్రకారమే మన పరమ యాకోబు మనలను వివాహము చేసికొనుటకు రెండవ రాకడలో రాబోతూ ఉండగా ఆయన వచ్చే వరకు ఆయన పెండ్లి భార్యగా ఆయన కొరకే పవిత్రముగా కనిపెట్టుకోవాలి. నేను పరిశుద్ధుడను గనుక మీరును పరిశుద్ధులై యుండుడి అని ప్రభువు చెప్పిన ప్రకారము సమస్త ప్రవర్తనలో పరిశుద్ధులై యుందాము. ఎఫె. 5:25

ప్రకారము సంఘవధువైన మనము కళంకముగానీ, ముడుతగాని అట్టిది మరి ఏదైనను లేక పరిశుద్ధమైనదిగాను, నిర్దోషమైనదిగాను మహిమగల సంఘముగాను ఆయన తన ఎదుట దానిని నిలువబెట్టుకొనవలెనని వాక్యముతో ఉదక స్నానముచేత దానిని పవిత్రపరచి, పరిశుద్ధపరచుటకై దాని కొరకు తన్నుతాను అప్పగించుకొనెను. తన్ను తానే స్వచ్ఛందంగా మనలను పవిత్రులుగా ఉంచుట కొరకై సిలువలో ప్రభువు అంతగా కష్టపడి మనల్ని తనకోసం పవిత్రపరచగా ఆ పవిత్రతను క్షణకాల పాప భోగానికి వాడుకొనక ఆయన రాకలో నిందారహితముగా ఆయనను ఎదుర్కొందాం.

ఆది 29:2లో నా భార్యను నాకిమ్ము అని యాకోబు లాబానుతో అడుగగా లాబాను ఆ చోటి మనుష్యులందరిని పోగుచేసి విందు చేయించి రాత్రివేల తన కుమార్తెయైన లేయాను ఎవ్వరికీ అమ్ముడుబోని జబ్బుకళ్ళ అమ్మాయియైన లేయాను అతని యొద్దకు తీసికొని పోగా యాకోబు ఆమెను కూడినట్లు వాక్యము చెబుతోంది. ఉదయమందు ఆయన రాహేలు కాదని లేయా అని ఎరిగి అతడు లాబానుతో నీవు నాకు చేసిన పని యేమిటి? రాహేలు కోసమే కదా నీకు కొలువు చేసితిని, ఎందుకు నన్ను మోసపుచ్చితివని అన్నాడు.

యాకోబు రాహేలు నాకిమ్మంటే, లేయానిచ్చాడు లాబాను. కీర్తన 50:4వ.లో బల్యార్పణచేత నాతో నిబంధన చేసికొనిన నా భక్తులను సమకూర్చుడని మీది ఆకాశమును భూమిని ప్రభువు పిలుస్తున్నాడు. కానీ ప్రభువుతో నిబంధన చేసుకున్న ఆయన ప్రజలమైన మనము (అనగా సంఘము) నేడు కీర్త. 50:16-23 వరకు వ్రాయబడినట్లు ఆత్మీయ అందము లేక 1. భక్తిహీనతతో దిద్దుబాటు అసహ్యించుకొనుచు, దొంగతో ఏకీభవిస్తూ, వ్యభిచారులతో సాంగత్యము చేస్తూ, కీడు చేయవలెనని నోరు తెరుస్తూ, నాలుకతో కపటము కల్పిస్తూ, కూర్చుండి సహోదరులమీద కొండెములు చెప్పుచూ, తల్లి కుమారునిమీద అపనిందలు మోపుతూ, ఇట్టి పనులు సంఘము చేస్తూ ఉండగా ప్రభువు మౌనియై ఉంటూ ఉండగా ఈ జబ్బు కళ్ళ లేయావలె ఉండుటకేనా మనల్ని ప్రభువు పరిశుద్ధపరచుకున్నది? జబ్బు క్రైస్తవులుగా ఈనాడు సంఘమున్నది. ప్రియ సోదరీ! ఎత్తబడే సమయంలో నీవు నేను లేయాలుగానే ఉన్నామా? యెష 5:1,2వ. ప్రకారం ద్రాక్షపండ్లు కాయవలెనని ప్రభువు ఎదురు చూచుచుండగా కారు ద్రాక్షలుగా కాశామా? యాకోబును తన మామయైన లాబాను మోసం చేసినట్లు ప్రభువును మనం మోసం చేస్తున్నామా? గల. 6:6,7లో వ్రాయబడినట్లు 'మోసపోకుడి, దేవుడు వెక్కిరింపబడడు. మనుష్యుడు ఏ పంట విత్తునో ఆ పంటనే కోయును. ఏలయనగా తన శరీరేచ్ఛనుబట్టి విత్తువాడు తన శరీరమునుండి క్షయమను పంటను కోయును. ఆత్మనుబట్టి విత్తువాడు ఆత్మ నుండి నిత్యజీవమను పంట కోయును అని వాక్యము చెబుతుండగా క్షయతను కాక అక్షయతను కోయాలంటే నేను, మనమందరము ఆత్మనుబట్టి విత్తుతూ ఆత్మ నుండి నిత్యజీవ పంటను కోయుటకు సిద్ధపడుదాం. ప్రభువును మనం రొట్టెనడిగితే రాయినిస్తాడా? చేపనడిగితే పామునిస్తాడా? గుడ్డునడిగితే తేలునిస్తాడా? ఏమి

అడిగితే అదే ఇస్తాడు. అలాగే ఆయన రాకడలో మనము రాహేలువలె ఆత్మసౌందర్యముతో ఆయనను ఎదుర్కొవాలని ప్రభువు కోరితే మనం లేయాలాంటి పాపపు జబ్బుతో కనపడితే ప్రభువు యిష్టపడతాడా?

యాకోబు 26వ.లో నన్నెందుకు మోసపుచ్చావని తన మామను అడిగితే పెద్దదానిని ఉంచుకొని ముందుగా చిన్నదానిని ఇచ్చుట మా దేశ మర్యాద కాదని, ఇప్పుడు చల్లగా చెబుతున్నాడు.

దేశమర్యాదలు గానీ, ఏ మర్యాదలు గానీ పెళ్ళి కదుర్చుకొనకముందే వాటిని గూర్చి చర్చించుకోవాలి, గానీ యాకోబు 7 యేండ్ల కొలువు చేసిన తరువాత మామగారు ఇప్పుడు దేశ మర్యాదను గురించి చెప్పడం ఆయన చేస్తున్న మోసమే గానీ దేశ మర్యాద కొరకు కాదు. ఖర్చుకాని తనకుమార్తెను, అమ్ముడుబోని తన కుమార్తెను, ఎవ్వరూ మెచ్చని ఇష్టపడని జబ్బు కళ్ళ కుమార్తెను యాకోబుకు బలవంతంగా అంటకట్టే ప్రయత్నంలో 'దేశ మర్యాద ఒప్పుకోదు అంటున్నాడు. దేవుడు ఒప్పుకుంటాడా? అని ఆలోచించక దేశ మర్యాద ఒప్పుకోదు' అంటున్నాడు. ప్రియ సోదరీ! నీ పెళ్ళి దేవుడు ఒప్పుకునే పెళ్ళా? లేక దేవుని అంగీకారము కాక, దేశ అంగీకారమా? ఎవరికి ముందు పెళ్ళి కుదిరితే వారు ముందుగా పెళ్ళి చేసికోవచ్చు దానిలో తప్పేముంది? నిర్గ 4:10లో మోషే 'ప్రభువా నేను నోటి మాంద్యము, నాలుక మాంద్యము గలవాడను నన్ను ఫరో యొద్దకు ఇశ్రాయేలీయుల విడుదలకై నన్ను పంపిస్తావా? అన్నప్పుడు యెహోవా 11వ.లో మానవునికి నోరిచ్చిన వాడెవడు? మూగ వానినే గాని, చెవిటివానినే గాని దృష్టి గలవానినే గాని గ్రుడ్డివానినే గాని పుట్టించినవాడెవడు? యెహోవానైన నేనే గదా! కాబట్టి వెళ్ళుము నేను నీ నోటికి తోడైయుండి, నీవు ఏమి పలుకవలసినది బోధించెదనన్నాడు కదా! అలాగే లేయా పెండ్లి విషయములో కూడ ఆమెను జబ్బు కళ్ళ అమ్మాయిగా పుట్టించిన దేవుడే ఆమెకు పెళ్ళి జరిగిస్తాడు కదా! ఇలా దేవుని వైపు లాబాను ఎదురు చూచి ఉంటే అది లేయాకు, రాహేలుకు, యాకోబుకు, అందరికీ ఏ పేచీ లేకుండా పోయేది. అనవసరంగా దేశ మర్యాద కాదని అల్లునికి లేయాను అంటగట్టడము వలన అట్లు లేయా భర్తయైన యాకోబు దగ్గర స్వేచ్ఛ సుఖము లేకపోవడము, యాకోబుకు ఇబ్బందికరమవ్వడం, రాహేలుకు కూడ అక్కమీద అసూయ పడటం ఇవన్నీ సమస్యలు అనవసరంగా వచ్చి పడ్డాయి. దేశమర్యాద అను నెపంతో లాబాను తన పెద్ద కుమార్తెను యాకోబుకిచ్చి చేతులు దులిపేసుకున్నాడు. ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లు అల్లుడైన యాకోబుకు ఇద్దరు కుమార్తెలను పెళ్ళిచేసి పని ముగించుకున్నాడు. కానీ ఇప్పటినుండే యాకోబుకు కుటుంబ సమస్యలు ప్రారంభమయ్యాయి.

యాకోబు తన తండ్రికి, అన్నకు మోసం చేసి దీవెనలు పొందుదామనుకున్నాడు. కానీ 'చెరపకురా చెడేవు' అన్నట్లు 'మోసపోకుడి దేవుడు వెక్కిరింపబడడు. మనుష్యుడు ఏ పంట విత్తునో ఆ పంటను కోస్తావు' అనిన గల. 5:7లోని మాట నెరవేరింది. లాబాను

వివాహంలో దేశమర్యాదను గమనించి నడచుకోవాలన్నట్లు ఈ దినాల్లో చాలామంది విశ్వాసులు కూడ అన్యుల మర్యాద, ఆచారాలు లోక మర్యాదలను పాటిస్తున్నారు. రోమా 12:1,2వ.లో 'ఇహలోక మర్యాదను అనుసరింపక ఉత్తమమును, అనుకూలమునునైన దేవుని చిత్తమేదో తెలిసికొనుడి' అని వ్రాయబడింది. మనము వాక్యమేమి సెలవిస్తుందోనని వాక్య మర్యాదను చూడాలి. 2 రాజు 17:23,24వ. ఇశ్రాయేలీయులు యెహోవాకు విరుద్ధముగా పాపము చేసినప్పుడు దేవుడు వారిని అష్షూరుకు చెరకు పంపించాడు. దేవుడు 24వ.లో అష్షూరు రాజు బబులోను, కూతా, అవ్వా, హమాతు, సెపర్వయీము అను దేశముల నుండి జనులను రప్పించి ఇశ్రాయేలు వారికి మారుగా షోమ్రోను పట్టణములలో వుంచెను గనుక వారక్కడ కాపురముండిరి. 25వ.లో వారు యెహోవా యందు భయభక్తులు లేనివారు గనుక యెహోవా వారిమధ్యను సింహములను పంపెను. అవి వారిలో కొందరిని చంపెను. జనులకు <u>ఆ దేశపు దేవుని మర్యాద</u> (అనగా యెహోవా మర్యాద) తెలియకున్నది గనుక దేవుడు వారి మధ్యకు సింహములను పంపించెను. ఇశ్రాయేలు దేవుని మర్యాద వారికి తెలియనందున సింహములు వారిని చంపుచున్నవని వారు అష్షూరు రాజుతో మనవి చేయగా 27వలో అష్షూరు రాజు అచ్చటినుండి తేబడిన యాజకులలో ఒకనిని అచ్చటికి మీరు తోడుకొని పోవుడి. అతడు అచ్చటికి పోయి కాపురముండి ఆ దేశపు దేవుని మర్యాదను వారికి నేర్పవలెనని ఆజ్ఞాపించెను.

పై వాక్యములలో వ్రాయబడినట్లు దేవుని వాక్య మర్యాదనే మనము అనుసరించాలి కానీ, అన్యజనుల ఆచార ప్రకారము మనము నడచుకొనకూడదని అలా నడచుకుంటే సింహములొచ్చాయని, సింహము అనగా విశ్వాసుల విరోధియైన అపవాది 'ఎవరిని మ్రింగుదునా' అని 1 పేతురు 5:8 ప్రకారం మన మధ్యకు వస్తాడని మనము గమనించాలి. ఆత్మీయ జీవితాల్లో ఎంతైనా నష్టము సంభవిస్తుంది. ఈ విషయంలో <u>వాక్య మర్యాద</u> వాక్యం చదివితే మనకు తెలుస్తుంది.

ఇక మరి 7 యేండ్లు కొలువు చేస్తే రాహేలును కూడ నీకిస్తాను అని లాబాను యాకోబుకు చెబుతున్నాడు. ఇక్కడ రాహేలును యూదులకు పోల్చితే, లేయాను అన్యులకు పోల్చితే పరమ యాకోబైన యేసు ప్రభువు యూదుల కొరకు, అన్యుల కొరకు కూడ ఈ లోకంలో కొలువు చేశాడు. యేసుక్రీస్తు అందరికి దేవుడు. అందరికీ ప్రభువు. 30వ వచనంలో యాకోబు రాహేలును పెండ్లి చేసుకున్నాడు. లేవీ. 18:18వ.లో 'నీ భార్య బ్రతికియుండగా ఆమెను పీడించుటకు ఆమె సహోదరి మానచ్ఛాదనమును తీయుటకు ఈమెను ఆమెతో పెండ్లి చేసికొనకూడదు' అని దేవుని వాక్యం చెబుతుండగా మామయైన లాబాను అక్కా చెల్లెళ్లిద్దరినీ యాకోబిచ్చాడు. అక్కాచెల్లెళ్ళిద్దరూ ఒకే భర్తను చేసికోకూడదు. వాక్యములో వ్రాయబడినట్లే రాహేలు తన అక్కను పీడిస్తూ, యాకోబు తన అక్క ఇంటికి వెళ్ళకుండా చేసేది. ఆమె పర్మిషన్ ఇవ్వనిదే యాకోబు లేయా ఇంటికి వెళ్ళేవాడు కాదు. కనుక దేవుడు

వద్దన్న పనులు మనలో ఎవ్వరము చేయకూడదు. యాకోబు లేయాకంటే రాహేలును బహుగా ప్రేమించాడు. లేయాను శరీరానికి పోల్చుకుంటే, రాహేలును ఆత్మకు పోల్చుకుంటే మనముసూ శరీరముకంటే ఆత్మను బహుగా ప్రేమించాలి. అలాగే ఎల్కానా శరీర సంబంధియైన పెనిన్నాకంటే ఆత్మ సంబంధియైన హన్నాను రెండింతలుగా ప్రేమించాడు.

**31వ ద్వేషించబడిన లేయా:-** లేయా యాకోబుచే అలాగే రాహేలుచే కూడ ద్వేషించబడుట యెహోవా చూచాడట. కళ్ళున్న దేవుడు మన దేవుడు. హాగరు శారాచే శ్రమపొందినప్పుడు హాగరు శ్రమను కూడ దేవుడు చూచాడు. ఇశ్రాయేలీయులు ఐగుప్తులో వారి కష్టాలను, దురవస్థలను ఆయన చూచాడు. నీ, నా కష్టాలను, మన మీదికి అన్యాయంగా వచ్చిన ప్రతిదానిని ప్రభువు చూస్తున్నాడు. చూచుచున్న దేవుడాయన. ప్రక్కన చెల్లి బహుగా ప్రేమను భర్తయైన యాకోబు ద్వారా పొందుతోంది. పెద్ద భార్యయైన లేయాను యాకోబు ద్వేషించుట యెహోవా చూస్తున్నాడు. చూచి యెహోవా ఏమి చేశాడు? లేయా గర్భాన్ని యెహోవా తెరచాడు. దేవుడు లేయావైపు ఉన్నాడు. రాహేలువైపు మనిషియైన యాకోబు ఉన్నాడు. దేవుడు మన పక్షమున ఉండగా మనకు విరోధి ఎవడు? కానీ, రాహేలు వైపు దేవుడు లేడు. కనుక ఆమె గొడ్రాలై ఉండింది. యిర్మీ. 17:5 నరులను ఆశ్రయించి శరీరులను తనకాధారము చేసికొనుచు తన హృదయము యెహోవా మీద నుండి తొలగించుకొనువాడు శాపగ్రస్తుడు' అన్న వాక్య ప్రకారము రాహేలు ఈ నరుడైన యాకోబును తనకాధారము చేసికొనుచు ప్రభువును సంతానము కొరకు ఆశ్రయించక సంతానమును పొందలేని శాపాన్ని కలిగి ఉంది. లేయాయైతే యిర్మీ. 17:7వ.లో వ్రాయబడినట్లు ఆమె యెహోవాను నమ్ముకుంది. యెహోవా ఆమెకు ఆశ్రయమైయుండినాడు. 31వ.లో లేయా గర్భాన్ని యెహోవా తెరచాడు. 1 సమూ. 1:5లో హన్నా గర్భాన్ని కొద్దికాలము మూసినవాడు కూడ యెహోవాయే. యెహోవా గర్భములను తెరచువాడు మాత్రమే కాదు. 1. చెవులను తెరవచేయువాడు. మార్కు 7:34. 2. కన్నులు తెరచువాడు. యోహా 9:14. 3. నోరు పెదవులు తెరచువాడు. కీర్తన 51:15. 4. మనసులు తెరచువాడు. లూకా 24:45. 5. హృదయము తెరచువాడు. అపొ. కా. 16:14. 6. పరలోకపు తలుపు తెరచువాడు. ప్రక. 4:1.

**పిల్లలను కనుచున్న లేయా (ఆది 30-35):-** లేయా ద్వేషించబడుట యెహోవా చూచి ఆమె గర్భము తెరవగా ఆమె కుమారుని కని, యెహోవా నా శ్రమను చూచియున్నాడు. గనుక నా పెనిమిటి నన్ను ప్రేమించును గదా! అనుకొని అతనికి రూబేను అనగా ఇదిగో కుమారుడు అనబడే అర్థసహితమైన పేరు పెట్టింది. తనను ద్వేషించే భర్తను లేయా ద్వేషించుట లేదు. ప్రతిగా ఆయన ప్రేమను కోరుకొంటూ 'ద్వేషిస్తున్న పెనిమిటికి ఇదిగో నీ కొరకు కుమారుని కన్నాను' అని మొదటి సంతానాన్ని ఫలముగా రూబేనును అందిస్తోంది. ప్రేమించకుండా ద్వేషిస్తున్న భర్తకు ఫలాలనిచ్చి వారి ప్రేమతోనే రాబట్టుకోవాలని ఈమె నేటి సోదరీలకందరికి నేర్పిస్తుంది. 1 పేతు. 3:2, 33వ.లో లేయా మరల గర్భవతియై

కుమారుని కని ద్వేషించబడితినన్న సంగతి యెహోవా విన్నాడు గనుక అని 'ఇతని కూడ నాకు దయచేసెననుకొని అతనికి షిమ్యోను అను పేరు పెట్టెను. లేయా షిమ్యోను కనేప్పుడు యెహోవా ప్రార్థన 'వినే దేవుడు' అని అనుభవంలో నేర్చుకుంది. మనము ఏమి చేస్తే ఆయన వింటాడు. మనం ప్రార్థిస్తే ఆయన వింటాడు. అలాగైతే లేయా యెహోవాను ప్రార్థించడం నేర్చుకుంది. అవును, విశ్వాసికి శ్రమ వచ్చినప్పుడు అనేక ఆత్మీయ అనుభవాలు నేర్చుకుంటాం. అవును, ఆయన ప్రార్థన ఆలకించే దేవుడు. గనుక సర్వశరీరులు ఆయన వద్దకు వస్తారు. (కీర్తన 91:5). అతడు నాకు మొఱ్ఱపెట్టగా నేనతనికి ఉత్తరమిచ్చెదను. శ్రమలో నేనతనికి తోడై యుండెదను. అతని విడిపించి అతని గొప్ప చేసెదను. దీర్ఘాయువు చేత అతనిని తృప్తిపరచెదను. అలాగున లేయా మొఱ్ఱపెట్టగా యెహోవా ఆమెకు ఉత్తరమిచ్చి శ్రమలో అతనికి తోడైయుండి ఆమెను విడిపించి మరొక కుమారున్నిచ్చాడు. అంతేకాక లేయా రాహేలు కంటే దీర్ఘాయువు పొందింది. యిర్మీ. 29:12వ.లో మీరు నాకు మొఱ్ఱపెట్టుదురేని మీరు నాకు ప్రార్థన చేయుచు వత్తురేని నేను మీ మనవి ఆలకింతును అని ప్రభువు అన్నాడు. కాబట్టి, మనమందరము మనవి ఆలకించే దేవునికి ప్రార్థన చేయాలి. ఆయన జవాబిస్తారు.

34వ. లేయా తిరిగి గర్భవతియై తుదకు ఈసారి నా పెనిమిటి నాతో హత్తుకొని యుండును. అతనికి ముగ్గురు కుమారులను కంటిని అనుకొని అతనికి లేవి అను పేరు పెట్టెను. 'లేవి' అనగా హత్తుకొనుట అని అర్థము. మనము వేటివేటిని హత్తుకోవాలో వాక్యంలో క్రింది వచనాలు చెబుతున్నాయి.

1. ద్వితీ. 13:4. మొదట యెహోవాకు లోబడి ఆయనకే భయపడి ఆయన ఆజ్ఞలననుసరించి ఆయన మాటవిని ఆయనను సేవించి ఆయనను హత్తుకొని ఉండవలెను. 2. ఆది. 2:24 పురుషుడు తన తల్లిని తండ్రిని విడిచిపెట్టి తన భార్యను హత్తుకొనవలెను. 3. రూతు 1:14 రూతు ఆమెను (నయోమిని అనగా అత్తను) హత్తుకొనెను. 4. రోమా 12:9 చెడ్డదానిని అసహ్యించుకొని మంచిదానిని హత్తుకొని యుండుడి. పై వాక్యాలనుబట్టి మనము మొట్టమొదటిగా యెహోవాను, తరువాత భర్తలైనవారు భార్యలను, కోడళ్ళు, అత్తలను, మంచివాటిని హత్తుకోవాలని నేర్చుకోవాలి.

35వ.లో లేయా తిరిగి గర్భవతియై కుమారుని కని ఈసారి యెహోవాను స్తుతించెదనని 'యూదా' అను పేరు పెట్టింది. అంతటితో ఆమెకు కానుపు ఉడిగింది. యూదా అనగా స్తుతి అని అర్థం. నిజానికి స్తుతికి మొదటి స్థానం ఇవ్వాలి. లేయా నాల్గవసారైనా స్తుతించడం నేర్చుకుంది. మన జీవితంలో స్తుతి మొదటి స్థానంలో ఉండాలి. స్తుతిచేయుట యెహోవాకు శోభస్కరము. అది ఎద్దు కంటెను, కొమ్ములును డెక్కలునుగల కోడెకంటెను యెహోవాకు ప్రియము. (కీర్తన. 30:12). కీర్త 22:3వ. ఇశ్రాయేలు చేయు స్తుతులమీద ఆయన ఆసీనుడు కాగోరుచున్నాడు. ఆయన స్తుతికి కారణభూతుడు సజీవులు సజీవులే

కదా నిన్ను స్తుతిస్తారు అను యెష. 38:19లోని మాటనుబట్టి సజీవులైన మనమందరము ఆయన్ను స్తుతించాలి. మృతి ఆయనకు స్తుతి చెల్లించదు. ఆయన చేసిన మేళ్ళనుబట్టి ఆయనను స్తుతించబద్దులమై యున్నాము. సూర్యోదయము మొదలుకొని సూర్యాస్తమయము వరకు ఆయన నామము స్తుతింపతగినది. (కీ. 113:3). ఆయన అధిక స్తోత్రము పొందతగినవాడు. (యిర్మీ. 17:14). నిత్య స్తోత్రము పొందతగినవాడు. (కీర్త. 115:18). కీర్త. 8:2వ.లో బాలుర యొక్కయు, చంటి పిల్లల యొక్కయు స్తుతుల మూలమున దేవుడు ఒక దుర్గమును స్థాపించి యున్నాడట. బాలురు, చంటిపిల్లల స్తుతులే దుర్గముగా ఉన్నయంటే పెద్దవారమైన మనము ఇంకెంతగా స్తుతులు చెల్లించి సాతానుకు విరుద్ధంగా దుర్గములను కట్టాలో కదా! కీర్తన. 50:23వ.లో స్తుతియాగమర్పించువాడు తనను మహిమపరచినవాడుగా ప్రభువు చెబుతున్నాడు. స్తుతిస్తే ఆయనను మహిమపరచుటతో సమానము. కీర్త. 50:14వ.లో దేవునికి స్తుతియాగము చేయుమని ప్రభువు చెబుతున్నాడు. కీర్త. 69:30 ప్రకారము కీర్తనలతో దేవుని నామమును స్తుతిస్తానని దావీదు చెబుతున్నాడు. కీర్త. 78:4వ.లో ఆయన స్తోత్రార్హక్రియలు చేయువాడు.

**I. దేవున్ని ఎందుకు స్తుతించాలి?**

1. కీర్త. 89:52. ఆయన ఆశ్చర్య కార్యములను బట్టి ఆయనను స్తుతించాలి.

2. దాని 2:23 అడిగిన సంగతిని తెలియజేసియున్నాడు గనుక ఆయనను స్తుతించాలి.

3. కీర్త. 99:3 ఆయనది భయంకరమైన గొప్పనామము గనుక ఆయనను స్తుతించాలి.

4. నిర్గ. 15:2 ఆయన నా బలము, నా గానము, ఆయన నా రక్షణ, ఆయస నా దేవుడు గనుక మనమాయనను స్తుతించాలి.

5. కీర్త. 106:1. ఆయన దయాళుడు కాబట్టి స్తుతించాలి.

6. 1 రాజు 5:7 ఆయన జ్ఞానముగల కుమరునిచ్చినందుకు స్తుతించాలి.

7. 1 రాజు 8:15 ఆయన మాటయిచ్చి నెరవేర్చువాడు గనుక ఆయనను స్తుతించాలి.

8. 1 రాజు 8:57 ఆయన తన జనులకు నెమ్మది కలుగజేసినవాడు గనుక ఆయనకు స్తుతి చెల్లించాలి.

9. 1 కొరిం. 15:57. ఆయన మనకు జయము అనుగ్రహించాడు గనుక ఆయనను స్తుతించాలి.

10. 2 కొరిం. 2:14. ఆయన ఎల్లప్పుడు జయము అనుగ్రహించుచున్న దేవుడు గనుక స్తోత్రము చెల్లించాలి.

11. ప్రక. 7:10. ఆయన మనల్ని రక్షించాడు గనుక మా రక్షణకై స్తోత్రం చెల్లించాలి.

12.119:17 ఆయన తన కట్టడలను మనకు బోధించుచున్నాడు. గనుక మన పెదవులు ఆయనను స్తోత్రిస్తాయి.

13. కీర్త. 28:6 ఆయన మన విజ్ఞాపన ధ్వనిని ఆలకించువాడు గనుక ఆయనకు స్తోత్రము కలుగుతుంది.

14. రోమా. 6:18వ. ఆయన తన నీతిని మనకిచ్చాడు. గనుక దేవునికి స్తోత్రం.

## II. దేవున్ని ఎట్లు స్తుతించాలి?

1. కీర్త. 28:7 కీర్తనలతో ఆయనను స్తుతించాలి.
2. కీర్త. 33:2 సితారాతో పదితంతుల స్వరమండలముతో స్తుతించాలి.
3. 24:53 యెడతెగక దేవాలయములో ఉండి దేవునికి స్తోత్రము చేయుచుండిరి.
4. కీర్త. 66:3వ. "నీ కార్యములు ఎంతో భీకరమైనవి అని, నీ విరోధులు నీ బలాతిశయమునుబట్టి లొంగి నీ యొద్దకు వచ్చెదరని నమస్కరించి ఈలాగు స్తోత్రించాలి.

## III. ఎవరెవరు స్తుతించాలి?

1. కీర్త. 30:12 యదార్థవంతులు స్తుతి చేయాలి.
2. కీర్త. 117:2. సమస్త అన్యజనులు
3. కీర్త 148:1. ఉన్నతస్థలముల నివాసులు ఆయనను స్తుతిస్తాయి.
4. కీర్త. 150:6 సకల ప్రాణులు యెహొవాను స్తుతిస్తారు.
5. యెష 38:19 సజీవులు, సజీవులే ఆయనను స్తుతిస్తారు.
6. అ.కా. 3:8 ప్రతి నాలుకయు దేవున్ని స్తుతిస్తుంది.
7. కీర్త 22:23 యెహొవాయందు భయభక్తులు గలవారు, యాకోబు వంశస్థులు, ఇశ్రాయేలు వంశస్థులు అయనను స్తుతిస్తారు.

కీర్త. 148:1-12వ. ఆకాశనివాసులు, ఉన్నత స్థలముల నివాసులు, ఆయన దూతలు, ఆయన సైన్యములు, సూర్యచంద్రులు, కాంతిగల నక్షత్రములు, పరమాకాశములు, అగ్ని, వడగండ్లు, ఆవిరి, హిమము, ఆయన ఆజ్ఞను నెరవేర్చు తుఫాను, పర్వతములు, సమస్తమైన గుట్టలు, పక్షులు, భూరాజులు, సమస్త ప్రజలు, భూమి మీద నున్న అధిపతులు, సమస్త న్యాయాధిపతులు, యవ్వనులు, కన్యకలు, వృద్ధులు, బాలురు, మకరములు, అగాధ జలములు ఆయనను స్తుతించాలని వ్రాయబడింది.

10. యెష. 42:10వ. సముద్ర ప్రయాణము చేయువారు, సముద్రములోని సమస్తము, ద్వీపములు, ద్వీపనివాసులు, అరణ్యము, దాని పురములు, కేదారు నివాస గ్రామములు, సెల నివాసులు, పర్వత శిఖరముల నుండువారు.

11. మత్త. 21:16వ. బాలురు, చంటిపిల్లలు, ఆయనను స్తుతిస్తారు.

## IV. ఎప్పుడెప్పుడు స్తుతించాలి?

1. కీర్త. 30:12 నిత్యము ఆయన స్తుతించబడాలి.
2. కీర్త. 113:3 సూర్యోదయము నుండి, సూర్యాస్తమము వరకు స్తుతించాలి.
3. కీర్త. 115:18. ఇది మొదలుకొని నిత్యము యెహొవా స్తుతించబడును గాక.
4. కీర్త. 145:2 అనుదినము, నిత్యము నీ నామమును స్తుతించెదము.
5. అ.పొ.కా. 2:46 ప్రతిదినము దేవాలయము ఆయనను స్తుతించెదను.

6. 1 ది. 16:36 యుగములన్నిటను ఆయనను స్తుతించాలి.

**V. ఎక్కడ స్తుతించాలి?**

1. కీర్త. 22:22 సమాజ మధ్యమున ఆయనను స్తుతించాలి.

2. కీర్త. 150:1వ. ఆయన పరిశుద్ధ ఆలయమందు దేవుడు స్తుతించబడాలి.

**VI. ఎలావుంటే స్తుతి చెల్లించినట్లు?**

1. కీర్త. 65:1 సీయోనులో మౌనముగా ఉండుట కూడ ఆయనకు చెల్లించినట్లే (స్త్రీలు సంఘములో మౌనముగా (వాక్య ప్రకారము) ఉండినను స్తుతి చెల్లించినట్లే).

**VII.** మనమాయనను స్తోత్రించుటకు కారణమెవరు?

1. యిర్మీ. 17:14 మనమాయనను స్తోత్రించుటకు ఆయనే కారణము.

**VIII. ఎంత వరకు స్తోత్రము ఆయనకు చెల్లించాలి?**

1. రోమా 1:25వ. యుగముల వరకు ఆయన స్తోత్రార్హుడై యున్నాడు.

**IX. ఎక్కడ నుండి స్తుతించాలి?**

1. యెష. 24:16 నీతిమంతులకు స్తోత్రమని భూదిగంతముల నుండి స్తుతించాలి.

**30:1. అసూయపడిన రాహేలు:–** రాహేలు తాను యాకోబునకు పిల్లలు కనకపోవుటనుబట్టి తన అక్కయందు అసూయపడెను. అసూయ కలిగి ఉంటే మీలో అసూయలు, కలహము ఉండగా మీరు శరీరసంబంధులై మనుష్యరీతిగా నడుచుకొనువారు కారా? అని ప్రభువు 1 కొరిం. 3:3లో వ్రాయబడింది. అట్లయితే పితరుని భార్య అసూయకలిగి శరీరసంబంధిగా ఉన్నట్లు చూస్తున్నాము. ఇక్కడ అక్కయైన లేయా తనకు జబ్బు కళ్ళు ఉండినా రాహేలుకున్న అందాన్నిబట్టి తానెన్నడూ అసూయపడలేదు. కానీ దేవుడు జబ్బుకళ్ళ అక్కకు సంతానాన్నిస్తే రాహేలు అసూయపడుతోంది. పిల్లలను దేవుడు తనకే ఇస్తున్నాడన్న అతిశయము కూడా లేయాకు లేదు. లేయాలో వినయమే ఉంది. కనుక విజయము వినయాన్నే నేర్పిస్తుంది. రాహేలు మీద అసూయ పడలేదు లేయా. రాహేలు అక్కమీద అసూయ పడుట మాత్రమే కాక భర్తతో 'గర్భఫలమిమ్ము లేని యెడల చచ్చెదను' అని అంటూ భర్తను 'బ్లాక్‌మెయిల్' చేస్తోంది. భర్త తాను అడిగింది యివ్వకపోతే ఆయనను భయపెట్టవచ్చునా? ఎవరిని చూచి ఆమె ఈలాగున నేర్చుకుంది? శారాగానీ, రిబ్కా గానీ ఎవరూ ఇలా తమ భర్తలను భయపెట్టలేదే. అన్యులు మాట్లాడునట్లు మాట్లాడుతోంది. పిల్లలనిచ్చేది ఎవరు? కీర్త. 127:3వ. కుమారులు యెహోవా అనుగ్రహించు స్వాస్థ్యము. గర్భఫలము ఆయన యిచ్చు బహుమానము' అని వ్రాయబడింది. ఈ వాక్యమును పరిశుద్ధాత్మ ద్వారా తెలిసికొనిన యాకోబు 'నేను గర్భమును యియ్యకపోయినందున దేవునికి ప్రతిగా ఉన్నావా?" అని అన్నాడు. అంటే నన్నెందుకు అడుగుతావు? దేవున్ని అడుక్కో అని అర్థము. కానీ రాహేలు దేవున్ని ప్రార్థనలో అడుగకుండా తన దాసియైన 'బిల్హాతో పొమ్ము ఆమె నా కొరకు పిల్లలను కనును' అని యాకోబుతో చెప్పింది. రాహేలు ప్రార్థనతో పిల్లలను కనకుండా, తన స్వంత

ప్రయత్నము ద్వారా తన దాసియైన బిల్హా ద్వారా మొదట పుట్టిన కుమారుడైన 'దాను'ను పొందుకొంది. దాను పుట్టినప్పుడు రాహేలు 'దేవుడు నాకు తీర్పు తీర్చెను. నా మొఱ్ఱవిని నాకు కుమారుని దయచేశాడు. అతనికి దాను అను పేరు పెట్టుకుంటున్నాను' అనుకుంది. రాహేలు తన ప్రయత్నంతో పిల్లలను పొందుకుంటూ యెహోవా తీర్పు తీర్చాడు. దేవుడు తన మొఱ్ఱను విన్నాడు అంటోంది. ఆమె మొఱ్ఱ ఏమిటి? ప్రభువా! నా దాసి ద్వారా పిల్లలని దయచేయండి అంటోంది. కానీ దాసి ద్వారా పొందుకోవడం దేవుని చిత్తమా? కాదా? అని ప్రార్థించలేదు. అయితే తన ఐడియా ద్వారానే తాను కోరుకున్న రీతిగానే తనకు జవాబు రావాలని ఆమె ప్రార్థించుచున్నది. ఆయన చిత్తాన్ని వెదకకుండా మన చిత్త ప్రకారమే అన్ని జరగాలని అనుకునే తత్వము రాహేలు కలిగి యున్నది. మన చిత్తప్రకారము దేవుడు చేయాలని ప్రార్థించడం ఎంత అవివేకమో కదా! అలా ఆమె ఇష్ట ప్రకారమే 'దాను' అను కుమారుని పొందుకున్నది. 'దాను' అనగా దారితో 'కట్లపాము'. అది గుఱ్ఱముల మడిమను కరుచును. అందువలన ఎక్కువాడు పడిపోవును అని ఆది 49:16,17వ.లో వ్రాయబడింది. అట్లయితే ఈ 'దాను' అనుకుమారుడు కట్లపామని, అందరిని కరచువాడని అందరిని పడిపోవునట్లు చేయువాడని మనకు తెలుస్తుంది. నిజముగా రాహేలు నేను మొఱ్రపెట్టగా యెహోవా ఈ కుమారుని దయచేసెను అని అంటూ ఉండగా దేవుడు ఇలాంటి పాములాంటి, అందరినీ కరచే పిల్లలను అనుగ్రహిస్తాడా? మన ఆలోచనల ప్రకారము మనము పుట్టించుకుని, నేను దేవుని మొఱ్ఱపెట్టగా దేవుడు ఈ కుమారుని నాకనుగ్రహించాడని చెప్పుకోవడు ఎంతమట్టుకు సమంజసము? ఈ దాను గోత్రములో నుండే క్రీస్తువిరోధి ఏడు ఏండ్ల శ్రమలకాల అంత్యములో వచ్చి ప్రభువుతో యుద్ధము చేస్తాడని ప్రవచనము కలదు. 'దాను' గోత్రములోనే యెరోబాము దూడ పూజ మొదలుపెట్టించాడు. దానీయులు దూడను తమ మధ్య ఉంచుకొని విగ్రహారాధన చేయుటానికి కారణమయ్యారు కనుక ఏడేండ్ల శ్రమల కాలంలో ప్రకటన 7:1-8 వరకు చెప్పబడిన పండ్రెండు గోత్రాల లిస్ట్‌లో దాను గోత్రము పేరే లేదు. కానీ, వెయ్యి యేండ్లకాల రాజ్యములో యెహె. 48:1లో వ్రాయబడినట్లు దాను గోత్రము అక్కడ కనబడుతుంది. రాహేలు సర్పములాంటి కుమారుని పొందుకోవడం, అతడు ప్రభువుకే ఏడేండ్ల శ్రమలకాలపు అంత్యములో శత్రువు అవ్వడం ఇవన్నీ ప్రభువు చేసిన పనులా? కాదు, కాదు. రాహేలు తన అక్కకే పిల్లలు పుడుతున్నారు. నాకు కూడ పిల్లలు కావాలి అని తన ప్రయత్నం ద్వారా పుట్టించుకోవడమే గాని, ప్రభువు ఆమె మొఱ్ర విని పుట్టించింది కాదు. ప్రభువు రొట్టెనడిగితే రాయినిస్తాడా? గ్రుడ్డునడిగితే తేలునిస్తాడా? చేపనడిగితే పామునిస్తాడా? అని వాక్యమే చెబుతుండగా, దేన్ని అడిగితే దాన్నే ఇస్తాడు దేవుడు. పాములు మనమే పుట్టించుకుంటున్నాము. కానీ, దేవుడిచ్చాడని చెప్పడం మనకు ధర్మమా? దేవుడు పాములనియ్యడు.

అలాగే హాగరు కూడ గర్భమొస్తే గర్వించింది. కానీ దేవుడు నీకు 'కుమారుడు' పుడతాడు. అతని పేరు ఇష్మాయేలు అని పెడతావు. అతడు అడవి గాడిదవంటి మనుష్యుడు. అతని చేతులు అందరికిని, అందరిచేతులు అతడికిని విరోధముగా ఉండును అని చెబితే

హాగరు 'ప్రభువా! నాకు అడవిగాడిదలాంటి పిల్లవాడు పుడితే నాకేమి సంతోషం ఉండదు. నీకూ మహిమ ఉండదు. అలాంటి పిల్లవాడు నాకు వద్దే వద్దు ప్రభువా' అని ప్రభువుతో మొఱ్రపెట్టుకోవాల్సింది. కాని, కుమారుడు పుడుతున్నాడనే సంతోషమే కానీ, ఎలాంటి మంచి కుమారుడు కావాలో దేవున్ని ఆమె అడుగలేకపోయింది.

రాహేలు కూడ 'అక్కకు పుట్టారు. నాకు పుట్టాలి. అంతేకాని నాణ్యమైన పిల్లలు, దానియేలు, షద్రక్, మేషక్, అబేద్నెగోలాంటి పిల్లలు, యోసేపు, మోషే, దావీదు లాంటి విధేయులైన పిల్లలు, కావాలని వారు దేవున్ని శ్రేష్ఠమైన పిల్లల కొరకు ప్రార్థించలేదు. ఇలా శ్రేష్ఠమైన దేవున్ని ప్రేమించి, స్నేహించి, సేవించే పిల్లలు, ప్రార్థనాపరులైన సంఘాలను కట్టే పౌలులాంటి పిల్లలను కావాలని ఈనాటి స్త్రీలు ప్రభువును కోరుకోవాలి. లేకపోతే సంఘాలలో సర్పాలు, అడవి గాడిదలు, ఫరోలాంటి పెద్ద మొసలులు, హేరోదులాంటి నక్కలూ పుడతారు. పుట్టబోయే పిల్లల కొరకై గర్భవతులైన సోదరీలందరూ పిల్లలు తమ గర్భములో పడకముందే, దేవున్ని మంచి పిల్లలనివ్వమని ప్రార్థించుకోవాలి.

ఆది 3:7వ.లో బిల్హా తిరిగీ గర్భవతియై యాకోబుకు రెండవ కుమారుని కనిందని చదువుచున్నాము. రాహేలు, దేవుని కృప విషయమై తన అక్కతో పోరాడి గెలిచితిననుకొని అతనికి 'నఫ్తాలి' అను పేరు పెట్టింది. తన భర్తయైన యాకోబు దేవునితోను మనుష్యులతోను పోరాడి గెలిస్తే, రాహేలు అక్కతో పోరాడి గెలిచానని చెబుతోంది. ఆది. 32:24వ.లో యాకోబు పోరాడినది ఒక దైవనరునితో పోరాడాడని 30వ॥ ద్వారా తెలుసకోవచ్చు. ఆశీర్వాదము కావాలని మనుష్యులైన 1. తన అన్నతో 2. తన మామయైన లాబానుతో, 3. తన తండ్రియైన ఇస్సాకుతో (మోసముతో) మునుపు పోరాడి గెలిచాడు. ఇప్పుడు నన్ను దీవించితేనేగాని నిన్ను విడువనని దేవునితోనే ఒక రాత్రంతా పెనుగులాడి, తొడగూడు వసలిపోయినా గానీ దేవున్ని పోనియ్యలేదు. యాకోబు దీవెన కొరకైన చేసిన 'ప్రార్థన' దేవుని పోనియ్యలేకపోయింది. ఇంతకు మునుపు మనుష్యులతో పోరాడి గెలిచినవాడు. ఇప్పటినుండి దేవునితోనే పోరాడాలని నేర్చుకున్నాడు. రాహేలు తన అక్కతో పోరాడి గెలిచానంటోంది. గానీ, తన భర్తవలె దేవునితో ప్రార్థనలో పోరాడటము ఇంకా నేర్చుకోలేదు. ఒకే తల్లికి జన్మించినా, రాహేలు అక్కతో పోరాడుతోంది. యాకోబు 4:1వ.లో 'మీలో పోరాటములును, యుద్ధములును దేనినుండి కలుగుచున్నవి? మీ అవయవములలో పోరాడు మీ భోగేచ్ఛల నుండియే కదా? మీరాశించుచున్నారు గాని మీకు దొరుకుట లేదు. నరహత్య చేయుదురు, మత్సర పడుదురు. గాని సంపాదించు కొనలేరు పోరాడుదురు, యుద్ధము చేయుదురు. గానీ, దేవుని అడగనందున మీకేమియు దొరకదు. మీరడిగినను మీ భోగముల నిమిత్తము వినియోగించుకొనుటకై దురుద్దేశముతో అడుగుదురు గనుక మీకేమియు దొరుకుట లేదు' అని వ్రాయబడిన ప్రకారము రాహేలు సంతానాన్ని ఆశించుచున్నది గానీ అమెకు దొరుకుట లేదని అక్కమీద మత్సరపడుతోంది. కానీ పొందలేకపోయింది. 'గర్భఫలమిమ్ము' అని భర్తతో పోట్లాడుతూ, భర్తమీద యుద్ధము చేస్తూ యిస్తావా చావాలా?

అని బెదిరిస్తోంది. గర్భఫలమియ్యకపోయినందున నేను దేవునికి ప్రతిగా ఉన్నానా! అని భర్తయైన యాకోబు కోపము రగిలి చెప్పినను రాహేలు దేవునిని అడగకుండ భర్తను అడిగినందువలన ఆమెకేమియు దొరకలేదు. నాకు పిల్లలు పుట్టలేదు కనుక నా దాసిని యాకోబుకిచ్చుట ద్వారా పిల్లలను కనాలని స్వంత ప్రయత్నము చేసి సంతానము పొందాలని ప్రయత్నించి, తన స్వంత ప్రయత్నం ఫలించాలని దేవునికి మొర్రపెట్టిందే గానీ, నా దాసి ద్వారా కాదు ప్రభువా! నాకే పిల్లల నివ్వండి అని దేవున్ని మొర్రపెట్టి ఉంటే ఎంత బాగుండేదో కదా! అలా అడుగలేదు. అందుకనే సర్పములాంటి, అందరినీ కరచి, వెనుకకు పడగొట్టే 'దాను' అను కుమారుని పొందింది. ఇలాగున విశ్వాసులమైన మనము మన స్వంత ఐడియాల ద్వారా దేవుడు సహాయము చేయాలని, దేవున్నే మనవైపుకు త్రిప్పుకోవాలని ప్రార్థనలు చేసి వచ్చిన దుష్ఫలితాలను, (సర్పములాంటి వాటిని) దేవుని ద్వారానే పొందుకున్నామని చెప్పుకునే ప్రయత్నంలో ఉండే ప్రమాదముంది. సమీప భవిష్యత్తులో అవి మంచి ఫలితాలనుకుంటాము. దూరపు భవిష్యత్తులో అవి మనకును, ప్రభువుకును శత్రువులుగా మారతాయని మనకు తెలియడానికి చాలాకాలం పడుతుంది.

ఉదాహరణకు 'ఇష్మాయేలును' పొందుకున్న కొంతకాలానికి అతడు తన వాగ్దాన కుమారుడైన 'ఇస్సాకుకు' శత్రువని శారా తెలుసుకోలేకపోయింది. ఆ సంగతి తెలిసిన తరువాత దాసిని, దాని కుమారుని వెళ్లగొట్టమని భర్తయైన అబ్రహాముతో చెప్పింది. కనుక దేవున్ని అడుగకుండా ఏ పనియూ చేయకూడదు. పిల్లలు కావాలి, కావాలి అని శారా, రాహేలు అనుకున్నారు గానీ పిల్లలనుగ్రహించే పరమ యాకోబును (దేవునిని) అడగనందున ఎంతో శ్రమను తెచ్చుకున్నారు. తమ మనుమండ్ల, మనుమరాండ్రకు రాబోవు తరాలకు శత్రువులను తయారుచేసి పెడుతున్నాము అని తలంచలేక పోయారు. శారా, ఇష్మాయేలు ద్వారా ఇశ్రాయేలీయులకు 'ఇష్మాయేలీయుల'నే శత్రువులను, దాను ద్వారా క్రీస్తు విరోధిని యేసుక్రీస్తుకు శత్రువుగా చేయబోతున్నాను అనే జ్ఞానము రాహేలుకు లేకపోయింది. వీరిద్దరూ 'పిల్లలు కావాలి' అన్న క్రేజ్‌తోటి ముందువెనుక ఆలోచించక దేవున్ని ప్రార్థించక ఎంత అసూయతో, శరీర సంబంధులుగా నడుచుకున్నారో కదా!

9వ.లో లేయా తన కానుపు ఉడుగుట చూచి తన దాసియైన జిల్పాను తీసికొని యాకోబునకు ఆమెను భార్యగా యిచ్చెనని చదువుచున్నాము. చెల్లిని చూచి అక్కడకూడ తన దాసియైన 'జిల్పాను' యాకోబుకు భార్యగా ఇస్తోంది. దేవుని చిత్తాన్ని తెలుసుకొనక ఒకరిని చూచి మరొకరు తమ దాసీలను యాకోబుకు భార్యలుగా యిస్తున్నారు. యాకోబు వివాహ జీవితంలో యితరుల ప్రమేయమే గాని తన ప్రమేయం అంతగా లేదు. తాను రాహేలును మాత్రమే పెళ్ళాడాలనుకున్నాడు. తల్లిదండ్రులు కూడ తన మేనమామయైన లాబాను కుమార్తెల్లో ఒకరినే పెళ్ళి చేసుకోమన్నారు. కానీ పిల్లలను కనేందుకని ఇద్దరు

భార్యలు తమ దాసీలను భర్తకు భార్యలుగా ఇచ్చుట చూస్తే యాకోబు వివాహ జీవితములో అతని స్వేచ్ఛ లేకుండా ఇతరుల ప్రమేయమే ఎక్కువగా కనిపిస్తుంది. భార్యలు తమ భర్తలకు లోబడి ఉండాలి. భర్తచే భార్యలు నడిపింపబడకుండా, భార్యలచే యాకోబు నడిపించబడ్డాడని అనిపిస్తుంది. 'అతడు నిన్ను ఏలును' అని ప్రభువు చెప్పాడు కానీ భార్యలే భర్తమీద ఏలుబడి చేశారు. ఒక భార్య మాటవిని ఇంకో భార్య మాట వినకపోతే, ఆమె ఊరుకుంటుందా? ఇలాగున యాకోబు పెళ్ళి విషయమై మామగారైన లాబాను ప్రమేయము, అలాగే ఇద్దరి భార్యల ప్రమేయము ఉండింది. అనుకోకుండా బహుభార్యాత్వము యాకోబు జీవితంలో ప్రవేశించింది. ఈ మాటలు తెలుసుకుంటూ ధ్యానిస్తున్న మనము మన వివాహ జీవితంలో ఇతరుల ప్రమేయము కాకుండా దేవుని ప్రమేయమే పూర్తిగా ఉండునట్లు పొరపాటులేమియూ జరుగకుండా ముందునుండీ ప్రార్థించుచూ ఉండుట చాల క్షేమకరము.

లేయాదాసియైన జిల్పా యాకోబుకు కుమారునికనగా లేయా - 'ఇది అదృష్టముగదా' అనుకొని అతనికి 'గాదు' అను పేరు పెట్టెను. పూర్వకాలములో అదృష్టమును ఒక దేవతగా భావించేవారు. యోబుకాలంలో కూడ యోబు 29:11వ.లో యోబును ప్రతివాడు అదృష్టవంతునిగా భావించేవారు. ప్రసంగి. 9:11వ.లో గెలుపుగానీ, విజయము గాని, అన్నముగానీ, ఐశ్వర్యముగానీ, అనుగ్రహము గానీ అన్నియు అదృష్టవశముచేతనే కాలవశముచేతనే కలుగుచున్నవని సొలొమోను తలంచుచూ ఉన్నాడు. కానీ యోహాను 1:2వ. ప్రకారము సమస్తము ఆయన మూలమున కలిగెను. కలిగినదేదియు ఆయన లేకుండా కలుగలేదు అని వ్రాయబడి ఉంది. ఆయన ద్వారా ఆయన కృప ద్వారానే కాని అదృష్టముచేత, కాలవశముచేత కానేకాదు. 12వ.లో లేయా దాసియైన జిల్పా యాకోబునకు రెండవ కుమారుని కనగా లేయా నేను భాగ్యవంతురాలను స్త్రీలు నన్ను - భాగ్యవతి అందురు గదా అని అతనికి 'ఆషేరు' అను పేరు పెట్టెను అని వ్రాయబడింది. లేయా తనకు ఒకరి తరువాత ఒకరు పిల్లలు పుడుతుండడముబట్టి స్త్రీలు తనను భాగ్యవతి అంటారని చెబుతోంది. (కానీ, వాక్యములో ఎలాంటి వారిని లేఖనాలు భాగ్యవంతులు అంటారు? ద్వితీ. 33:29వ.లో ఇశ్రాయేలు నీ భాగ్యమెంత గొప్పది? యెహోవా రక్షించి నిన్ను పోలినవాడెవడు? అని వ్రాయబడింది. రక్షించబడినవారే భాగ్యవంతులట. పిల్లలున్నా ఆస్థిపాస్థులున్నా వెండి బంగారాలున్నా రక్షణ లేకపోతే ఏమున్నా అది సున్న. రక్షణ అనేది విశ్వాసికి గొప్ప భాగ్యము. బైబిల్‌లో కొద్దిమంది, ఇహసంబంధంగా భాగ్యవంతులుగా ఉండిన వారు ఉన్నారు. 1 సమూ. 9:1లో కీషు అనే భాగ్యవంతుడున్నాడు. 1 సమూ. 25:6వ.లో నాబాలు అనే భాగ్యవంతుడున్నాడు. జెక. 1:17లో భాగ్యవంతమైన పట్టణాలున్నాయి. కానీ ద్వితీ. 8:17,18 వచనములలో మీరు భాగ్యము సంపాదించుకొనుటకై మీకు సామర్థ్యము కలుగజేయువాడు ఆయనే. మా సామర్థ్యము

మా బాహుబలము ఇంత భాగ్యము మాకు కలుగజేసెనని అనుకొనకుడి అని దేవుడు చెబుతున్నాడు. అన్ని భాగ్యములు తన ప్రజలమైన మనకు యిచ్చువాడు మన ప్రభువే. 1 రాజు 10:7,8లలో 'నీ జ్ఞానమును, నీ భాగ్యమును నేను వినినదానిని బహుగా మించినవి. నీ జనులు భాగ్యవంతులు. నీ ముందర ఎల్లప్పుడును నిలచి నీ జ్ఞానవచనములు వినుచుండు నీ సేవకులు భాగ్యవంతులు అని 'షేబ' దేశపు రాణిరాజైన సొలొమోనును గురించి చెప్పినట్లు మనము గమనిస్తున్నాము. సొలొమోనును, సొలొమోను జ్ఞానవాక్కులను వినుచున్న అతని జనులకును ఆ భాగ్యాలనిచ్చింది దేవుడే. ఏ భాగ్యమైనా దేవుడే మనకిచ్చువాడై యున్నాడని వాక్యంలో మనము చదువుచున్నాము.

1. దేవుడు ఒక వ్యక్తికి ఇవ్వదలచిన మొట్టమొదటి భాగ్యము ద్వితీ. 33:29వ.లో వ్రాయబడింది. ఇశ్రాయేలూ! నీ భాగ్యము ఎంత గొప్పది. యెహోవా రక్షించిన నిన్ను పోలిన వాడెవడు? ఎవరితో పోల్చలేని రక్షణ భాగ్యము ఇశ్రాయేలీయులకిచ్చాడట. ఇక ఏ జాతికీ లేని రక్షణ గొఱ్ఱెపిల్ల రక్తము ద్వారా వారికి రక్షణను ఇచ్చాడు. రక్షణ అను భాగ్యము లేకుండా ఇక ఏ యితర శరీర సంబంధమైన భాగ్యాలెన్నున్నా అవన్నీ ఈ లోకంలో విడిచిపెట్టాల్సినవే. కనుక శరీర సంబంధమైన భాగ్యాలు కాక ఆత్మ సంబంధమైన భాగ్యాలు మనకవసరం. వాటి మీద మనము శ్రద్ధ నిలుపుదాం.

2. దేవుడు తన జనులమును, తన సేవకులమైన మనకిచ్చిన రెండవ భాగ్యము ఏమిటనగా 1 రాజు 10:8లో సొలొమోను జనులు, సొలొమోను ముందర ఎల్లప్పుడు ఆయన జ్ఞానవచనము వినే ఆయన సేవకుల భాగ్యము గొప్పదని షేబరాణి అంటుంటే ఇక పరమసొలొమోనైన యేసుక్రీస్తు సేవకులమైన మన భాగ్యము ఇక ఎంత గొప్పదని చెప్పాలి. కనుక మన ప్రభువు మాటలు వినే భాగ్యము చదివే భాగ్యము వాటి చొప్పున జీవించే భాగ్యము ఎంత గొప్పవో ఆలోచించండి.

3. దేవుడు మనకనుగ్రహించిన మూడవ భాగ్యము జెకర్యా. 3:7వ.లో ఈలాగు వ్రాయబడింది. యెహోవా దూత యెహోషువతో 'నా సన్నిధిని నిలుచు భాగ్యము నేను నీకిత్తును' అని అన్నాడు. అవును, రక్షించబడి, ఆయన వాక్కులను వినేవారమైన మనకు ఆయన సన్నిధిలో వుండటం కూడ ఎంతో గొప్ప భాగ్యము. హన్నా తన కుమారుడు తన బ్రతుకు దినములన్నియు ఆయన మందిరములో ఉండాలని కోరుకుంది. దావీదు కూడ చిరకాలము యెహోవా మందిరములో నివాసము చేసెదనని కోరుకున్నాడు. తన సన్నిధిలో నిలిచి నైవేద్యము, పరిచర్య, ధూపము వేయుటకు దేవుడు లేవీయులను దేవుడు నియమించుకున్నాడు. ఇలా దేవుని సన్నిధిలో వుండటము కూడ ఒక భాగ్యమే అని దేవుడు తన వాక్యంలో చెబుతున్నాడు. ప్రియ సోదరీ! నీవు నీ పిల్లలు దేవుని సన్నిధిలో ఉండగోరుతూ ఉన్నారా? ఆయన సన్నిధి భాగ్యము పొందాలనుకుంటున్నారా? ఆయన సన్నిధి భాగ్యము

కంటే మనకింకేమి కావాలి? పెనిన్నా పిల్లలు దేవుని సన్నిధిలో వుండే భాగ్యము పొందుకొని ఉండాల్సింది. ఆ ఉద్దేశ్యంతో పెనిన్నా వారిని కనలేదు, పెంచలేదు. వారేమయ్యారో కూడా వారి సంగతులే మనకు తెలియదు. చిరకాలము దావీదువలె మనము, మన పిల్లలము ఆయన సన్నిధిలోనే ఉండకోరుకుందాం.

4. దేవుడు తన ప్రజలకిచ్చిన నాల్గవ భాగ్యము 2 కొరింథీ. 9:10వ.లో వ్రాయబడింది. ఈ వచనములో వ్రాయబడిన ప్రకారము దేవుడు మనకు విత్తుటకు విత్తనమును, తినుటకు ఆహారమును వృద్ధి పొందుటకు నీతిఫలములను ఇచ్చి పూర్ణ ఔదార్యభాగ్యము గలవారగునట్లు చేస్తారట. దేవుడు అన్ని మనకిచ్చి ఆయన మనకిచ్చిన దానిలోనుండి దీనదరిద్రులకిచ్చుటకు, <u>పూర్ణ ఔదార్యమనే భాగ్యమును</u> కూడ ఇస్తాడట. లేనివారికిచ్చుట కూడా ఒక భాగ్యమే. ఔదార్యబుద్ధి పూర్ణముగా దేవుడు మనకిస్తాడట. ప్రియసోదరీ! నీకున్న దానిలోనుండి లేనివారికి నీ ఔదార్యము చూపగలుగుతున్నావా? లేక అంతాభాగ్యము ఎవ్వరికీ యివ్వకుండా నీవు, నీ పిల్లలే కాజేసుకుంటున్నారా? లేని పేదలకు, సేవకులకు, ఆకలిగొన్నవారికి అవసరములో ఉన్నవారికి, రోగగ్రస్తులకు యిస్తే మన భాగ్యాలు ఖాళీ అవ్వవు కానీ ఇంకా ఆశీర్వదించబడతాయి. ప్రియసోదరీ! నీవు ఆ పూర్ణ ఔదార్య భాగ్యము కలిగి ఉన్నావా?

5. ప్రభువు తన ప్రజలమైన మనకిచ్చిన ఐదవ భాగ్యము హెబ్రీ. 11:24వ. వ్రాయబడింది. <u>క్రీస్తు విషయమైన నిందయే గొప్ప భాగ్యము.</u> మోషే ఐగుప్తు ధనము కంటే క్రీస్తు విషయమై నిందయే గొప్ప భాగ్యమని ఎంచుకున్నాడు. అల్పకాల పాపభోగము అనుభవించుటకంటే దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుటే మేలు. పాపభోగాలు అల్పకాలమే ఉంటాయట. తప్పిపోయిన చిన్న కుమారుడు కొలది కాలంలోనే తన ఆస్తిఅంతయూ పాపభోగాల కొరకు ఖర్చు పెట్టుకొని పందులపొట్టు దొరకక ఇబ్బంది పడసాగాడు. కానీ మోషే దేవుని ప్రజలతో నిందలు, హింసలు, శ్రమలు అనుభవించుటయే గొప్పభాగ్యము అనుకున్నాడు. గానీ ఫరో రాజు కుమార్తె కుమారుడు బహుమానము మీద ఆయన దృష్టియుంచాడు. పరలోకంలో ఎంత గొప్ప బహుమానము దేవుడు ఆయనకు భాగ్యముగా ఇవ్వబోతున్నాడో కదా! కనుక దేవుని ప్రజలతో శ్రమలు, నిందలు, అవమానాలు, విమర్శలు, సతాయింపులు, కన్నీరు, ఇవి మన భాగ్యాలుగా ప్రభువు చెబుతున్నారు. కనుక వీటిని అనుభవించినందుకు పరలోకంలో మనకు గొప్ప భాగ్యము (బహుమానము) కలుగబోవుచున్నదనే సత్యాన్ని మనము మోషే ద్వారా తెలుసుకుంటున్నాము.

6. ప్రభువు మనకిచ్చే ఆరవ భాగ్యము – యాకో. 2:5లో వ్రాయబడినట్లు – దరిద్రులైన వారిని <u>విశ్వాస విషయములో భాగ్యవంతులుగా చేయుటయే</u> లోకరీతి. శరీరరీతి దరిద్రులను ప్రభువు విశ్వాసవిషయములో భాగ్యవంతులుగా చేస్తారట. ఈ లోక ధనసంపన్నతకంటే విశ్వాస విషయములో ధనవంతులుగా ప్రభువు తయారు చేస్తారట. ప్రభువును నమ్మినవారు

ఈ లోకంలో అనేకులు ఉన్నప్పటికినీ, విశ్వాసము అందరిలో లేదు. విశ్వాస పరిమాణము అందరిలో వేరువేరుగా ఉంటుంది. దేవుని వాగ్దానాలు బైబిల్‌లో అనేకములున్నాయి. ఈ లోక విషయములో దరిద్రులైనవారు, దేవుని వాగ్దానముల మీద విశ్వాసముంచుట ద్వారా ఎన్నో భాగ్యములను పొందుకొనవచ్చును. లాజరును మృతులలో నుండి లేపునప్పుడు మార్తతో ప్రభువు 'నీవు నమ్మితే నా మహిమను చూస్తావని ప్రభువు చెప్పలేదా? యెష. 60:11వ.లో జనముల భాగ్యము నీ యొద్దకు తేబడును' అని ప్రభువు వ్రాయించగా 'లోకరీతిగా మనము దరిద్రులమైనప్పటికి ఆ వాగ్దానాలను మనము విశ్వసించినప్పుడు మార్తలాగా భాగ్యాన్ని (లేదా మహిమను) పొందుకోవచ్చు. వాగ్దానమిచ్చినవాడు నమ్మతగినవాడు. మాట ఇచ్చువాడు ఆయనే, మాట నెరవేర్చువాడును మాటను స్థిరపరచువాడును ఆయనే. 'మీరు అడుగు వాటినన్నిటిని పొందియున్నామని నమ్మండి. అప్పుడు అవన్నియు మీకు కలుగును అని ప్రభువు చెప్పాడు' గనుక దేవుని వాగ్దానములోనివి యిప్పుడే మనం పొందియున్నామని విశ్వసించి ఆ విశ్వాసము చేతనే మనం దేవున్ని ముందుగానే (advanceగా) స్తుతించాలి. అప్పుడు అవన్నియూ మనకు అనుగ్రహించబడుతాయి. ఈ విశ్వాసాన్ని కలిగియున్న వారినే దేవుడు విశ్వాసవిషయములో భాగ్యవంతులు అని చెబుతున్నాడు. ప్రియసోదరీ! అందరూ విశ్వాసులని పేరే కానీ! విశ్వాస విషయములో భాగ్యవంతులయ్యారా? ప్రియ పతితలారా! విశ్వాస విషయంలో భాగ్యవంతులెలా అవ్వాలో పైన వివరించబడింది గనుక అలాంటి విశ్వాసాన్ని మీ వ్యక్తిగత, కుటుంబ, సేవా జీవితమంతటిలో 'ప్రాక్టీస్' చెయ్యండి. ఆ భాగ్యాలన్నీ మీరు పొందుకుంటారు. ఉదాహరణకు చచ్చిన లాజరును లేపునకు ముందు ప్రభువు సమాధి ముందర యేసు కన్నులు పైకెత్తి "తండ్రీ నీవు నామనవి విని వినినందుకు నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను. నీవు ఎల్లప్పుడును నా మనవి వినుచునే ఉన్నావని నేనెరుగుదును" అన్నాడు. ప్రభువు లాజరు చనిపోకముందే లాజరు రోగియై యున్నాడని వర్తమానము వినినప్పుడే తానున్న స్థలములోనే అయన తండ్రికి ప్రార్థించియున్నాడు. మాట మన నోటికి రాకమునుపే మనమేమి మాట్లాడుతామో మనమేమి ప్రార్థిస్తామో ఆయనకు ముందుగా తెలుస్తుంది. ఆల్‌రెడిగా ప్రభువు తాను చేసిన ప్రార్థనను తండ్రి విన్నాడని (జవాబును తాను చూడకమునుపే) తన ప్రార్థన దేవుడు విన్నాడన్న విశ్వాసముతో ముందుగానే (advanceగా) తండ్రిని స్తుతిస్తున్నాడు. ఈ పద్ధతిలోనే మనమును విశ్వాస భాగ్యాన్ని పొందుకోవచ్చు.

7. ప్రభువు మనకిచ్చుచున్న ఏడవ భాగ్యము సామె. 12:27వ.లో చురుకుగా నుండుట గొప్ప భాగ్యము అని వ్రాయబడింది. జీవితములో చురుకుగా నుండువారు అన్ని పనులు త్వరత్వరగా చేసుకోగలుగుతారు. సోమరితనంతో వాయిదాలు వేసే మనస్తత్వము గలవారు ఏ పనియూ చేసుకోలేపోతారు. ఏ రోజు పని ఆరోజు చేసుకోవాలి. 'శ్రద్ధగలవారు ఏలుబడి

చేయుదురు'. సోమరులు వెట్టి పనులు చేయవలసి వచ్చును అని సామె. 12:24లో వ్రాయబడింది. తీతు 3:8. మనవారు సత్క్రియలు శ్రద్ధతో చేయాలి అని వ్రాయబడింది. మనవారు నిష్ఫలులు కాకుండు నిమిత్తమై అవసరమునుబట్టి సత్క్రియలు శ్రద్ధగా చేయుటకు నేర్చుకొనవలెను. (తీతు 3:15). సామె. 10:4వ.లో బద్ధకముగా పనిచేయువాడు దరిద్రుడగును. శ్రద్ధ గలవాడు ఐశ్వర్యవంతుడగును అని వ్రాయబడింది. శ్రద్ధలేకపోతే చురుకుదనము లేనట్లే. శ్రద్ధ ఉంటే చురుకుదనము ఉన్నట్లే. చురుకుగా పనిచేసికొనుట గొప్ప భాగ్యము. అలాకాక సోమరిగా ఉంటే సామె. 19:24వ. ప్రకారము సోమరి పాత్రలో చెయ్యి ముంచునేగాని తన నోటికి దాని తిరిగి ఎత్తనైనా ఎత్తడు. తన నోటికి చెయ్యి ఎత్తడు అంటే ఆహారము తినుటలో కూడ సోమరితనమే అంటే ఇక పస్తుండటమే కదా! సామె. 19:14వ. ప్రకారము సోమరితనము గాఢనిద్రలో పడవేయును, సోమరివాడు పస్తుపడియుండును. సామె. 24:30వ.లలో సోమరివాని చేను నేను దాటిరాగా తెలివిలేనివాని ద్రాక్షతోట నేను దాటి రాగా ఇదిగో దానియందంతట ముండ్ల తుప్పలు బలిసి యుండెను. దూలగొండ్లు కప్పియుండెను. దాని రాతిగోడ పడియుండెను. ఇంక కొంచెము నిద్ర, ఇంక కొంచెము కునుకుపాటు, పరుండుటకై ఇంక కొంచెము చేతులు ముడుచుకొనుట వీటి వలన దరిద్రత వచ్చును. ఆయుధస్థుడు వచ్చునట్లు లేమి నీ యొద్దకు వచ్చును అని వ్రాయబడింది. కావున పై వచనములనుబట్టి సోమరితనము వలన పస్తు, ముండ్ల తుప్పలు, దూలగొండ్లు, రాతిగోడ పడిపోవుట, దరిద్రత ఇవన్నియూ వస్తాయి. కానీ చురుకుగా నుండుట గొప్ప భాగ్యము. ప్రియ సోదరీ! నీ జీవితంలో సోమరిగా కాలం గడుపుతూ నీ సంసారంలో తరచు పస్తులు, నీ చేనిలో ముండ్ల తుప్పలు, దూలగొండ్లు నీ రాతి గోడపడిపోవడం, దరిద్రత ఇవన్నీ ఎదుర్కొంటున్నావా? కొద్దిమంది స్త్రీలు ఎప్పుడూ నిద్రపోతూనే ఉంటారు. అలాకాక శ్రద్ధతో చురుకుదనము అను భాగ్యము పొందుటకు ప్రభువును ప్రార్థించండి.

8. ప్రభువు తన పిల్లలమైన మనకిచ్చు ఎనిమిదవ భాగ్యము <u>దయాళురును, అప్పిచ్చువారును భాగ్యవంతులు</u> అని 112:5వ.లో వ్రాయబడింది. మన దేవుడు దయాళుడు. దయార్థ హృదయుడు. దయగలవారిపై దయచూపించును. దయామయుడు దయతోనే మనకు ఆత్మీయముగా యాజకత్వమిచ్చాడు. ఇశ్రాయేలు రాజులకు, దయాపరులని పేరున్నది. సంవత్సరమును దయాకిరీటమును ధరింపజేయువాడు అని కీర్తన. 65:11లో దేవున్ని గురించి చదువుచున్నాము. కీర్త. 103:8వ.లో యెహోవా దయాదాక్షిణ్యపూర్ణుడు. హోషే. 2:19లో దయచూపుట వలన నిన్ను ప్రధానము చేసికొందును అని వ్రాయించాడు. ఆయన పెదవుల మీద దయారసము పోయబడియున్నది. (కీర్త. 45:2).

మన ప్రభువు దయాళుడు ఆయన కృప నిరంతరము నిలుచునని ఎజ్రా. 3:11లో వ్రాయబడింది. కనుక ఆయన బిడ్డలమైన మనము కూడా శుద్ధ హృదయులుగా

దయాళురై అప్పు ఇచ్చువారై ఉంటారని ప్రభువు కీర్తన. 37:26వ.లో వ్రాయబడింది. ఇట్లు దయాళులై అప్పు ఇచ్చువారు భాగ్యవంతులని ప్రభువు చెప్పుచుండగా మనమును అట్టి ధన్యతను కలిగి యుందుము గాక! అప్పులు తీసుకునే అభాగ్యులము కాకుందము గాక!

మనకు ఇన్ని భాగ్యములనిచ్చిన మన ప్రభువు దేవునితో సమానముగా ఉండుట విడచిపెట్టకూడని భాగ్యముగా ఆయన తన భాగ్యమును యెంచుకొనకుండా ఆ భాగ్యాన్ని విడిచిపెట్టుకొన్నాడు. తండ్రిని, దేవదూతల స్తుతిని, అనేక కిరీటాలను, సింహాసనాలను, మహిమను, శక్తిని, అన్నిటినీ విడచిపెట్టి వచ్చాడు. మనుష్యపోలికెగా, దాసుడుగా రిక్తుడైన దాసుడుగా, మరణము అనగా సిలువ మరణము పొందునంతగా తగ్గించుకున్నాడు. సురూపము సొగసు విడచిపెట్టుకొని, అన్యాయపు తీర్పును పొందినవాడై కొట్టబడి, ఈడ్వబడి, దిగంబరియైపోయి, బరువైన సిలువ మ్రాను వీపున మోసి, తన బలమంతటిని చిల్లపెంకువలె చేసికొని, ముళ్ల కిరీటముచే మొత్తబడి కాళ్ళుచేతులలో చీలలు కొట్టించుకొని, మాటలనెడి దెబ్బలను కొట్టించుకొని ఆఖరుబొట్టు వరకు రక్తమును కార్చి తండ్రికి తన ప్రాణాన్ని అర్పించాడు. భాగ్యాలన్ని మనకిచ్చాడు. అలాగున ఆ ప్రభువు నిర్భాగ్యుడయ్యాడు. నా కొరకు, నీ కొరకు అన్నింటినీ కాదనుకొని తాను ఏమీ లేనివాడుగా, దరిద్రుడుగా మారిపోయాడు. ఒక ధనవంతునితో ప్రభువు, నీ ఆస్తి అమ్మి బీదలకిచ్చి నీవు నన్ను వెంబడించమనగా అయన వ్యసనపడుచు వెళ్ళిపోయాడు. ఆయన మనకిచ్చిన వాటిని తిరిగి ఆయనకే యిచ్చుటకు వ్యసనపడి మూతిముడుచుకొని వెళ్తున్నామా? ఆయనైతే తనకున్నవన్నీ మన కొరకు ధారపోసి రిక్తుడుగా మరణించిన ఆ ప్రభువు ప్రేమను ఏమని వర్ణించగలము? దేవునితో సమానముగా ఉండుట అనే భాగ్యాన్ని విడచిపెట్టి మానవ సమానునిగా కూడా కాకుండ దాసుడైన మానవుడుగా, రిక్తుడైన మానవ సమానుడిగా (పైసా కూడ చేతిలో లేని) పురుగువలె, చిల్లపెంకువలె, మైనమువలె, నీళ్ళవలె పారబోయబడుటకుగా మారిపోవుటకు ఒప్పుకొని తన్నుతాను తగ్గించుకొనిన ప్రభువును ఎలాగు స్తోత్రిస్తే ఆ ఋణం తీరుతుంది? ప్రియసోదరీ! అన్నిటినీ మన కొరకు ధారపోసికొనిన ప్రభువును జీవితాంతము కొనియాడుదాం.

ఆది. 30:14వ. గోధుమల కోతకాలములో రూబేను వెళ్ళి పొలములో పుత్రదాత వృక్షపు పండ్లు చూచి తన తల్లియైన లేయాకు తెచ్చియిచ్చెను. అప్పుడు రాహేలు - నీ కుమారుని పుత్రదాతపు వృక్షపండ్లలో కొన్ని నాకు దయచేయుమని లేయాతో అనగా ఆమె - నా భర్తను తీసికొంటివే అది చాలదా? ఇప్పుడు నా కుమారుని పుత్రదాత వృక్షపు పండ్లను తీసుకుందువా? అని చెప్పెను. అందుకు రాహేలు కాబట్టి నీ కుమారుని పుత్రదాతపు వృక్షపు పండ్ల నిమిత్తము అతడు ఈ రాత్రి నీతో శయనించునని చెప్పెను. పై మాటలనుబట్టి రాహేలు తన భర్తను అక్కయైన లేయా యింటికి వెళ్ళకుండా కట్టడి చేస్తున్నదని తెలుస్తుంది.

తాను అడిగినట్లు పుత్రదాత వృక్షపు పండ్లు లేయా తనకు ఇస్తే ఆ రాత్రి మాత్రమే ఒకరోజు కూడాకాదు ఒక రాత్రి పూటకు మాత్రమే లేయా యింటికి తన భర్తను పంపించినట్లు తెలుస్తుంది. దీనినిబట్టి రాహేలు తన భర్తను ఎంతగా తన కంట్రోల్‌లో ఉంచుకుందో మనకు ఇట్టే తెలిసిపోతోంది. సాయంకాలమందు యాకోబు పొలము నుండి వచ్చునప్పుడు లేయా అతనిని ఎదుర్కొనబోయి – నీవు నా యొద్దకు రావలెను. నా కుమారుని పుత్రదాతపు వృక్షపండ్లతో నిన్ను కొంటిని అని చెప్పగా అతడు ఆ రాత్రి ఆమెతో శయనించెను' అను మాట వింటూంటే ఆ సాయంకాలము అతనిని ఎదుర్కొనబోయి 'నేను నిన్ను ఈ రాత్రికి మాత్రమే కొన్నాను అని అంటూంటే లేయా ఫ్యామిలీ లైఫ్ ఎంత దుర్భరంగా ఉన్నదో అని అనిపిస్తుంది. రాహేలు చెప్పినట్లే నడుచుకొంటున్నాడు యాకోబు. ఈ విషయము లేయా మనసును ఎంతగా గాయపరుస్తుందో కదా! ఆమె ఫ్యామిలీ లైఫ్ ఎంతో దయనీయంగా ఉందనిపిస్తుంది. యాకోబు తనను పట్టించుకోనకుండా రాహేలుతోనే జీవించుటకు యాకోబు ఇష్టపడుచుండినప్పటికీ, ఆమె పలుమారులు యాకోబు కొరకే పిల్లలను కంటూ ఉండడము చూస్తే లేయా తన భర్త వంశాన్ని వర్థిల్లచేయుటకే ఆలోచిస్తోంది. తనను ద్వేషిస్తే, శ్రమపెట్టుచున్న భర్తకు సారిసారికి పిల్లలనుకంటూ ఆయనకు పిల్లలను అందిస్తున్న లేయా, ఆ రాత్రి ఆయనతో శయనించి దేవుడు తన మనవిని విన్నాడని అతనికి 5వ కుమారుని కని నేను నా పెనిమిటికి నా దాసిని ఇచ్చినందున దేవుడు నాకు ప్రతిఫలము దయచేసెననుకొని అతనికి 'ఇశ్శాఖారు' అను పేరు పెట్టింది. ఏ స్త్రీయైన మరో స్త్రీకి ఎన్ని సొమ్ములైనా, బట్టలైనా ఇస్తుంది కానీ, తన భర్తను దానం చేయదు. కానీ భర్త తనను ద్వేషిస్తూ, శ్రమపెడుతూ ఉన్నప్పటికీ అట్టి భర్తను మార్చుకోవాలని ప్రయత్నిస్తూ ఆయనను రాబట్టుకునేందుకు అతనికి తన దాసినైనా యిచ్చి, అతనికి పిల్లలు అనే ఫలాలను ఇవ్వాలనుకుంది లేయా. భర్తతో వ్యాజ్యెమాడలేదు. పేచీపెట్టుకోలేదు. మాటలతో అతనిని కొట్టలేదు. ప్రతిసారి భర్తకు ఫలాలను (పిల్లలను) అందిస్తూనే ఉంది. నేడు అనేకమంది భర్తలు తమ భార్యలను ద్వేషిస్తూ వారితో సంసారము చేయకుండా పోషించకుండా, నిర్లక్ష్యపెడుతూ ఉండే వారు అనేకులు ఉండగా, వారి భార్యలు లేయావలె భర్తలతో వ్యాజ్యెమాడకుండా, ఎలా ప్రేమిస్తే ఆయనను రాబట్టుకోవచ్చునో అని ప్రభువు దగ్గర ఆలోచించి వారిని ప్రేమించి, వారికి పరిచర్య చేయాలి. ఆ ప్రేమ, ఆ పరిచర్యలే మీ భర్తలను మీ యొద్దకు నడిపిస్తాయి. అందుకే ప్రభువు రోమా 12:20వ.లో 'కాబట్టి నీ శత్రువు ఆకలిగొని ఉంటే అతనికి భోజనము పెట్టుము. దప్పిగొనివుంటే దాహమిమ్ము. అలాగు చేయుట వలన అతని తలమీద నిప్పులు కుప్పగా పోయుదువు. కీడువలన జయింపబడక మేలుచేత కీడును జయించుము' అని వ్రాయించారు. అలాగు చేసి లేయా తన యింటికి ఆ రాత్రి వచ్చిన భర్తతో ఇన్నాళ్ళు తనను ద్వేషించి, శ్రమపెట్టినందుకు అతని మీద ప్రతీకారము తీర్చుకొనక పగతీర్చుకొనక భర్తను

ప్రేమించి అతనికి ఒక కుమారున్ని ప్రతిఫలముగా అందించింది. రోమా. 12:21వ.లో కీడు వలన జయింపబడక మేలుచేత కీడును జయించుమని ప్రభువు వ్రాయించారు. ఇలా భర్తకు ప్రతిఫలాన్ని అందించుటకు ఆరోజు పుత్రదాత వృక్ష్యపు పండ్లతో తన భర్తను కొనుకున్నదిగా లేయాను చూస్తున్నాము. అందుకే ఈసారి కనిన కుమారునికి 'కొనబడినవాడు' అని అర్థమిచ్చే 'ఇశ్శాఖారు' అనుపేరు ఆ బిడ్డకు పెట్టింది. మన పరమభర్తయైన మన ప్రభువు పాపము చేసిన మనల్ని తన రక్తంతో కడిగి, మనల్ని కొనగా, లేయా తనను ద్వేషిస్తున్న భర్తను తానే 'కొన్నదిగా' కనబడుతోంది. నేటి స్త్రీలకు లేయా ఎంత మాదిరిగా నిలిచిందో కదా, లేయా మనస్సు ఎంత మంచి మనస్సో కదా! 19వ.లో లేయా మరల గర్భవతియై యాకోబుకు 6వ కుమారుని కనింది అంటే దేవుడు మరొకమారు యాకోబుకు లేయా ఇంటికి వచ్చే మనస్సును దేవుడే ఇచ్చాడు కాబట్టి ఆమె తన భర్తకు 6వ కుమారుని కనగలిగింది. అప్పుడు దేవుడు నాకు మంచి బహుమతిని దయచేశాడనుకున్నది. అవును, పిల్లలు మనకు దేవుడిచ్చిన మంచి బహుమతులే. సాధారణంగా, లోకంలో మనము పొందుకొనే బహుమతులు చాలావరకు ప్రాణం లేనివే. కానీ, దేవుడు మనకనుగ్రహించే పిల్లలు మనకు ప్రాణమున్న బహుమతులుగా వున్నారు. కీర్త. 127:3వ.లో వ్రాయబడినట్లు కుమారులు యెహోవా ఇచ్చు స్వాస్థ్యము. గర్భఫలము ఆయన ఇచ్చు బహుమానము. యాకోబు తన ఇంటికి వచ్చినప్పుడెల్లా లేయా ఆయనకు పిల్లలు అనే బహుమతులను అందిస్తూనే ఆయనను రాబట్టుకుంటూ ఉంది. విరోధ బుద్ధి చూపి, కోపగించుకొని, వివాదము రేపలేదు. నేను యాకోబునకు ఆరుగురు కుమారులను కనియున్నాను గనుక అతడు ఇకనుండి నాతో కాపురము చేయును అనుకొని అతనికి 'జెబూలూను' అను పేరు పెట్టెను. ఆది. 30:18వ.లో వ్రాయబడింది. ఆ తరువాత ఆమె 'దీనా' అను ఒక కుమార్తెను కూడ కనినట్లు వాక్యంలో గమనిస్తున్నాం. ఆరుగురు కుమారులను, తనను ద్వేషించుచున్న యాకోబుకు కన్నాను కాబట్టి ఒకటికాదు, రెండు కాదు, 6గురిని కన్నాను గనుక నా భర్త నాతో ఇక కాపురము చేస్తాడు అని అనుకుందట. తమతో సమ్మకంగా కాపురము చేయని భర్తల మీద కోపము తెచ్చుకొనకుండ వారు తమ ఇంటికి వచ్చిన ప్రతిసారి కూడ వారికి మేలునే చేయుట ద్వారా వారిని రాబట్టుకోవచ్చునన్న పాఠాన్ని నేడు లేయా స్త్రీసమాజమంతటికీ తెలియజేస్తున్నదని నేను సమ్ముతున్నాను. గుణవతియైన భార్యవలె అతనికి మేలే చేసింది కానీ, కీడు చేయలేదు. తమకు అన్యాయం చేస్తున్న భర్తలమీద నేడు ఎన్నో కేసులు పెట్టడం, పోలీస్ వారికి అప్పగించడం, నానారభస చేయడం, నానారీతిగా అవమానపరచడం లాంటివి నేటి స్త్రీలు చేయుచుండగా లేయా జ్ఞానంతో తన భర్తకు అన్నిసార్లు మేలే చేయుచు తన విషయమై కనీసము ఆలోచనైననూ చేయకపోయిన అలాంటి భర్త తనతో ఇకనుండైనా కాపురం చేస్తాడు అని దేవుని మీద విశ్వాసంతో కలలు గంటున్న లేయా యొక్క

మంచితనము, లేయా యొక్క నిరీక్షణ ఆమెకున్న ఓర్పు, సహనము ఎంత గొప్పవో కదా! ఆమె కోరుకున్నట్లే ఇక కొలది రోజులకే రాహేలు ఇద్దరు పిల్లలని కని చనిపోవుట వల్ల ఇక లేయాతోనే ఆయన కాపురము చేయునట్లు ప్రభువు అటువంటి పరిస్థితి చేకూర్చలేదా? ఆది. 31:4 వచనములో యాకోబు తన పితరుల యొద్దకు బంధువుల యొద్దకు తిరిగి వెళ్ళాలనుకున్నప్పుడు రాహేలుతో మాత్రమే కాక లేయాతో కూడ ఆ విషయాలు ప్రస్తావించాడు. లేయాతో కూడ ఆ విషయాలు ఆలోచన (కన్సల్ట్) చేయుట మనము చదువుచున్నాము కదా! మునుపు లేయాను ద్వేషించేవాడు కదా! ప్రభువు లేయా మనవి విన్నాడు కదా! ప్రభువు గొప్పవాడు. న్యాయవంతుడు. నీతిగల న్యాయాధిపతి. తండ్రియైన లాబాను, ఎవ్వరూ పెండ్లి చేసికొనని కళ్ళ జబ్బున్న లేయాను, యాకోబుకిచ్చి పెళ్ళి చేసి చేతులు తుడుచుకొనగా ఇటు భర్తతోను అటు చెల్లియైన రాహేలుతోను ద్వేషించబడుచున్న ఎవ్వరికీ ఇష్టములేని, తల్లిదండ్రులకు బరువైన ఈ అన్‌వాంటెడ్ అమ్మాయి యొక్క బాధను, శ్రమను చూచిన దేవుడు చివరికి ఈమెకు సహాయము చేయుటను మనము గమనించవచ్చు. తృణీకరింపబడిన రాయి మూలకు తలరాయి అయినట్లు అక్క ఇంటికి పోకుండా యాకోబును కట్టడి చేసిన రాహేలును దేవుడు తొలగించి ఇక లేయాతోనే యాకోబు కాపురము చేయునట్లు ప్రభువు పరిస్థితులను అనుకూలము చేయుటనుబట్టి దేవుడు లేయా ప్రార్థన విన్నాడని మనకు బాగుగా అర్థమగుచున్నది. ఆది. 31:12-16వచనాలలో యాకోబు దేవుడు నన్ను నా బంధువుల యొద్దకు వెళ్లమని చెప్పాడంటే అక్కా చెల్లెల్లిద్దరూ - మా తండ్రి ఇంట పాలుపంపులెక్కడివి? అతడు మమ్మును అన్యులుగా చూచుట లేదా? అతడు మమ్మును అమ్మివేసి మాకు రావలసిన ద్రవ్యమును బొత్తుగా తినివేసెను. కాబట్టి దేవుడు నీతో చెప్పినట్లు చేయుమని అక్కాచెల్లెండ్లు ద్వేషము, అనైక్యత లేకుండా ఏకమనస్సుతో ఉండుట ఇవన్నీ లేయా ప్రార్థనా ఫలితమే అని అనిపిస్తుంది. లేయా ప్రార్థన రాహేలులో కూడ మార్పు తెచ్చింది. ఇద్దరూ ఏకీభవాంతో ఒద్దికతో మాట్లాడుచుండుట చూడగా రాహేలు ఇదివరకు అక్కమీద అసూయ పడినట్లు అసూయ పడకుండ అక్కను తనతో కలుపుకోవడం ఇవన్నీ లేయా ప్రార్థనా ఫలితమే. కీర్త. 40:1వ.లో వ్రాయబడినట్లు మనము యెహోవా కొరకు సహనంతో కనిపెట్టుకోవాలి. అప్పుడే జవాబులు పొందగలము. ప్రియసోదరీ! నీవు కూడ లేయావలె బాధపడుచున్నావా? లేయాలాగ నీవునూ నీ భర్తను లేయావలె ప్రేమించు. అతనికే మేలు చేయి. కీడు చేయొద్దు. అతని అల్లరిపాలు చేయొద్దు. పగతీర్చుకోవద్దు. అతని బజారుపాలు చేయొద్దు. లేయాలాగ ప్రార్థించు. ప్రభువు కొరకు కనిపెట్టు. ఆయన ప్రార్థననాలకించే దేవుడు. నీకు న్యాయము చేకూర్చే దేవుడు. నిన్ను మూలకు తలరాయిగా చేస్తాడు. చివరకు లేయా మరణించినప్పుడు యాకోబు ఆమెను ఆది. 49:81వ.లో వ్రాయబడినట్లు మమ్రే ఎదుట ఉన్న మక్పేలా పొలములో ఎఫ్రోను పొలమందున్న గుహలో పాతిపెట్టాడు. అదే లేయా దగ్గర, యాకోబు మరణించి (ఆది.

50:13వ.లో) అదే గుహలో పాతిపెట్టబడ్డాడంటే లేయా ప్రార్థన ఎంత కార్యం చేసిందో కదా! యాకోబుకు ప్రియంగా ఉండిన రాహేలు ఆది 34:19వ.లో బెత్లెహేము ఎఫ్రాతా పాతిపెట్టబడగా, లేయా దగ్గరే యాకోబు పాతిపెట్టబడ్డాడు.

రాహేలు పిల్లలను కనుట:- ఆది 30:22వ. దేవుడు రాహేలును జ్ఞాపకము చేసికొని ఆమె మనవి విని ఆమె గర్భము తెరచెను. ఈ వచనమునుబట్టి ఇప్పుడు రాహేలు పిల్లలకొరకై దేవుని ప్రార్థించుట నేర్చుకున్నదని తెలుస్తోంది. మొదట 'నాకు గర్భఫలమిమ్ము. లేనియెడల నేను చస్తాను" అని ఒక అన్యురాలివలె భర్తను బ్లాక్‌మెయిల్ చేయుదానివలె కనిపించింది. కాలక్రమేణ దేవున్ని ప్రార్థిస్తే దేవుడు పిల్లలనిస్తాడు అని తెలుసుకుంది. లేయా దగ్గరి నుండి పుత్రదాత వృక్షపు పండ్లను తీసికొని తినినను ఆ పండ్లు పనిచేయుటకు (లేదా ఆ మందు పనిచేయుటకు) కూడ దేవుని సహాయము అవసరమని రాహేలు గుర్తించింది. దేవుని ప్రక్కన పెడితే మన మందులు, మన ప్రయత్నాలు ఫలించవు. దేవుని తోడ్పాటు ఎంతో అవసరమని చివరకు రాహేలు తెలుసుకుంది. ఆమె ఒక కుమారుని కని దేవుడు నా నిందను తొలగించెననుకొన్నది. అవును, దేవుడు మన నిందలను తొలగించేవాడు. మన కొరకు సిలువలో నిందించబడ్డాడు. కీర్త. 69:7వలో "నీ నిమిత్తము నేను నిందనొందినవాడనైతిని. నీ నిమిత్తము సిగ్గు నా ముఖమును కప్పెను" అన్నాడు. 19వ.లో నిందయు సిగ్గును అవమానమును నాకు కలిగెనని నీకు తెలిసియున్నది. 20వ.లో నిందకు నా హృదయము బ్రద్దలాయెను అన్నాడు. మన నిమిత్తము ఆయన నిందలు పొందాడంటే ఎవరన్నా ఈలాటి ప్రేమను చూపించేవారున్నారా? ఒక్క యేసుప్రభువే అట్టి ప్రేమను చూపారు.

ఇశ్రాయేలీయులు ఐగుప్తులో 430 సం॥లు దాసత్వంలో ఉన్నారు. అట్టి ఇశ్రాయేలీయులు 40 సం॥ అరణ్య మార్గమందు కనిన పిల్లలు సున్నతి పొందలేదు కనుక ఆ సమస్త జనము సున్నతి పొందుట తీరిన తరువాత తాము బాగుపడువరకు పాళెములోని తమ చోట్ల నిలిచారు. అప్పుడు యెహోవా నేడు నేను ఐగుప్తు అవమానము మీమీద నుండకుండ (ఐగుప్తులో దాసులుగా ఉండినవారు అన్న నింద) దొరిలించి వేసియున్నానని యెహోషువతో యెహో 5:9వ.లో అన్నాడు. అందుచేత నేటికి ఆ చోటికి 'గిల్గాలు' అను పేరు కలిగింది. గిల్గాలు అనగా 'దొరలించిన' అని అర్థము. అనగా ఇశ్రాయేలీయులు దాసత్వములో నుండిన వారు అనే నిందను యెహోవా దేవుడే దొరలించాడు. ప్రియసోదరీ! నీవు కూడ నిందలతో అవమానముతో, సిగ్గుతో నింపబడియున్నావా? నీ అవమానాన్ని, నిందలని కూడ ప్రభువు దొరలిస్తాడు. 'ఇశ్రాయేలీయుల నిందను దొరలించావే తండ్రీ! నా నిందలను తొలగించు ప్రభువా! నా నిమిత్తమై సిలువలో నిందించబడి హృదయం బ్రద్దలు చేసుకున్నావే. నా కొరకై సకల బాధలు అనుభవించి రక్తము కార్చావే. నా పాపములను, దాని సంబంధమైన నిందలను కడిగి దొరలించు ప్రభువా' అని ప్రార్థించు.

25వలో రాహేలు యెహోవా మరియొక కుమారుని నాకు దయచేయును గాక! అని ఆ కుమారునికి 'యోసేపు' అను పేరు పెట్టినట్లు చదువుచున్నాము. పుత్రదాత వృక్షపు పండ్లవలన మరియొక కుమారుని పొందుతాను అనలేదు. కానీ యెహోవా వలన మరియొక కుమారుని పొందగలననుకొంటూ ఉన్నది. అనగా తన పుత్రదాత - యెహోవా దేవుడే అని పూర్తిగా ఇప్పుడు రాహేలు నమ్ముతోంది. మునుపు యాకోబుతో 'నాకు గర్భఫలమిమ్ము, లేనియెడల నేను చచ్చెదను' అని అనింది. ఇంతకాలానికి ఆమె గర్భఫలమిచ్చేవాడు పరమ యాకోబైన యెహోవాయే అని తెలుసుకుంది. ఒక గర్భఫలమే కాదు ప్రియసోదరీ! యాకోబు 1:16వ. చొప్పున శ్రేష్ఠమైన ప్రతి ఈవియు, సంపూర్ణమైన ప్రతివరమును, పరసంబంధమైనదై జ్యోతిర్మయుడగు తండ్రియొద్దనుండి మనకు వస్తుంది. మనకు అన్నింటిని అనుగ్రహించే దాత, ప్రదాత తండ్రియైన దేవుడే. అన్ని ఈవులు ప్రార్థిస్తే దేవుడు ఇస్తాడని కూడ రాహేలు నేర్చుకుంది. మునుపు అన్నింటికొరకు పతియే దైవము అన్నట్లు అన్నీ యాకోబునే అడిగేది. అన్నిటికి యాకోబునే అడిగి <u>ఆయన మీదే</u> ఆనుకొనేది. యెష. 26:3వ.లో వ్రాయబడినట్లు మనమందరము దేవుని మీద విశ్వాసం ద్వారా ఆనుకుంటే పూర్ణశాంతి గలవారముగా కాపాడబడుతాము. యెహోవా ఇప్పుడు ఒక కుమారున్నిచ్చాడు. ఇతనినే కాక మరొక కుమారుని కూడ (in addition to him) ఇస్తాడు, అనే విశ్వాసంతో ఆయనమీద ఆనుకొని 'యోసేపు' అను పేరు పెట్టింది. 'యోసేపు' అనగా కూడబెట్టుట, లేక అభివృద్ధి అని అర్థము. యోసేపు అనగా కూడబెట్టువాడు. (addition తెచ్చువాడు)

**రాహేలు దొంగిలించుట:-** రాహేలు తన భర్తతో కూడ తన తండ్రి ఇంటి నుండి మామగారింటికి వెళ్ళేటప్పుడు తన తండ్రియైన లాబాను ఇంటనున్న గృహ దేవతలను దొంగిలించెను అని ఆది. 31:19వ.లో చదువుచున్నాము. వీటిని ఎన్నడు రాహేలు పూజించినట్లు మనము రానున్న అధ్యాయాలలో చూడము కానీ, కొద్దిమంది బైబిలు పండితులు - తన కుమార్తెలు అల్లుడు లాబానుకు చెప్పకుండా ఇల్లు వదలి వచ్చారు కనుక లాబాను ఈ గృహదేవతల దగ్గర శకునము చూచి వీరు వెళ్ళే త్రోవను తెలిసికొని తమ్మును తరుముతాడేమో అనుకొని వాటిని ఆమె దొంగిలించిందని చెబుతారు. అయినా ఆమె వీటిని పూజించలేదు. కానీ లాబాను యాకోబు గుడారంలో లేయ, బిల్హా, జిల్పా గుడారాలలో వెదకినప్పుడు అతనికి విగ్రహాలు కనబడలేదు. రాహేలు ఆది. 31:34వ.లో రాహేలు ఆ విగ్రహములను తీసికొని ఒంటె సామాగ్రిలో పెట్టి వాటిమీద కూర్చుండగా లాబాను గుడారమంతయు తడవి చూచాడు. అయినా అతనికి అవి దొరకలేదు. లాబానుకు దొరకలేదు కానీ ఆది 35:3వ.లో ఆ విగ్రహాలు దేవునికే కనబడినాయి. యాకోబు తన ప్రియమైన భార్య దొంగ కాదు. అబద్ధికురాలు కాదు అనుకొని వుండవచ్చు. 35:3వ.లో దేవుడు మీ యొద్ద నున్న అన్యదేవతలను పారవేయమన్నప్పుడు యాకోబు "మొన్ననే కదా!

మా మామగారు అందరి గుడారములను సోదా చేశాడు. ఎక్కడను లేవన్నప్పుడు నీ ప్రియ భార్య గుడారములో ఒంటె సామాగ్రిలో ఉన్నాయాని దేవుడు యాకోబుకు చెప్పి ఉంటాడు. రాహేలు తాను కడగా ఉన్నానని, తమ ఎదుట తాను లేవలేనందుకు తాము కోపపడకూడదు అని తాము తమ ఎదుట అని తండ్రిమీద చాలా గౌరవముతో మాట్లాడినట్లు చాలా నైస్‌గా (nice) మాట్లాడినట్లే మాట్లాడి నైస్‌గానే (nice) తండ్రికి అబద్ధాలు చెప్పేసింది. తండ్రి ఎదుట చిన్న 'నాటకమే' (drama) చేసేసి తండ్రిని మోసగించింది. ఒక రీతిగా భర్తయైన యాకోబును కూడ మోసగించింది. కానీ, సర్వము చూచెడి దేవుని కంటికి చాటుగా జరిగే పని ఏదీ లేదు. కొద్దిమంది సోదరీలు రాహేలులాగానే భర్తలు తమ బట్టలు గోడమీద హ్యాంగర్‌కు తగిలించి యుండగా వారి డబ్బులు దొంగతనము చేసి వాటిని కూడబెట్టి, చీరలు తామే కొనుక్కొని 'మా అన్న ఈ చీర పెట్టాడు, అక్క పెట్టింది అని అబద్ధాలాడుతుంటారు. ఒకామె తన భర్త దగ్గర 60,000 వేల రూపాయలు దొంగగా తీసికొని తన తల్లికి, తమ్మునికి ఇచ్చిందట. అది ఎవరి సొమ్ము? అది భర్త కష్టార్జితము. భర్తకు తెలిసి యిస్తే మంచిదే కానీ, తెలియకుండా అలా చేయడం మంచిది కాదు. కొద్దిమంది భర్తలకు తెలియకుండా చీటీలు కడుతుంటారు. ట్రిప్పులు వేస్తుంటారు. వడ్డీకి డబ్బులిస్తుంటారు. భర్తలకు తెలిస్తే నమ్మకాన్ని కోల్పోయేవారుగా ఉంటున్నారు. ఈ లోక భర్తల కళ్ళుకప్పినా, పరలోక భర్తయైన యేసుప్రభువు కళ్ళు కప్పలేము కదా! రాహేలు దొంగతనము, అబద్ధాలు బయటపడినప్పుడు ఎంత సిగ్గు పడి ఉంటుందో కదా! అలా సిగ్గు పడకముందే మానవులతోను, దేవునితోను దొంగతనాన్ని ఒప్పుకుంటే మంచిది.

మామగారైన లాబాను నా గృహదేవతలను ఏల దొంగిలితివి? అన్నప్పుడు యాకోబు "ఎవని యొద్ద ఆ విగ్రహములు కనబడునో వారు బ్రతుకకూడదు అన్నాడు. విగ్రహములు ఎవని యొద్ద కనబడుతాయో వారు బ్రతుకకూడదు అన్న యాకోబు మాట రాహేలులో నెరవేర్చబడింది. దీనినిబట్టి విగ్రహాలు మనల్ని బ్రతుకనీయవని తెలుస్తుంది. అవి మనల్ని అపవిత్రపరుస్తాయి. అందుకే దేవుడు ఆది 35:3వ.లో మీ వస్త్రములను శుచిపరచుకోండి అన్నాడు. దేవుడు పది ఆజ్ఞలలో కూడ మీరు ఆకాశంలోకాని, భూమిమీద గానీ, భూమిక్రింద, నీళ్ళయందేగాని సృష్టిలో దేని ప్రతిమనైనను 1. చేసికొనకూడదు 2. దానికి సాగిలపడకూడదు అని చెప్పాడు కనుక రాహేలు పూజించినట్లు కనబడకపోయిననూ అవి ఉంచుకోవడం కూడా తప్పే.

"క్రైస్తవులమైన మనము విగ్రహాలు ఉంచుకోము కదా!" అని క్రైస్తవులు అనుకోవచ్చు కానీ యెహెజ్కేలు 14:3వ.లో నరపుత్రుడా! ఈ మనుష్యులు తమ హృదయములలో విగ్రహములనే నిలుపుకొని దోషము పుట్టించు అభ్యంతరములు తమ యెదుటనే పెట్టుకొని యున్నారని వీరు నా యొద్ద ఏమైనా విచారణ చేయదగునా? అని దేవుడంటున్నాడు.

5వ.లో తమ విగ్రహముల వలన నాకు అన్యులయ్యారు. నేనే వారి హృదయమును లోపరచుకొనునట్లు యెహోవానగు నేను వారికి ప్రత్యుత్తరమిచ్చుచున్నాను. 6వ.లో మీ విగ్రహములను విడిచిపెట్టి మీరు చేయు హేయకృత్యములన్నిటిని మాని మనస్సు త్రిప్పుకొనుడని దేవుడు అంటున్నాడు.

**హృదయంలో ఉండే విగ్రహాలు కొన్ని వాక్యములో చూద్దాము.**

**1. కొలొ. 3:5వ. విగ్రహారాధనయైన ధనాపేక్ష:–** దేనిమీద మన మనస్సు ఎక్కువగా ఆలోచిస్తూ ఉంటామో, లేక దేవుని కన్నా, దేనిని ఎక్కువగా ప్రేమిస్తుంటామో అదే విగ్రహము. కొద్దిమందికి ధనంమీద ఆలోచిస్తూ ఉంటారు. ఆదివారం కూడా ఓవర్ డ్యూటీ (over duty) వేయించుకొని ఆరాధనకు వెళ్ళకుండా డబ్బు సంపాదిస్తూ ఉంటారు. నీ ధనమెక్కడంటుందో నీ మనస్సు కూడ అక్కడ ఉంటుందని దేవుని వాక్యం చెబుతుంది.

**2. కడుపే దేవుడు:–** ఫిలి. 3:19. నాశనమే వారి అంతము. వారి కడుపే వారి దేవుడు. ఆదివారం మందిరానికి రాకుండా స్పెషల్ వంటకాలు చేసుకుంటూ ఉంటారు. ఆదివారాలలోనే పలావులు, మటన్, చికెన్లు, బిరియానీలు చేసుకుంటూ ఉంటారు. ఆదివారాల్లోనే వడియాలు పెట్టుకుంటూ ఉంటారు. సిగ్గుపడవలసిన సంగతుల విషయమై అతిశయపడుతుంటారు. ఈరోజు మా యింటిలో స్పెషల్ బిరియాని అని అతిశయంగా చెప్పుకుంటూ ఉంటారు. నాశనమే <u>వాటి</u> అంతము కాదు, నాశనమే <u>వారి</u> అంతము అని దేవుడు వ్రాయించాడు.

**3. వలలు:–** హబ. 1:16 వలల వలన పుష్టినిచ్చు భోజనము తనకు కలుగుచున్నదని ఒకడు తన వలలకు బలులు అర్పించుచున్నాడు. తన ఉరులకు ధూపము వేయుచున్నాడు. ఏ వస్తువు ద్వారా లేక ఏ వాహనము ద్వారా లేక ఏ ఆయుధము ద్వారా జీవనోపాధి జరుగుంతో వాటినే మానవుడు ఈనాడు పూజిస్తున్నాడు. ఇదే 'ఆయుధాలపూజ'గా అన్యులు వాటినే దేవతలుగా భావించి పూజిస్తున్నారు. ఆయుధాలను, వాహనాలను, వలలను పూజించక వాటినిచ్చిన దేవున్ని ఆరాధించాలి. మానవులు దేవున్నికాక ఆయా వస్తువులు తమ జీవనోపాధికి పనికి వస్తున్నాయని అలాంటి ప్రతి వస్తువును పూజిస్తున్నారు. ఇది దేవుని దృష్టిలో చాలా తప్పు.

**4. వస్త్రాలు:–** కొద్దిమందికి వస్త్రాలే దేవతలుగా ఉంచుకున్నట్లు ఎప్పుడు వస్త్రాలను గురించి ఆలోచించడం, వాటిమీదే మనసుంచుకోవడం, వాటికోసం షాపింగ్ చేయడం, ఎక్కువ డబ్బులు వాటికి వెచ్చించడం, వాటినే ఎక్కువగా సర్దుకోవడంలాంటిది చేయటం వల్ల వారు వస్త్రాలకే విగ్రహారాధన చేయుచున్నవారుగా ఉంటున్నారు. ఎన్ని బట్టలున్నా, క్రొత్తవాటిని కొంటూనే ఉండడమే వారి నిత్యపనిగా భావిస్తూవుంటారు.

**5. బంగారు:–** కొద్దిమంది స్త్రీలు బంగారం మీద ఎక్కువ మనసుంచుకొంటూ, ఎప్పుడూ నగలను కొనటం, క్రొత్త ప్యాటర్న్‌తో నగలు చేయిచుకోవడం, బంగారం మీద ఎక్కువ

మోజు పెంచుకోవడం, వాటిని గూర్చియే ఎల్లప్పుడు మాట్లాడ్డంలాంటివి చేస్తూ బంగారును పూజించేవాళ్ళుగా ఉంటున్నారు.

**6. భర్తలు:-** కొద్దిమందికి భర్తలే దేవుళ్ళు ఎందుకు మీటింగ్‌కు రాలేదు అంటే 'భర్త యింటికి వస్తారు. 'అన్నం పెట్టాలి' అంటారు. భర్త క్రొత్త పెళ్ళి కొడుకేమీ కాదు కదా! ఎవరి తాళాలు వారు తీసుకెళ్తే ఎవరి సమయమొచ్చినప్పుడు వారు ఇంటికి వచ్చి టేబుల్ మీద రెడీగా ఉంచిన అన్నాన్ని వారే వడ్డించుకొని వెళ్తారు కదా! అలాకాక కొద్దిమంది స్త్రీలు భర్తల మీద ఎక్కువ శ్రద్ధ ప్రేమ, మమకారం ఉంచుకొని దేవునికన్నా భర్తలనే ఎక్కువగా ప్రేమిస్తూంటారు. వీళ్ళకు భర్తలే దేవుళ్ళు.

**7. పిల్లలు:-** కొద్దిమంది స్త్రీలు మందిరానికి రాకుండా, ఎందుక రాలేదని సంఘసేవకుడు అడిగితే 'పిల్లల వలన రాలేకపోయాను' అంటారు. పిల్లలు అందరికీ ఉంటారు. పిల్లలతో, శిశువులతో కుటుంబ సమేతంగా మనము దేవుని సన్నిధికి వెళ్ళాలి. పిల్లలు పుట్టకపోతే, అమ్మా! అక్కా! నాకు పిల్లలు పుట్టాలని దేవున్ని ప్రార్థించండి' అని అంటూ ఉంటారు. చివరకు దేవుడు పిల్లలనిస్తే ఆ పిల్లలే ఇప్పుడు ఆటంకమని చెబుతుంటారు. అలాగైతే దేవుడు పిల్లలనిచ్చి తప్పుచేశాడా? కాదు, కాదు, మన పిల్లలను కూడ దేవుని సన్నిధికి అలవాటు చేయాలి. నెహెమ్యా కాలంలో పిల్లలతో కూడ దేవుని సన్నిధికి వచ్చారు. నెహె. 12:43. పిల్లలు మనకు ఆటంకముగా వున్నారని అనుకోకూడదు. కొద్దిమంది దేవునికంటే తమ పిల్లలనే ఎక్కువ చేస్తూ పిల్లలనే పూజిస్తున్నట్లు పిల్లలే వారి దేవుళ్ళు అన్నట్లుగా పిల్లలనే తమ దేవతలుగా చేసికొని ఉన్నారు. 1 సమూ. 2:29వ.లో దేవుడు ఏలీ అను ప్రధాన యాజకునితో నీవు నాకంటే నీ కుమారులను గొప్ప చేయుచున్నావు అని అన్నాడు. 'ఆ పిల్లలు అతని మొఱ్ఱ వినకపోయిరి' అని 1 సమూ. 2:25వ.లో వ్రాయబడింది. ఏలీ పిల్లలను తండ్రిగా దండించవలసినది. కానీ తండ్రి మొఱ్ఱపెట్టగా కూడ వారు వినలేదు. సామ, దాన, బేధ, దండోపాయాలలో పిల్లలను గద్దించి, దండించి, శిక్షించవలసినది కానీ ఊరకనే చెప్పాడు. తన పిల్లలను దేవుని కంటే ఎక్కువగా చూచాడు గనుక దేవుడే 29వలో నాకంటే నీ కుమారులను నీవు గొప్ప చేయుచున్నావు అని వ్రాయించాడు. కాబట్టి యెహోవా వారిని చంపదలంచియుండెను అని 25వ.లో వారిని గూర్చి వ్రాయబడింది. యెహోవా చంపతలంచిన వారిని ఏలీ గొప్పచేస్తున్నాడు. ఇది ఎంత భయంకరము కదా! కనుక మనపిల్లలే మనకు విగ్రహాలు కాకూడదు.

**8. టి.వి (T.V):-** చాలామంది టి.వి. ఒక దేవతగా ఉంది. దేవునికిచ్చే సమయం కంటే టి.వి యెదుట గడిపే సమయమే ఎక్కువ. వచ్చే ప్రతి చానల్ త్రిప్పుతూ చూస్తూనే ఉంటారు. నా చిన్న తమ్ముడు ఒకసారి టి.విని ఒంటికన్ను దేవత' అన్నాడు. అప్పుడు నేనన్నాను, 'ఒంటి కన్ను దేవతను రెండుకళ్ళతో మానవులు చూస్తున్నారని, టకటకా వంటలు ముగించి స్త్రీలు అత్యధికులు తమ అత్యధిక సమయాన్ని టి.వి. చెంత గడుపుతున్నారు. కొద్దిమంది నియామక కూడికలకు మందిరానికొచ్చి చివరి ప్రార్థన ముగించకముందే ఎవరికీ

వందనాలు చెప్పకమునుపే తొందరగా ఇండ్లకు వెళ్ళి తంభనుగా టి.విల ముందు కూర్చుని టి.విలు ఆన్ చేసికొని ఆ సీరియల్స్ ఎపిసోడ్స్ వెంబడి ఎపిసోడ్స్ కొన్ని వందల ఎపిసోడ్స్ చూస్తున్నారు. ఇది న్యాయమా? ఫిలి. 4:8వ.లో వ్రాయబడినట్లు 'ఏవి సత్యమైనవో ఏవి మాన్యమైనవో ఏవి న్యాయమైనవో, ఏవి పవిత్రమైనవో, ఏవి రమ్యమైనవో, ఏవి ఖ్యాతిగలవో వాటిమీద మీ ధ్యానముంచుకొనుడి' అన్నట్లు పైనున్న వాటిమీద ధ్యానముంచుకోవాలి కానీ టి.వి. కార్యక్రమముల మీద కాదు. టి.వి. చేత లోపరచబడకూడదు. సమయము దేవుడిచ్చిన సొమ్ము సమయమనే ధనాన్ని గురించి కూడ మనం దేవునికి లెక్క చెప్పాలి. దివారాత్రములు దేవుని ధర్మశాస్త్రమునందు ఆనందించాలి అని బైబిల్ చెబుతోంది. కానీ ఈనాటి యువత, టి.విల దగ్గర ఇంటర్‌నెట్ ( Internet) దగ్గర, ఫేస్‌బుక్ (Facebook) దగ్గర ఎక్కువ టైమ్ వేస్ట్ చేసుకుంటూ వాటినే విగ్రహాలుగా చేసుకుంటున్నారు. చెత్త దృశ్యాలు చూడడంలోను, చెత్త మాటలు మాట్లాడడంలోను కాలం గడుపుతూ దేవునికిచ్చే సమయంకంటే వాటికే ఎక్కువ సమయం ఖర్చుచేస్తున్నారు. నేడు నీ దేవతలు ఇవేనా? చూచుటచేత కంటికి తృప్తి ఉంటుందా? లేదు కదా! ఎంత చూచినా తృప్తి ఉండదు. అదే సమయం దేవుని వాక్యము చెంత గడిపితే ఎంతో తృప్తి, ఎంతో నెమ్మది, ఎంతో సంతోషము, ఎంతో సమాధానము నీవు పొందగలవు. దేవుడు నిన్ను అలాగున మార్చును గాక!

ఇలాగున ఈ లోకంలో ఎంతోమందికి ఎన్నెన్నో దేవతలు విగ్రహాలు ఉన్నాయి. కొద్దిమందికి తమ <u>అందమే</u> విగ్రహము. కొద్దిమందికి '<u>స్నేహమే</u>' విగ్రహం. కొద్దిమందికి తమ <u>బలమే</u> విగ్రహం, కండలు పెంచడంలోనే మనస్సుంచుతారు. ఈలాంటి విగ్రహాలు ఎవరి యొద్ద కనిపిస్తాయో వాటివలన మనకు యాకోబు అనినట్లు బ్రతుకు అనగా ఆత్మీయ బ్రతుకు ఉండదు, ఆత్మీయతకు నష్టముంటుంది. దేవునికంటే ఈ విగ్రహాలను ఎక్కువగా ప్రేమిస్తున్నామేమో పరిశీలించుకొని ప్రభువుకు అప్పగించుకుందా. విగ్రహాలను తొలగిద్దాం. మనల్ని ఆయన వాక్యము ద్వారా పవిత్రపరచుకుందాం. ఎందుకంటే విగ్రహము మనకు ఆత్మీయ బ్రతుకు లేకుండా చేస్తుంది.

**మృతిచెందిన రాహేలు:-** ఆది. 35:16వ.లో 'ఎఫ్రాతాకు వెళ్ళు మార్గములో రాహేలు ప్రసవించుచు, ప్రసవ వేదనతో, ప్రయాసపడుచున్నప్పుడు మంత్రసాని ఆమెతో భయపడకు, ఇదియు నీకు కుమారుడగునని చెప్పెను. ఆమె మృతిబొందెను. ప్రాణము పోవుచుండగా ఆమె అతని పేరు 'బెనోని' అనెను. అతని తండ్రి అతనికి 'బెన్యామీను' అను పేరు పెట్టెను అని వ్రాయబడింది. రాహేలు తన ప్రసవ సమయములో <u>ప్రసవవేదనతో ప్రయాసపడుచు భయపడుచు, ప్రాణము</u> పోవుచుండగా కుమారునికి బెనోని అని పేరు పెట్టి మృతిపొందెను అను మాటలు చదువుచున్నాము. రాహేలు కాన్పు సమయంలో ప్రసవవేదన, ప్రయాస, భయము, ప్రాణము పోవుట, <u>మృతిబొందెను</u> అను ప్రాణగండమునకు సంబంధించిన మాటలు చదువుచున్నాము. స్త్రీ, పురుషునితో ఆదిలో ఆది. 1:19వ.లో దేవుడు మీరు ఫలించి, అభివృద్ధి పొంది విస్తరించి, భూమిని నిండించి దానిని లోపరచుకొనుడి' అన్నాడు.

కానీ పాపాన్నిబట్టి స్త్రీకి కాన్పు సమయము గండము వంటిది. డాక్టర్స్ కూడ ఈమెకు కష్ట కాన్పు జరుగుతుంది. తల్లి ప్రాణానికైనా, బిడ్డ ప్రాణానికైనా గ్యారంటీ ఇవ్వలేము అని సాధారణముగా చెబుతుంటారు. కానీ బైబిల్‌లో దేవుడు ఏమి చెబుతున్నాడు? 1 తిమో. 2:14,15వచనాలలో మరియు ఆదాము మోసపరచబడలేదు కానీ స్త్రీ మోసపరచబడి అపరాధములో పడెను. అయినను వారు 1. స్వస్థబుద్ధి కలిగి 2. విశ్వాస 3. ప్రేమ 4. పరిశుద్ధతలయందు నిలుకడగా ఉండిన యెడల శిశు ప్రసూతి ద్వారా ఆమె రక్షించబడును అని దేవుడు వ్రాయించాడు. శిశు ప్రసూతి ద్వారా రక్షించబడును అని అంటే 'ముందే రక్షించబడ్డాము కదా మరల ఇప్పుడు రక్షించబడుట ఏమి'? అని చాలామంది స్త్రీలు ఈ దినాల్లో తమ అనుమానాన్ని ఎక్స్‌ప్రెస్ చేస్తున్నారు. ముందుపొందిన రక్షణ పాపక్షమాపణ కొరకై పొందిన రక్షణ. కానీ, అనుదిన విశ్వాస జీవితంలో అనేక గండాలు, కష్టాలు, సమస్యలు శోధనలు, రోగాలు అనే ఎన్నో గండాల ద్వారా మనము వెళ్ళవలసి వుంటుంది. మన పాపాలనుండి మనల్ని రక్షించిన దేవుడే మన అనుదిన గండాల నుండి దేవుడు మనలను తప్పక రక్షిస్తాడు అన్న విశ్వాసము ద్వారానే మనము దినదినము రక్షించబడతాము. ఈ అనుదిన గండాలనుండి రక్షించబడాలంటే ప్రభువు మీదే విశ్వాసముంచాలి. దిన దిన విశ్వాసము ద్వారా దిన దిన రక్షణలో మనము సాగిపోతూ ఉండాలి.

అలాగే స్త్రీకి కాన్పు గండము వచ్చినప్పుడు ఆ ప్రసవవేదన, ప్రయాస, భయమునొందే స్త్రీకి 1 తిమో. 2:14,15 వచనాలలో చెప్పబడిన 1. స్వస్థబుద్ధి 2. విశ్వాస 3. ప్రేమ 5. పరిశుద్ధతలయందు ఆమె నిలుకడగా ఉంటే కాన్పు గండము నుండి ఆమె తప్పించబడుతుంది, లేక రక్షించబడుతుంది అన్న వాగ్దానాన్ని దేవుడు స్త్రీలకిస్తున్నాడు. చాలామంది గర్భవతులు ఈ నాలుగు గుణములు కలిగియుండక ఇంట్లో బంధువులతో, ఇరుగుపొరుగువారితో అత్తలతో ఎప్పుడూ కలహిస్తూ, వారంటే ఇష్టములేక వారితో చక్కని సంబంధ బాంధవ్యాలు కలిగి యుండక, కక్ష సాధింపులు చేస్తూ, బహుభయంకరంగా ద్వేషిస్తూ, మంచి సాక్ష్యాన్ని కలిగియుండక కలహ ప్రియులుగా ఉంటూ ఉంటారు. స్వస్థబుద్ధి విశ్వాస, ప్రేమ, పరిశుద్ధతలకు వారి జీవితంలో చోటే ఉండదు. స్వస్థబుద్ధికాక దుర్బుద్ధి మనలో ఉంటే సుఖప్రసూతి మనకు జరుగదనే భావమే ఈ వచనాల్లో మనకు అర్థమౌతుంది.

రాహేలు తన జీవితంలో ఈ వాగ్దాన ఫలితాన్ని పొందలేకపోయింది. అక్క (లేయాకు) సుబుద్ధి చూపలేదు. యాకోబును అక్కయైన లేయా ఇంటికి వెళ్ళకుండ భర్తను కట్టడి చేసింది. యాకోబు అక్క ఇంటికి రావాలంటే ఆమె పర్మిషన్ ఇస్తేనే యాకోబు లేయా ఇంటికి రాడు. యాకోబు తన అక్కకు కూడా భర్తయే కదా! అసలు యాకోబు ఫస్ట్ వైఫ్ లేయానే కదా! తన తండ్రియే యాకోబుకు లేయాను భార్యగా ఇచ్చాడు కదా! ఈమె వారము సంపూర్ణము చేయుము అన్నప్పుడు ఆ వారము దినాలు యాకోబు ఆమెతో కలసి జీవించాడు కదా! వాళ్ళ నాన్న యాకోబుకు లేయాతో పెళ్ళి చేసి లాబాను చేతులు తుడుచుకోగా ఇటు

యాకోబు లేయాను ద్వేషిస్తూ వుండగా లాబాను - యాకోబుల మధ్య అడకత్తెరలో ఉన్నట్లు లేయా ఉండి నలిగిపోతుండగా ఒకసాటి, తోటి స్త్రీగా రాహేలు అక్కను అర్థం చేసికొని ప్రేమ చూపి ఉంటే ఎంత బాగుండేది? నా అక్క పరిస్థితి 'రెంటికి చెడిన రేవడు' లాగా అయ్యింది, దయచేసి మా అక్కను కూడ ప్రేమించండి అని యాకోబుతో ఎన్నడైనా రాహేలు చెప్పిందా? ఆమెలో అక్క యెడల ఈ స్వస్థబుద్ధి, ప్రేమ లేనే లేవు. ఇసుమంతైనా ఆ గుణాలు కనిపించలేదు. మచ్చుకైనా అవి ఆమెలో లేవు. తన భర్త తనను ఎత్తి తలమీద పెట్టుకున్నాడు. ఆమె అందానికి ముగ్ధమనోహరుడయ్యాడు. 7 యేండ్ల కొలువు జీవితం ఆయనకు కొద్దిదినాలుగా తోచాయి. ఇంత ప్రేమ భర్త ద్వారా రాహేలు పొందుకుంటూ కొంతప్రేమయైన తనతోడబుట్టిన అక్కకు చూపలేకపోయింది. పైగా దేవుడు తనకు పిల్లలనిస్తాడని విశ్వాసముంచలేదు. 'నాకు పిల్లలనిస్తావా? లేక చావాలా?' అని భర్తను బెదిరిస్తూ బ్లాక్‌మెయిల్ చేసింది. ఇవి భర్తను గౌరవించే మాటలేనా? ఈనాడు చాలామంది ఇలాగే భర్తలను భలే భయపెడుతున్నారు. భర్తలను సరిగా, గౌరవంగా సంభోదించరు. నీవు, నీవు అని ఏకవచనంతో సంబోధిస్తున్నారు. భర్త అంటే గౌరవప్రదమైన భయము (Reverential Fear) కలిగి ఉండాలి. భయముతో కూడిన పవిత్ర ప్రవర్తన వారియెడల మనము కలిగి ఉండాలని 1 పేతురు 3:2వ.లో మనము చదువుట లేదా? ఇంకా కొంతమంది సినిమాల్లో చూచి భర్తను 'ఏందిరా' 'ఉండరా' 'ఒరేయ్, వీడు, వాడు' అనడానికి కూడ వెనకాడుట లేదు. ఇవి బైబిల్ పదాలా? లోకులవి కావా? బైబిల్ భాషలో లేక బైబిల్ టెర్మినాలజీలో భార్యాభర్తలు ఈ వేళ మాట్లాడుకో గలుగుతున్నారా? మీరే ఇలా ఉంటే రేపు మీ పిల్లలు ఎలా తమ భర్తలతో మాట్లాడుతారో ఆలోచించండి. ఆవేశాలెందుకు? ఆత్మపూర్ణులై ఉండాలి. ప్రార్థించి సమస్యలు తీర్చుకోండి. సంసారాన్ని బజారుపాలు కానివ్వకండి. సంయమనము పాటించండి. కాపురాన్ని కట్టుకోవలసిన స్త్రీలారా! మీ ఇంటికి దీపం ఇల్లాలివైన నీవే, నీ దీపాన్ని ఆర్పుకుంటావా? లేక నీ వెలుగును ఆర్పివేసుకుంటావా? ఇష్టానుసారంగా భర్తతో మాట్లాడ్డానికి తెగించవద్దు. నిన్ను బాగుగా నీ భర్త ప్రేమిస్తున్నాడని, ఆయనను నీ గుప్పిట్లో నీ చెప్పుచేతుల్లో ఉంచుకోవాలని కోరవద్దు. ఆయన నిన్ను ఏమి అనడు అని ఆయన మెతక స్వభావాన్ని నీవు సొమ్ము చేసికోవద్దు. రేపు దేవుని దగ్గర తీర్పున్నదని యెరిగి ఆయనతో మాట్లాడేటప్పుడు భయంతో, భక్తితో మాట్లాడటం నేర్చుకో. హృదయం పగిలిపోయే మాటలతో ఆయన హృదయాన్ని పగులగొట్టవద్దు. సాత్వీకమైన నాలుక జీవవృక్షమని తెలుసుకో. ఇష్టానుసారముగా భర్తలను నేటి భార్యలు మాట్లాడం జరుగుతోంది. ఇలాంటి వారికి ఎవరు బుద్ధి చెప్పాలి? ఇంట్లో ఉన్న అత్తలు 'నాన్నా, భర్తను అలాగు అనకూడదు నాన్నా' అని చెబితే ఏంటీ నీ కుమారున్ని వెనుకేసుకుని వస్తున్నావా? అని కోడలు ఎక్కడ మాట అంటుందేమోనని ఆ అత్తలు నేడు మనస్సులోనే బాధపడుతూ ఉన్నారు. పెద్దవారైన అత్తమామలు ఇంట్లో ఉంటూ ఉండగా ఇలాంటి రభసలు ఇంట్లో కలిగి ఉండకూడదు. ఇంటికి దీపం, ఇల్లాలివైన నీవే గనుక జర, భద్రంగా మాట్లాడడం

నేర్చుకుంటే మంచిది. భర్తలో ఎన్ని తప్పులు నీకు కనబడుతున్నా, నీవు ఆయన్ని ప్రేమించి ఆయన కొరకు ఓపికతో ప్రార్థించు. ఆయన ఎందుకు మారడు? తప్పక మారుతాడు. దేవుడు సంసోను చేతిలో ఉన్న సింహాన్ని మేకపిల్లలాగా చంపడానికి సహాయం చేయలేదా? సింహంలాంటి నీ భర్తను సాధువైన మేకపిల్లగా చేస్తాడు తల్లీ! కనుక విశ్వాసులతో కలసి ప్రార్థించు నాన్నా! అత్తతో కలిసి ప్రార్థించు. మీ మొఱ్ఱ తప్పకుండా ప్రభువు వింటాడు.

దేవా! నాకు పిల్లలనివ్వు అని రాహేలు ప్రార్థించక భర్తను పట్టుకొని పిల్లలనివ్వమని అడిగింది. అంతేకాక, పుత్రదాత వృక్షపు పళ్ళమీద ఉన్న విశ్వాసం దేవుని మీద ముందు లేదు. ప్రకృతి సంబంధంగా పిల్లలను పొందుకోవాలనుకుంది. కానీ ఆమె గురి దేవుని మీద ఉంచలేకపోయింది.

దేవుడు చూడదగిన పరిశుద్ధత కూడ రాహేలులో లేకపోయింది. గృహదేవతలను దొంగిలించింది. విగ్రహాన్ని దేవుడు ద్వేషించేవాడు కానీ, ఎంతోకాలంగా అవి ఆమె యొద్ద ఉండినాయి. ఆది. 35 అధ్యాయంలో దేవుడు వాటిని తీసివేయమని చెప్పాడు. దొంగిలించటమే కాదు, ఒంటె సామాగ్రిలో ఆ విగ్రహాలను ఉంచి వాటి మీద తాను కూర్చుని తాను కడగా ఉన్నానని, లేవలేనందుకు కోపపడకూడదని తన తండ్రికి అబద్ధాలు కూడ చెప్పింది. కనుక ఈ సుబుద్ధి, విశ్వాస, ప్రేమ, పరిశుద్ధతలు లేకపోవుటచే ఆమె తన కాన్పు గండములో ఇరుక్కునిపోయి ప్రాణము పోగొట్టుకున్నట్లుగా మనము గమనించగలుగుచున్నాము.

ఈనాటి స్త్రీలు హద్దు మీరి భర్తలతో మాట్లాడుచుండుట గమనిస్తున్నాము. తెలియకయే వాక్య విలువలు ఎరుగకయు ఆలాగున మాట్లాడుతున్నారు. కనుక స్త్రీలారా! స్త్రీల కూడికలకు హాజరవ్వండి. వృద్ధ స్త్రీలు చెప్పే ఉపదేశాలకు చెవి యివ్వండి. అనుభవజ్ఞులైన వారి దగ్గర సలహాలు తీసుకోండి. మీ ఇష్టమొచ్చినట్లు కుటుంబంలో బిహేవ్ (behave) చేయకండి. కుటుంబాలు కూల్చుకోకండి. ముందు వెనకాల ఆలోచించుకొనండి. హేస్టీస్టెప్ తీసుకోవద్దు. కుటుంబ తీర్మానాలు నీవొక్కడివే తీసుకోవద్దు. కనపెట్టు దేవుని దగ్గర. త్వరగా పరుషపదాలు నీ పెదవుల నుండి రానీయకు. నిన్ను పెళ్ళి చేసుకోవడమే నేను చేసిన పెద్ద తప్పు అని నీ భర్తతో అనకు. ఆ పని పెళ్ళికి ముందే చేసి ఉండాలి. కానీ ఇప్పుడు కాదు.

'పరుషమైన పదజాలము పెదవిని దాటితే... ఓ అందమైన వివాహబంధం బీటలు వారుతుంది. మనిషికి మాట ఎంత అవసరమో... ఆ మాట మధురంగా ఉండుట కూడ అంతే అవసరం. ఈ మాటలు మాట్లాడే విషయంలో ఆత్మీయులే పొరపాటుగా దేవుని భయం, భక్తి లేకుండా ఇష్టానుసారంగా మాట్లాడుతేంటే ఇక ప్రభువుని నమ్మని భర్త ఎలా స్వీట్‌గా మాట్లాడతాడు? ప్రభువును నమ్మిన వారే ఒక్కోసారి అనకూడని మాట అనేస్తారు. ఆ తరువాత మన కోపం ఆరిపోవచ్చు. కానీ అవతలి వారిలో కలిగిన ఆ మంట ఆరుతుందని గ్యారంటీ ఏమి? ఆ మాట అతనిని ఎంతగాయపరచిందో కదా! కొద్దిమంది సారీ! అనే

చిన్న పదాన్ని కూడ చెప్పలేని 'ఇగో'తో ఉంటారు. మొదట నేనేనా తగ్గాల్సింది? ఆయనే తగ్గాలి అని అనుకుంటారు కొద్దిమంది స్త్రీలు. సహజంగా పురుషులలో 'పురుషాధిక్యత' అనేది వారిలో ఉంటుంది. మనలో మనకి 'ఇగో' ఎందుకు? పనికి రాని 'ఇగో'తో హృదయాలు పగులగొట్టుకునేదెందుకు? ఇల్లు కట్టుకోవలసిన ఇల్లాలివైన నీవే ఏమండీ! 'ప్రొద్దున జరిగిన దానికి నేను 'సారీ' చెబుతున్నాను. ప్లీజ్ ఏమనుకోకండి అని భార్యవైన నీవే మొదట అంటే నీకు నష్టమైపోయేది ఏమీ ఉండదు కదా!

ఈ సందర్భంలో ఒక ఉదాహరణ వ్రాయాలనుకుంటున్నాను.

బ్రిటీష్ రాణీ ఎలిజెబెత్ గారు పెళ్ళైన క్రొత్తలో తన భర్త గారైన 'ఫిలిప్'ను ఏదో ఒక నొప్పించే మాట అనేసి ఆయన మనసును గాయపరచిందట. ఫిలిప్ గారు వెంటనే బెడ్‌రూమ్‌కెళ్ళి మొదటి బోల్ట్ పెట్టేసుకున్నాడట. రాణీ వెళ్ళి తలుపు తట్టిందట. ఫిలిప్ వెంటనే రెండవ బోల్ట్ పెట్టాడట. 'నేను బ్రిటీష్ రాణిని అజ్ఞాపిస్తున్నాను తలుపు తీయ్' అని అజ్ఞాపిస్తే ఫిలిప్ గారు తలుపు తీయలేదట. అప్పుడు రాజుగారు వారిద్దరికీ మ్యారేజ్ చేసిన రిజిష్టార్ గారిని పిలిపించి నేను ఆజ్ఞాపించిన ఫిలిప్ తలుపు తీయలేదని రిజిష్టార్ గారితో చెప్పిందట. అప్పుడు ఆ రిజిష్టారు గారు, మీరు బ్రిటీష్ సామ్రాజ్యానికి మాత్రమే రాణీ, కానీ నీ భర్తకు నీవు రాణీ కాదు. ఏ మాట ద్వారా నీ భర్తకు నీవు కోపం పుట్టించావో. ఆ మాట విషయమై ఆయనకు సారీ చెప్పు అని రిజిష్టారుగారన్నారట. వెంటనే రాణిగారు తన్ను తాను తగ్గించుకొని యింట్లో నా భర్త నాకు ఏలికగా ఉండగా, నేను ఆయనను రాణీగా ఏలుబడి చేయడం తప్పని తెలిసికొని నేరుగా రాణీ తలుపు దగ్గరికెళ్ళి 'ఫిలిప్! ఐయామ్ వేరీ సారీ' అనిందట. వెంటనే ఫిలిప్ తలుపు యొక్క రెండవ బోల్ట్ టపటప లాగేసి తలుపు తీసి భార్యయైన రాణిని ఆలింగనము చేసికొని ఆమెకు ముద్దులు పెట్టాడట. రాణీ సారీ అడగడం ఎంత మేలయ్యింది. తాను రాణీ పదవిలో ఉన్ననూ కుటుంబములో ఆమె భర్త దగ్గర రాణీ కాదు రాజ్యానికే రాణీ అన్న సంగతి రాణీ తెలుసుకుంది. కుటుంబంలో కుటుంబ విషయములో భర్త మాట భార్య వినాలి అనే సంగతి ఆమె గమనించి తన తప్పు దిద్దుకుంది. స్త్రీలారా! భర్తల విషయంలో మన హద్దులను మించి మాట్లాడికుటుంబంలో దేవుడు మనకిచ్చిన విలువైన వివాహ బంధాలను దుడుకుగా అనాలోచనగా నోటికి వచ్చిన మాటలు మాట్లాడి ఆ తరువాత ఫీల్ అయితే లాభం లేదు. ఈ ఉదాహరణలో రాణీ సారీ చెప్పగానే ఫిలిప్ కోపం దూదిపింజలాగ ఎగిరి పడిపోయి, దాని స్థానంలోనే ప్రేమ, ఆలింగనము, ముద్దులు వచ్చిపడ్డాయి. భార్యభర్తల మర్మమెరిగి మెలిగితే అన్ని మేళ్ళే మనకు మిగులుతాయి. ప్రేమతో మసులుకోండి. 'సారీ' అనే చిన్నమాటను అనలేక దేవుడేర్పరచిన విలువైన వివాహబంధాన్ని దూర చేసుకోకండి.

పై గుణాలు రాహేలులో లేకపోయిన కారణాన ఆమె శిశు ప్రసూతిలో (కాన్పు గండములో) రక్షింపబడలేకపోయింది. ప్రియులారా! దిన దిన విశ్వాసంలోను, దిన దిన రక్షణలోనూ ఎదిగేందుకు ప్రయత్నిద్దాం. ప్రాణం పోవుచుండగా దుఃఖపుత్రుడు అను అర్థమిచ్చే

'బెనోని' అను పేరును రాహేలు తాను కన్న కుమారునికి పెట్టింది. ఆ దుఃఖపుత్రుడే తండ్రియైన యాకోబునకు కుడిచేతి పుత్రుడు అనే అర్ధమిచ్చే బెన్యామీనుగా మార్చబడ్డాడు. మీ ఇండ్లలో ఏ కుమారుడైనా గాని, అల్లుళ్ళుగాని, దుఃఖపరచే భర్తలైనా గానీ కోడళ్లైనాగాని, దుఃఖపెట్టే అత్తలు గానీ, అందరిని ప్రభువు బెన్యామీనులుగా మార్చగలడు. ఎండినచెట్లను చిగిరింపగల దేవుడు మన దేవుడు. బెన్యమీను తండ్రికి కుడిచేతి పుత్రుడుగా (ఎడమ చేతికి బలముండదు) కుడిచేతికి బలమెక్కువ కాబట్టి బలకరమైన పుత్రుడుగా చీల్చునట్టి తోడేలుగా, ఉదయమందు ఎరను తినువాడుగా, అస్తమయమందు దోపుడు సొమ్ము పంచుకొనువాడుగా అతనిని దేవుడు మార్చాడు.

రాహేలు మృతి చెందిన తరువాత యాకోబు ఆమెను బెత్లెహేము ఎఫ్రాతా మార్గమందు పాతిపెట్టి, ఆమె మీద తనకున్న ప్రేమకు సూచనగా ఆమె సమాధిమీద ఒక స్తంభమును కట్టించినట్లుగా ఆది. 35:19,20వ.లలో వ్రాయబడింది. యాకోబు రాహేలు మీద తనకున్న ప్రేమకు సూచనగా గుర్తుగా ఒక స్తంభమును కట్టిస్తే మన ప్రభువు తన పెండ్లి భార్యగా ఉన్న మన మీద తనకున్న ప్రేమనుబట్టి తన ప్రాణాన్నే పణంగా పెట్టాడు. లోకసంబంధమైన ఒక రాజు తన భార్య మీద తన ప్రేమకు గుర్తుగా 'తాజ్ మహల్' కట్టించగా ప్రభువు తన పెండ్లి భార్యయైన మనకొరకు తన విలువైన ప్రాణము మాత్రమే కాక తన పరలోకంలో 12 రకములైన ముత్యాలతో, నీలాంజనములతో, మాణిక్యమణులతో ప్రశస్తమైన రత్నములతో ఆయన పరిశుద్ధ పరలోకమును కట్టుచున్నాడు. నా తండ్రి ఇంట అనేకులకు అనేక నివాసములున్నవి. నేను వచ్చి మీరు నా యొద్ద ఉండుటకు మిమ్మును తీసికొని పోవుదును' అని చెప్పాడు. పరమ ప్రభువు ప్రేమను ఎవరి ప్రేమతోను పోల్చలేము. ఆయన ప్రేమ అసమానమైనది.

చివరకు రాహేలు పేరు లేయా పేరు రూతు గ్రంథము 4:11వచనములో కూడ ప్రస్తావించబడింది. ఆ పురద్వారమందున్న ప్రజలందరును, పెద్దలందరును యెహోవా నీ ఇంటికి వచ్చిన స్త్రీని (రూతు అను) ఇశ్రాయేలు వంశమును వర్ధిల్లచేసిన రాహేలుగాను, లేయాను పోలినదానిగాను చేయును గాక! అని రూతును దీవిస్తూ రాహేలు, లేయాను జ్ఞాపకం చేసుకున్నారు. అలాగైతే ఇశ్రాయేలు పండ్రెండు గోత్రములను వర్ధిల్లచేసేందుకు అక్క చెల్లెళ్ళిద్దరూ పోటీలుపడి కని, తమ భర్తకు దాసీలనిచ్చి వారు కూడ కనునట్లు చేశారు. వారినిబట్టే 12 గోత్రములుగా ఇశ్రాయేలీయులు సైన్యముగా వారు తయారు చేశారు. అయినా పిల్లలను కనుట అనే పోరాటంలో ప్రథమ స్థానం పొంది విజయభేరి మ్రోగించింది లేయాయే. ప్రియ సోదరీ! పోటీతత్వంతో కాకపోయినా ఆత్మలను సంపాదించాలి అనే పోరాటపటిమ, ఆరాటము, ఆదుర్ధ, ఆశ, ఆవేదన, ఆత్మల దాహము ఆ స్త్రీలిద్దరికీ ఉన్నట్లు మనకున్నదా? అని పరీక్షించుకొని, పరిశీలించుకొని, ప్రయత్నించుట మనకందరికీ ప్రయోజనకరమైయున్నది.

చివరకు రాహేలు ప్రస్తావన యిర్మీయా 31వ అధ్యాయములో 15-17వ.లలో కూడ వ్రాయబడింది. 15వ.లో రామాలో అంగలార్పును, మహా రోదన ధ్వనియు

వినబడుచున్నది. రాహేలు తన పిల్లలను గూర్చి ఏడ్చుచున్నది. ఆమె పిల్లలు లేకపోయినందున ఆమె వారిని గురించి ఓదార్పు పొందనొల్లకున్నది. 16వ. యెహోవా ఈ ఆజ్ఞ ఇచ్చుచున్నాడు– ఏడవక ఊరకుండుము కన్నీళ్ళు విడుచుట మానుము. నీ క్రియ సఫలమై జనులు శత్రువుని దేశములో నుండి తిరిగి వచ్చెదరు. ఇదే యెహోవా వాక్కు 17వ. రాబోవు కాలమందు నీకు మేలు కలుగునను నమ్మిక యున్నది. నీ పిల్లలు తిరిగి తమ స్వదేశమునకు వచ్చెదరు. ఇదే యెహోవా వాక్కు

రాహేలు తన పిల్లలను గూర్చి ఏడ్చుచున్నది అని యిర్మీయా 31:15వ.లో చెప్పుచున్నాడు. రాహేలు అంటే ఆది 29వ అధ్యాయంలో కనిపించే 'రాహేలు' అని కాదు. మత్తయి 3:17–18 వచనాలలో వ్రాయబడినట్లు పుట్టిన శిశువైన యేసును చంపాలని హేరోదు రాజు బెత్లెహేములోను, దాని సకల ప్రాంతములలోను రెండు సంవత్సరములు మొదలుకొని తక్కువ వయస్సుగల మగ పిల్లలనందరినీ వధించాడు. అందువలన రామాలోని హేరోదుచే వధింపబడిన చిన్న పిల్లల తల్లులందరూ ఏడ్చుచూ, అంగలార్చుచూ, మహా రోధన ధ్వని చేశారు. ఆదికాండము 29వ అధ్యాయములో ఉన్న యాకోబు భార్యయైన రాహేలు సమాధి బెత్లెహేము ఎఫ్రాతా మార్గమున ఉండుటచే ఆ చిన్న పిల్లల తల్లులందరినీ కలిపి ఉపమానరీతిగా 'రాహేలు' అన్న పేరు (figurativeగా) పెట్టి యిర్మీయా ఆ రీతిగా వ్రాశాడు. పిల్లలు లేరని ఓదార్పు పొందనొల్లకపోయిన ఆ తల్లులను 'రాహేలు' అన్న పేరు పెట్టి సంబోధిస్తూ 'ఏడువక ఊరకొనుము. కన్నీళ్ళు విడుచుట మానుము. నీ క్రియ సఫలమై జనులు శత్రువుని దేశములోనుండి తిరిగి వచ్చెదరు" అని యిర్మీయా ద్వారా ప్రభువు ఓదార్చినట్లుగా చదువుచున్నాము. రాహేలు అన్న పదము ఇక్కడ ఎందుకు కనిపిస్తోందంటే, ఇశ్రాయేలీయులు అష్షూరు చెరకు వెళ్ళినప్పుడు కూడా వారు రాహేలు సమాధి మీదుగానే చెరకెళ్ళారట. అప్పుడు సమాధిలోనున్న రాహేలు చూచి తన పిల్లలు చెరకెళ్ళుట చూచి ఏడ్చిందని కొందరి ఇశ్రాయేలీయుల నమ్మకం. అలా కాకపోయిన ఇశ్రాయేలీయుల జాతిని 'రాహేలు' అనే తల్లిగా సంబోధిస్తూ కూడ యిర్మీయా అలా ప్రవచనము వ్రాసి యుండవచ్చును. 17వ.లో యెహోవా రాబోవు కాలమున (ఇప్పుడు కాదు) నీకు మేలు కలుగుతుందని నమ్మిక ఉన్నది. నీ పిల్లలు తిరిగి తమ స్వదేశానికి వస్తారని దేవుడు ఆ ఇశ్రాయేలు జాతి తల్లి అనబడిన రాహేలును ఓదార్చినట్లు ఇక్కడ వ్రాయబడింది. యూదులు 70 యేండ్ల బబులోను చెరకెళ్ళి తిరిగి వచ్చారు, కానీ, ఇశ్రాయేలీయులు అష్షూరు చెరకెళ్ళి ఇంకనూ రాలేదు. ప్రభువైన యేసుక్రీస్తు రెండవ రాకడ సమయములో వారు గువ్వలవలె జెక. 8:7లో వ్రాయబడినట్లు తూర్పు, పడమర దేశములలో నుండి నేను నా జనులను రప్పించి రక్షిస్తాను అన్నాడు. అలాగున రాబోవు కాలమున ఇశ్రాయేలీయులు తిరిగి తమ స్వదేశమునకు వస్తారని దేవుడు చెబుతూ ఇశ్రాయేలు జాతిని ఓదార్చుచు, చెబుతున్న విషయాన్ని మనమిక్కడ చదువుచున్నాము.

పైన వ్రాయబడిన మాటల ప్రకారమే ప్రియ సోదరీలారా! నా జీవితములో నిజముగా దేవుడు జరిగించిన ఒక గొప్ప కార్యాన్ని మీ యెదుట ఈ పుస్తకములో దేవుని మహిమార్థమై సాక్ష్యమివ్వాలని కోరుకుంటున్నాను.

నా చిన్న కుమారుడైన పాల్‌ప్రసాద్ టీన్ఏజ్‌లో ఎదుగుచూ ఉండగా తరచుగా ఆ అబ్బాయిలో తిరుగుబాటు క్రియలు కనబడేవి. దుష్టసాంగత్యములో కొన్ని చెడు అలవాట్లకు, చిన్నగా మాదక ద్రవ్యాలకు అలవాటై యుండగా ఆ బిడ్డ కొరకు దేవుని ఎదుట ప్రార్థించుచుండగా కన్నీరు నా చెంపల మీద ప్రవహిస్తూ ఉండేది. అలాగున విలా. 2:18-19వ.లలో వ్రాయబడినట్లు కన్నీటితో ప్రభువును ప్రార్థిస్తూ చీర కొంగును చూపి నేను పోగొట్టుకున్న నా కుమారుని తిరిగి నాకిచ్చి దేవా! నీ కొరకు ఆ బిడ్డను వాడుకొనుమని ప్రార్థించేదాన్ని. నా స్వంత ప్రార్థనల్లో నా చేతులు పైకెత్తి ప్రార్థించేదాన్ని. కొన్నిసార్లు బాధతో, చిన్ని (మేము చిన్నీ అని ఇంట్లో పిలిచేవారము) కాళ్ళు విరుగగొట్టి ఇంటికి తీసుకురమ్మని ప్రార్థించేదాన్ని. కాని నా అవివేక ప్రార్థనలను ప్రభువు అంగీకరించలేదు. చిన్నీకి కాళ్ళు విరిగితే నా పరిచర్య నూరంతలు ఎక్కువవుతుంది కదా! ప్రభువు అలాగున చేయలేదు. అందుకై ఆయనకు స్తోత్రం. చాలాసార్లు ఈ రోజు దేవుడు బిడ్డను మార్చి ఇంటికి తెస్తాడేమో అనుకునేదాన్ని. రాను రాను బిడ్డలో మానసికమైన బలహీనత కూడ కనబడుతూ వచ్చింది. దానివలన బిడ్డకు తలనొప్పి, ప్రాణభీతి, నిద్రలేనితనము, పానిక్ అటాక్, భ్రమలు, చనిపోవాలనే తలంపులు కలుగడం (suicidal tendency) క్రౌర్యము, కోపము, ఆయుధాలు ఉంచుకోడం, బెదిరింపు, డబ్బు డిమాండ్ చేయుట, మొదలగునవన్నీ బిడ్డలో చూడాల్సి వచ్చింది. వీటన్నిటినీ కళ్ళతో చూస్తూ చాలా భయపడేవాళ్ళము భార్యాభర్తలమిద్దరము. భవిష్యత్తులో ఎక్కడికైనా కనబడకుండా వెళ్ళిపోవాలనిపించేది. 'నెబుకద్నేజరును పంపి ఇశ్రాయేలీయులను చెరకు పంపినట్లు ఎక్కడికైనా దేవుడే బిడ్డను పంపాలి కానీ, మాచేత కాదు' అని అనుకునేవాళ్ళము. డాక్టర్స్, మనుష్యులు, సైన్స్ చెప్పే విషయాలనుబట్టి ఎంతో భయమనిపించేది? బిడ్డకు కోపమొస్తే అడిగింది ఇవ్వకపోతే ఇంట్లో అద్దాలన్నీ పగులగొట్టి, చేతిలో ఏముంటే అవన్నీ పగులగొట్టేవాడు. అదెంత ఖరీదైన వస్తువైనా కోపమొస్తే, నేలకేసి కొట్టడమే. ఒకరోజు టి.విని కూడ పగులగొట్టాడు. ఈ వింతైన ప్రవర్తన మాకు అర్థమయ్యేది కాదు. పగులగొట్టబడిన గ్లాస్ ముక్కలను ఎత్తుకోవడం ఎంతో కష్టమయ్యేది. డబ్బు విపరీతంగా ఖర్చు పెట్టడం, చదువుపై ఆసక్తి తగ్గిపోవడం, మాదక ద్రవ్యాల వాడకం, తనకు నెమ్మది లేకపోవడం, మానసికంగా ఆరోగ్యము దెబ్బతినడము జరిగింది. ఇశ్రాయేలీయులు అష్షూరు చెరకెళ్ళినట్లు సాతాను చెరలో ఉన్నట్లు గ్రహించాము. యిర్మీయావలె నా తలను జలమయముగ నా కన్నీళ్ళను కన్నీటి ఊటలుగా చేసికొని ప్రార్థించేదాన్ని. ఆ దినాల్లోనే బైబిలు చదువుచుండగా అనేక వాగ్దానాలను నా వ్యక్తిగత బైబిల్ ధ్యానములో (Personal Bible studyలో) ప్రభువు చూపించేవాడు. ఆ వాగ్దానములలో ఒకటి యిర్మీ. 31:15-17వచనాలలో వ్రాయబడింది. 'సాతాను చెరలోకి లేదా సాతాను గవినిలోనికి వెళ్ళిన నా కుమారుని తిరిగి దేవుడు రప్పిస్తాడని, ఇప్పుడు కాకపోయిననూ, రాబోవు దినములలో దేవుడు చిన్నీని తెస్తాడని, నేను ఏడ్పు మానాలని ప్రభువు చెప్పుచూ

ఓదార్చేవాడు. ఎప్పుడైన ఏడ్పువస్తే నేనెందుకేడ్వాలి? నా ప్రభువు వాగ్ధానము చేశాడే, నేను కన్నీళ్ళు పెట్టడానికి ఆయన చేతగానివాడా? అని తిరిగి కన్నీళ్ళు తుడుచుకునేదాన్ని. "అడుగువాటినెల్లను పొందియున్నామని నమ్ముడి అప్పుడు అవన్నియునూ మీకనుగ్రహించబడుసన్న" వాక్య ప్రకారమే సమస్య ఇంటిలో ఉచ్ఛస్థితిలో ఉండినప్పటికీ, నిరీక్షణ కనబడనప్పటికీ అద్భుతంగా స్తుతులు చెల్లించుట ప్రభువు నేర్పించారు. అలాగున దేవుడు చిన్నీని ఒక పునరావస కేంద్రములో ఉంచి యిర్మీ. 31:18లో ఉన్నట్లు కాడికి అలవాటుకాని కోడె దెబ్బలకు లోబడునట్లుగా శిక్షకు లోపరచి 'నీవు నా దేవుడవైన యెహోవావు. నీవు నా మనసును త్రిప్పిన యెడల నేను తిరుగుదును' అని చిన్ని అంగలార్చుచుండగా దేవుడే ఆ బిడ్డ ప్రార్ధన ఆలకించి 'చిన్నీ! నా కిష్టమైన కుమారుడా! నాకు ముద్దు బిడ్డా! నీకు విరోధముగా మాటలాడునప్పుడెల్లా నీ జ్ఞాపకము నన్ను విడువకున్నది. నిన్ను గూర్చి నా కడుపులో చాలా వేదనగా ఉన్నది. తప్పక నిన్ను కరుణింతును' అని చెప్పినట్లే చిన్నిని ప్రభువు మార్చి తన సేవకొరకు పిలిచి 2012 ఫిబ్రవరిలో ఇంటికి నడిపించాడు. 2013 జనవరి 7వ తారీఖున వివాహము అకస్మాత్తుగా ఏర్పాటు చేశాడు. ఇప్పుడు, భార్యా సమేతంగా అనంతపూర్ ఇంజనీరింగ్ కాలేజ్ దగ్గరనున్న షాలోం చర్చిలో సేవ చేయుటకు ప్రభువు కృప చూపినారు. నా అనుభవములో పై వచనాలు ప్రాక్టికల్‌గా నెరవేరుట చూచి అనుదినము ఆనంద భాష్పాలతో ప్రభువును స్తుతించగలుగుచున్నాము. ప్రభువు నుండి ఇంతగా జవాబులు పొందుతామని అనుకోలేదు. అడిగిన దానికంటే, ఊహించినదానికంటే ఎక్కువగా ప్రభువు సహాయం చేశారు. నిజముగా మా గోడు ప్రభువు విన్నారు. మా రోదన, వేదన, మా అంగలార్పును నేడు ప్రభువు నాట్యముగా మార్చియున్నారు. మా గోనెపట్టను విడిపించి సంతోష వస్త్రమును ధరింపజేశాడు. నేడు సంఘములోను, అనంతపురం బైబిల్ ఇన్స్టిట్యూట్‌లోను ప్రభువుపనిలో చిన్నీను ప్రభువు వాడుకొనుచున్నాడు. అందులకై ప్రభువుకే లెక్కింపలేని స్తోత్రములు. ప్రియ సహోదరీ! నా సమస్యల విషయంలో సహాయం చేసిన దేవుడు నీ సమస్యల విషయంలోనూ ప్రభువు సహాయం చేస్తారని విశ్వాసంతో గట్టిగా ప్రభువును బట్టి హామి ఇస్తున్నాను. ఇంతటితో అబ్రహాము, ఇస్సాకు, యాకోబు అను పితరుల భార్యల కుటుంబ విశేషాలు ముగించుకున్నాం.

ఈ వాల్యూమ్ ద్వారా ప్రభువు మిమ్ములను ఏ విషయములోనైననూ దర్శించి మీతో మాట్లాడి మేలు కలుగజేసి ఉంటే నాతో పంచుకోగలరని ఆశిస్తూ నా సెల్ నెంబరు క్రింద పొందుపరుస్తున్నాను. తరువాతి వాల్యూమ్స్‌లో మరికొన్ని బైబిల్ స్త్రీల కుటుంబ విశేషాలను గూర్చి ప్రభువు చిత్తమైతే ధ్యానించుకుందాం. అందాకా సెలవ్.

ఇట్లు క్రీస్తునందు వందనములతో ముగిస్తున్న

**నా సెల్ నెంబర్: 9440469046** **– మీ, కెజియక్క**


రిబ్కా
సమూయేలు
మోషే - సిప్పోర